1001 ARABIAN NIGHTS



# 1001 అరేబియన్ రాత్రుల కథలు

పార్ట్-3

డాక్టర్ లంకా శివరామప్రసాద్

Dr. LANKA SIVA RAMA PRASAD

# 1001
# అరేబియన్ రాత్రుల కథలు

## 1001 ARABIAN NIGHTS

### 3వ భాగం




డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. Lanka Siva Rama Prasad**

# 1001 అరేబియన్ రాత్రుల కథలు

**(1001 Arabian Nights)**

**3వ భాగం**

✧✧✧——————————✧✧✧

by

**Dr. Lanka Siva Rama Prasad**

April 2023

Copyright @ 2023

**Dr. Lanka Siva Rama Prasad**

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**

**Srijana Lokam / Writer's Corner**

Prasanthi Hospital

Sivanagar, WARANGAL-506 002,

Telangana, INDIA

Mobile : 6305677926

Email: lankasrprasad@gmail.com

**www.anuvaadham.com**

**www.prosetry.in**

Price : ₹ **400** **$ 10**

Cover Design & Post Script :

**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**

J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

# ప్రస్తావన

1001 అరేబియన్ రాత్రుల కథలు - మూడవ భాగంలో 145-315 రాత్రుల కథలు రసరమ్యభరితమైనవి ఉన్నాయి. పంచతంత్ర కథలను గుర్తుకు తెచ్చే పక్షులు-జంతువుల కథలు, అద్భుతమైన ప్రేమకథలతో పాటు, పవిత్ర గ్రంథం ఖురాన్‌లోని ధార్మిక సంబంధమైన విషయాలు తెలిపే కథ, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సింద్‌బాద్ సాహస యాత్రలు ఈ మూడవ భాగంలో ఉండి చదువరులను ఉర్రూతలూగిస్తాయి.

ఈ కథలలో ఉండే అద్భుత, శృంగార, హాస్య రసాలకు తోడు చక్కని కవిత్వ చరణాలు పాఠకుల మనసులను దోచుకుంటాయనడంలో సందేహం లేదు.

అద్భుతమైన శైలితో మిమ్మల్ని మరల మరల చదివించే గుణమున్న ఈ అరేబియన్ రాత్రుల కథలు మూడవ భాగాన్ని తెలుగు సాహితీలోకానికి సృజన లోకం సవినయంగా సమర్పిస్తున్నది.

**- డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక


**I. పక్షులు - జంతువుల కథలు .............................. 5-35**
(145-151 రాత్రుల కథలు)

**II. ఆలి ఇబిన్ బకర్ - షామ్స్ అల్-నహర్ కథ ......... 36-62**
(152-169 రాత్రుల కథలు)

**III. బుదుర్ యువరాణి - కమర్ అల్-జమాన్ కథ . 63-122**
(169-235 రాత్రుల కథలు)

**IV. సలీమ్-జమీలా కథ .................................. 123-140**
(236-248 రాత్రుల కథలు)

**V. అలా అల్-దిన్ అబు షామత్ కథ ................. 141-185**
(248-269 రాత్రుల కథలు)

**VI. జ్ఞాని, విద్యావంతురాలు షఫక్ కథ ............... 185-212**
(270-287 రాత్రుల కథలు)

**VII. కవి అబు నువాస్ సాహసగాధ .................... 213-217**
(287-290 రాత్రుల కథలు)

**VIII. సింద్‌బాద్ సాహస యాత్రలు ................... 217-260**

290-295 రాత్రులు - మొదటి సాహసయాత్ర
295-298 రాత్రులు - రెండవ సాహసయాత్ర
298-301 రాత్రులు - మూడవ సాహసయాత్ర
301-306 రాత్రులు - నాలుగవ సాహసయాత్ర
306-309 రాత్రులు - అయిదవ సాహసయాత్ర
309-311 రాత్రులు - ఆరవ సాహసయాత్ర
311-315 రాత్రులు - ఏడవ సాహసయాత్ర

ఇప్పుడు నేను చెప్పబోయే కథ మరింత రసవత్తరమైనది. ఈ కథలో పక్షులు, జంతువులు మాట్లాడుకుంటాయి మనుషులలానే. ఇది నెమలి, ఆడనెమలి, బాతు కథ.

ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.

## * 145-146వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

# I. పక్షులు - జంతువుల కథ

## 1. నెమలి, నెమలిపిట్ట, బాతు కథ

ఆ నెమలి, నెమలిపిట్ట ఏటి ఒడ్డున రాజసంగా నడుస్తూ పోతుంటే పాటలు పాడే పక్షులు రాగాలాపన చేసేవి. ఇతర పక్షులు స్వాగతం పలికేవి. అప్పుడప్పుడు వర్షమేఘాలను చూసి నెమలిపుంజు నాట్యం చేస్తుంటే ప్రకృతి పరవశించిపోయేది. పగలంతా ఆహారం కోసం అడవిలో తిరిగి రాత్రి ఓ చెట్టుకొమ్మపైన హాయిగా నిదురించేవి.

ఒకరోజున నెమలిపుంజు అన్నది తన భార్యతో- "రోజూ చూసిందే చూసి, తిన్నదే తిని, నడిచిందే నడిచి విసుగుపుడ్తున్నది. అలా ఏ ఊరన్నా తీర్థయాత్రకు పోదాం!"

"నీ మాట నాకు శిరోధార్యం" అన్నది భార్య.

ఇద్దరూ అలా చెట్టుపైనుంచి చెట్టుకు ఎగుర్తూ, కాసేపు నడుస్తూ దగ్గర్లో ఉన్న లోయలోకి ప్రవేశించారు. అక్కడ అనేక ఫలపుష్ప వృక్షాలు, గలగల పారే సెలయేరు, ఆకుపచ్చని పచ్చిక మైదానాలు, రకరకాల పక్షులతో మనోహరంగా ఉన్న ప్రాంతంలో కొన్నిరోజులుండి, విశ్రాంతి తీసుకుని, ఇంటికి పోదామను కుంటున్న ప్పుడు రెక్కలు టపటపలాడిస్తూ పరుగు పరుగున వచ్చింది ఓ బాతు భయంతో గజగజ వణుకుతూ- "రక్షించండి! రక్షించండి!"

నెమలి అడిగింది- "ఎవరు నిన్నిలా భయపెట్టింది? నేను నీకు రక్షణ నిస్తాను. భయపడకు!"

బాతు అన్నది– "ఆదాము కుమారుడు నన్ను భయపెట్టాడు".

నెమలి అన్నది– ఆదాము కుమారుడు ఈ దీవిలోకి ఎలా రాగలడు. అతడు ఆకాశంలో ఎగరలేడు. నీటిపై నడవలేడు కదా!"

బాతు అన్నది– "నేను పుట్టి పెరిగింది ఈ దీవిలోనే. భయమన్నది ఎరగను. మొన్న రాత్రి నా శిరస్సును రెక్కలలో దాచుకుని నిద్రపోతుంటే నాకో కల వచ్చింది. దానిలో ఆదాము కుమారుడు నాతో మాట్లాడబోతుంటే నన్ను హెచ్చరిందో గొంతు–

***"అతడి మాటలు తీపి భక్ష్యాలు***
***అతడి కోరలు ప్రాణ హరాలు***
***అతడు తేనెపూసిన కత్తి***
***అమాయక ప్రాణులతడి లక్ష్యాలు***

ఓ బాతుపిల్లా! వాడితో జాగ్రత్త. నిన్ను ఆకర్షించి భయంకర భూతాల కప్పజెబుతాడు. నీటి పక్కన ఉన్న జీవుల రెక్కలపై మట్టిముద్దలు విసిరి నీళ్లలో పడవేస్తాడు. ఏనుగునైనా మభ్యపెట్టి తన పబ్బం గడుపుకుంటాడు. కాబట్టి ఓ బాతూ! జాగ్రత్త సుమా జాగ్రత్త!" అని హెచ్చరించిందా స్వరం.

భయం నా వళ్లంతా పాకగా, మెడను పొడుగ్గా చాపి, రెక్కలను రెపరెపలాడిస్తూ గాలిలోకి ఓపిక ఉన్నంత ఎగిరాను. ఇక ఎగరలేని పరిస్థితుల్లో ఎదురుగా ఉన్న కొండగుహపైన ఆగి రొప్పుతుంటే గుహలోంచి బయటకు వచ్చింది యువ సింహం. అతడిని చూడగానే నాకు కాస్త ధైర్యం వచ్చింది.

అతడన్నాడు– "సున్నితమైన బాతుపిల్లా, నీవు భయపడుతూ పైకెగరడం చూసాను నేను. ఎవరు నిన్ను ఇంతగా భయపెట్టింది? ఎవరు నీవు?"

నేనన్నాను– "నాపేరు బాతు. నేను పక్షుల జాతికి చెందిన దానిని. నాకు రాత్రి కలలో ఆదాం కుమారుడు కనిపించి మాట్లాడబోతుండగా, నాకో స్వరం హెచ్చరించింది– అతడి మాటల వలలో పడవద్దని. నాకు భయం వేసి గాలిలోకి ఎగిరాను".

సమస్త జంతువులకు ప్రభువైన 'సింహం' అన్నాడు– "నాకూ అలాంటి కల వచ్చినపుడు అనుభవజ్ఞుడైన నా తండ్రి నన్ను హెచ్చరించినాడు. ఎవరినైనా

ఎదిరించు కాని ఆదాము కుమారుడు కనిపిస్తే పక్కకు తప్పుకో! వాడు పయోముఖ విషకుంభం. గడ్డికప్పిన గొయ్యి! జాగ్రత్త" అన్నాడు యువసింహం.

నేనన్నాను– "తమలాంటి వీరాధివీరుడు ఆ ఆదాము కుమారుడనే వాడిని వధిస్తే తమరి ఖ్యాతి దిగంతాల వ్యాపించదా!"

యువకిశోరం అన్నాడు– "నేను అదే ఉద్దేశంతో ఉన్నాను. పద! నా వాడి గోళ్లతో, కరాళదంష్ట్రలతో వాడిని గాయపరచి వాడి గొంతు కొరికి నెత్తురు తాగుతాను".

ఇద్దరం కలిసి బయల్దేరాం. సింహం ముందు, నేను వెనక. అతడిది రాజసమైన సింహపు నడక. అతడు నడుస్తుంటే తోక ఓ ఖడ్గంలా కదిలేది. నాది తప్పటడుగుల బాతునడక. దాదాపు పరిగెడుతూ అతడి ననుసరించాను.

కొంచెం దూరం పోయేసరికి ధూళిమేఘం మధ్య కానవచ్చిందో గాడిద. అది ఎంతో గాభరాగా గెంతుతూ, మోకాళ్ల మీద కూలబడుతూ, ఒక్కోసారి దొర్లుకుంటూ మావేపు వచ్చింది– "రక్షించండి! రక్షించండి!" అంటూ. సింహాన్ని చూడగానే ఓ క్షణం ఆగి అన్నదా గాడిద– "ప్రభూ, అభివాదం! నాపేరు గాడిద, గార్దభ జాతికి చెందిన దానిని. నేను ఆ ఆదాము కుమారుడి నుంచి తప్పించుకుని పారిపోయి వస్తున్నాను".

యువసింహం నవ్వి అన్నది– "నీలాంటి బలిష్ఠమైన గాడిద, వెనకకాలితో తన్ని ఏనుగునైనా గాయపరచగలదు. నీకు ఆదాము కుమారుడంటే భయమెందుకు?"

గాడిద వణుకుతూ అన్నది– "బహుశా తమరు ఈ భయంకరమైన జీవిని చూసి ఉండరు. అతడు చంపుతాడని కాదు నా భయం. బతికుండగానే వాడు పెట్టే చిత్రహింసలకు ఎప్పుడు చావు వస్తుందా అని ఎదురుచూడాలి. నా వీపుమీద జీనులాంటిది వేసి, నా పొట్ట చుట్టూరా పటకాతో జీనుకు గట్టిగా కట్టి, నా తోక అడుగున ముళ్లచక్రం పెట్టి, నా నోటిలో ఇనుపముక్క పెట్టి నా నాలుక నుంచి రక్తం కారుతున్నా పట్టించుకోకుండా, నా వీపుమీద కూర్చుని అంకుశం లాంటి ముల్లుగర్రతో మెడమీద పొడుస్తూ– నానా బూతులు తిడుతూ, పొరపాటున నేను అపానవాయువు వదిల్తే నన్ను చితకగొడుతూ నా స్వేచ్ఛను హరించి, నాకు అంతంత

మాత్రం తిండి పెడుతూ అస్తమానం పని చేయించుకుంటాడు. నాకు ముసలితనం వచ్చాక నీళ్లు మోసేవాడికి అమ్ముతాడు. ఆ నీళ్లవ్యాపారి నామీద చెక్కజీను పెట్టి రెండుపక్కల నీటి బిందెలను కట్టి నెలల తరబడి పనిచేయించి, నేను కృంగి కృశించి చనిపోతే నన్నీడ్చి వూరిబయట పారేస్తాడు. అక్కడ నన్ను కాకులు, కుక్కలు పీక్కుతింటాయి. అలా నన్నతడు వేధిస్తాడు" అంటూ గాడిద వెళ్లబోతే సింహం అతడిని ఆపి అన్నది-

"ఎందుకు భయపడతావు. నీవు ఆ విచిత్ర జంతువు ఎక్కడ ఉందో చూపించు. దానిని ఈ పంజాతో నేలకూల్చి మీకు స్వేచ్ఛను ప్రసాదిస్తాను'' అన్నది సింహం దర్పంగా.

గాడిద అన్నది- "మహాప్రభో! గాడిద సలహా అని కొట్టిపడవేయకండి. వాడు తక్కువవాడు కాదు. నా మాట విని మనం పారిపోదాం ఇక్కడ నుంచి దూరంగా వాడి వాసన రానంత దూరం!" అని పక్కనే ఉన్న పచ్చగడ్డిపై కాసేపు దొర్లి భయంతో దాని కడుపులో నిండిన గాలిని పిడుగు పడిన శబ్దాలతో వదిలి పెట్టింది. ఆ వాసనకు ముక్కులు మూసుకుని మేం చెట్లచాటుకు పోయి దాక్కున్నాం.

ఇంతలో కాసింత దూరాన మరల గాలిలో పైకిలేచిన దుమ్ము చెబుతున్నది ఎవరో వేగంగా మావేపు వస్తున్నారని. గాడిద తన చెవిని నేలకానించి అన్నది- "వచ్చేది గుర్రం. నాకు గుర్రపుడెక్కల చప్పుడు వినవస్తున్నది" అని పలికి మమ్మల్ని దారిలో వదిలి గాడిద చెట్టు చాటుకు పోయి దాక్కున్నది.

ఆ ధూళిమేఘాన్ని చీల్చినట్లు బయటపడింది గుర్రం ముఖం. దాని నుదుటిపై వెండి దీనారంలాంటి తెల్లటి మచ్చ. బలిష్ఠమైన శరీరం, నాలుగు కాళ్లకు గిట్టలపైన కిరీటంలా తెల్లటి వెంట్రుకలు, చాలా చక్కగా ఉన్నదా అశ్వరాజం. సింహాన్ని చూడగానే గౌరవపూర్వకంగా ఆగి అభివాదం చేసింది- "మహాప్రభూ! నేను అశ్వాన్ని, గుర్రాల తెగకు చెందిన దానిని. ఆ ఆదాము కుమారుడి బారి నుంచి తప్పించుకుని పారిపోతున్నాను".

"ఎంతటి పిరికిమాట! అదీ నీలాంటి వీరుడి నోటినుంచి రావడమా? నేను ఆ దుష్టుడి పొగరణచడానికే బయల్దేరాను. ఇదిగో ఈ బాతు, అదుగో ఆ చెట్టు చాటున ఉన్న గాడిద, ఇప్పుడు నీవు ఆ దుర్మార్గుడికి భయపడి వణుకుతున్నారు. కొద్దిసేపట్లోనే వాడి భరతం పడ్తాను".

అశ్వం అన్నది విచారంగా– “ప్రభూ! వాడిని ఎదిరించడానికి ప్రయత్నం చేయవద్దు. ఎంతో వేగము, బలమూ ఉన్న నన్ను ముక్కుకు తాడేసి వ శపరుచుకో గలడు. పైపెచ్చు నా కాళ్లను జనపనార తాళ్లతో బంధించి, స్వారీ చేయాలను కున్నపుడు వీపుమీద జీను పరచి, నడుముకు పటకా కట్టి, నోటిలో ఇనుప ముక్క పెట్టి దానికి కళ్లేలు కట్టి నన్ను తనకిష్టమైన రీతిలో పరిగెత్తేట్లు చేయగలడు. వాడి చెప్పులకున్న ఇనుప చక్రం ముళ్లు చాలా వాడిగా ఉంటాయి. వాటితో నా పక్కల మీద పొడిచి నా వేగం నియంత్రిస్తాడు. నాకు ముసలితనం వచ్చాక గానుగాడించే వాడికి అమ్ముతాడు. వాడు పగలు రాత్రి భేదం లేకుండా నాతో గానుగ నడిపించి, నేను నీరసించాక కటికవాడికి అమ్మితే, వాడు నా పీక కోసి చర్మాన్ని వొలిచి చెప్పులు కుట్టేవాడికి, నా వెంద్రుకలను కంబళి నేసేవాడికిస్తాడు. అందుకే ఆ ఆదాము కుమారుడి నుంచి తప్పించుకుని పారిపోతున్నాను. మీరూ నాతో రండి, త్వరగా! వాడిటే వస్తున్నాడు”.

“లేదు, నేను వాడిని చంపిగాని మరల అడవికి పోను!” అన్నాడు సింహప్రభువు.

ఇంతలోనే మరల ధూళిమేఘం. ఈసారి ఓ ఒంటె పడుతూ లేస్తూ పెద్దపెద్ద అంగలతో వాళ్లవేపు వచ్చి సింహాన్ని చూసి ఓ క్షణం ఆగింది. ఆ పెద్ద వక్రరూపాన్ని చూసి సింహం అదే ఆదాము కుమారుడనుకుని వీరావేశంతో ఒంటెపై దూకడానికి సిద్ధం కాగా, అశ్వరాజం అతడిని ఆపి అన్నది– “ఇతడు ఒంటె. ఎడారిలో ఇతడిని మించినవారు లేరు”.

“ఒంటె అన్నది– “ప్రభూ! ఆ ఆదాము కుమారుడు మంచివాడు కాదు. వాడు నా ముక్కు రంధ్రాలకు ఉంగరం తొడిగి దానికో తాడుకట్టి లాగుతుంటే నా నరాలు, ప్రాణాలు తోడేసినట్లై వాడు చెప్పిన పనల్లా చేస్తాను. తరతరాలుగా వాడు మాపై పెట్టినబరువులను మోసిమోసి నా వీపున మూపురం వచ్చింది. నా కాళ్లు చూడు, ఇసుకలో, రాళ్లలో నడిచి నడిచి కాయలు కాసాయి. వాడి పనిలోనే జీవితం గడిచి, ముసలితనం రాగానే నన్ను కటికవాడికి, చర్మశుద్ధి పనివాడికి అమ్మేస్తాడు. అందుకే వాడంటే నాకు చచ్చేంత భయం. గాడిదను, గుర్రాన్ని వెతుక్కుంటూ నా మీద వేగంగా బయల్దేరాడు. నీటిమడుగు వద్ద వాడు నీళ్లు తాగుతుంటే వీలు చిక్కించుకుని ఇలా పారిపోయి వచ్చాను.

*నీ స్వంత ఊళ్లోకి వచ్చి ఎవడైనా గుడారం పాతితే*
*వాడి ముఖం చూడు, నచ్చలేదనుకో అంతే*
*వాడితో తగాదా పడకు, వెంటనే వెళ్లిపో లేకుంటే*
*నీకు నష్టం తప్పదు, వాడు వచ్చాడా నీ పని గల్లంతే!"*

అని చెప్పి ఒంటె, గుర్రం దూరంగా ఉన్న చెట్ల గుబురులో, గాడిద ఉన్న చోటుకు వెళ్లి దాక్కున్నవి.

అక్కడ మిగిలింది బాతునైన నేను, సింహం. ఒంటె వెళ్లిపోయిన కొద్ది నిముషాల్లోనే ఓ ముసలి జంతువు రెండుకాళ్లపై వంగివంగి నడుస్తూ వచ్చింది. అంతటి అసహ్యకరమైన ప్రాణిని నేనెన్నడూ చూడలేదు. ముడతలు పడిన శరీరం, ఒకచోట స్థిరంగా నిలవని కళ్లు, కాస్త వంగిన నడుము, వీపుపై వడ్రంగి సామాను, ఎనిమిది గట్టి చెక్కముక్కలున్న మూట మహా విచిత్రంగా ఉన్నాడతడు.

నేను ఉన్నచోటునే కూలబడిపోయాను కాని యువకుడైన సింహం వాడిని దగ్గరగా వెళ్లి పరీక్ష చేసింది. వాడన్నాడు సింహానికి అభివాదం చేసి– "ఓ కీర్తి గడించిన సింహప్రభూ! అత్యున్నత ఆసనంపై కూర్చుని నింగిని తాకే ప్రకాశవంతుడా, నేను ప్రార్థిస్తున్నాను దైవాన్ని తమకు మరిన్ని కీర్తిప్రతిష్ఠలను భోగభాగ్యాలను ఇమ్మని. నేనో అభాగ్యుడిని తమ రక్షణ కోరుతున్నాను".

అతడి గద్గద స్వరానికి, కనులవెంబడి ధారలా కారుతున్న కన్నీటికి, అతడి వినయ విధేయతలకు సింహంలోని వీరావేశం చల్లారింది. "ఎవరు నిన్ను భయపెడుతున్నది ఓ అధమజీవీ, అనాకారీ!" అన్నది సింహం గర్జిస్తూ.

"నేనో వడ్రంగిని! నన్ను ఆదాము కుమారుడు భయపెడ్తున్నాడు. పగలూ రాత్రీ నిద్రాహారాలు లేకుండా నాతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాడు. నేను అతడికి ఎదురుతిరిగి ఇటు పారిపోయి వచ్చాను" అన్నాడు వాడు.

"ఎక్కడున్నాడు వాడు? వాడిని చంపి ఈ అణగదొక్కబడిన జంతు సమూహానికి ఆనందం కలిగిస్తాను" అన్నాడు సింహకిశోరం భీకరంగా గర్జిస్తూ.

"వాడిటే వస్తున్నాడు. ఎందుకంటే వాడికి ఇళ్లు కట్టేవారు ఎవరూ ఇప్పుడు లేరు. అందుకే నా వెంటబడి తరుముతూ వస్తున్నాడు" అన్నాడు ఆ వడ్రంగి.

"ఎటు పోతున్నావు నీవు ఈ అడవిలో?" అడిగాడు సింహం.

"మహాప్రభూ, తమరి తండ్రిగారి వజీరు అయినటువంటి చిరుతపులి నాకు పురమాయించాడు ఒక గట్టి భవనాన్ని నిర్మించమని, తద్వారా ఆదాము కుమారుడి దాడినుంచి తప్పించుకోవచ్చని. అందుకే నేను ఈ పనిముట్లు, చెక్కలు తీసుకుని చిరుతపులి వద్దకు వెళ్తున్నాను. వెళ్లి ఏ శత్రువూ ఆదాము కుమారుడు కూడా తాకలేనంత గట్టి ఇల్లు నిర్మిస్తాను".

సింహానికి అసూయ పుట్టింది. తనకు సరైన ఇల్లు లేదు కాని తన వజీరుకు రక్షణ దుర్గమా?– "అదీకాక మాకు ముందుగా నిర్మించకుండా తనకొరకు ఎలా కట్టమని ఆదేశిస్తాడు! అతడికి తర్వాత కడుదువుగాని, ముందు నాకు నిర్మించు శత్రు దుర్భేధ్యమైనది, ఆదాము కుమారుడి దాడి నుంచి తట్టుకోగలిగిన దారుభవనం!"

"తమ వజీరు చిరుతపులికి కోపం వస్తుందేమో!"

"ఏమి నాకు రాదా? ఎవరు రాజు, ఎవరు వజీరు?"

అని సింహం తన పంజాను ఎత్తి సున్నితంగా ఆ వడ్రంగి ఛాతీపైన కాలిగోటితో నెట్టింది. ఆ చిన్ని దెబ్బకే వాడు కిందపడిపోయాడు. సింహం పగలబడి నవ్వింది.

ఆ వడ్రంగి –సింహకిశోరపు కొలతలు తీసుకున్నాడు. కొద్ది నిముషాల్లోనే మంచి బలమైన పెట్టె తయారయ్యింది. ఆ పెట్టె పక్కచెక్కలకు పదునైన మేకుల కొనలు పొడుచుకువస్తున్నాయి. లోపల కేవలం సింహం పట్టగలిగినంత చోటు మాత్రమే ఉన్నది. "ప్రభూ, తమ తాత్కాలిక గృహం తయారైనది. తమరు నెమ్మదిగా జాగ్రత్తగా లోపలికి ప్రవేశించండి. ఈ పెట్టె తమకు రక్షకగృహమై, కవచమై ఆ ఆదాము కుమారుడి నుంచి మిమ్మల్ని కాపాడుతుంది" అన్నాడతి వినయంగా.

"పెట్టె లోపలికి పోవడానికి అటూ, ఇటూ రంధ్రాలున్నాయి. చాలా ఇరుకుగా ఉన్నట్లున్నది" అన్నది సింహం.

"తమరికి సరిగ్గా సరిపోతుంది ప్రభూ! ఈ రంధ్రం లోంచి దూరి, అటువేపు రంధ్రం గుండా తల బయటకు పెట్టి ఒక్కసారి వళ్లు విదుల్చుకోండి. ఒక గొప్ప అనుభూతిని పొందుతారు" అన్నాడు వడ్రంగి.

పాకుకుంటూ, నెమ్మదిగా సింహం పెట్టెలోకి ప్రవేశించింది. సింహంతోక వరకు లోనికి పోగానే వడ్రంగి చెక్కతో దారి మూసివేసాడు. రెండో రంధ్రం

గుండా తల బయటపెట్టబోతే తల పట్టలేదు. ఒళ్లు విరుచుకోబోయింది సింహం. పదునైన మేకులు కసకసా శరీరంలోకి దిగగా తీవ్రమైన బాధతో గావుకేక పెట్టింది సింహం.

"దుర్మార్గుడా, చంపేస్తాను నిన్ను" అరిచింది సింహం.

ఆ వడ్రంగి పకపకా నవ్వాడు– "బక్కప్రాణిని, అధమజీవిని, అనాకారిని నేను. అయినా తెలివిగలవాడిని. నేనే ఆ ఆదాము కుమారుడిని. ఓ అడవికుక్కా, అయిపోయింది నీ పని. నిన్ను చంపి ఈ అడవిని, అడవిలోని సమస్త జంతువులను నా ఏలుబడిలోకి తెచ్చుకుంటాను" అంటూనే వాడు సింహమున్న పెట్టె చుట్టూ ఎండుకట్టెలు పేర్చి నిప్పు అంటించాడు. చావుకేకలు పెడుతూ సింహం మంటల్లో కాలి చనిపోయింది. వాడు విజయనాదాలు చేస్తూ తన పనిముట్లు తీసుకుని వచ్చిన దారినే పోయాడు. వాడు వెళ్లిపోయాక నేను ఒక్క ఉదుటున ఎగిరి ఒంటె, గుర్రం, గాడిద దాక్కున్న చెట్ల గుబురు వేపు వెళ్లాను. ఇంకెక్కడున్నాయవి, ఎప్పుడో పారిపోయాయి తలో దిక్కుకూ. నేనూ నా ఇంటికి వచ్చి బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాను, ఆ ఆదాము కుమారుడికి దొరకకూడదని దైవానికి మొక్కుకుంటూ. అయినా రోజుకొక్కసారైనా ఆ వడ్రంగి రూపంలోని ఆదాము కుమారుడు నా కలల్లోకి వచ్చి భయపెడుతుంటాడు" అని చెప్పింది బాతు తన మిత్రులైన నెమలి దంపతులతో.

***అంతవరకూ చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 147వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

"ఆ ఆదాము కుమారుడు కలలోకి వస్తే చాలు నా గుండె దడదడ లాడుతుంది" అన్నది బాతు తన మిత్రులైన నెమలి దంపతులతో.

వాళ్లన్నారు– "అసలు భయంవద్దు, సోదరీ. నీవు ఎంతకాలం కావాలంటే అంతకాలం మాతో ఉండవచ్చు. అల్లా నీకు దైహిక, మానసిక ఆరోగ్యాలను ప్రసాదిస్తాడు. భయమెప్పుడూ విధిరాత నుంచి తప్పించుకోడానికి మార్గాలు

వెదుకుతూ ఉంటుంది. గుర్తుంచుకో మనం చేసిన ప్రతి అప్పు తీర్చాలి, మన నుదుటి రాత ఆఖరి అక్షరం వరకూ పూర్తయినాకే మనకు విముక్తి లభిస్తుంది. ఆ అద్భుత న్యాయమూర్తి తన జీవులకు ఎవరెవరికి ఎంతైతే ఆనందాన్ని కేటాయించాడో అంత ఆనందాన్ని ఆ జీవి అనుభవిస్తాడు".

అలా వాళ్లు మాట్లాడుకుంటూ కాస్త ముందుకు పోగానే చెట్లలో అలికిడైంది. ఎవరో వేగంగా పరిగెత్తుకుంటూ ఎండుటాకులు తొక్కుతూ వస్తున్న శబ్దాలు వినగానే అసలే భయపడుతున్న బాతు గాలిలోకి ఎగిరి అంత దూరాన వాలింది. నెమళ్లు ఆశ్చర్యంతో చూస్తుండగానే వారిముందు కనబడింది ఓ ఎర్రదుప్పి. నెమళ్లు అన్నాయి– "సోదరీ, ఇతడు మన అతిథి. ప్రమాదకరమైనవాడు కాదు. మనం పక్షిజాతికి చెందినవాళ్లం, అలాగే, ఇతడు జంతుజాతికి చెందినవాడు. మాంసాహారం తినడు. ఎంచక్కా ఆకులు అలములు తింటాడు. ఇలా ప్రతిదానికీ భయపడితే నీ ఆరోగ్యం దెబ్బతింటుంది".

ధైర్యం చిక్కినాక బాతు తిరిగివచ్చింది. ఎర్రదుప్పి అందరికీ అభివాదం చేసి అన్నది– "ఇక్కడున్న చక్కటి పచ్చిక, చెట్లు నన్ను ఆకర్షించాయి. లేడిపిల్లలా గెంతులు వేసుకుంటూ వచ్చేసరికి ఈ బాతు నన్ను చూసి బెదిరినట్లున్నది. అవునా మిత్రమా!"

ఆ తరువాత నలుగురు మిత్రులూ చాలా కాలం హాయిగా కబుర్లు చెప్పుకుంటూ సుఖంగా ఉన్నారు. అయితే బాతు సుఖజీవితానికి అలవాటుపడి దైవ ప్రార్థనలను మరచిపోయింది. నెమళ్లు, ఎర్రదుప్పి ఎంత చెప్పినా వినకుండా "రేపటి నుంచి చేస్తా" అంటూ సెలయేటి నీళ్లలో ఈదుకుంటూ కాలక్షేపం చేసింది. అలా కొంతకాలం గడిచింది.

ఒకరోజున ప్రమాదానికి గురై ఓడ ధ్వంసం కాగా ప్రాణాలతో బయట పడిన కొందరు నావికులు ఆ ద్వీపం వేపుగా వచ్చారు. వాళ్లను చూడగానే మిత్రులను హెచ్చరిస్తూ నెమళ్లు చెట్లపై ఎగురుకుంటూ చాలాదూరం వెళ్లిపోయాయి. ఎర్రదుప్పి చాలా వేగంగా చెట్లలోకి పారిపోయింది. పరధ్యానంలో ఉన్న బాతు ఇవేమీ పట్టించు కోకుండా నీళ్లలో తలముంచి తిండికై వెదుకుతూ ఆ మనుషులకు చిక్కింది. వాళ్లను తప్పించుకోడానికి అటుయిటూ పరిగెత్తినా వాళ్లు దానివెనకే పరిగెత్తి పట్టుకుని

మెడ కోసి చంపి, మంటపై కాల్చుకుని తిన్నారు. వాళ్లు వెళ్లిపోయాక దూరం నుంచి చూస్తున్న నెమళ్లు దుఃఖిస్తూ ఎర్రదుప్పిని వెదుక్కుంటూ వెళ్లి అతడు కనిపించాక జరిగిన విషాదాన్ని అతడితో చెప్పి- "బాతు చాలా మంచిది. అయితే అది తిండియావలో పడి అల్లాను ప్రార్థించడం మరచిపోయింది" అన్నాయి నెమళ్లు.

***అతడు కరుణామయుడు, సమవర్తి***
***మనం చేసిన పాపపుణ్యాలు***
***అతడికి తెలుసు.***
***అతడు అత్యంత శక్తివంతుడు, చక్రవర్తి***
***మనం పలికిన సత్యాసత్యాలు***
***అతడికి తెలుసు***
***అతడు సర్వసాక్షి, అంతిమదిన న్యాయమూర్తి***
***మన సత్కార్యాలు, నేరాలు***
***అతడికి తెలుసు.***

దైవ ప్రార్థనలు మనల్ని సరైన మార్గంలో నడుపుతాయి. దైవ చింతన మన మనసును అద్దంలా శుభ్రంగా ఉంచుతుంది. దైవభయం మనల్ని నేర ప్రవృత్తి నుంచి కాపాడుతుంది.

## (2) గొర్రెలకాపరి - నీలికనుల బాలిక

అక్కడ ఉన్న పర్వత ప్రాంతంలో ధర్మనిష్ఠ, దైవభక్తి, జీవులపై దయ కలిగిన ఓ గొర్రెలకాపరి ఉండేవాడు. తన గొర్రెల ఆలనా పాలనా చూసుకుంటూ ఇతర జంతువులకు ఆపద కలిగితే వాటిని సంరక్షిస్తూ ప్రేమను పంచుతూ ఉండేవాడు. క్రూరమృగాలు కూడా అతడిని చూడగానే వినయ విధేయతలతో అభివాదం చేసేవి. అటువంటి ధర్మనిష్ఠాపరుడిని పరీక్షించేందుకు అల్లా అనుమతితో దేవదూత ఓ అద్భుత సౌందర్యరాశి అయిన నీలికనుల బాలికను పంపినాడు.

ఆమె గుహలోకి అడుగుపెట్టగానే అక్కడంతా పరిమళాలు వ్యాపించగా, ఆమె చిరునవ్వుల వెలుగులతో ఆ గుహలోని చీకటి అదృశ్యమయ్యింది. తన వద్ద నిలబడిన ఆ సౌందర్యరాశిని చూసి అతడన్నాడు- "ఎవరు నీవు? నాకు నీ అవసరమూ లేదు. నేను నీకే ఆహ్వానమూ పంపలేదు".

ఆమె అన్నది మాటలలో మాధుర్యం తొణికిసలాడుతుండగా– "నేను కన్యను. నీవు మగవాడివి. మన మధ్య ఆహ్వానాలు అవసరమా!" ఆమె తన కళ్లు తిప్పుతుంటే ప్రేమ కాంతిపుంజాలు ఆ గుహను వెలుగుల్లో నింపాయి.

"వెళ్లిపో కామినీ! నన్ను ప్రభువు ప్రేమలో తరించనీ!" అన్నాడతడు.

ఆమె తన దేహాన్ని విద్యుల్లతలా ప్రకాశింపజేస్తూ అన్నది– "కోరి వచ్చిన కన్యను తిరస్కరించకు. నా తెల్లని వక్షోజాలు నీ గొర్రెల పాలతెలుపును మించలేదా! నా నగ్నరూపం కొండవాలులో జాలువారుతున్న జలపాతాన్ని తలపించలేదా! నా కురులు అప్పుడే పుట్టిన గొర్రెపిల్ల ఉన్నికన్నా మెత్తగా కానరావా! నీ స్పర్శ కొరకు నా దేహమే ఒక పరిమళభరిత మొగ్గగా వేచి చూస్తున్నది. నీ చూపుడు వేలు తగిలితే చాలు అది మనోహర పుష్పమై వికసించనున్నది. నా అధరాలు తేనెలూరు జీవజలాన్ని స్రవిస్తున్నవి. మరొక్కసారి చూచి మాట్లాడవోయీ ఈ నిరుపమాన సౌందర్యాన్ని" అన్నదామె హొయలు లొలికిస్తూ.

గొర్రెల కాపరిలో ఆగ్రహం పెల్లుబికి అతడి శరీరపు ప్రతిరోమమూ నిక్కబొడుచుకుని కంపించసాగింది– "వెళ్లిపో, కామపిశాచీ! లేకుంటే నా కొంకి కర్రతో నిన్ను కొట్టి అవతల పడేస్తాను" అన్నాడు ఆమెమీదకు ఉగ్రంగా వస్తూ.

మరుల తీగలా అతడి మెడను చుట్టి ఆమె అతడి చెవులలో గుసగుస లాడింది తీయగా– "నేను అద్భుత మధురఫలాన్ని. తిని ఆరగించుకో. అపురూపమైన మల్లెల పరిమళాన్ని ఆఘ్రాణించి సెదతీర్చుకో!"

అతడన్నాడు ఆమెను నెట్టివేస్తూ– "దైవప్రార్థనా పరిమళాలను మించిన సుగంధమేమీ లేదు. నీ యుక్తులు నా వద్ద చెల్లవు. వెళ్లిపో, వెళ్లు!"

ఆమె అతడి శయ్యపై ఒరిగి తన దేహం పైనున్న పలుచటి వస్త్రాలను తొలగించి పూర్తి నగ్నంగా, నల్లటి కురుల అలలపై తేలుతున్న తెల్లటి ముత్యంలా కానవచ్చింది. ఆమె మౌనరూప ఆహ్వానం ఆమె ఇదివరకు పలికిన పలుకుల కన్నా శక్తివంతమై విద్యుత్ వలయాలను సృజించసాగింది.

గొర్రెలకాపరి వెంటనే తన ముఖాన్ని గొంగళిలో కప్పుకుని ఆ సజీవ లిల్లీపుష్పాన్ని చూడకుండా జాగ్రత్తపడి అన్నాడు– "వెళ్లిపో ఇక్కడి నుంచి ఓ వంచనా

పూరిత నేత్రాల్లారా! ప్రపంచపు తొలిరోజుల్నుంచి మీ కనుల భాష శిలాహృదయాల్ని సైతం కరిగించింది. దేవుని కుమారుల మధ్య వైషమ్యాన్ని కలిగించి మృత్యువుకు ఆహ్వానం పలికింది" తలకు ముసుగును మరింత గట్టిగా కప్పుకున్నాడా గొర్రెలకాపరి.

ఆమె జవాబిచ్చింది– "నీవు పేర్కొన్న జ్ఞానులు, వేదాంతులు నన్ను గౌరవించారు, పొగిడారు. నా అందమేనాడూ వారిని సరైన మార్గం నుంచి మళ్లించలేదు. వారికోసం దారిని వెలుగులతో నింపి, పాదాలకు నెప్పి కలగకుండా పూలను పరచింది. నిజమైన జ్ఞానమేమిటంటే, నీకున్న జ్ఞానాన్ని నా వక్షోజాల మధ్య మరచిపోవడం. రా, నీకు నేర్పుతాను సరైన జ్ఞానాన్ని, నా విద్యుత్ ప్రభల మధ్య"

గొర్రెలకాపరి దైవప్రార్థనలో మునిగిపోయాడు– "అన్ని స్వల్ప ఆనందాలను లయం చేసే ఆనంద స్వరూపమా! అన్ని కామాగ్నులనూ ఆర్పివేసే అపూర్వ ప్రేమ దీపమా! అన్ని పిశాచాలనూ మట్టెబెట్టే అద్భుత శక్తిరూపమా! నన్ను రక్షించు. ఈ పరీక్ష నుంచి నన్ను గట్టెక్కించు" అంటూ కన్నీళ్లతో దైవాన్ని వేడుకొనసాగినాడు.

ఆ నీలికనుల బాలిక అన్నది– "ఓ పవిత్ర సాధుమూర్తీ! శాంతించు! నీ గొర్రెల పాలు తాగుతూ ప్రశాంత జీవనాన్ని కొనసాగించు. దైవప్రార్థనలో చిరకాలం జీవించు"

ఆ మంత్రదృశ్యం కనుల నుంచి మాయం కాగానే ఆ చుట్టుపక్కల ఉన్న పక్షులు, జంతువులు అన్నీ వచ్చి ఆ గొర్రెలకాపరి చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడి అతడి ఆశీస్సులను పొందినాయి.

షహర్జాది ఈ కథ చెప్పగానే షారియార్ ప్రభువు ఆలోచనలో పడినాడు. అతడన్నాడు– "ఒక్కోసారి నాకూ అనిపిస్తుంది, ఈ రాజ్యం, ఈ భోగభాగ్యాలు వదిలి ఆ కొండలోని గొర్రెలకాపరిలా నివసించకూడదా అని!"

షహర్జాది అన్నది– "అలాంటిదే ఇప్పుడు నేను చెప్పబోయేది తాబేలు–నీటికోడి కథ".

***ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# * 148వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

## (3) తాబేలు-నీటికోడి కథ

ఆ నీటికొంగ నది ఒడ్డున నీటి అంచున నిలబడి మెడ నిలువుగా సాచి, ప్రవాహం వేపు జాగ్రత్తగా చూస్తున్నది. అంత శ్రద్ధగా పనిచేస్తూండడం వల్లనే అది తన జీవనాన్ని నిశ్చింతగా, ఏ ఒడిదుడుకులు లేకుండా గడుపుకుంటూ తన కుటుంబాన్ని, పిల్లలను పోషిస్తూ సుఖంగా బతుకుతున్నది.

అదలా చూస్తూ ఉండగానే ఆ ప్రవాహంలో ఓ మానవ మృతకళేబరం కొట్టుకువస్తూ కానరాసాగింది. అది కాస్తదూరంలో ఉన్న రాళ్ల మధ్య చిక్కుకుని దాదాపు నిలబడిన సైనికుడిలా, కత్తి, బల్లెపు దెబ్బలతో దేహమంతా ఛిద్రమై కనబడగానే కొంగ అనుకున్నది– "ఇతగాడు బతికున్నరోజుల్లో బందిపోటు దొంగ అయివుంటాడు. ఇప్పుడిలా నదీపోటులో కొట్టుకుని పోతున్నాడు" అనుకుని వాడి శరీరాన్ని పొడిచి కొంత మాంసం తన పిల్లలకు పట్టుకుపోదామని అటు పోబోయే సరికి, ఆకాశాన రాబందులు, గద్దల గుంపు వలయాలుగా ఎగుర్తూ శవం వేపు రావడం కనబడింది.

దానితో తారెత్తిన కొంగ అంచెలంచెలుగా ఎగుర్తూ వేగంగా నదీ ముఖద్వారాన ఉన్న దీవిలోకి వెళ్లి ఆగింది– "ఏమిటీ దురదృష్టం! కొద్దిసేపటి ముందు నాకూ నా పిల్లలకూ ఇంత ఆహారం దొరికిందని సంబరంలో ఉన్నానే, మరుక్షణంలోనే ఆ రాబందులకు ఆహారమౌతానేమోనని భయపడుతూ ఇల్లుకాని ఇల్లు, ఊరుకాని ఊరు, దీవికాని దీవి వచ్చి భార్యాబిడ్డలకు దూరమయ్యానే! ఇది ఓ ఖాళీ ప్రపంచం. రేపటి కోసం దాచుకోకుండా ఏరోజుకారోజు బతికేవాడు కష్టకాలంలో చాలా అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పుడు గాలిలోని తోడేళ్లు నన్ను వేటాడుతాయోమోనన్న భయం నన్నింతదూరం తరిమింది. అయినా ఆపద కాలంలో కావాల్సింది ఓపిక. సహనమున్న వాడు జీవిత సమరాన గెలుస్తాడు"

ఇలా కొంగ ఆలోచిస్తున్న సమయంలోనే తానున్న చెట్టువేపు తాబేలు ఈదుకుంటూ రావడం కనిపించింది. తాబేలు తలపైకెత్తి అన్నది– "ఓ కొంగా, ఎక్కడి నుంచి వచ్చావీ దీవికి?" కొంగ సమాధానమిచ్చింది–

*"నీవున్న గుడారంలోకి కొత్తముఖం తొంగిచూసిందా,*
*జాగ్రత్తగా పరికించు, అది నీకు నచ్చిందా, లేదా*
*నచ్చలేదా నీవక్కడి నుంచి వెళ్లిపో, లేకుంటే*
*నీకే ఆపద; శత్రువు అతడు, వచ్చింది నిను ఓడించేందుకే కదా!*

ఓ మంచి హృదయమున్నదానా! నేనున్న ప్రదేశంపై గద్దలు, రాబందులు గుమికూడాయి. నేను పారిపోయి వలసపక్షిగా వచ్చానిక్కడికి!"

తాబేలు అన్నది– "పరాయి దేశంలో స్నేహితుడుంటే మనసు దిటవుగా ఉంటుంది. నేను నిన్ను సాదరంగా ఆహ్వానిస్తున్నాను. నీవు నీ దేశం వెళ్లేవరకూ ఇక్కడ హాయిగా ఉండవచ్చు".

కొంగ సమాధానమిచ్చింది– "పైన పెంకులా గట్టిగా లోన అత్యంత మృదువుగా ఉండే కచ్ఛప మిత్రమా నీ ఆహ్వానం నన్నెంతో ఆనందపరచింది. నా జాతిలో నీలాంటి సహృదయులు కానరారు. ఎప్పుడు చూసినా వారి ధ్యాసంతా చేపలపైనే. కాసేపు అల్లాపై భక్తితో ప్రశాంతంగా ప్రార్థనలు చేద్దామన్న ఇంగితజ్ఞానం ఉండదు. పొడుగాటి ముక్కుల్ని నేలవేపుంచి, రెక్కలున్నా పైకెత్తి ప్రార్థించవు".

తాబేలు అన్నది– "చాలా మంచివాడివి నీవు. దైవం నీకు మేలు చేస్తాడు".

***ప్రపంచాన్నింత స్నేహమయంగా తీర్చిదిద్దిన***
***సృష్టికర్తకు కృతజ్ఞతలు***
***పేదవాళ్లకు చిరునవ్వులు, స్నేహశీలతనిచ్చిన***
***కరుణామూర్తికి అభివాదములు***

ఇరువురూ దైవప్రార్థన చేసినారు.

కొంగ అన్నది– "నా భార్యాబిడ్డలు అక్కడ ఉన్నారు కదా!"

తాబేలు సమాధానమిచ్చింది– "నీవు కొద్దిసేపటి తరువాత నీ ఇంటివేపు వెళ్లు; నదిలో ప్రతిదినం అనేక తాటిదోనెలు నీళ్లలో కొట్టుకు వస్తుంటాయి. నీవు నీ భార్య నీ పిల్లలు ఒక దోనెపై కూర్చుని క్షేమంగా రండి".

జగద్రక్షకుడైన అల్లా దయతో కొంగ తన కుటుంబాన్ని క్షేమంగా ఆ దీవికి తీసుకువచ్చింది. గాలి తోడేళ్లను దాటుకుని– తాబేలు, కొంగ కుటుంబాలు ఆ దీవిలో చిరకాలం సఖ్యంగా జీవించాయి"

షహర్జాది అన్నది– "ఇప్పుడు నేను చెప్పబోయేది తోడేలు–నక్క కథ. ఈ కథలోనూ ఆదాము కుమారుడి ప్రస్తావన ఉంటుంది. అందుకే మరింత ఆసక్తి కరంగా ఉంటుంది".

**ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 149వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

## (4) తోడేలు-నక్క కథ

ఆ రోజుల్లో నక్కలకు రాజు తోడేలు. అతడు శత్రుభయంకరుడు. మహాబలుడు. అతడు కాలు చాచి తంతే ఏనుగులైనా కేక పెట్టాల్సిందే! దానికి తోడు కోపిష్ఠి ఆ వృకరాజు. క్రూరుడు.

నక్క ఎంత వినయ విధేయతలతో, నక్కజిత్తులతో పనిచేసినా తోడేలు మహరాజు ఏదో ఒక తప్పు పట్టుకుని దండిస్తూ ఉండేది. దానితోపాటు అతడి అధికారంలో కోత విధిస్తూ వచ్చేది. దానితో నక్క హతాశుడై పోయిన గౌరవాధికారాలను ఎలా సంపాదించుకోవాలో అన్న ఆలోచనలో పడింది.

ఖర్మకాలి ఆ ఆలోచన వృకమహరాజుకు చెబుదామని వెళ్లేసరికి ఆ తోడేలు భగభగమని మండుతూ, ముక్కు నుంచి వేడి పొగలు వస్తుండగా, రోమాలు సన్నని సూదుల్లా నిక్కపొడుచుకోగా మహాభీకరంగా కానవచ్చింది. ఆ సమయంలోనే తనముందు వినయ విధేయతలతో నడుం, తల వంచి మోకరిల్లిన నక్కను అడిగింది–

"కుక్కల కొడకా, ఎందుకు వచ్చావు?" దాని అరుపుకు చుట్టుపక్కల చెట్లు, సభిక జంతువులు గజగజ వణికాయి. చెట్లమీద పక్షులు ఒక్కుమ్మడిగా పైకి ఎగిరి మరల స్వస్థలాలకు చేరుకున్నాయి.

నక్క అన్నది– "తమరు అనుమతిస్తే నేనొక విషయం చెబుతాను"

తోడేలు గయ్యమన్నది– "సరే, త్వరగా ఏడువు. నీళ్లు నమిలావా, నీ కీళ్లు జారేలా తంతాను".

నక్క చెప్పింది– "మహాప్రభో! చాలా రోజుల నుంచి ఆదాము కుమారుడు మనపై నిరంతర యుద్ధం ప్రకటించి ఉచ్చులు, వలలు, గోతులు, కత్తులు, కటార్లు తయారుచేసి మన రాజ్యాన్ని కొద్దికొద్దిగా ఆక్రమిస్తూ వస్తున్నాడు. అతడి ఎత్తుల ముందు నక్కజిత్తులు కూడా పనిచేయడం లేదు. తమ గౌరవనీయులైన తోడేళ్ల సమూహం, మా సేవక నక్కలు కలిసి ఉమ్మడి ప్రణాళికతో వాడిని ఎదిరించాలి".

తోడేలు అరిచింది– "మూర్ఖుడా! పిరికిపందా! రాజ కుటుంబీకులమైన మేము నీచ నికృష్టజాతికి చెందిన నక్కలతో పొత్తు కలపాలా? ఏమనుకుంటున్నావు నీ గురించి. ఇస్తా ఉండు నీకు నా స్నేహహస్తం" అంటూ కాలు చాచి గట్టిగా తన్నేసరికి నక్క వెళ్లి అల్లంత దూరాన పడింది.

దెబ్బతిన్న నక్క అవమానపడినట్లు ముఖ కవళికలు ప్రదర్శించకుండా లేచి దుమ్ము దులుపుకుని– "ప్రభువుల దయ, ఆగ్రహాలు సేవకులకు కానుకల వంటివి. సేవకుల దోషాలు తెలిసే ప్రభువు వారిని దండిస్తాడు. తమరు తన్నిన తన్నుకు నాలోని తప్పులు తొలిగిపోయి ధన్యుడనైనాను".

అప్పటికి తోడేలు కాస్త శాంతించి అన్నది– "నీ లోపమల్లా నీది కాని విషయంలో తలదూర్చడం. అనవసర ప్రసంగాల్ని అధికంగా చేయడం!"

నక్క అన్నది మరింత వినయంగా– "తమరన్నది సత్యం. ఒకప్పుడు ఓ జ్ఞాని సెలవిచ్చాడు– ప్రభువు మాట్లాడమన్నప్పుడే మాట్లాడాలి. ఉచిత సలహాలు ఇవ్వకూడదు. అర్థంకానివారికి క్లిష్ట వాక్యాలతో అనర్గళ ప్రసంగాలు చేయరాదు".

కాని, మనసులో నక్క అనుకుంటున్నది– "ఈరోజు తగిలిన దెబ్బ మరచి పోవడానికి నేను ఆదాము కుమారుడిని కాదు. నక్కజిత్తుల సృగాళాన్ని. దెబ్బకు దెబ్బ తీస్తాను. అవమానానికి అవమానం; ఓపిక, ఓపిక కావాలి. అదినాకు తట్టెడంత ఉన్నది. గర్వాంధకారులు, మొండివాళ్లు, మూర్ఖుల ముందు కొంత సహనం వహించాలి" అనుకుని తోడేలుతో అన్నది– "ప్రభూ! తమరు దేవుని దయను పుష్కలంగా పొందినవారు. నేను తప్పు చేసాను. తమరు దండించారు. అంతేకాక నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తపడుతున్నాను. తమరి దండన నాకు దోషనివారణ చేసింది. జ్ఞాని అన్నాడు– 'తొలిదండన కాస్త బాధను కలిగిస్తుంది. మలిదండన తేనెలా మధురంగా ఉంటుంది".

తోడేలు కాస్త మెత్తబడింది– "నాకనవసరంగా నిన్ను తన్నే శ్రమ కలిగించినందుకు నీవిచ్చిన సంజాయిషీని అంగీకరిస్తున్నాను. ఇప్పుడు నీ శిరస్సును నా పాదాల వద్ద ఉన్న ధూళికి తాకించి, మోకాళ్ల మీద నడుస్తూ వెళ్లిపో!"

"చిత్తం మహాప్రభూ!" అన్నది నక్క. "తమకు దైవం మరింత శక్తినిచ్చును గాక, నా లాంటి సేవకులను దండించేందుకు"

తోడేలు అన్నది రాజసంగా– "నీ విధేయత నాకు నచ్చింది. నిన్నిప్పుడు నాకు గూఢచారిగా నియమిస్తున్నాను. వెళ్లి ఏదైనా జంతువు సమీపంలో ఉన్నదేమో చూసి తెలియజేయి. వేటాడి ఆకలి తీర్చుకుంటాను".

"తమ ఆజ్ఞ నాకు శిరోధార్యం" అంటూ నక్క అడవిలోకి పరిగెత్తింది. అక్కడ దారిలో రెండు ఫలవృక్షాల మధ్య ఖాళీస్థలంలో నేలకాస్త కుంగినట్లు, దానిమీద కాస్త ఎండిన చెట్టుకొమ్మలు ఆకులు దట్టంగా ఉన్న ప్రదేశం కానవచ్చింది. అసలే నక్క, దానికి అనుమానం రానేవచ్చింది. కాస్త దూరంగా నడుస్తూ ప్రతి అంగుళం నేలనూ వాసన చూస్తూ కాస్త ముందుకు వెళ్లేసరికి దానికర్థమయ్యింది అది జంతువులను పట్టుకోవడానికి ఆదాము కుమారుడు – గోతిని తవ్వి పైన గడ్డిగాదం వేసిన ప్రదేశమని. తృణావృతకూపం లాంటిదని. దానిని చూడగానే దేవుడికి ధన్యవాదాలు తెలుపుకున్నది.

***"ఆహా! వేచి ఉన్న తరుణం వెంటనే వచ్చింది***
***తృణావృత కూపమొకటి దారిలో కానవచ్చింది***
***ఎదురుచూస్తున్నదది తోడేలు ప్రభువు రాకకై***
***నక్కజిత్తులు చాలిప్పుడు నరకమే తోడు వచ్చింది"***

అనుకుని నెమ్మదిగా వెనక్కివెళ్లి ఆతృతగా ఎదురుచూస్తున్న తోడేలుతో అన్నది– "శుభవార్త! తమరు ఆకలితో అలసిపోలేదు కదా!" అన్నది నక్క.

"వాచాలత్వం కట్టిపెట్టు, వార్తలను ముందు పెట్టు. లేకుంటే నీకిస్తా చెంపపెట్టు" అరిచింది తోడేలు.

నక్క అన్నది– "ఈరోజు ఉదయం అడవి, జంతువులు ఆనందంగా ఉన్నాయెందుకంటే వేటగాడు చనిపోయాడు. అతడిని అడవి మధ్యలో లోతు తక్కువ గోతిలో పాతిపెట్టారు".

"ఇంకెందుకాలస్యం? పద! దారి చూపించు"

నక్క వేగంగా తోడేలును గడ్డిగాదం కప్పిన గోతివేపు తీసుకువెళ్లి ఆ చోటు చూపగానే ఆత్రగొట్టు తోడేలు మెరుపువేగంతో ఆ పొదలపై దూకి, భీకరంగా అరుస్తూ లోతైన గోతిలో పడిపోయింది.

తన మనసుకు ఆనందాన్ని కలిగించిన ఆ దృశ్యాన్ని చూసిన నక్క అన్నది–

***"ఇప్పుడు ఈ ఆకుపచ్చని అరణ్యం మాది***
***ఈ పండ్లచెట్లూ, ఆ చెవుల పిల్లులూ***
***ఈ లేడిపిల్లల మాంసం, బాతుల రక్తం మాది***
***ఈ కోళ్లూ, పావురాలూ, అడవి పిల్లులూ***
***మరల ఇప్పుడు నక్కల వంశస్థులమైన మాది".***

తన శత్రువు పెడుతున్న చావుకేకలను వినాలన్న కోరిక, తన పగ అంత త్వరగా చల్లారినందుకు సంతోషం – అతడిని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా జాగ్రత్తగా వెళ్లి గోతి అంచున నిలబడి లోపలికి తొంగి చూసి దుఃఖం నటించసాగింది.

"అయ్యో! అంతటి మహాప్రభువు ఈరోజు గోతిపాలయ్యెను కదా! ఎటువంటి వీరుడు, ఎంత శక్తిమంతుడు శవాన్ని తినబోయి శవం కాబోతున్నాడే! అయ్యో, అయ్యో!" అని ఏడ్వసాగింది నక్క.

అంతలోతు గోతిలో పడిన తోడేలు గజగజ వణికింది. దానికర్థమయ్యింది ఆదాము కుమారుడు తవ్విన గోతిలోకి నక్క తన జిత్తులతో తనను నెట్టిందని. అయినా ఇప్పుడు బయటపడాలి – అనుకుని తోడేలు అన్నది కాస్త బతిమలాడుతున్న గొంతుతో.

"నిన్ను నా గూఢచారిగా నియమించాను కదా, నన్ను బయట పడేసే ఉపాయం ఆలోచించు. నిన్ను నా మంత్రిగా, వజీరుగా నియమించుకుంటాను".

నక్క అన్నది– "నేనేమన్నా పిచ్చివాడిననుకున్నావా! తప్పు చేయకుండానే తన్నులుతిన్నాను తమ కాలి మడమతో. నేనెందుకు ఏడుస్తున్నానో తెలుసా! ఇన్నాళ్లు నీవు బతికున్నందుకు. నీవు ఎప్పుడో చావాల్సింది. ఇక ఈ గోతిలో పడి చావు. రేపెలాగూ ఆదాము కుమారుడు ఇటు వస్తాడు. నిన్ను చంపి, చర్మం వలిచి, నీ

తలకాయ, చర్మంతో తోడేలు బొమ్మను చేసి గడ్డి నింపి తన ఇంటిలో గోడకు తగిలిస్తాడు. నీ దేహాన్ని పాతిపెట్టిన చోట నేను వచ్చి ఉచ్చపోస్తాను. నేనూ, మా నక్కల సమూహం ఊళలు వేస్తూ నీ పీడ విరగడైనందుకు సృగాళ నృత్యం చేస్తాం నీ సమాధిపై" అన్నది నక్క ఛీత్కరిస్తూ.

"మిత్రమా! కాసేపటిక్రితమే నీవు నాతో స్నేహాన్ని కోరావు. నాపై విశ్వాసాన్ని ప్రకటించావు. ఇంతలో వైరమేల? నాపై ద్వేషం తగదు. గద్దెపై కూర్చున్న రాజు రాజులానే ప్రవర్తిస్తాడు. ఇప్పుడు గోతిలో ఉన్నాను. నా మిత్రుడిగా నన్ను రక్షించాల్సిన బాధ్యత నీది" అన్నది తోడేలు.

***"వానచుక్క పడకమును పే వెదజల్లకు విత్తనం***
***అన్ని నేలలూ పనికిరావు, మొలకెత్తదు విత్తనం***
***కోపం అనే విత్తనాన్ని వెదజల్లకు మిత్రమా,***
***దేవుడి దృష్టిలో దయ, ప్రేమ ఇవే మంచి విత్తనం".***

తోడేలు మాటలు వినగానే నక్క మండిపడింది.

***"గద్దెమీద కూర్చున్నపుడు గుర్తురావు సూక్తులు***
***నడ్డిమీద తన్నేపుడు అడ్డంరావే సూక్తులు***
***అవమానమెప్పుడూ నిద్రపోతుంది అరకన్ను మూసి***
***పగ తీర్చుకునే సమయాన పనికిరావు సూక్తులు.***

దేవుడొక్కడే ఎల్లప్పుడూ రెండు కళ్లూ తెరిచి చూస్తూ ఉండేది" అన్నది నక్క.

తోడేలు అన్నది– "అవును మిత్రమా! మనం ఈ చర్చలు తీరికగా చేద్దాం! నీవు ఏదో ఒక తాడు కాని, తీగె కాని చెట్టుకు కట్టి గోతిలోకి జార్చు. నేను నెమ్మదిగా పైకివచ్చి నీకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటాను".

నక్క పగలబడి నవ్వింది– "తప్పకుండా, తప్పకుండా కొద్దిరోజులు ఓపిక పట్టాలి ప్రభువులు. అప్పటికి తమ దేహం గట్టిపడి ఆత్మ తనంతట తానే బయటకు వస్తుంది. దానికేతాడూ, చెట్టుతీగె అవసరం లేదు. ఇవిగో ఈ రాళ్లున్నాయిక్కడ. బాగానే పనికి వచ్చేట్లున్నాయి. ఓ క్రూర నియంతా! ఇప్పుడు నీ స్థితి చూస్తుంటే నాకు డేగ–గువ్వ కథ గుర్తుకు వస్తున్నది–

# (5) డేగ-గువ్వ కథ

నక్క చెప్పసాగింది– "ఒకరోజున నేను అడవిలో తిరుగుతుండగా ఒకచోట గువ్వలు సందడిగా తిరుగుతూ పురుగులను, గింజలను ఏరుకుంటూ తమలో తాము ముచ్చటించుకుంటూ ఉన్నవి. ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో ఏమో ఓ డేగ వేగంగా వచ్చి ఓ గువ్వపైకి దూకింది. మిగతా గువ్వలన్నీ చెల్లాచెదురుగా పారిపోయాయి. ఆ గువ్వ ఎలాగోలా తప్పించుకుని చిన్న బొరియలోకి వెళ్లింది. లోపల విశాలంగా ఉన్నా దాని ద్వారం డేగ పట్టేంత లేకపోవడంతో డేగ ఆలోచించి అన్నది–

"ఓ గువ్వా! నాకు తెలుసు నీవు ఆకలితో ఉన్నావని. నేనంటే ఇందాకే తిన్నాను. ఇప్పుడేమీ తినబోను. ఇవిగో నీకోసం మొక్కజొన్న గింజలు తెచ్చాను. కాసిని తిని ఆకలి తీర్చుకో. తరువాత నీ దారి నీది, నా దారి నాది!"

గువ్వ అన్నది– "నీవు డేగవు. నేను గువ్వను! నీ మాటలు నేను నమ్మను"

డేగ అన్నది– "నేను నిన్ను రక్షించడానికే అంతెత్తు నుంచి దూకాను. నేను తలుచుకుంటే అప్పుడే చంపి ఉండేవాడిని. నేనిప్పుడు వ్రతదీక్షలో ఉండి కేవలం మొక్కజొన్నలు, జొన్నలు తిని బతుకుతున్నాను. అందుకని నిర్భయంగా వచ్చి ఈ గింజలు తిని ఆకలి తీర్చుకో!"

అమాయకురాలైన గువ్వ తల బయటపెట్టగానే డేగ దానిని తన కొంకెలాంటి ముక్కుతో గట్టిగా పట్టుకుని బయటకు లాగుతుండగా గువ్వ అన్నది– "ఆకలితో కళ్లు బైర్లు కమ్ముతున్న స్థితిలో నీవు నన్ను మోసం చేసావు. నేను దైవాన్ని ప్రార్థిస్తున్నాను. నీవు నన్ను చంపిన వెంటనే నా శరీరం విషపూరితమగును గాక!" గువ్వ మాటలు పట్టించుకోకుండా డేగ దాని మెడ కొరికి చంపివేసి, చెట్టుపైకి ఎత్తుకుపోయి చీల్చి మరీ తిన్నది. తిన్న మరుక్షణంలో గిలగిలా కొట్టుకుంటూ నేలపైబడి చచ్చింది.

ఓ తోడేలూ నీవు నన్ను ఘోరంగా అవమానించావు. అందుకే నీవీ గోతిలో పడ్డావు" అన్నది నక్క.

తోడేలు అన్నది దీనంగా– "నామీద దయజూపు మిత్రమా! నా తప్పుకు సరైన శిక్ష విధించావు. ఈ గోతిలో పడినప్పుడు కాలు విరిగి ఉండవచ్చు. కళ్లు దెబ్బతిని ఉండవచ్చు. ఈసారికి నన్ను క్షమించి రక్షించు. జీవితాంతం నీకు ఋణపడి ఉంటాను".

నక్క నవ్వి అన్నది– "నీకు జ్ఞానుల హితవచనాలు తెలిసినట్లు లేదు. మా నక్కల గురువులు మాకు బోధించారు. నీలాంటి క్రూరుల ముఖాలను చూడగానే చెప్పవచ్చు మీ గర్వం, అహంకారం, క్రౌర్యం, పరపీడన పరాయణత్వాలను. వాటిని తప్పించుకోవడానికే మా గురువులు మాకు నక్కజిత్తులు నేర్పారు. లేకుంటే మీ కాళ్లదెబ్బలకు మా జీవితాలు కమిలి శాశ్వతంగా సర్వనాశనమై ఉండేవి. నీతో స్నేహమంటావా, ఆలోచిద్దాం. ఇక నీవు నాకు సలహా ఇవ్వడం గురించి అంటావా, ముందు నీవెలా ఈ గోతిలోంచి బయటపడతావో ఆలోచించు. నిన్ను చూస్తుంటే నాకో వైద్యుడి కథ గుర్తుకు వస్తున్నది–

## (6) వైద్యుడు - రైతు కథ

ఆ ఊళ్లో రైతుకు కుడిచేతిమీద పెద్ద కాయ కాచి ఆ చేత్తో ఏ పనీ చేయడానికి వీలుండేది కాదు. అతడు అక్కడ పేరొందిన వైద్యుడికి కబురు పంపాడు. ఆ వైద్యుడి ఒక కంటికి పట్టీకట్టి ఉన్నది.

"వైద్యుడా, ఏమిటీ పట్టీ?" అన్నాడు రైతు.

"నా కంటి దగ్గర కాయకాచింది, చూపుకడ్డం వస్తున్నది" అన్నాడు వైద్యుడు.

"నీకంటి గడ్డ తీయలేనివాడివి, నా చేతిగడ్డనెలా బాగుచేస్తావు, వెళ్లిపో!" అన్నాడు రైతు.

కాబట్టి ఓ గతకాలపు ప్రభూ, ముందు నీవు బయటపడే పథకం ఆలోచించు. ఆ తరువాత నాకు స్నేహితుడివో, సలహాదారుడివో అవుదువుగాని, లేకుంటే, ఈ గోతినే తమ రాజభవనంగా భావించి స్థిరనివాసిగా బతకవచ్చు".

తోడేలుకు తానున్న దీన స్థితికి కళ్లు జలసముద్రాలైనాయి– "నీవు నీ తోకను కాస్త గోతిలోకి వదులు. దానిని పట్టుకుని నేను పైకి వస్తాను. దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను నీకు నేనెటువంటి అవమానాన్ని, కీడును కలుగజేయను. నా గోళ్లను, కోరలను తీసివేసి ఇతరులకు హాని చేయకుండా బతుకుతాను. వీలైతే ఆకులలములు తిని ఓ మునిగా మౌనవ్రతంలో కాలం గడుపుతాను.

నక్క పగలబడి నవ్వింది. "నేను నక్కజాతికి చెందిన దానిని. నా జాతి లక్షణాలు పోయి కుందేలులా బతకలేను. నీవు తోడేలువు, నీవు జింకపిల్లలా

జీవించలేవు. ఇక నీవడిగినట్లు నా తోక అందించడమనేది నా చావును నీ చేతిలో పెట్టినట్లే! అంతేకాక ఎవరో జ్ఞాని అన్నట్లు- 'పాపిష్ఠివాడి చావు నేలను శుద్ధి చేస్తుంది".

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# * 150వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

తోడేలుకు పౌరుషం ముంచుకువచ్చి ఉగ్రంగా ఉరకబోయి తానున్న గోతిలోనని గుర్తుకు వచ్చి తమాయించుకుని అన్నది- "ఓ నక్కా, నీ కుటుంబం తెలివితేటలకు, యుక్తులకు, వాక్చాతుర్యానికి, చక్కని నడవడికి, దయకు ప్రసిద్ధి. నీ కుటుంబ గౌరవ మర్యాదలను, కరుణను గుర్తుతెచ్చుకుని నన్ను ఈ ఆపద నుంచి కాపాడి చిరకీర్తి గడించు"

నక్క అన్నది- "ఇంకా నీకు నీ పరిస్థితి అర్థం కానట్లున్నది. రెండు విషయాలు చెబుతాను విను- అన్నిటికీ వైద్యమున్నది ఒక్క మరణానికి తప్ప. వజ్రానికి తప్ప ప్రతిదానికి నాశనమున్నది. మనం దేనినైనా తప్పించుకోగలం విధి నిర్ణయాన్ని తప్ప. నీవు పాములాంటి వాడివి. ఆ కథ చెబుతాను విను-

## (7) కృతజ్ఞత లేని పాము కథ

ఒకరోజున ఓ పాము పాములవాడి బుట్టలో నానా అవస్థ పడుతున్నది. అటుగా వెళ్తున్న ఎలుక బుట్టలో ఏదో ఆహారం దొరుకుతుందని దానిని పళ్లతో కొరికి రంధ్రం చేసి లోపలికి వెళ్లింది. ఆకలితో ఉన్న పాము ఆ ఎలుకను మింగి ఎలుక చేసిన రంధ్రంలోంచి బయటపడింది.

అయితే చానాళ్లుగా బుట్టలో ఉండడంతో దానికి వెనకటి శక్తి లేక నెమ్మదిగా పాకుతూ పోతుంటే దయగల మనిషి ఒకడు దానిని పక్కకుతీసి పాలు తాగించాడు. వెచ్చని బట్టలలో ఉంచాడు. పైన మెత్తటి బొంత కప్పినాడు. కాసేపటి కల్లా నాగుపాము తేరుకున్నది. దానికి వెనకటి ఉత్సాహం వచ్చింది. ఆ దయగల వ్యక్తి పాము ఎలా ఉన్నదో చూస్తున్న క్షణంలోనే అతడిని కాటువేసింది. ఆ విష ప్రభావానికి లోనై అతడు నురగలు కక్కుతూ కిందపడి ప్రాణాలు విడిచాడు.

*నీవు పాముకు పాఠాలు నేర్పదలుచుకుంటే*
*దానికి నీ పాటలు, నాట్యాలు నేర్పు*
*అతడు బుసకొట్టగానే, వెనక్కి తగ్గు, లేకుంటే*
*చిరునవ్వు నవ్వుతూ చిమ్ముతాడు విషం ఊర్పు*
*పిల్లాడని చేరదీసావు మంచిదే కాకుంటే*
*పెద్దవాడైనాక వాడికి ఉండదే ఓర్పు!*

ఓ తోడేలు రాజమా! నీవిప్పుడు కోరలు తీసిన పామువు. నీకు ఆఖరి క్షణాలలో అవమానం రుచిని చూపిస్తాను" అంటూ ఆ నక్క కాస్త దూరంగా నిలబడి భయంకరంగా ఊళపెట్టింది. ఆ అరుపులు విని కర్రలు, కత్తులు పట్టుకుని చుట్టుపక్కల తోటమాలులు, రైతులు, వేటగాళ్లు పరుగుపరుగున వస్తుండగా నక్క దూరంగా వెళ్లి పొదల్లో దాక్కుని చూస్తూ ఉన్నది. వచ్చినవాళ్లు చుట్టుపక్కల దొరికిన రాళ్లతో గోతిలో చిక్కుపడిన తోడేలును చితకగొట్టి, కర్రలతో బాది, చావగొట్టి, గోతిని మట్టితో కప్పి దానిని పాతిపెట్టారు ఇంకా బతికి ఉండగానే. జనం వెళ్లిపోగానే తనను అవమానం చేసిన తోడేలు సమాధిపై ఉచ్చపోస్తూ అన్నది నక్క– "ఇంత ఆనందాన్ని నా జన్మలో నేను పొందలేదు". ఆ విధంగా తోడేలు కథ ముగిసింది.

ప్రభూ ఇప్పుడు నేను చెప్పబోయే కథ ఎలుక–ముంగిసలది.

## (8) ఎలుక-ముంగిసల కథ

ఆ ఊళ్లో ఒక మహిళ నువ్వులను దంచి బాగుచేసే వృత్తిలో జీవిస్తున్నది. ఒకరోజున ఓ పరిచయమున్న వ్యక్తి ఆమెకు ప్రశస్తమైన నువ్వులను ఇచ్చి– "వైద్యుడు నా స్నేహితుడికి బాగా దంచి చేసిన నువ్వుల ఆహారం ఇమ్మని సలహా ఇచ్చినాడు. త్వరగా వీటిని బాగుచేసి ఇస్తే నా స్నేహితుడి ఆరోగ్యం కుదుటపడుతుంది" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ మహిళ ఆ నువ్వులను బాగా తెల్లగా వచ్చేలా దంచి ఆరబెట్టి తన పనులు చేసుకోవడానికి ఇంటిలోకి వెళ్లింది. అటుగా వెళ్తున్న ముంగిస ఆ నువ్వుల వాసనకు ఆకర్షించబడి గబగబా వచ్చి తాను తినగలిగినన్ని తినేసిపోయి గోడ కన్నంలో దాక్కుని చూడసాగింది.

ఆ మహిళ వచ్చి ఎలుకలు వచ్చి నువ్వులు తిన్నాయని అనుకుని– "ఈ పాడు ఎలుకలు మళ్లీ మొదలెట్టాయి. పిల్లి బతికున్నంతకాలం కిక్కురుమనలేదు.

అది చనిపోయాక వీటి రాజ్యం మళ్లా మొదలైంది. నా కంట కనబడాలి అప్పుడు వాటిని చావచితకగొడ్తాను" అని అరుచుకుంటూ నువ్వుల్ని తీసుకుని ఇంటిలోకి పోయింది.

గోడ కన్నంలోంచి చూస్తున్న ముంగిస అనుకున్నది- "ఈమె అనుమానాన్ని నిజం చేయాలంటే ఏదో ఒక ఎలుకను బలి చెయ్యాలి".

అది ఆ పక్కనే ఉన్న కలుగు దగ్గరకు వెళ్లి ఎలుకను పిలిచి అన్నది- "సోదరీ, మనం ఇరుగు-పొరుగు వాళ్లం. నాకున్నది కలో, గంజో, భక్ష్యాలో, గింజలో పక్కవాళ్లతో పంచుకోవడం అలవాటు".

ఎలుక అన్నది- "ఇన్నాళ్లూ ఇక్కడో దిక్కుమాలిన పిల్లి ఉండేది. అది చచ్చి, మా పీడా విరగడైనాక కొద్దిరోజుల క్రితమే నేను ఈ ఇంటికి వచ్చాను. అయినా నిన్ను చూస్తుంటే నాకేదో విషయం చెప్పడానికి వచ్చావని అనిపిస్తున్నది".

ముంగిస అన్నది- "అవును సోదరీ! ఈ ఇంటి యజమానురాలు ప్రశస్తమైన నువ్వులు దంచి తన పిల్లలకు ఆహారంగా పెట్టింది. వాటి ఘుమఘుమలు చూస్తే నీవు వదిలిపెట్టవు. ఆ పిల్లలు తినగా మిగిలిన నువ్వుల్ని వంటింట్లోని ఉట్టిపై పెట్టింది. నీకు శుభమగుగాక!"

ఎలుక వెళ్లి ఉట్టిలోని నువ్వులను తినబోతుంటే గమనించిన మహిళ కర్రతో ఎలుకను చావగొట్టి ఈడ్చిపారేసింది. దానిని చూసి ముంగిస కూడా అక్కడి నుంచి పారిపోయింది. అందుకే పెద్దలంటారు ఏదైనా పని చేసేప్పుడు కాస్త వెనకా ముందూ ఆలోచించుకోవాలని.

షహర్జాది అన్నది- "ఇలాంటిదే మరో కథ. ఓ అడవిలో కాకి, అడవిపిల్లి మంచి స్నేహితులు.

## (9) కాకి - అడవిపిల్లి కథ

వాళ్లిద్దరూ మాట్లాడుకుంటుంటే ఎంత సమయం గడిచిందో తెలిసేది కాదు. ఓరోజున ఇద్దరూ అలా మాట్లాడుకుంటున్నపుడు ఓ పెద్దపులి భయంకర గర్జన వినిపించి అవి ఉలిక్కిపడ్డాయి.

చెట్టుపై కొమ్మల మీద ఉన్న కాకి రెక్కలు టపటపలాడిస్తూ గాలిలో ఎగిరింది. అడవిపిల్లికి ఏం చేయాలో పాలుపోలేదు. తానూ చెట్టెక్కబోయింది కాని చెట్టుకున్న ఎర్రచీమల్ని చూసి భయపడి కాకిని సలహా అడిగింది.

*"నిజమైన స్నేహం విలువ తెలుస్తుంది*
*విపత్కర సమయాల్లోనే!*
*నిజమైన వీరత్వ పటిమ బుజువవుతుంది*
*సమర సమయాల్లోనే!*
*నిజమైన మిత్రుడు, తన మిత్రుడి శత్రువులను*
*ఎదుర్కొనేది ఈ సమయాల్లోనే!"*

అంటూ కాకి ఆ దగ్గర్లో ఉన్న గొర్రెలమంద దగ్గరకు వెళ్లి కావుకేకలు పెట్టేసరికి గొర్రెలు చెల్లాచెదురుగా పారిపోసాగినాయి. అది చూసి కాపలా కుక్కలు భయంకరంగా ఉమ్మడిగా భౌభౌ అంటూ అరిచేసరికి వాటి అరుపుల శబ్దానికి పులి కూడా భయపడి వేరేదారిన పోయింది. కొద్దిసేపటికి కాపలా కుక్కలు గొర్రెలన్నిటిని సరైన దారిలో పెట్టి గుంపును అడవి పక్కన పొలాల వేపు మళ్లిస్తుండగా గొర్రెలకాపరులు వచ్చి గొర్రెలకే కీడు కలగనందుకు సంతోషించి పొలాల వేపు వెళ్లినారు. పులి వేరే దిక్కుకు, గొర్రెల మంద, కుక్కలు ఇంకో దిక్కుకు వెళ్లేదాక గాలిలో ఎగుర్తూ వాటిని గమనించి తరువాత వచ్చి సురక్షితంగా ఉన్న తన స్నేహితుడిని కలిసింది. అడవిపిల్లి తన కృతజ్ఞతలు తెలుపుతుండగా కాకి వారించి "మనం స్నేహితులం" అని నవ్వింది. ఇరువురూ హాయిగా యధారీతిన కాలం గడిపినారు.

ఇటువంటిదే మరో కథ.

## (10) కాకి - నక్క కథ

ఆ నక్క మామూలు నక్క కాదు, వయసు ముదిరి వృద్ధాప్య దశను చేరుకునేసరికి అది చేసిన పాపకృత్యాలు, అమాయకులను చంపడాలు, నక్కజిత్తులు, వీటన్నిటితో ఆ కొండవాలు ప్రాంతం లోయలో జంతువులన్నీ అయిపోయాక, తన సంతానాన్ని చివరకు తన భార్యనీ చంపి తినేసింది, ఆకలి దాని కళ్లపై పొరలను కమ్మగా.

వెనకటిలా పోట్లాడే శక్తి లేదు, వేటాడే ఓపికాలేదు కాబట్టి ఏదన్నా ఉపాయమాలోచించి పొట్ట గడుపుకోవాలి అనుకున్నపుడే దానికి పక్కనే ఉన్న చెట్టుపై వాలి అలసట తీర్చుకుంటున్న కాకి కనిపించింది. ఈ కాకితో స్నేహం కుదిరితే అది అదృష్టమే. ఆహారం తెచ్చివ్వగల శక్తి దానికున్నది. ఒంటరితనము నుంచి కాస్త విముక్తి లభిస్తుంది.

"ఓ పొరుగువాడా! ఈరోజు శుభదినం. నీలో నాకు రెండు అద్భుత లక్షణాలు, దైవ విశ్వాసిలో ఉండేవి కనిపించాయి. మొదటిది నీవు విశ్వాసివి. రెండవది మంచి పొరుగువాడివి. నీలాంటి వాడితో స్నేహం రెండింతలు ప్రయోజనం ఇద్దరికీ.

ఆ మాటలు వినగానే కాకి పగలబడి నవ్వింది- "ఆశ్చర్యం! ఎప్పటి నుంచి ఈ స్నేహభావం నక్కకు కాకులపైన! నాలుక కొసమీద ఉండే నీ మాటలు హృదయంలోకి ఎప్పుడు వెళ్లాయి? ఎలా జంతువులు, పక్షులు ఒకే స్థాయిలో ప్రవర్తించగలుగుతాయి? మీరు తినేవాళ్లు, మేము తినబడేవాళ్ల జాతులం కదా, ఈ పద్ధతి ఎప్పుడు మారింది? జిత్తులమారి నక్కా! నీ తెలివితేటలు నీ జేబులోనే దాచుకుని నా మానాన నన్ను వదిలెయ్యి!"

నక్క అన్నది- "నీ వాదన సమంజసమైనది ఓ న్యాయవర్తనుడవైన కాకీ! మనలను సృజించిన దైవం నా చీకటిగుండెలో కాస్త ప్రేమ వెలుగును నింపితే నేనెలా కాదనగలను! వివిధ జాతుల వాళ్లు కలిసి ఉండగలరు - భిన్నత్వంలో ఏకత్వంతో ఇరుగుపొరుగులుగా హాయిగా జీవించగలరని ఈ కథ చెబుతుంది విను.

## (11) నల్లి - ఎలుక కథ

ఒక నల్లి చాలాకాలం పిల్లి వెంట్రుకల మధ్య స్థిరనివాస మేర్పరుచుకుని దాని రక్తం తాగి జీవిస్తుండేది. అదే రక్తం తాగి, అదే స్థలంలో దాగి దానికి విసుగు పుట్టింది. అందుకని అది పెంపుడు పిల్లిమీంచి దూకి ఆ పిల్లి యజమాని అయిన ధనిక వ్యాపారి మంచం మీద కాళ్లవేపు దిండులో దాక్కున్నది. కొద్దిసేపటికే ఆ ఇంటి యజమానురాలు వచ్చి మంచం మీద తియ్యటి కలలు కంటున్న సమయంలో నల్లి నెమ్మదిగా పాక్కుంటూ వెళ్లి ఆమె ధరించిన సిల్కు వస్త్రాలలో

జారుకుంటూ పాదాలు, మోకాళ్లు తొడలు దాటి కాస్త ముందుకు వెళ్లి పిల్లి వెండ్రుకల కన్నా మృదువైన వెండ్రుకలున్న చోట నివాసమేర్పరచుకుందామనుకుని, నునుమెత్తటి చర్మంపై కాస్త మత్తుమందు పూసి, నెప్పి తెలియకుండా కొరికి ఉబికిన రక్తాన్ని కడుపునిండా తాగి బ్రేవ్‌మని తేల్చేప్పటికి తెలిసింది ఆ యజమానురాలికి నల్లి కుట్టిందన్న సంగతి. ఆమె పెద్దగా అరిచి గగ్గోలు పెడుతూ మంచం మీద గంతులు వేయసాగింది తన పరిచారికలను తిడుతూ– “ఎక్కడ చచ్చారే మీరు! మంచంలో నల్లులున్నాయేమో చూసుకోవద్దా! ఈ నల్లి పాడుగాను, కుట్టక కుట్టక అక్కడే కుట్టాలా” అంటూ కుట్టిన చోటు నలుపుకుంటూ తాను వేసుకున్న బట్టల్ని విప్పి పడేసి నగ్నంగా నిలబడింది. పరిచారికలు దీపాల వెలుగులో ఆమె దుస్తుల్ని, దుప్పట్లను, తలగడ దిండ్లను, మంచాల్ని నిశితంగా పరిశీలించారు. అప్పటికే ఆ నల్లి ఆమె దుస్తులలోంచి మంచం మీదకు, మంచం మీద నుంచి నేలమీదకు దూకి పక్కనే ఉన్న ఎలుక కలుగులోకి కాలుపెట్టి ఓ మూలన దాక్కున్నది.

***ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# ✻ 151వ రాత్రి కథ ✻

***షహర్జాది కథ చెప్పసాగింది-***

తన ఇంట్లోకి పిలవకుండా కొత్తవాడు వచ్చినందుకు ఎలుకకు కోపం వచ్చింది. “ఓ పరాన్నభుక్కూ! రక్తజీవనీ! నల్లీ! ఎందుకు నీవు నా ఇంటిలో ప్రవేశించావు?” అడిగింది ఎలుక.

నల్లి అన్నది– “ఆగ్రహించకు మహానుభావా! నేను పొరబాటున తమ గృహంలోకి ప్రవేశించాను. ఇన్నాళ్లూ తమ శత్రువైన పిల్లిరాజు గారి వెండ్రుకలలో దాక్కుని, పిల్లిరక్తం తాగి బదికాను. ఈరోజెందుకో మనిషి రక్తం తాగాలనుకుని ఈ ఇంటి యజమానురాలి బట్టల్లో దూరి కుట్టరాని చోట కుట్టి నా రక్తదాహం తీర్చుకున్నాను. ఇంతలో ఆమె కెవ్వున కేకపెట్టి తన బట్టలు దులుపుతుంటే ఆ విసురుకు మంచం మీదకు, దానిమీద నుంచి తమ గృహంలోకి పడ్డాను. శరణు వేడిన వాడిని రక్షించడం తమలాంటి ఎలుకరాజులు ఆనవాయితీగా చేస్తున్న పనేకదా!” అన్నది నల్లి.

ఎలుక అన్నది– "కించిత్తు నల్లి కుట్టిన, మంచమునకు చేటువచ్చు మహిలో సుమతీ' అన్నమాట వినే ఉంటావు. నిన్ను వెదుకుతూ వాళ్లు నా కలుగును గమనిస్తే నా పరిస్థితి ఏమిటి?"

నల్లి అన్నది– "నల్లిని, ఎలుకను రక్షించేవాడే నిన్ను నన్ను రక్షిస్తాడు. పైపెచ్చు నేను తమ శత్రువు పిల్లి రక్తాన్ని తాగి బబతుకుతున్నానని తమకు తెలుసు. తమ శత్రువుకు శత్రువునైన నేను తమకు మిత్రుడిని కదా. ఈ క్షణాన తాము నన్ను రక్షిస్తే ఏదోవిధంగా తమ ఋణం తీర్చుకుంటాను"

ఎలుక కాస్త మెత్తబడింది– "నీవనేది నీ మనసులోంచి, హృదయం లోంచి వచ్చిన మాటయితే ఓ నల్లీ, నీకు స్వాగతం. దేవుడు ప్రతి జీవికీ ఆహారాన్ని ప్రత్యేకించాడు. నీవు నీ ఆహారాన్ని హాయిగా అరిగించుకో. దేవుని ప్రణాళికలను విమర్శించడం ద్వారా మనం ఆకలిదప్పులను కోరి తెచ్చుకున్నవాళ్లమవుతాం" అన్నది ఎలుక.

*నా దగ్గర ఏమీలేదు*
*నా హృదయం అందుకే బరువుగా లేదు*
*చింకి పాత నా వస్త్రం*
*నన్నస్యహించుకునేందుకు భార్యలేదు*
*తినేది కాసింత రొట్టె*
*నంజుకునేందుకు ఉప్పుతప్పు ఇంకేమీలేదు*
*నా దగ్గర ఏమీలేదు*
*అందుకే నేను దేనికీ భయపడేది లేదు".*

ఎలుక మాటలు విని నల్లి అన్నది– "ఎంత గొప్ప జ్ఞానివి నీవు. నీ ఋణం తీర్చుకునే సమయం రాకపోదు".

ఆ సమయం వెంటనే వచ్చింది. మరుసటిరోజున వ్యాపారి తన దగ్గర ఉన్న చిన్న సంచిలోని బంగరు దీనారాలను తీసి లెక్కపెట్టుకోవడం ఎలుక గమనించింది. లెక్క పూర్తయినాక అతడు ఆ సంచిని తలగడ కింద ఉంచి నిద్రకుపక్రమించినాడు. ఆరోజున యజమానురాలు, పరిచారికలతో వేరే ఊరికి వెళ్లడంతో ఇంట్లో వ్యాపారి తప్ప ఎవరూ లేరు. అది చూసిన ఎలుక తన కలుగుకు వచ్చి నల్లితో అన్నది–

"మిత్రమా! ఇది మంచి తరుణం. నాకెప్పటి నుంచో ఈ ఇంటి యజమాని దాచుకున్న దీనారాలను తస్కరించి నా ఇంట్లో భద్రపరచుకోవాలని ఆశ. దానికోసం నా ఇంటికి డెబ్బైరెండు ద్వారాలు ఏర్పరచాను. పద ఆ మానవుడి తలగడ కింద ఉన్న నాణేలు తెచ్చుకుందాం! బంగారమంటే ఇష్టపడని వారెవరు?"

నల్లి అన్నది– "నేనెక్కడ, దీనారమెక్కడ! నా వీపుమీద దీనారం ఉంచితే నేను నలిగి చచ్చిపోనా! అయినా నేను వెళ్లి అతగాడిని ఎలా కుడతానంటే వాడికి చిన్నప్పుడు తాగిన పాలు గుర్తుకురావాలి".

ఎలుక సాయంతో నల్లి వ్యాపారి పడుకున్న మంచం మీదకు దూకి గురకపెట్టి నిద్రపోతున్న వ్యాపారి వీపు మీద గోక్కోడానిక్కూడా వీలులేని చోట గట్టిగా కుట్టి వెంటనే పక్కకు దూకి తలగడ కింద దాక్కున్నది. వ్యాపారి కెవ్వున కేకపెట్టి లేచి స్తంభానికి వీపును రాపాడించి మరల వెళ్లి పడుకున్నాడు. మరల నల్లి నెమ్మదిగా పాక్కుంటూ వెళ్లి ఈసారి పిర్రల మధ్య అతి సున్నితమైన భాగం దగ్గర తన బలాన్నంతా ఉపయోగించి కొరికి మరల మంచం మీదకు, అక్కడ నుంచి నేలమీదకు దూకి ఎలుక ఉన్న కలుగువేపు బయల్దేరింది. ఆ వ్యాపారికి ఎంత నెప్పి వేసిందంటే అతడు లబోదిబోమంటూ బయటకు పరిగెత్తి చల్లటి నీళ్లున్న తొట్టిలోకి దూకి వళ్లంతా కడుక్కున్నా ఆ మంట చల్లారలేదు. గదిలోకి వెళ్లి మంచం మీద పడుకునే ధైర్యం లేక అతడు ఆరుబయటే కాలం గడిపినాడు.

ఈలోగా ఎలుక వెళ్లి తలగడ కింద ఉన్న దీనారాల సంచికి రంధ్రం చేసి ఒక్కో దీనారాన్ని తీసుకుని తన కలుగులోకి చేర్చింది. తెల్లవారినాక వ్యాపారి వచ్చి చూసుకునేసరికి ఒక్క దీనారమూ లేదు ఆ ఎలుక కొరికిన సంచిలో. ఆ విధంగా నల్లి లాంటి అల్పజంతువు కూడా ఎలుకకు సాయం చేయగలిగింది'' అని నల్లి–ఎలుక కథ చెప్పింది నక్క.

కాకి అన్నది– "నీ కథ పెద్ద గొప్పగా ఏమీలేదు. నీ జాతి చరిత్ర సమస్తం వంచనాపూరితం, వాగ్దాన భంగ దూషితం. నీ స్వంత పిల్లల్ని, భార్యను చంపి తిన్నవాడివి ఇతరులను ఉపేక్షిస్తావా! అది నన్ను నమ్మమంటావా? ఈ కథ తెలుసా నీకు?" అన్నది కాకి.

# (12) నియంత రాబందు కథ

ఒకప్పుడు ఓ క్రూరాతి క్రూరమైన రాబందు ఆ దేశంలో ఉండేది. దాని భయంకరమైన ముక్కు, పదునైన గోళ్లు, బట్టతలతో భీకరంగా అరుస్తూ వస్తుంటే ఆకాశంలో, నేలపై తిరిగే గద్దలు, డేగలు, నక్కలు, కుక్కలు, దుమ్ములగొండి జంతువులు తాము తింటున్న ఆహారాన్ని అక్కడే వదిలేసి భయంతో పారిపోయేవి.

కాలం గడిచింది. వృద్ధాప్యదశలోకి అడుగుపెట్టే సరికి దాని పరిస్థితి దయనీయంగా మారింది. ఇదివరకు తాను భయపెట్టిన గద్దలు, డేగలు, నక్కలు, కుక్కలు తినగా మిగిలిన ముక్కలు తిని బతకాల్సిన దుస్థితి ఏర్పడింది.

అందుకే ఓ నక్కా! నీ మోసపూరితమైన మాటలను విని దెబ్బతినే స్థితిలో లేను నేను. బలమైన రెక్క, సునిశితమైన చూపు, పదునైన ముక్కు నాకున్నాయి. నా సలహా ఏమిటంటే నీవు కూడా ఆ పిచ్చుకలా చేయకు" అన్నది కాకి.

"ఎవరా పిచ్చుక?" అడిగింది నక్క.

ఆ పిచ్చుక ఒకరోజున గొర్రెలమంద మైదానంలో మేతమేస్తుంటే చూస్తూ ఉన్నది. ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో ఓ పెద్ద గ్రద్ద ఆకాశంలోంచి దూసుకుంటూ వచ్చి ఓ గొర్రెపిల్లను తన కాలిగోళ్లతో పట్టుకుని అంతే వేగంతో ఎగిరిపోయింది. ఆదమరచి ఎటో చూస్తున్న గొర్రెలకాపరి పరిగెత్తుకుంటూ వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

పిచ్చుక అనుకున్నది– "మా పక్షిజాతి ఎంతైనా ఈ జంతువుల కన్నా గొప్పది. మేము నేలపైనా నడవగలం. గాలిలోనూ ఎగరగలం. నా జాతి వీరుడు చేసినట్లు నేను కూడా ఓ గొర్రెను నా కాలిగోళ్లతో పట్టుకుని మా ఇంటికి తీసుకుపోతాను" అనుకుని ఆ గొర్రెలమంద వేపు దృష్టి సారించింది. దాని కంటికి ఓ బలిష్ఠమైన గొర్రెపొట్టేలు, మెలిదిరిగిన కొమ్ములు కలిగినది, గుండ్రంగా, సుడులు తిరిగి, మూత్రంతో తడిచి గట్టిపడిన ఒత్తైన ఉన్ని కలది కనిపించింది. అంతే! ముందూ వెనకా ఆలోచించకుండా వేగంగా వెళ్లి ఆ పిచ్చుక ఆ గొర్రెపొట్టేలుపై దూసుకువెళ్లి, దాని ఉన్నిలో ఇరుక్కుపోయి గిలగిలా తన్నుకోసాగింది.

గొర్రెలకాపరి వచ్చి పిచ్చుకను విడిపించి దాని కాలికో తాడు కట్టి తన పిల్లలకు ఆడుకోవడానికి ఇచ్చి అన్నాడు– 'ఇది తనకంటే ఎన్నోరెట్లు పెద్దది,

బలిష్ఠమైన గ్రద్దతో పోల్చుకుని దానిలా గొర్రెను ఎత్తుకుపోవడానికి ప్రయత్నించి భంగపడింది’.

కాబట్టి ఓ నక్కా! మనకు స్నేహం పొసగదు” అన్నది కాకి. నక్కకు కోపం వచ్చి పళ్లు పటపటా నూరేసరికి అసలే అరిగి ఉన్న కోరదంతం విరిగిపడింది.

కాకి నవ్వుతూ అన్నది– “చింత చచ్చినా పులుపు చావలేదు”.

నక్క అన్నది– “నీ నిరాకరణ వలన నాకు కోపం రాలేదు. నామీదే నాకు కోపం వచ్చింది” అంటూ అది అడవిలోకి నిష్క్రమించింది.

ప్రభూ! ఇవి కొన్ని జంతువుల కథలు. ఇప్పుడు నేను చెప్పబోయే కథ – అలి ఇబిన్ బకర్ – షామ్స్ అల్–నహర్‌ల కథ.

ఖలీఫా హరూన్ అల్–రషీద్ కాలంలో ఓ ధనిక యువవ్యాపారి అబు అల్–హసన్ బాగ్దాద్ నగరంలో నివసిస్తూ ఉండేవాడు. మేలిమి దుస్తులను విక్రయించడంలో, నగలు, వస్త్రాల ఎన్నికలో అందరూ అతడిని విశ్వసించేవారు. అందగాడు, సౌమ్యుడు, వినయశీలి కావడంతో అంతఃపుర పరిచారకులే కాక భాగ్యవంతుల కుటుంబాలకు చెందిన మహిళలు కూడా అతడి దుకాణాన్ని ఎన్నిక చేసుకునేవారు తమకు కావాల్సిన వస్త్రాలు నగల కోసం. క్రమేపీ అతడి ఖ్యాతి ఖలీఫా హరూన్ అల్–రషీద్ చెవులకు చేరింది. రాజభవనంలోని విందులకు ఆహ్వానమందుకున్న అబు అల్–హసన్ వెళ్లినప్పుడల్లా ఖలీఫాకు విలువైన కానుకల్ని సమర్పించి సంతోషపెట్టేవాడు.

అతడి దుకాణానికి తరచు వచ్చేవాళ్లలో పర్షియన్ రాజవంశానికి చెందిన ఆలి ఇబిన్–బకర్‌కు అబు అల్–హసన్‌ల మధ్య మైత్రి ఏర్పడింది. ఒకరోజున వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ ఉండగా పదిమంది చంద్రవదనలు వెంటరాగా పదకొండవ యువతి అలంకరించబడిన కంచరగాడిదనెక్కి రాజసంగా అటువేపు వచ్చింది. గులాబి రంగు సిల్కు ఇజార్–దుస్తులు, నడుముకు వజ్రాలు పొదిగిన బంగరు పటకా, పలుచటి మేలిముసుగులోంచి ప్రకాశవంతంగా కానవస్తున్న కళ్లు, పాల తెలుపు శరీరవర్ణం, యువకుల కలలలో విహరించే దేవకన్యలా ఆమె కానవచ్చింది.

***తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# * 152వ రాత్రి కథ *

షహర్జాది కథ చెప్పసాగింది-

## II. ఆలి ఇబిన్ బకర్ - షామ్స్ అల్-నహర్ కథ

పదిమంది అపురూప లావణ్యవతుల మధ్య ఆ సౌందర్యరాశి వారి దుకాణపు ఆవరణలో అడుగుపెట్టగానే అబు అల్-హసన్ అత్యంత గౌరవాభిమానాలతో ఆమెకు స్వాగతం పలికినాడు. అక్కడ ఉన్న మేలైన వస్త్రాలను చూస్తూ ఆమె తన మేలిముసుగును కొద్దిగా తొలగించి వస్త్రాల జరీ అంచులను నిశితంగా పరీక్ష చేయసాగింది. ఆమె అద్భుత సౌందర్యాన్ని ఓరకంట తిలకించిన ఆలి ఇబిన్-బకర్ నిశ్చేష్టుడై వెంటనే చూపులను మరల్చుకుంటూ అక్కడి నుంచి లేచి వెళ్లిపోబోయినాడు.

ఆమె అబు అల్-హసన్‌తో అన్నది- "నేనున్నానని నీ మిత్రుడు వెళ్లిపో నక్కరలేదు"

ఆ మృదు మధురమైన మాటలను విని ఆనందపరవశుడైన ఆలి ఇబిన్-బకర్-

*"నీలాకాశంలో బంగరు సూర్యుడిని చూసావు*
*నీవా అంతదూరం ప్రయాణం చేయలేవు*
*మూర్ఖుడా, రెక్కలు లేకుండా ఎలా వెళ్తావక్కడకు?*
*అయినా, స్వర్ణకాంతి నిన్ను చేరిందని మరవలేవు".*

ఆ ఆశుకవితను విని ఆమె చిరునవ్వుల వెన్నెలను కురిపించి, అతడెవరని అబు అల్ హసన్‌ను అడిగింది. అతడు పర్షియన్ రాజవంశీకుడని తెలుసుకుని ఆమె అన్నది- "ఓ అబు అల్-హసన్, రేపు నేను నా బానిస ద్వారా మీ ఇద్దరికీ ఆహ్వానం పంపిస్తే ఆశ్చర్యపోకు. అతడికి తెలియజేయి, పర్షియన్ రాజాంతఃపుర కాంతలను మించిన అద్భుత సౌందర్యరాశులు బాగ్దాద్‌లోని ఈ భవనంలో ఉన్నారని తెలియజేయి".

అలా పలికి ఆమె తన మేలిముసుగు సర్దుకుని తన పరిచారికలతో కలిసి నిష్క్రమించింది. ఆమె వెళ్లినా ఆమె తాలూకు మల్లెల, చందన పరిమళాలు ఆ గదిని వీడలేదు.

ఆలి ఇబిన్ బకర్ అడిగాడు తన మిత్రుడిని– "ఎవరామె? ఇంత స్పష్టతతో, రాజసంతో, ఇతరుల మనసులను ఇట్టే ఆకట్టుకొనగల చాతుర్యమున్నది".

అబు అల్–హసన్ అన్నాడు– "ఆమె షామ్స్ అల్–నహర్, ఖలీఫాకు ఇష్టురాలు. మహరాణి జుబేదా కన్నా ప్రభువు ఈమెకు ప్రాముఖ్యత నిస్తాడు. ఈమెకు అంతఃపుర రక్షకుల నిర్బంధాలు లేవు. ప్రభువుకు ఈమెపై అపార విశ్వాస మున్నది. అంతఃపురంలో కూడా ఈమెపై అపవాదు వేయడానికే జంకుతారెవరైనా!"

మరుసటి రోజున ఓ బానిస యువతి వచ్చి వారిద్దరికీ షామ్స్ అల్–నహర్ నుంచి ఆహ్వానాన్ని అందజేసింది.

వారిద్దరూ ఆ బానిస యువతి ననుసరించి రాజభవనంలోకి ప్రవేశించారు. ఆ ఇద్దరిని ఓ అద్భుతమైన గదిలో కూర్చోబెట్టి ఆమె చప్పట్లు చరవగానే సేవకులు బంగరు పళ్లెరాల్లో తినుబండారాలు, మధుర భక్ష్యాలు తెచ్చి వారిముందు ఉంచారు. వజ్రాలు, కెంపులు పొదిగిన పాత్రల నిండా పళ్లరసాలు, పానీయాలు తెచ్చి, బంగరు కుంపటిలో కలబంద, సువాసన మూలికల పొడిని జల్లి ఆ గదిని పరిమళభరితం గావించారు. ఇద్దరు మిత్రులు, భోజనాలు చేసాక గులాబి నీళ్లతో చేతులు కడుక్కుని, మెత్తటి వస్త్రాలతో తుడుచుకుని కాసేపు విశ్రాంతి తీసుకున్నారు.

ఆ తరువాత ఆ బానిస యువతి వారిని ఓ విశాలమైన ఆవరణలోకి తీసుకువెళ్లింది. ఆ ఆవరణలో, ఇరవైనాలుగు స్తంభాలు ప్రశస్త అలబాస్టర్‌తో చేసినవి, బంగరు పక్షుల రూపాలున్న దిమ్మలు, గోడలకు అద్భుతమైన రంగులు, చిత్రాలు అవి నేలపై పరచిన తివాచీలతో కలిసిపోయి ఓ మనోజ్ఞమైన ఆకృతిని సంతరించుకున్నవి. స్తంభాల మధ్య పూలకుండీలు, స్ఫటిక పాత్రలు, నేల–గోడలు – పైకప్పు ఒకేరీతి శైలిలో అలంకరించబడి ఓ అద్భుత దృశ్యాన్ని తలపింపచేస్తున్నవి.

ఆ ఆవరణలో వాళ్లు మంత్రముగ్ధులై నడుస్తూ ఉండగానే పదిమంది యువతులు గులాబి చెక్కిళ్లు, నీలి కనులు, పూర్ణకుంభ వక్షోజ రమణులు ఒక వలయంగా నృత్యం చేస్తూ వారిని ఆహ్వానించారు.

***ఆ రాత్రికి షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# ✳ 153వ రాత్రి కథ ✳

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ఆ పదిమంది అపురూప లావణ్యవతుల చేతుల్లో వీణలున్నాయి. ఆ వీణా నాదాలు ఈ అతిథుల గుండెచప్పుడు నధికం చేసాయి. మిగతా పరిచారికలు తంబూరాలు శృతిచేసారు.

*చప్పున నీలిగాలులు చిలకరించాయి చిరునవ్వును*
*చంద్రిక తన వదనంపై కప్పుకున్నది మేలిముసుగును*
*సూర్యకుమారుడు వేగంగా రువ్వాడు వెలుగు పువ్వులు*
*చీకటి తొలిగి విస్తరింపజేసింది విస్తృత వెలుగును*
*- షామ్స్ అల్-నహర్ చంద్రిక వస్తున్నది*
*సూర్యుడి కెంపు పెదాలకు సూచించు జాగ్రత్తను*
*అతడి వెలుగును చూసి చీకటి పారిపోతున్నది*
*అతడి కళ్లు సూచిస్తున్నాయి అప్రమత్తతను!*

పన్నెండు మంది నీగ్రో యువతులు అర్ధనగ్నంగా వస్తున్నారు ఓ వెండి సింహాసనాన్ని మోసుకుని. దానిపై కూర్చుని ఉన్నది మేలిముసుగులో చంద్రికలా ఆమె. వాళ్లు ఆ సింహాసనాన్ని యువతుల వలయంలో ఉంచి తోటలోకి నిష్క్రమించారు.

తన అందమైన అంగుళిలతో తెరను తొలగదోసి షామ్స్ అల్-నహర్ ఆ అతిధులవేపు చూసింది. చంద్రుడి నీడలో మెరిసే తారల్లా ఆ కనులు. ఆకాశపు నీలిరంగు దుస్తులు, వాటికి బంగరు జరీఅంచు, ప్రశస్తమైన కెంపులు పొదిగిన అల్లికతో ఆమె దేవకన్యలా దర్శనమిచ్చింది.

పరిచారికలలో ఓ యువతి గానం చేసింది-

*"ప్రేమికులు పారవశ్యంలో మునిగి ఉన్నపుడు*
*అధరాలు ఒకే వలయంగా మారినపుడు*
*ఎవరూ చెప్పలేరపుడు ఎందుకని అడిగితే*
*సృష్టికర్త మాత్రమే సూచించగలడు వివరంగా*

మరో యువతి పాడింది–

*చీకటి పడినప్పుడు*
*పూలుగా విడిపోతుంది వెలుగు*
*వాళ్లంటారవి తారలని, నేనంటాను నీ నేత్రాలని*

*చీకటి పడినప్పుడు*
*నీ దేహం నాకందిస్తుంది మధువును నా పెదాలకు*
*వాళ్ళంటారది మధువని, నేనంటాను అమృతమని.*

*చీకటి పడినప్పుడు*
*వెన్నెల ఆక్రమిస్తుంది నా శయ్యను*
*వాళ్లంటారది కాంతి వస్త్రమని, నేనంటానది నీ దేహపు వెలుగని*

*చీకటి పడినప్పుడు*
*సృష్టికర్త అతడి పెదవులలో రగిలిస్తాడు అగ్నిని*
*వాళ్లంటారది కామమని, నేనంటానది ప్రేమజ్వాలని.*

ఇద్దరు అతిథులు నిట్టూర్పులు విడుస్తుండగానే మూడవ యువతి అన్నది–

*ఆకుపచ్చటి నీరు మారుతున్నది ఆకర్షణీయంగా*
*నల్లటి వెండి జలాలుగా, నీలంగా*
*వెన్నెల నిష్క్రమించగానే అదృశ్యమవుతున్నది;*
*ప్రేమకూడా అంతే, అదృశ్యమయ్యేలోపునే గడపాలి ఆనందంగా!*

ఆలీ ఇబిన్–బకర్ అన్నాడు–

*వానజల్లుల మధ్య వస్తున్నది సౌదామిని*
*ఉరుములన్నీ శ్రావ్య సంగీతధ్వనులైనవి*
*పూలజల్లుల మధ్య వస్తున్నది వసంతయామిని*
*వనములన్నీ పాటల పల్లకీలైనవి.*
*వెలుగు జల్లుల మధ్య వస్తున్నది భామిని*
*భవనములన్నీ దివ్యభువనములైనవి.*

షామ్స్ అల్-నహర్ అతడివేపు చూసి ప్రేమగా-

*దివ్యభువనము లెన్ని ఉన్నా దీర్ఘ నిశ్వాసలే*
*వెలుగు దివ్వెలెన్ని ఉన్నా వేడి నిట్టూర్పులే*
*వనములన్నీ పాటలైనా వలపు కోరికలే నావి*
*పూలజల్లులన్నీ నేలరాలిన పూలరేకలే*
*ఉరుములన్నీ పాటలుగా ఉరికిన భావనలే నావి*
*సౌదామిని కాంతులన్నీ సౌమ్య ప్రేమ వీవెనలే!*

జన్మజన్మల బంధమా ఇది అన్నట్లు వారిద్దరు ఒకరినొకరు చూసుకుంటూ తన్మయత్వంలో మునిగి ఉండగా, అబు అల్-హసన్ గుండెలో ప్రమాద ఘంటికలు మోగాయి. ఆమె ఖలీఫా ప్రియురాలు. ఆమె ప్రేమిస్తున్నది తన మిత్రుడైన ఆలి-ఇబిన్ బకర్‌ను. ప్రేమ అంకురించింది తన వ్యాపారస్థలంలో. ఖలీఫాకు తెలిస్తే ఆమెను శిక్షించకపోవచ్చును గాని, తామిద్దరి మెడలపై తలలుండేనా? ప్రేమికులనిద్దరినీ వదిలేసి తోటలోకి వెళ్లి చెట్లచాటున బిక్కుబిక్కుమంటూ ఆలోచనల్లో పడినాడు అబు అల్-హసన్.

ప్రేమికులు కాస్త తేరుకున్నాక, షామ్స్ అల్-నహర్ ఆ ఇద్దరు మిత్రులను భోజనానికి ఆహ్వానించింది. అపురూపమైన వంటకాలు, భక్ష్యాలు, మధువు వారి చతురోక్తుల మధ్య సంగీత గానాల మధ్య ఆరగించబడినాయి.

*ప్రేమకై వెదుకుతున్నది నా హృదయం*
*ఇన్నాళ్లూ ఎడారిలో విరామం లేకుండా*
*పక్కనే ఒయాసిస్సును గమనించిందీ ఉదయం*
*తీర్చుకుంటున్నది దాహాన్ని కాసేపైనా ఆగకుండా*
*నా దేహం చుట్టూరా నిర్మించుకున్న రక్షణ వలయం*
*ఇన్నాళ్లూ ఆపింది ఎటూ పోకుండా, నన్ను,*
*పంజరంలో చిలుకకూ కావాలి ప్రణయం*
*ప్రళయాన్నైనా ఎదిరిస్తుంది లొంగిపోకుండా!*

గానం చేసింది షామ్స్ అల్-నహర్ అద్భుతంగా వీణానాదాల మధ్య వీనుల విందుగా!

**తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# ✻ 154వ రాత్రి కథ ✻

**షహర్జాది కథ చెప్పసాగింది-**

ప్రేమికుల ప్రణయ రాగాలు, వైణికుల వీణానాదాల ప్రవాహంలో కాలం గడచిపోతున్నది త్వరత్వరగా.

ఓ గాయని ఆలపిస్తున్నది యజమానురాలి సూచనతో-

*కన్నీళ్లతో నా పెదవులు తడిచినవి మరల*
*మధువుతో మధుపాత్రలు నిండినవి మరల*
*కన్నీళ్లు, మధువు కలిసిన పానీయమిది*
*ప్రేమ, వేదన ప్రవాహమై పొంగినవి మరల.*

షామ్స్ అల్-నహర్ అందుకున్నది మరికొన్ని చరణాలను-

*మెరిసే కనుల ఓ లేడికూనా, ఇటు రావా*
*మధుర ద్రాక్షఫలాల్ని తిని వస్తున్నావా*
*ఎడారి గాలి తెస్తున్నది ఈ వనాలలోనా*
*ఖర్జూర పరిమళాలను గుర్తించావా!*

*పడమటి గాలి అంటే పడదు నాకు,*
*గులాబి చెక్కిళ్లకది చేస్తుంది చెరుపు*
*అరవిరిసిన మల్లెపూలంటే అసూయ నాకు*
*నీ వెన్నెల వదనాన వెలుగు రేకల చూపు*
*కెంపు వర్ణపు పగడాలపై కోపమున్నది నాకు*
*నీ పెదవులను చూసి చిట్లించుకొను రూపు*
*ఎర్రగా మండే అగ్నిజ్వాలలపై ఆగ్రహమున్నది నాకు*
*నీ ప్రేమ వెచ్చదనానికి రగిలిపోతున్న వింతసేపు.*

*మెరిసే కనుల ఓ లేడికూనా, ఇటురావా,*
*మధుర ద్రాక్షఫలాల్ని తిని వస్తున్నావా*
*ఎడారి గాలి తెస్తున్నది ఈ వనాలలోనా*
*ఖర్జూర పరిమళాలను గుర్తించావా!*

రాకుమారుడు ఆలి ఇబిన్ బకర్ ఒక వీణను తీసుకుని శృతి చేయగా మరో వీణను అబు అల్-హసన్ అందుకున్నాడు. ఆలి ఇబిన్-బకర్ తన్మయత్వంతో పాడినాడు-

ఓ మధుపాత్ర లావికా, సాకీ,

*నేనే ప్రభువునైతే నా సమస్త సంపదలనూ*
*ధారపోసేవాడిని నీ చరణాల చెంత*
*నేనే ప్రభువునైతే తెల్లకాగితం పైనున్న ఎరుపురంగును*
*ధారపోసేవాడిని నీ అధరాల చెంత*
*నేనే ప్రభువునైతే కుంకుమపూల వర్ణాన్ని, ద్రాక్ష*
*ఫలసారాన్ని, గులాబీల సోయగాల్ని*
*ధారపోసేవాడిని, నీ పాదాల చెంత!*

షామ్స్ అల్-నహర్ ఆ పాటను వింటూ ఊహాలోకాల్లో తేలిపోతుండగానే ఆమెకిష్టురాలైన చెలికత్తె పరుగు పరుగున వచ్చి అన్నది-

"అమ్మా! ద్వారం వద్ద ఖలీఫా అంగరక్షకుడు మస్రూర్, అంతఃపుర నపుంసక బానిసల నాయకుడు అఫిష్, ఇతర సైనికులతో ద్వారం వద్ద వేచి ఉన్నాడు".

ఓ క్షణం కలవరపడినా, షామ్స్ అల్-నహర్ వెంటనే తేరుకుని తన చెలికత్తెతో అన్నది- "మన అతిధులను పక్కనే ఉన్న గదిలో సురక్షితంగా ఉంచు".

తాను వెండి ఆసనంపై కూర్చున్నది ఏదో రుగ్మత, నీరసం తనను ఆవహించగా చెలికత్తెలు ఆమె సెదదీరుస్తున్న రీతిలో. విందు జరిగిన దృశ్యమేమీ కానరాకుండా పరిచారికలు ఆ స్థలాన్ని శుభ్రం చేసినారు.

మస్రూర్ సైనికులతో వచ్చి షామ్స్ అల్-నహర్‌కు అభివాదం చేసి అన్నాడు- "విశ్వాసుల అధిపతి, ప్రభువు తమ క్షేమ సమాచారములు కనుగొనమని నన్ను పంపినాడు. అన్నీ శుభములు జరిగిన ఈనాడు ప్రభువు మనసు తన ప్రియసఖి సమాగమానికి ఎదురుచూస్తున్నది. తమరు ప్రభు సన్నిధికి వస్తారో లేక ప్రభువుకు ఇక్కడ ఆహ్వానం పలుకుతారో అది తమ ఇష్టం"

షామ్స్ అల్-నహర్ అన్నది- "నేను, నా శరీరం, సంపదలు అన్నీ ప్రభువు అధీనంలోనివి. ప్రభువు ఇక్కడకు అరుదెంచిన, ఈ భవనం కాంతిమయ మవుతుంది"

మస్రూర్ తన అనుచరులతో నిష్క్రమించగానే షామ్స్ అల్-నహర్ తన అతిధులు దాగి ఉన్న గదివద్దకు వచ్చింది. ఆలి ఇబిన్-బకర్‌ను చూసి ఆమె అన్నది–

*"పంజరంలో అన్నీ ఉంటాయి ఆ ఒక్క స్వేచ్ఛ తప్ప!*
*సౌఖ్యాలన్నీ దొరుకుతాయి ఆ ఒక్క ప్రేమ తప్ప!*
*ప్రశస్తమైన దైహిక సుఖాలన్నీ ఆ చిలుకకు అనుభవమే!*
*కాలం మాన్పుతుంది అన్నిటినీ, గుండె గాయాన్ని తప్ప!*

*ఎందుకో చెప్పలేను ఏదో వెలితి నా హృదయంలో*
*ఏ రకంగానూ వర్ణించలేను ఏదో లోటు నా మనసులో*
*చల్లని వానజల్లు చటుక్కున వచ్చింది*
*ఎడారి నేలకు తగలకమునుపే ఆవిరయ్యింది గాలిలో".*

ఆమె మాటలు వినగానే ఆలి ఇబిన్-బకర్ కన్నీరు మున్నీరయ్యాడు. అబు అల్-హసన్ అన్నాడు–

*"ప్రేమ చేసే గాయం చాలా లోతైనది.*
*పరిచయం స్వల్పమే అయినా పరిణామం దుష్కరమైనది*
*ఎడారిలో ఉండవచ్చు ఎన్నో ఒయాసిస్సులు*
*దాహార్తులకు నేడు కన్నీటి చెలమ ఆశ్రయమైనది".*

ప్రేమికుల్దిరూ కౌగిలి నుంచి విడివడినాక, చెలికత్తె వారిని రహస్య మార్గం ద్వారా టైగ్రిస్ నది ఒడ్డుకు తీసుకువెళ్లే దారి వద్దకు తీసుకువస్తుండగానే షామ్స్ అల్-నహర్ భవనం వద్ద ప్రభువు వస్తున్న సందడి మొదలైంది. అతిధులను చీకటిలో వదిలి చెలికత్తె రహస్య ద్వారాన్ని మూసివేసి భవనంలోకి వెళ్లిపోయింది. తోటలో చెట్లమధ్య నుంచి టైగ్రిస్ నది ఆవల వేపు ఉన్న భవనాలలోని దీపకాంతులు మినుకుమినుకు మంటున్నట్లు కానరాసాగినాయి.

అక్కడ ప్రభువు కాగడా వెలుగుల మధ్య చంద్రుడిలా ప్రకాశిస్తున్నాడు. వందమంది యువ నపుంసక బానిసలు, వారి వెనుక మరో వందమంది వయసులో పెద్దవారైన బానిసలు కత్తులు దూసి రక్షణగా ప్రభువు చుట్టూ ఉన్నారు. ప్రభువుకు ముందు ఇరవై మంది శ్వేత బానిసలు, అనేకమంది గాయనీమణులు, నాట్యగత్తెలు,

వేణువు నూదేవారు, వైణికులు ఓ వలయంలో పాటలకు అనుగుణంగా నర్తిస్తూ తన భవనంలోకి రాగానే షామ్స్ అల్-నహర్ ప్రభువు ముందుకువెళ్లి అభివాదం చేసింది.

ప్రభువును వెండి ఆసనంపై కూర్చోబెట్టి అతడి ముందు తాను వినయంగా మోకరిల్లి ప్రభువు ఆజ్ఞకై ఎదురుచూసింది షామ్స్ అల్-నహర్.

ప్రభువుతో వచ్చిన సేవకులు తోటలోకి నిష్క్రమించారు. గాయనీమణులు పాటలు పాడినారు.

*"ప్రాతఃకాలపు పొగమంచులో*
*స్నానం చేసాయి అరవిరిసిన కుసుమాలు*
*దక్షిణ గాలి అలల అంచులో*
*నాట్యం చేసాయి పరిమళ ద్రుమాలు*
*నీ కనులెందుకు చెలీ, కన్నీటి కొలనులైనాయి*
*కలలు చేసాయి అలల ఆరామాలు*
*పెదవులెందుకో వణుకుతున్నాయిపుడు*
*తలపులు చేసాయి తన్మయ విరామాలు"*

ఆ పాట విని కనుల నీరు నిండిన షామ్స్ అల్-నహర్ అన్నది-

*"విరహవేదనతో దుఃఖిస్తున్నది ఎడారి కన్య*
*వానరూపంలో వచ్చాడు ప్రేమికుడు*
*ఒంటరి ఒయాసిస్సుకు ఆనందమే ఆ క్షణం*
*ఇంతలో రానే వచ్చింది ఇసుక తుఫాను*
*భూకంపం కన్నా తీవ్రమైనది హృదయకంపం*
*కూలిపోతుంది శిథిలాలుగా ఆశాహర్మ్యం!"*

అలా గానం చేస్తూనే షామ్స్ అల్-నహర్ సొమ్మసిల్లిపోయింది ఆవేదనతో.

***ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# * 155వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఇక్కడ షామ్స్ అల్-నహర్ సొమ్మసిల్లిన క్షణంలోనే అక్కడ తోటలో ఇద్దరు మిత్రులూ ఏదో చెప్పలేని వేదన తమను ఆవరించగా నెమ్మదిగా టైగ్రిస్ నదీతీరం వేపు చేరుకున్నారు. ఆలి ఇబిన్-బకర్ హృదయ భారం మరింత ఎక్కువ కాగా అతడు కన్నీళ్లపర్యంతమైనాడు. అటుగా వచ్చిన పడవనెక్కి వాళ్లు టైగ్రిస్ నది ఆవల వేపుకు చేరి కొంతదూరం నడిచేసరికి అబు హసన్‌కు తెలిసిన వ్యాపారస్తుడి ఇల్లు కానవచ్చింది. ఆ రాత్రికి అతడి ఇంటిలో ఆశ్రయం పొందినారు మిత్రులిద్దరూ. మరుసటి రోజు ఉదయం ఆలి ఇబిన్-బకర్‌ను అతడి ఇంటివద్ద దించి అబు అల్-హసన్ తన దుకాణానికి వెళ్లినాడు. సాయంకాల సమయంలో ఆ దుకాణానికి వచ్చింది షామ్స్ అల్-నహర్ పంపగా వచ్చిన ఆమె ప్రియసఖి. విచారమగ్న వదనంతో ఉన్న ఆమెను చూడగానే అబు అల్-హసన్ గుండె దడదడలాడింది.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# * 156వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

షామ్స్ అల్-నహర్ ప్రియసఖి అన్నది- “ఖలీఫా వస్తున్నట్లు తెలియగానే మిమ్మల్ని తోటలో వదిలి నేను నా యజమానురాలి వద్దకు చేరుకున్నాను. ఆమె ప్రభువు కోసం సిద్ధమైనా తన మనసు నిండా ఆలీ ఇబిన్-బకర్ రూపమే ఉన్నదేమో, ఆమె కనుల నుండి అశ్రువులు ధారగా ప్రవహించసాగినాయి.

తననెంతగానో గౌరవించిన ఖలీఫాను కాదని, ఒక్కరోజు పరిచయమున్న ఆ యువకుడిపై ఇంతగా తపించడానికి కారణమేమిటి? ఇన్నాళ్లూ ఆమె ఆ బంగరు పంజరం నుంచి పారిపోవాలనుకున్నదా? ప్రభువుకు తన దేహాన్నప్పగించి అతడు వచ్చిన ఆ ఒక్కరాత్రికి సుఖాన్నందించి తద్వారా వచ్చే సంపదలు, గౌరవం ఆమెకు కంటకప్రాయమైనాయా? దానికన్నా ఈ పంజరం నుంచి తప్పించుకుని ఒక్కరోజైనా తనకు నచ్చినట్లు బతుకుదామని అనుకున్నదా? ఆమె ఒక్కతే కాదు అంతఃపురంలోని స్త్రీలమందరం ఒక్కోసారి అటువంటి భావనలలో మునిగి ఉక్కిరిబిక్కిరై మరల

వాస్తవ పరిస్థితులకు తలవొగ్గి బతుకుతున్నాము కాదా – ఇలా నేను భావిస్తూ ఉండగానే ప్రభువు రావడం, ఆవేదనతో గానం చేస్తూ షామ్స్ అల్-నహర్ స్పృహ తప్పిపోవడం జరిగాయి.

దయాహృదయుడైన ప్రభువు కనుసైగలతో ఆమెకు శీతలోపచారాలు జరిగాయి. కాసేపటికి ఆమె కనులు తెరచి ప్రభువు పాదాలపై పడి దుఃఖిస్తూ అన్నది–

"ప్రభూ! నేను తిన్న ఆహారం వికటించినట్లున్నది! తమరు వచ్చేసరికి స్వస్థతనొంది తమకు ఆనందం కలిగించాల్సిన దానిని ఇలా బేలనై ఉన్నాను. నన్ను క్షమించండి!"

"ఏం తిన్నావు ఈ పూట" అడిగాడు ఖలీఫా ఆమె తల నిమురుతూ–

"రెండు నారింజలు, ఆరు ఆకుపచ్చ ఏపిల్ కాయలు, పెరుగు, తీపి కతైఫ్ సమోసా, వేయించిన తియ్యటి బఠాణీలు, గుమ్మడి విత్తులు తిన్నాను ప్రభూ!"

"అవన్నీ ఆకలి కలిగిస్తాయి. సరే!" అని ప్రభువు రాజవైద్యులకు కబురంపినాడు. వారు వచ్చి ఆమెను పరీక్షించి విశ్రాంతి అవసరమని చెప్పగా ప్రభువు ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచి తన భవనానికి వెళ్లినాడు.

ప్రభువు వెళ్లిన తరువాత నేను ఆమెకు పరిచర్యలు చేస్తూ అన్నాను– "రాజ వైద్యులకు తెలుసు మన అంతఃపుర స్త్రీల మానసిక స్థితి. వారు ప్రభువుకివన్నీ చెప్పలేరు. నాకు తమ ప్రేమస్థితి తెలియును. నేనూ ఏమీ చెప్పలేను. అయినా ఈరోజు అబు అల్-హసన్ దుకాణానికి వెళ్లి శుభవార్త తెస్తాను. రాణీ! ఈ రహస్యం బట్టబయలైతే మన ప్రాణాలకు ప్రమాదం కదా! పంజరంలోనే స్వేచ్ఛగా బతకడం మంచిదేమో ప్రణయ పంజరంలో బందీ కావడం కన్నా!" అన్నది ఆమె.

అబు అల్-హసన్ అన్నాడు– "నేను అతడిని వాళ్లింటి వద్ద దిగబెట్టి వచ్చాను. ఈరోజు వెళ్లి అతడి కుశల సమాచారం కనుక్కుని వస్తాను. నీవు వెళ్లి షామ్స్ అల్-నహర్‌కు ఆలి ఇబిన్-బకర్ కూడా ప్రేమ సాగరంలో మునిగి దుఃఖితుడై ఉన్నాడని తెలియజేయి. రేపు సాయంకాలం మరల కలుద్దాము".

ఆమె వెళ్లగానే అబు అల్-హసన్ దుకాణాన్ని మూసివేసి ఆలి ఇబిన్-బకర్ ఇంటి వేపు వెళ్లినాడు.

***షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# * 157వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

అబు అల్-హసన్ వెళ్లేసరికి ఆలి ఇబిన్-బకర్ గృహం బంధువులు, వైద్యులు, సేవకుల హడావుడితో గందరగోళంగా ఉన్నది. ఏ ఇద్దరు వైద్యులూ ఒక రకమైన వైద్య సలహా ఇవ్వకుండా వారిలోవారు వాగ్యుద్ధాలు చేస్తున్నారు. ఇంటిలోని వృద్ధమహిళలు వాళ్ల పద్ధతిలో వాళ్లు కషాయాలు, తాయెత్తులు తెచ్చి సిద్ధంగా ఉన్నారు.

అబు అల్-హసన్ రాక తెలియగానే అందరినీ పంపించివేసాడు ఆలీ ఇబిన్-బకర్.

"మిత్రమా, కాసేపటి క్రితం షామ్స్ అల్-నహర్ చెలికత్తె వచ్చి నీ కుశల సమాచారం కనుక్కున్నది. ఆకాశంలోని చందమామపై ప్రేమలో పడినావు. కాస్త సహనం, బలం రెండూ కావాలి" అన్నాడు అబు అల్-హసన్.

మంచం మీద తలగడల మధ్య శిరస్సును దాచుకుని కన్నీళ్లు ఆపుకుంటూ ఆలి ఇబిన్-బకర్ అన్నాడు- "ఈ ప్రేమ చేసే గాయం ఇంత లోతుగా ఉంటుందని అనుకోలేదు. ఇంత స్వల్పకాలంలోనే నన్నింతగా అధైర్యపరుస్తుందనీ అనుకోలేదు.

*నీలికత్తుల దాడి ఆమె చూపుల వాడి*
*కస్తూరి పరిమళాల కర్పూరపు వేడి*
*ముత్యాలు ఎరుపెక్కినట్లు ముదిత నవ్వేను చూడు*
*రత్నాలు, వజ్రాలు రంగరించిన రమణి మాటల దాడి*

*బంగరు బల్లపై బోర్లించిన రెండు వెండి కలశాలు*
*మగవాడి గుండెను తాకి మంటలను రేపే కుంపటి ద్వయాల వేడి*

*అవి నన్ను కౌగిలించుకున్నాయి ఆదరంగా ఆ రాత్రి*
*అంతలోనే వచ్చిన ఆ తుఫాను నాకు మిగిల్చింది దుఃఖరాత్రి దాడి"*

అబు అల్-హసన్ అన్నాడు- "ప్రేమికుడా! నీ గుండె గాయానికి ఈ మందు లేపనంలా పనిచేస్తుందేమో చూడు!

*సాకీ చేతి మధుపాత్ర అందింది అధరాలకు*
*మధుపాయి ప్రేమ ఎగిసింది శిఖరాలకు*

*కాలం గడిస్తేనే కదా రుచి పెరిగేది*
*విరహం అనుభవిస్తేనే కదా విధి శక్తి తెలిసేది భ్రమరాలకు.*

*సాకీ మరల వస్తున్నది మరింత మధువుతో*
*కళ్లతోనే తాగు ఇప్పుడు పనిలేదు అధరాలకు!"*

ఆలి ఇబిన్-బకర్‌ను అలా సముదాయించి అబు హసన్ తన ఇంటికి చేరుకున్నాడు.

మరుసటిరోజు మధ్యాహ్నం వేళ ఓ లేఖా సందేశాన్ని తీసుకుని వచ్చింది షామ్స్ అల్-నహర్ ఇష్టసఖి. ఇద్దరూ కలిసి ఆలి ఇబిన్-బకర్ ఇంటికి వచ్చారు.

**ఇంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## ✻ 158వ రాత్రి కథ ✻

**షహర్జాది కథ చెప్పసాగింది-**

అబు అల్-హసన్ తనతోపాటు షామ్స్ అల్-నహర్ ఇష్టసఖిని తీసుకుని తన మిత్రుడు ఆలి ఇబిన్-బకర్ ఇంటికి వచ్చాడు. ఇష్టసఖి తాను తీసుకువచ్చిన ప్రేమలేఖను ఆలి ఇబిన్-బకర్‌కు ఇచ్చింది. ప్రేమజ్వరంతో నీరసించి ఉన్న ఆలి ఇబిన్-బకర్ ఆ లేఖను చదివి కన్నీళ్లపర్యంతమైనాడు. తన మనసులోని భావాన్ని జవాబుగా వివరిస్తుండగా అబు అల్-హసన్ దానిని పొందికగా వ్రాసినాడు.

దానిని తీసుకుని ఆమె షామ్స్ అల్-నహర్‌కు ఇవ్వడానికి వెళ్లిపోయినాక, అబు అల్-హసన్‌లో అనేక ఆలోచనలు ముప్పిరిగొన్నాయి.

"ఈ వ్యవహారం శృతిమించి రాగాన పడుతున్నట్లున్నది. పర్షియన్ రాజవంశీకుడు ఆలి ఇబిన్-బకర్‌కు ఇంకా వివాహం కాలేదు. కాని తనకు భార్యా పిల్లలున్నారు. ఈ ప్రేమ వ్యవహారం ఖలీఫాకు తెలిస్తే ఆలి ఇబిన్-బకర్‌తో పాటు తన తల ఎగిరిపోతుంది. మొత్తం కుటుంబం వీధిన పడాల్సివస్తుంది. కనుక మిత్రుడిని ఏదో విధంగా బుజ్జగించి అతడిని ఈ ప్రేమజ్వరం నుంచి బయట పడవేయాలి".

అనుకుని మరుసటి రోజు ఉదయం తానొక్కడే ఆలి ఇబిన్-బకర్ వద్దకు వెళ్లి అన్నాడు– "మిత్రమా! మీ ఇరువురి మధ్య ఉన్న ప్రేమకు సరితూగగలిగిన దానిని నేను నా జీవితంలో ఏనాడూ చూడలేదు. కాని మీరిద్దరూ మృత్యువుతో చెలగాటమాడుతున్నారన్న విషయం మరచిపోవద్దు. మీ ప్రేమ తలుపులు లేని ఇల్లు లాంటిది. ఇంకా నీవు ఈ ప్రేమను కొనసాగిస్తే నీ ప్రాణానికే కాదు, నీవత్యంత ఇష్టపడే ఆమె ప్రాణమూ పోవచ్చు. నా సంగతంటావా, నేను, నా కుటుంబం యావత్తూ చావు ముంగిట నిలబడాల్సి ఉంటుంది".

తన మిత్రుడి కన్నీటి అభ్యర్థన విని చలించిపోయాడు ఆలి ఇబిన్-బకర్. "గమ్మత్తైనది ఈ ప్రేమ. ఓ వారం రోజుల క్రితం నా జీవన నది చాలా ప్రశాంతంగా ప్రవహిస్తున్నది. ఇప్పుడు ప్రేమాగ్నికి కాలి ఎండిపోయినది. అయినా మిత్రమా, నా వలన ఆమెకు, నీకు ఏ కష్టమూ రానివ్వను. అయినా ఆమెను నేను మరచిపోలేను. నీవు నాకు చేసిన సహాయానికి ఎన్ని జన్మలెత్తి సేవచేసినా ఋణం తీరదు''.

ఆలి ఇబిన్-బకర్ వద్ద సెలవు తీసుకుని అబు అల్ హసన్ తన ఇంటికి వెళ్తుండగా అతడి అంతరంగిక స్నేహితులలో ముఖ్యుడు, నగల వ్యాపారి అయిన అమీన్ కనిపించాడు.

దిగులుతో పాలిపోయిన ముఖంతో కానవస్తున్న అబు అల్-హసన్‌ను పలకరించాడు అమీన్. ఇద్దరూ ఒకచోట కూర్చున్నాక అబు అల్-హసన్, ఆలి ఇబిన్-బకర్‌కు షామ్స్ అల్-నహర్ మధ్య జరుగుతున్న ప్రణయ వృతాంతాన్ని, మధ్యలో చిక్కుకున్న తన పాత్ర గురించి వివరించి అన్నాడు– "అమీన్, మొదట్లో నేనూ ధైర్యంగానే ఉన్నాను. ఒకరాత్రి వాళ్లిద్దరూ హాయిగా కాలం గడుపుతారు. అంతటితో ఈ వ్యవహారం ముగుస్తుందని. అంతఃపురాల్లో ఇటువంటి కథలు, వాటి పర్యవసానాలు మనకు అనేక రీతులుగా తెలిసినవే కదా! అయితే ఇప్పుడు నాకు భయం పట్టుకున్నది. ఒకరాత్రి ప్రేమ కాస్తా జీవితకాల పరిణయమైతే, ఈ విషయం ఖలీఫాకు తెలిస్తే నా మిత్రుడు, అతడి ప్రియురాలు, నేను, నాతోపాటు నా కుటుంబమూ ప్రాణాలు కోల్పోవాల్సిందే కదా! ఏ సంబంధమూ లేని నా కుటుంబం కష్టాల పాలవుతున్నదని అర్థమయ్యేసరికి నా గుండె దడదడలాడుతున్నది. అలా అని స్నేహధర్మాన్ని వీడలేను. నా కుటుంబానికి ఆపద రావడానిని సహించలేను. ఏదైనా తరుణోపాయం ఆలోచించి ఈ చిక్కు నుంచి బయటపడాలి!"

***తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# * 159వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

తన మిత్రుడు అమీన్‌తో అన్నాడు అబు అల్-హసన్- "నేనొక నిర్ణయానికి వచ్చాను. ఇక్కడ ఉన్న నా దుకాణాన్ని ఎంత ధరకు వీలైతే అంత ధరకు అమ్మి, నా నివాసాన్ని బాగ్దాద్ నుంచి బస్రాకు మారుస్తాను. ఈ ప్రేమ వ్యవహారం అటో ఇటో తేలినాక మరల బాగ్దాద్‌లో అడుగుపెడతాను. నీకు తెలిసిన వాళ్లుంటే క్రయవిక్రయ వ్యవహారం ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ముగిద్దాం!"

అమీన్ ధైర్యవంతుడు, యువకుడు, పెండ్లి కానివాడు. అతడికి ఆలి ఇబిన్-బకర్ ఇంతకు ముందు సహాయం చేసి ఉన్నాడు. ఆ కృతజ్ఞతో అమీన్ అన్నాడు- "ఎవరికో ఎందుకు మిత్రమా! సరైన ధర చెప్పు. నేనే కొంటాను. ఆ విధంగా నీకు, ఆలీ ఇబిన్-బకర్ పట్ల స్నేహధర్మం నిర్వర్తించిన వాడినవుతాను".

కొద్ది రోజులలోనే క్రయవిక్రయ వ్యవహారాలు ముగిసాయి. అబు అల్-హసన్ వెంటనే బస్రాకు తన కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. అతడి దుకాణంలో అమీన్ కూర్చుని చుట్టుపక్కల వారికి విందు ఇచ్చాడు తనను పరిచయం చేసుకునే నెపంతో.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 160వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

మరుసటి రోజు దుకాణం తీసేసరికి అక్కడకు వచ్చింది షామ్స్ అల్-నహర్ ఇష్టసఖి. అమీన్ చెప్పాడు అబు అల్-హసన్ వాళ్ల కుటుంబం అత్యవసర పరిస్థితుల్లో బాగ్దాద్ విడిచి వెళ్లారని. ఆలి ఇబిన్-బకర్‌కు అవసరమైన సాయాన్ని తాను చేయగలనని వినయంగా విన్నవించాడు.

ఇద్దరూ కలిసి ఆలీ ఇబిన్-బకర్ గృహానికి వెళ్లారు. చిక్కి శల్యమైన స్థితిలోనూ ఆలీ గుర్తుపట్టాడు షామ్స్ అల్-నహర్ ఇష్టసఖిని.

ఆమె వెళ్లి ఆలీ ఇబిన్–బకర్ చెవిలో ఏదో గుసగుసలాడింది. ఆలీ వదనంలో కొత్త కాంతి, ప్రశాంతత కానవచ్చాయి.

అమీన్ అన్నాడు– "అబు అల్–హసన్ వెళ్తూ వెళ్తూ తమకు సాయపడమని కోరినాడు. ఖలీఫాకు ఈ విషయం తెలిస్తే తన కుటుంబానికి కీడు జరుగుతుందని భయపడినాడతడు. భార్యాపిల్లలున్నవాడికి భయమెక్కువ కదా! దైవం మీద ప్రమాణం చేసి చెబుతున్నాను నేను మీ రహస్యాన్ని బయటకు పొక్కనివ్వను. నేను చేయగలిగిన సాయమేదన్నా ఉంటే ఆజ్ఞాపించండి"

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 161వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

స్నేహం కోసం ప్రాణమిచ్చే తత్వం గల అమీన్ అన్నాడు– "ఆలి ఇబిన్ బకర్ గురించి నా మిత్రుడు అబు చెప్పినాడు. ఇక నుంచి నా ఇల్లు ఆలీ–షామ్స్ అల్–నహర్‌లకు సమావేశ స్థలం అవుతుంది. ఈ మాట దైవంపై ప్రమాణం చేసి చెబుతున్నాను".

ఆలి ఇబిన్–బకర్ అన్నాడు– "దైవమే నిన్ను పంపించినాడనుకుంటున్నాను. కృతజ్ఞతలు మిత్రమా!"

నగల వర్తకుడు అమీన్ గృహం సంకేత స్థలంగా గ్రహించి షామ్స్ అల్–నహర్ సేవిక ఆ విషయం తన యజమానురాలికి చెప్పడానికి వెళ్లి ఆమె సందేశంతో తిరిగి వచ్చి అన్నది– "అమీన్, నీవు అతిథిగా ఆహ్వానించబడినావు".

అమీన్ వణికిపోయాడు– "అమ్మా! ఏదో నా ఇంటిలో ఆతిథ్యమివ్వడానికి సాహసించాను కాని, నేను అత్యంత రక్షణగల అంతఃపురంలోకి వెళ్లి అబు అల్–హసన్‌లా ప్రాణాలతో తిరిగి రాగలనన్న నమ్మకం కలవాడిని కాదు".

ఆ సేవిక వెళ్లి షామ్స్ అల్–నహర్‌కు ఈ సంగతి చెప్పగా ఆమె స్వయంగా నగల వ్యాపారి అమీన్ ఇంటికి వచ్చింది. ఆమె రాకతో ఆ ఇల్లు ఆమె దుస్తుల నుంచి వ్యాపించిన అత్తరు సుగంధ పరిమళాలతో నిండిపోయింది.

అమీన్‌కు కృతజ్ఞతలు తెలిపి ఆమె అతడి వివరాలను తెలుసుకున్నది.

**తెల్లవారుజాము కావస్తున్న సూచనలు కానరాగా షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# ✻ 162వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

అమీన్ అన్నాడు షామ్స్ అల్-నహర్‌తో- "కన్యాతిలకమా! ఈ ఇంటి కెదురుగా అదుగో కానవస్తున్నది నాదే మరో గృహం. దానిని నేను యువరాజు ఆలి ఇబిన్-బకర్ అవసరాలకు ఇస్తున్నాను. తమలాంటి ఉన్నత కుటుంబీకుల అవసరాలకు తగినట్లు ఉంటుంది. నా అతిథులుగా మీరు దేనికీ సంకోచపడ నవసరం లేదు".

షామ్స్ అల్-నహర్ అతడికి కృతజ్ఞతలు తెలిపి మెచ్చుకున్నది- "నీ స్నేహం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. నిన్ను నా దారిలో నిలిపినందుకు విధికి ఋణపడి ఉంటాను. ఎడారిలో ఆకుపచ్చని లోయలాంటిది స్నేహితుడి వలన అందిన సాయం. నా నెచ్చెలి, చెలికత్తె ఈ చిన్నది. నీకు అన్ని విధాలా ఈడూ జోడైనది. ఆమె లేకుండా నాకు ఒక్క గంట కూడా గడవదు. అయినా ఆమెను నీకిస్తాను. నీకు ఆనందకరమైన వెన్నెల రాత్రులను ఆమె నీకివ్వగలదు".

అమీన్ హృదయం ఆనందంతో నిండిపోయింది. అత్యంత లావణ్యవతి యైన యువతి తన స్వంతం కాబోతున్నందుకు. ఆ నీలికన్నుల వెలుగు, ఆమె హంస నడకల సొబగు, అతడిని చూసి మార్మికంగా విరిసిన ఆమె చిరునవ్వు అతడిని మధురోహలలో నింపివేసాయి. అతడికి కృతజ్ఞతలు తెలిపి వాళ్లు నిష్క్రమించారు.

వారు వెళ్లినాక అమీన్ తన రెండవ గృహాన్ని పింగాణి, వెండి పాత్రలు, అందమైన తివాచీలు, పట్టు మెత్తలు, రకరకాల భక్ష్యాలు, మధుర రసాలతో నింపినాడు.

అతడు వాటిని పర్యవేక్షిస్తుండగానే ఆ అందాల చెలికత్తె సొగసులొలకబోస్తూ ఆ ఇంటికి వచ్చింది- "ఈ రాత్రి ఖలీఫా రాజకార్యాల వల్ల పొరుగు పట్టణ

సందర్శనకు వెళ్లనున్నాడు. షామ్స్ అల్-నహర్ ఈ రాత్రి యువరాజు ఆలి ఇబిన్-బకర్‌ను కలవదలచుకున్నదని అతడికి తెలిపి ఆనందాన్ని కలిగించు''

అని పలికి ఆమె, బంగరు నాణెములున్న సంచిని అమీన్‌కు ఇవ్వబోగా అతడు సున్నితంగా తిరస్కరించినాడు. ఆమె అతడికి తన చూపులతోనే సంతోషాన్ని వ్యక్తపరచి వెళ్లిపోయింది. అమీన్ వెళ్లి యువరాజుకు సందేశాన్నిచ్చి ఆనందంతో స్వస్థుడైన అతడిని తన ఇంటికి తీసుకువచ్చినాడు. తన ప్రియురాలిని కలవబోతున్నానన్న ఆనందంతో అతడి బుగ్గలపై గులాబిపూలు పూసినాయి.

కాసేపటికి ఇద్దరు యువతులు నల్లటి బురఖాలలో ఆ ఇంటి వద్దకు వచ్చి తలుపు తట్టినారు.

***తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

## * 163వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

అది ప్రార్థనా సమయం. ముయొజ్జిన్లు తమ శ్రావ్యమైన గొంతులతో అల్లాను స్తుతిస్తూ ప్రార్థనా సమయపు పిలుపునిస్తున్నారు.

ప్రార్థనలు పూర్తి కాగానే షామ్స్ అల్-నహర్ తన మేలి ముసుగును తొలగించి యువరాజు ఆలి ఇబిన్-బకర్ వేపు అర్ధనిమీలిత నేత్రాలతో చూసింది ప్రేమగా. ఆ ప్రేమలోని మాధుర్యానికి పరవశుడై ఆలి ఇబిన్-బకర్ దాదాపుగా మూర్ఛపోయినట్లై తేరుకుని తన అతిధులను ఆహ్వానించి వారికి అమీన్ సాయంతో పసందైన భక్ష్యాలను తినబెట్టినాడు.

భోజనాల అనంతరం షామ్స్ అల్-నహర్ వీణనందుకుని మధురంగా గానం చేసింది-

*"అతడికై ఎదురుచూస్తూ*
*నా దేహమొక పూలతోటగా విరబూసింది*
*అతడిని తాకి వీచిన గాలి*
*నా హృదయపు ఎడారిలో వాన కురిపించింది.*

*అతడి వెలుగును చూస్తూ రాత్రి*
*నా మధువొలికే అధరాలను శాసించింది*
*అతడికై తపన పడుతూ*
*నా జీవితమొక వసంత వాగుగా ప్రవహించింది"*

యువరాజు ఆలీ ఇబిన్-బకర్ ఆనందపరవశుడై ఆమెను తన కౌగిలిలో బంధించినాడు. వారిని ప్రేమ మందిరంలో వదిలి అమీన్-మరో యువతి మరో పొదరింటి మాటున మాటలలో మునిగారు. కాసేపైనాక ఆ ముగ్గురిని ఆ ఇంటిలో వదిలి అమీన్ తన ఇంటికి వెళ్లి విశ్రమించాడు.

తెల్లవారేసరికి అతడిని ఎవరో తట్టినట్లై కళ్లు తెరచి చూసాడు అమీన్. అతడి పరిచారిక భయంతో వణుకుతూ పక్కనే నిలబడి ఉన్నది. ఇంటి గుమ్మం వద్ద ఉన్న అమీన్ స్నేహితుడు లోనికి వచ్చి అన్నాడు- "మిత్రమా! కొంప మునిగింది. నీవు రాత్రి ఈ ఇంటికి వచ్చిన కాసేపటికి కొందరు బందిపోటు దొంగలు ఆ ఇంటిపై దాడిచేసి నీ ముగ్గురు స్నేహితులను బంధించి తీసుకుపోయినారు".

ఆ మాటలు వినగానే అమీన్ వెంటనే ఆ ఇంటికి పరిగెత్తినాడు. దోపిడి దొంగలు సమస్తమూ దోచుకోగా ఆ ఖాళీ ఇల్లు శూన్యంగా కానవచ్చింది. ఎప్పుడూ లేనిది, అమీన్ గుండెల్లోకి, భయం చొరబడగా అతడు పెనుగాలికి పెల్లగించబడిన చెట్టువలె నేలకూలినాడు "అయ్యో దైవమా!" అని శోకిస్తూ.

**తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# ✻ 164వ రాత్రి కథ ✻

**షహర్జాది కథ చెప్పసాగింది-**

అయ్యో దైవమా! అని అతడు శోకిస్తుంటే వారన్నారు- "దిగులు పడకు. నగర సైనికులు ఆ దొంగలను వెంటాడినారు. ఏ క్షణంలోనైనా నీకు శుభవార్త అందవచ్చు. నీ మిత్రులు క్షేమంగా ఉన్నారన్నది".

అమీన్ అనుకున్నాడు- "అబు అల్-హసన్ తెలివిగా బస్రాకు వెళ్లి తల కాపాడుకున్నాడు. నా పరిస్థితి మొదటిరోజునే చివరి రోజుకు చేరుకున్నది. విధి వ్రాత అంటే ఇదేనేమో!"

అమీన్ అక్కడనుండి తన ఇంటికి వెళ్తుండగా ఎవరో కొత్త వ్యక్తి అతడి చెవి దగ్గర అన్నాడు– "నీ దురదృష్టం తొలగాలంటే నేను చెప్పేది జాగ్రత్తగా విను. నాతోపాటు మారు మాటాడకుండా రా!"

ఇద్దరూ కలిసి టైగ్రిస్ నదీ తీరానికి చేరుకున్నారు. అక్కడ పడవ ఎక్కి ఆవలి గట్టుకు చేరుకున్నాక అటువేపు నగరంలో సందుగొందుల్లో నడుస్తూ, ఆ తరువాత ఓ సొరంగ మార్గంలో మోకాళ్లు, మోచేతులపై నడుస్తూ చివరకు ఓ ఇంటిలోకి చేరుకున్నారు. అక్కడ దివిటీ వెలిగించిన గదిలో ఓ పదిమంది సాయుధులు ఒకేరూపం అచ్చుగుద్దినట్లున్న వాళ్లు కూర్చుని మాట్లాడుకుంటున్నారు లోగొంతులతో. అక్కడకు చేరుకోగానే అమీన్ అలసటతో నేలపై పడి స్పృహ తప్పగా, అతడితో వచ్చినవాడు కాసిని నీళ్లు చల్లి అమీన్ తెప్పరిల్లినాక అతడికి కాస్త భోజనం పెట్టి, వాళ్లు కూడా తిన్నారు.

అమీన్ అన్నాడు– "మిత్రులారా! మీరెవరో నాకు తెలియదు. కాని నా అతిథుల్ని మీరే బంధించి తెచ్చారా, వారికి ఆతిథ్యమిచ్చిన వ్యక్తిగా నాకు తెలియక పోవడం వలన నా గుండె దడదడలాడుతున్నది. అల్లాపై ఆనతో నేను నా గృహంలో కాపాడుకుంటానని మాట ఇచ్చి దానిని నెరవేర్చలేకపోయాను. నన్ను క్షమించి నా మిత్రులెక్కడున్నారో తెలియజేయగలరు".

పదకొండుమంది ఒక్కుమ్మడిగా ఓ గదివేపు వేలు చూపించారు– "నీ మిత్రులు క్షేమమే! కాని వారెవరో మాకు తెలియలేదు. వారి స్థాయిని బట్టి మేము వారిని విడిపించుకునే వెల నిర్ణయిస్తాము. వారు ఉన్నత వంశస్థులుగా కనిపిస్తున్నారు. అందుకే నిన్నిక్కడికి రప్పించాము".

అమీన్ అన్నాడు– "ఈ ప్రపంచంలో మృగ్యమైన గౌరవం, పరువు ప్రతిష్ఠ, హుందాతనం, వినయం, కరుణ ఈ ఇంటిలో పుష్కలంగా ఉన్నాయి" అని అమీన్ ఆ యువతీయువకుల ప్రేమగాథను, ఆమె సహచరి గురించి సవిస్తరంగా తెలిపాడు.

వాళ్లన్నారు– "ఇది మా అదృష్టం. మా ఇల్లు ప్రఖ్యాతిగాంచిన షామ్స్ అల్–నహర్, ఆలి ఇబిన్–బకర్‌లకు విడిది గృహం కావడం" అని వాళ్లు తలుపు తెరిచి అమీన్‌తో సహా లోనికి వెళ్లి అతిథులకు క్షమాపణలు చెప్పినారు.

అమీన్‌తో అన్నారు– "నీ ఇంటినుంచి దోచుకున్న వాటిలో అమ్మగా మిగిలినవన్నీ నీ ఇంటికి చేరుస్తాము. ఓ నగల వర్తకుడి ఇంటిలో రాకుమారుడు, షామ్స్ అల్–నహర్ లాంటి ఉన్నత స్త్రీ ఉంటుందని మేం ఊహించలేదు".

అలా క్షమాపణలు వేడుకుని వాళ్లు అమీన్, ఆలి ఇబిన్–బకర్, షామ్స్ అల్–నహర్, ఆమె చెలికత్తెలను సగౌరవంగా వేరే దారులగుండా టైగ్రిస్ నదీ తీరానికి తీసుకువచ్చి అక్కడ నౌకల దగ్గర వదిలి మాయమయ్యారు. పడవనెక్కి వాళ్లు నలుగురూ ఆవల ఒడ్డుకు చేరుకోగానే వారిని సైనికులు చుట్టుముట్టినారు.

పెనం నుంచి పొయ్యిలోకి పడిన చందమై వాళ్లు కళవళ పడుతుండగా సైన్యాధిపతి వారిని తీవ్ర స్వరంతో అడిగాడు– "ఎవరు మీరు? ఎక్కడి నుంచి వస్తున్నారు? నిజం చెప్పకపోతే మీ కాళ్లూ చేతులూ కట్టి నగర వీధుల్లో నడిపిస్తాను".

షామ్స్ అల్–నహర్ ఇక సహించలేకపోయింది. సైన్యాధిపతిని తన వద్దకు రమ్మని పిల్చి అతడి చెవిలో ఓ మాట చెప్పగానే అతడు గజగజ వణుకుతూ వినమ్రుడై క్షమాపణలు వేడుకున్నాడు.

రెండు పడవలు తెప్పించి ఒకదానిలో అమీన్, ఆలి ఇబిన్–బకర్‌లు, రెండవ దానిలో షామ్స్ అల్–నహర్, ఆమె చెలికత్తెను ఉంచి వారివారి స్థానాలకు సగౌరవంగా పంపినాడు.

ఆలి ఇబిన్–బకర్‌కు భవిష్యత్తు అంధకారంగా కానవచ్చింది. ఇక షామ్స్ అల్–నహర్‌ను కలవలేడన్న నిజం అతడిని పూర్తిగా శక్తిహీనుడిని చేయగా అతడు శయ్యపై స్పృహతప్పినాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## ✻ 165వ రాత్రి కథ ✻

***షహర్జాది కథ చెప్పసాగింది-***

అమీన్ చెబుతున్నాడు– "నేను నా ఇంటికి వచ్చి గాఢంగా నిద్రపోయాను.

రెండు రోజులు గడిచాయి. అలసట తగ్గినాక నేను స్నాన గృహానికి వెళ్లి కాస్త స్థిమిత పడి నెమ్మదిగా నా నగల దుకాణానికి వెళ్లి తలుపు తీయబోతున్నంతలో నా భుజంపై ఓ సుకుమార హస్తస్పర్శ తగిలింది. ఉలిక్కిపడి వెనక్కి చూడగా నా పక్కనే షామ్స్ అల్–నహర్ చెలికత్తె.

ఆమెను చూడగానే ఆనందంతో పాటు భయం వేసింది. బాగ్దాద్ సుల్తాన్‌కు అత్యంత ఇష్టురాలైన యువతి ప్రేమ వ్యవహారంలో తలదూర్చి నిండా మునిగి పోయాను నేను.

దుకాణానికి మరల తాళం వేసి ఒక్కమాట మాట్లాడకుండా ఆమెను అనుసరించి నగర శివార్లలోని పురాతన మసీదుకు చేరుకున్నాను. నన్ను ఈ గండం నుంచి బయట పడవేయమని దైవాన్ని ప్రార్థిస్తూ కాసేపు ధ్యానంలో కాలం గడిపాను నేను. మరెప్పుడూ ఇలాంటి ప్రేమ విషయాలలో తలదూర్చబోనని ప్రమాణం చేసాను.

***ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

# ✳ 166వ రాత్రి కథ ✳

**షహర్జాది కథ చెప్పసాగింది-**

అమీన్‌తో ఆ యువతి అన్నది- "నేను నానా అవస్థలు పడి అంతఃపురం నుంచి నీ దగ్గరకు వచ్చాను. తొలిప్రేమ ఇంత గాఢంగా ఉంటుందా అనేది నాకు నా యజమానురాలి విషయంలో అనుభవానికి వచ్చింది. ఎవరు ఎందుకు ఎలా ఎప్పుడు ప్రేమలో పడతారో, ఆ ప్రేమకై తమను తాము ఆపదలలోకి ఎలా నెట్టుకుంటారో చూస్తుంటే నా గుండె దడదడ లాడుతుంది. బాగ్దాద్ నగరం ప్రభువుకు అత్యంత ఇష్టురాలైన యువతి బంగరు పంజరాన్నుంచి బయట పడాలనుకున్న కోరిక రోజురోజుకూ అధికంగా కాగా ప్రేమ లభించే కొద్ది క్షణాల కోసం ఆమె తన జీవితాన్ని పణంగా పెడుతున్నది.

ఇవిగో అయిదువేల బంగారు నాణేలు. తన వలన నీకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ఆమె ఇవ్వమని నిర్దేశించిన సొమ్ము ఇది. ఇది ఇచ్చి యువరాజు ఆలి ఇబిన్-బకర్ కుశల సమాచారాలు కనుక్కొని వెళ్లాలి నేను".

ఆమెను మరల సాయం సమయానికి రమ్మని చెప్పి ఆమె వెళ్లిపోయాక ఇంటికి వెళ్లి బంగరు నాణేల సంచిని భద్రంగా దాచి ఆలి ఇబిన్-బకర్ ఇంటికి వెళ్లాడు అమీన్.

అమీన్ వెళ్లేసరికే ఆ మూడు రోజుల్లోనే సగం చిక్కి నీరసించి ఉన్న ఆలి ఇబిన్–బకర్ కనులలో మరల కాంతిరేఖలు కదలాడసాగినాయి.

**తెల్లవారుజాము సూచన కానరావడంతో షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## ✳ 167వ రాత్రి కథ ✳

**షహర్జాది కథ చెప్పసాగింది-**

అమీన్‌ను చూడగానే యువరాజు ఆలి ఇబిన్–బకర్ కళ్లు కాంతివంతంగా మెరిసాయి. ఎంతో ప్రయత్నంతో అతడు మాట్లాడినాడు– "మిత్రమా! నీ సహాయాన్ని నేనెన్నడూ మరవలేను. ఏనాడూ లేని దుర్బలత్వం ఈనాడు నా శరీరంలో ప్రవేశించింది. ఇక షామ్స్ అల్–నహర్‌ను కలవలేనన్న సత్యం నన్ను మానసికంగా క్రుంగదీసింది. ఈ రహస్యం బయటపడితే ఆమె ప్రాణాలకు ముప్పు కలుగుతుందన్న భయం నన్ను మరింత బాధపెడ్తున్నది. ఈ ప్రేమజాడ్యం బహు విచిత్రమైనది. క్షణమాత్ర సమావేశంలో కలిగిన ప్రేమ జన్మజన్మల బంధమంత గాఢంగా మమ్మల్ని బంధిస్తుందని తొలుత గ్రహించలేకపోయాను. ఆమెను చూసిన మరుక్షణం నుంచి అనేక సంఘటనలు ఊహించని విధంగా వచ్చి మా జీవితాల్ని అతలాకుతలం చేసాయి. మాతోపాటు మీరూ ఇబ్బందులు పడినారు. దైవం మీకు శుభముల నిచ్చును గాక!"

అతడు కనుసైగ చేయగానే అతడి సేవకులు అమీన్ ముందు అత్యంత విలువైన మణిమాణిక్యాది రత్నరాశులున్న సంచుల నుంచినారు. వాటిని అమీన్ ఇంటికి తన సేవకులతో పంపి ఆలి ఇబిన్–బకర్ అన్నాడు– "ప్రేమ మార్గాన్ని ఎన్నుకున్న నాబోటివాళ్లకు వెనుతిరిగే అవకాశం లేదు. నా మనోహరి రాజాగ్రహానికి గురై కష్టాలు పడడం చూడలేని కనులు నావి. వేదనా సముద్రంలో నా హృదయం పూర్తిగా మునిగి ఉన్నది. ప్రవక్త (దేవుని కరుణ అతడిపై అనంతంగా ప్రవహించును గాక) విధించిన నియమాల వల్ల నేను ఆత్మహత్యకు ప్రయత్నించలేదు. నాకు మిగిలిన దారి షామ్స్ అల్–నహర్ జ్ఞాపకాలలో నా జీవితపు ముగింపును చూడడం".

అమీన్ అన్నాడు– "యువరాజా! దిగులు చెందకు. నీ క్షేమ సమాచారములను తెలుసుకోవడానికి షామ్స్ అల్–నహర్ తన ఇష్టసఖిని నా వద్దకు పంపింది. ఈ

సాయంకాలం నన్ను కలవమని చెప్పి నేను తమ వద్దకు వచ్చాను" అని కాసిని అనునయ వాక్యాలు చెప్పి అమీన్ తన ఇంటికి వచ్చాడు.

అప్పటికే షామ్స్ అల్-నహర్ చెలికత్తె అతడి గురించి వేచి ఉన్నది. ఆమె కన్నీరు మున్నీరై కన్నీటి తెరల మధ్య వెక్కివెక్కి ఏడుస్తూ చెప్పింది- "మనం భయపడినంతా అయ్యింది. అంతఃపుర కావలివారు మా రాకపోకలపై నిఘా ఉంచి, తమ అనుమానాన్ని కాపలాభటుల అధికారికి తెలిపారు. అతడు అంతఃపుర సేవికలను ప్రశ్నించి ఖలీఫాకు ఈ విషయాన్ని తెలియబరచినాడు. ఖలీఫా వెంటనే ఇరవై మంది సాయుధ సైనికులను పంపి షామ్స్ అల్-నహర్‌ను తన వద్దకు పిలిపించినాడు. ఈ విషయాన్ని నీకు వివరించి హెచ్చరించడానికి నేను నానా కష్టాలు పడి వచ్చాను" అని చెప్పి మరుక్షణంలో అదృశ్యమయ్యింది.

అల్లాను ప్రార్థించి అమీన్ శరవేగంతో ఆలి ఇబిన్-బకర్ ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని చెప్పి మూడు ఒంటెలనిండా విలువైన వస్తువులను, ధన ధాన్యాదులను నింపి, తన ఇంటి నుంచి కావాల్సిన ధనాన్ని, సంపదలను తీసుకుని ఎడారిని దాటి బాగ్దాద్ నగరానికి దూరంగా వెళ్లిపోవడానికి సర్వ సన్నాహాలు చేసాడు.

**ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# * 168వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

విధి బలీయం. భూమ్యాకాశాలను తలకిందులు చేయవచ్చునేమో కాని విధి వ్రాతను మార్చలేము.

అమీన్, ఆలి ఇబిన్-బకర్‌లు ఒంటెలపై ఎడారిలో ప్రయాణం చేస్తూ ఓ ఒయాసిస్సు వద్దకు చేరుకున్నారు. ఇంతలో ఓ బందిపోటు దొంగల ముఠా వాళ్లను ఎదుర్కొని సంపదలన్నీ దోచుకుని వాళ్లను ప్రాణాలతో వదిలి పారిపోయారు.

అమీన్ ఎంతో కష్టం మీద ఆలీ ఇబిన్-బకర్‌ను అక్కడ ఉన్న మసీదు వద్దకు చేర్చినాడు. అక్కడ దయామయుడైన ఓ వృద్ధుడు వారిని చూసి జాలిపడి వారికి మసీదులో ఆశ్రయమిచ్చి అన్నపానాదుల నొసగినాడు.

ఆలీ ఇబిన్–బకర్‌కు మగత నిద్రలో ఆ ఖర్జూర వృక్షాల మధ్య నుండి ఓ సంచార గాయని పాడుతున్న పాట వినరాసాగింది.

*"యవ్వనం కరిగిపోతున్నదని ఏనాడూ*
*కన్నీరు కార్చలేదు నేను.*
*ప్రణయ ధనం తరిగిపోతున్నదని తెలిసాక*
*కన్నీటిని ఆపలేదు నేను.*
*మృత్యువు తరుముకు వస్తున్నదని ఏనాడూ*
*మనసును ఓదార్చలేదు*
*జీవన ఇంధనం తరిగిపోతున్నదని తెలిసాక*
*మనసును ఆపలేదు నేను*
*విరహం ఇంత వేదన నిస్తుందని ఏనాడూ*
*ప్రేమ దారిని వీడలేదు*
*ప్రేమధనం ఉన్నా ఆయుష్షు లేదని తెలిసాక*
*మృత్యు ప్రేమను ఆపలేదు నేను"*

అతడు పాడుతున్నాడా, ఆమె పాడుతున్నదా ఆ పాట అనుకుని ఆలీ ఇబిన్–బకర్ వేపు వెళ్లాడు అమీన్. అప్పటికే అతడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## ✻ 169వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఆలి ఇబిన్–బకర్ పార్థివ దేహాన్ని మసీదు దగ్గర ఉన్న వృద్ధుడి సంరక్షణలో ఉంచి అమీన్ వడివడిగా బాగ్దాద్ చేరుకుని యువరాజు ఆలి ఇబిన్–బకర్ గృహానికి వెళ్లి అతడి మరణవార్తను నెమ్మదిగా యువరాజు మాతృమూర్తికి తెలియపరచినాడు. మొదలు నరికిన చెట్టువలె ఆమె నేలకూలి నెమ్మదిగా తేరుకున్నది.

"నాయనా! నా కుమారుడు నాకేమైనా ఆఖరి సందేశాన్ని పంపినాడా?" అడిగిందామె కన్నీటి తెరల మధ్య.

"తన పార్థివ దేహానికి ఈ నగరంలోనే అంత్యక్రియలు గావించమన్నాడు" అని అమీన్ పలుకగా ఆమె తగు ఏర్పాట్లు చేసింది. చిరుప్రాయంలోనే ప్రేమకోసం ప్రాణాలు విడిచిన ఆలీ ఇబిన్–బకర్‌ను తలుచుకుంటూ అమీన్ తన ఇంటికి చేరుకున్నాడు.

అక్కడ మరల కనిపించింది షామ్స్ అల్–నహర్ ఇష్టసఖి. ఆమెను చూడగానే మరల ఏ విపత్తు ముంచుకు వచ్చిందోనని ఆపాదమస్తకం వణికి పోయాడు అమీన్.

ఇంటిలోపలికి వెళ్లాక ఆమె అన్నది నెమ్మదిగా– "యువరాజు ఆలి ఇబిన్–బకర్ మరణవార్త నాకు తెలిసింది. నేను ఆ ఇంటి దగ్గర్నుంచే నిన్ను అనుసరించి వచ్చాను".

అమీన్ అడిగాడు– "ఈ వార్త తెలిసి షామ్స్ అల్–నహర్ ఎలా స్పందిస్తుందో! ఖలీఫా ఆమెను దండించాడా? ఆమె ప్రాణాలతో ఉన్నదా?" అని అడిగాడు భయం ముప్పిరిగొనగా.

ఆమె జవాబిచ్చింది– "నీవనుకున్నట్లు ఆమె ఖలీఫా దండనతో మరణించలేదు. ఆ రోజున ఇరవైమంది సాయుధులు షామ్స్ అల్–నహర్‌ను వెంటబెట్టుకుని ఖలీఫా ముందుకు తీసుకువచ్చారు. ఆమెకు తోడుగా నేనొక్కదానినే ఉన్నాను.

ఖలీఫా సైనికులనందరిని పంపివేసి షామ్స్ అల్–నహర్‌తో అన్నాడు– "నీమీద అనేక అభియోగాలను నీపై అసూయచెందిన వాళ్లు మోపినారు. నేను వాటిని నమ్మలేదు. అంతఃపురంలో ఇవన్నీ మామూలే. నేను నీ బానిసల సంఖ్య ఎక్కువ చేసి, నీ నెల భత్యాన్ని రెండింతలు చేస్తున్నాను. భయం వదిలి హాయిగా మునుపటి షామ్స్ అల్–నహర్‌లా ఆనందంగా, హాయిగా జీవితాన్ననుభవించు. నీకోసం నేనిక్కడ చిన్నపాటి వేడుకను సిద్ధం చేసాను. ఇవికాక ఇంకేమైనా కోరికలుంటే చెప్పు. వెంటనే నెరవేరుస్తాను".

షామ్స్ అల్–నహర్ వదనం కృతజ్ఞతాభావంతో వెలిగి కాంతులీనింది. ఆమె ఖలీఫా పాదాలపైబడి కన్నీళ్లతో అతడి పాదాలను కడిగింది. దయార్ద్ర హృదయుడైన ఖలీఫా ఆమెను లేవనెత్తి ఉచితాసనాన కూర్చోబెట్టాడు. వైణికులు, గాయనీమణులు గానం చేయసాగినారు. మరల అంతఃపురం సందడిగా మారింది.

***కన్నీటిలో ఏదో మహాత్మ్యమున్నది***
***రహస్యాలను దాస్తుంది, విడమరుస్తుందది.***
***మున్నీటిలో ఏదో రహస్యమున్నది.***
***ప్రేమ మహాత్మ్యాన్ని లోతును విడమరుస్తుందది***
***కన్నీరు మున్నీరైనపుడు ఏదో అద్భుతం జరుగుతుంది***
***ప్రేమ, కరుణలలోని రహస్యం విడమరుస్తుందది.***

ఆ పాటలో తానూ స్వరం కలిపి పాడింది అత్యంత మధురంగా షామ్స్ అల్-నహర్ ప్రభువు పాదాలవేపు చూస్తూ. తన కోరికగా తన ఇష్టసఖినైన నాకు బానిసత్వం నుంచి విముక్తినిమ్మని అడిగింది. ఖలీఫా నాకు స్వేచ్ఛను ప్రసాదించాడు.

***"ఈ లోకమనే పంజరంలోని చిలుకకు స్వేచ్ఛ కావాలి***
***ఈ దేహమనే పంజరంలోని చిలుకకూ స్వేచ్ఛ కావాలి***
***ప్రభూ, ఈ చిలుక దేహాన్నీ, లోకాన్నీ వీడుతున్నది***
***ఈ చిలుకకు స్వర్గమనే పంజరంలోకి వెళ్లే స్వేచ్ఛ కావాలి"***

అంటూ షామ్స్ అల్-నహర్ ప్రభువు పాదాలపై తూలిపడి అచేతనురాలయ్యింది. నేనూ, ప్రభువు ఆమె ముఖంపై నీళ్లు జల్లి ఆమెకు స్పృహ తెప్పించే ప్రయత్నం చేసాము.

ఖలీఫా దుఃఖానికి అంతులేదు. వీణలను విరగగొట్టినాడు. భక్ష్యాల పళ్లేలను చిందరవందర చేసినాడు. షామ్స్ అల్-నహర్‌ను తన చేతుల్లోకి తీసుకుని స్వయంగా శయ్యపై పరుండబెట్టినాడు. ఆ రాత్రంతా ఆమె పక్కనే కన్నీరు కారుస్తూ కూర్చున్నాడు.

వజీర్లను రావించి ఆమెకు రాణులకు మించిన అంత్యక్రియలు చేయించినాడు. తరువాత తన భవనానికి వెళ్లి, ఎవరినీ కలిసేందుకు ఇష్టపడలేదు".

అమీన్ అన్నాడు- "ఇరువురు ప్రేమికులు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోతూ మనల నిరువురినీ కలిపినారు".

ఆ విధంగా షామ్స్ అల్-నహర్ నెచ్చెలి, ఆలి ఇబిన్-బకర్ స్నేహితుడు అమీన్ భార్య అయ్యింది. ఇరువురూ ఆ అమర ప్రేమికుల సమాధులను సందర్శిస్తూ వారి ప్రేమగాధను మననం చేసుకుంటూ తమ జీవితాలను ఆదర్శప్రాయంగా గడిపారు.

**ఇది ఖలీఫా హరూన్ అల్-రషీద్‌కు ఎంతో ప్రియమైన సేవిక, ప్రణయిని షామ్స్ అల్-నహర్ ప్రేమగాథ" అన్నది షహర్జాది.**

**"ప్రభువు సెలవిస్తే నేను మరో అద్భుత కథ చంద్రికలకే చంద్రిక బుదుర్ యువరాణి- కమర్ అల్-జమాన్‌ల కథ చెబుతాను-**

# III. బుదుర్ యువరాణి - కమర్ అల్-జమాన్ కథ

ఖలిదాన్ ప్రభువైన షారిమాన్‌కు నలుగురు భార్యలు, డెబ్భైమంది ఉప భార్యలున్నా సంతాన లేమితో బాధపడుతున్నాడు. వృద్ధాప్యం పైబడుతున్నా దైవం అతడిని కరుణించలేదు.

అతడొక రోజున తన మహామంత్రి వజీర్‌ను పిలిచి ఏదన్నా ఉపాయం వెదకమని ఆదేశించినాడు.

వజీర్ అన్నాడు- "దైవేచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది. అయినా మానవ ప్రయత్నం మానరాదు. రేపటిరోజు మంచిరోజు. స్నానగృహానికి వెళ్ళి శుభ్రపడి, సాయంకాలం దైవ ప్రార్థన చేసి తమ కత్యంత ఇష్టమైన రాణితో రేపటి రాత్రి గడపండి. దైవం తప్పక తమను కరుణిస్తాడు".

దైవం కరుణించాడు. రాణి గర్భవతి అయ్యింది. ఆ వార్తతో ప్రభువు ఆమందానంతభరితుడైనాడు. అలా జన్మించి తల్లిదండ్రులకు ఆనందాన్ని చేకూర్చిన బాలుడికి కమర్ అల్-జమాన్ - శుభకాల చంద్రుడు అని పేరు పెట్టారు.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 170వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

లేకలేక కలిగిన తన కుమారుడికి కమర్ అల్-జమాన్ అని పేరుబెట్టినాడు ప్రభువు. శుక్లపక్ష చంద్రుడిలా దినదిన ప్రవర్ధమానమై పెరిగినాడు యువరాజు. అందమైన తోటలోని అద్భుత పుష్ప సౌకుమార్యమంతా అతడిలో కానవచ్చేది. పదిహేనేళ్లు వచ్చేసరికి పదిహేను కళల చంద్రుడిలా ప్రకాశించాడతడు. అతడి దృక్కులు హారుత్-మారుత్ దేవదూతల మంత్రశక్తులను, అతడి నేత్రాలు విగ్రహాల

విశాల నేత్రాల్లా, అతడి బుగ్గలు వసంతకాలపు బంతులు, గులాబీల్లా, అతడి నడుము వెదురులా సన్నగా వయ్యారంగా, పట్టుదారంలా మృదువుగా, అతడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కదిలే సైకత పర్వతాల్లా, అతడి స్వరం బుల్‌బుల్ పిట్టల గానంలా ఉండి అందరిని సమ్మోహితులను చేసేవి.

అతడి విశాల వక్షస్థలాన్ని మోయలేక అతడి సింహపు నడుము వంగినట్లు కనిపించగా, అతడి పిరుదుల కదలిక సింహ గజమరాళముల నడకను మరిపించేది.

అతడి చెక్కిళ్లు పగడద్వీపాల్లా, గులాబీల తోటలా, సాయంకాలపు చల్లని గాలుల్లా ప్రకాశించేవి. ఎందరో కవులు అతడిని పొగిడి వ్రాసినారు కవితలు.

***అతడి చెక్కిలిపై లిఖించింది గులాబి***
***'నీవు మావాడివి'***
***అవునవునని వంతపాడారు జనులు***

***అతడి నుదుట తేలుకొండిలా ముంగురులు అన్నాయి***
***'మా విషంతో నిన్ను మూర్ఛిల్లచేస్తాము'***
***అవునవునని వంత పాడారు జనులు.***

***అతడిని మరో చంద్రుడిగా నింగిపై ఉంచాడు దైవం***
***'ఇతడు మీకు వెన్నెలలనిస్తాడు'***
***అవునవునని వంత పాడారు జనులు.***

యుక్తవయస్కుడైన తన కుమారుడికి వివాహ ప్రయత్నాలు చేయసాగినాడు ప్రభువు. అతడి వజీరు అన్నాడు– "వివాహం మనిషిలోని దోషాలను తగ్గిస్తుంది. ప్రభూ, తమ ఆలోచన అత్యుత్తమమైనది".

***తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

## ✳ 171వ రాత్రి కథ ✳

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ప్రభువు తన కుమారుడైన కమర్ అల్–జమాన్‌ను పిలిచి తన అభిప్రాయాన్ని తెలియబరచినాడు. అందచందాల ఆ యువకుడు వినయంగా తండ్రికి నమస్కరించి అన్నాడు–

"తండ్రీ, ప్రస్తుతం నా మనసు వివాహంపై లగ్నం చేయబడలేదు. నాకెందుకో స్త్రీలపైన, వారి యుక్తులపైన దురభిప్రాయమున్నది. అది సరైనది కాదని నాకనిపించినపుడు నేనే స్వయంగా తమకు అంగీకారాన్ని తెలుపగలవాడను. ఎవరైనా యువతి నా వద్దకు రాగానే నాలో ఏదో వికర్షణ, భయం ఏర్పడుతున్నది.

*శిలాలోహ నిర్మిత దుర్గాలను కూల్చినదెవరు?*
*ఫిరంగులు కాదు ఇంతి క్రీగంటి చూపులు*
*నల్లని చీకటి సముద్రంలో వీరులను బంధించినదెవరు*
*సరంగులు కాదు రమణుల శిరోజాల తళుకులు*
*మహావీరులనే మరులు కురిపించి మట్టి కరిపించినదెవరు?*
*మత్తెక్కే మాటలతో మైకం కలిగించు మదనికలు*
*తన శరీరమనే రంగస్థలాన నాటకమాడే దెవరు*
*పాత్రలో లీనమయ్యేట్లు నటన చేసే పడతులు*
*రాత్రి కుటీరాన్ని బందిఖానాగా మార్చేదెవరు*
*రాజునైనా బంధించి రాజిల్లే రమణులు*

అందుకని తండ్రీ, నీకు మనస్తాపం కలుగుతున్నా చెప్పక తప్పడం లేదు. నన్ను బలవంతం చేస్తే ఆత్మహత్యకన్నా వేరే మార్గం లేదు.

ప్రభువు కాస్త చింతాక్రాంతుడైనా తన కుమారుడి మాటలలోని భావాన్ని అర్థం చేసుకున్నాడు– "కుమారా! నీ ఇచ్ఛకు వ్యతిరేకంగా నేనేమీ చేయబోను. ఇంకా నీవు పసివాడివి. కాలంతో పాటు నీ ఆలోచనలోనూ మార్పు రావచ్చు. ఒక తండ్రిగా పిల్లా, పాపలతో నీవు సుఖించాలని కోరుకుంటాను నేను" అన్నాడు ప్రభువు.

ఏడాది పాటు వివాహపు ప్రసక్తిని తేలేదెవ్వరూ. ఏడాది గడచినాక ప్రభువు ఆ ప్రస్తావన తేగా మరల యువరాజు అన్నాడు– "తండ్రీ, ఈ సంవత్సర కాలంలో నాకు స్త్రీలపై మరింత వైముఖ్యం పెరిగింది. వారి నీడ కూడా నాపై పడేందుకు నేను ఇష్టపడను. ఈ విషయం తప్ప తమరు, ఏది మాట్లాడినా సావధానుడనై వింటాను".

వజీరు సలహాతో ప్రభువు మరొక్క ఏడాది కుమారుడితో పెండ్లి విషయం మాట్లాడలేదు. వజీరు అన్నాడు– "మరో సంవత్సరం గడిచింది. మనం మన

సమస్త సామంతులను, ఉన్నత వంశీకులను, కుటుంబ సభ్యులను, అధికారులను సమావేశపరచి అందరి ముందు యువరాజును రావించి వివాహ ప్రస్తావన తెద్దాం. వినయగుణ సంపన్నుడైన యువరాజు తప్పక అంగీకరిస్తాడు" అన్నాడు వజీరు.

రహస్య సమావేశానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 172వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

వజీరు సలహాతో ప్రభువు సభను కట్టుదిట్టంగా ఏర్పాటు చేసి కుమారుడిని పిలిపించినాడు. తారల మధ్య చంద్రుడిలా అతడు నడుస్తుంటే సభాసదులు హర్షధ్వానాలు చేసినారు. తన తండ్రి ముందు ఉన్న నేలను ముమ్మారు ముద్దాడి వినయంగా నిలబడినాడు కమర్ అల్-జమాన్.

ప్రభువు అన్నాడు- "కుమారా! నీకు నీ వివాహ విషయం చెప్పి మరో ఏడాది గడిచింది. యువరాజుగా నీకున్న బాధ్యతలలో ముఖ్యమైనది వంశపు కొనసాగింపు. రాజు లేని రాజ్యం అరాచకమై శత్రువుల దాడికి అవకాశాన్నిస్తుంది. సభాసదులందరూ నీ వివాహ సందర్భానికై వేచి చూస్తున్నారు".

తండ్రి మాటలు వినగానే యువరాజు దిగ్భ్రాంతికి గురైనాడు. అతడిలో ఏదో ఉన్మత్తత ప్రవేశించిందో, లేక చెడుభూతం ఆవహించిందో తెలీదు కాని అతడు తన తండ్రిని తీవ్రంగా దూషించేసరికి సభికులందరు తలలు వంచి నిశ్శబ్దంగా ఉండిపోయారు. ప్రభువు తెప్పరిల్లి అన్నాడు- "నీవు నీ పరిధిని అతిక్రమించావు. నీలాంటి మూర్ఖులను, అవిధేయులను రాజసభ క్షమించదు. భటులారా, ఈ ధూర్తుడి కాళ్లు చేతులు కట్టిపడేసి మన శిధిల దుర్గంలో ఖైదీగా పడవేయండి. చుట్టూ కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటు చేయాలి. ఇది నా ఆజ్ఞ!" అన్నాడు తీవ్రంగా.

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా. యువరాజును బంధించి చెరసాలలో పడేసాక అతడు ఆలోచించాడు- "తండ్రిని, కుటుంబ సభ్యులను, సభాసదులను వ్యతిరేకించి నేను పొందిన ప్రయోజనమేమున్నది. స్వేచ్ఛ కోసం పరితపించే నాకు చెరసాల నివాసమైనది కదా! అయినా మరల ఋజువైనది కాదా స్త్రీలు, వివాహం మగవాడి పతనానికి కారణమని".

అక్కడ ప్రభువు కూడా అదే పరిస్థితిలో ఉన్నాడు. ఆగ్రహముపశమించాక అతడు తనకు సలహా ఇచ్చిన వజీరును పిలిచి– "ఈ విపత్కర పరిస్థితికి కారణం నీవు. దీనిని సరిదిద్దే భారం కూడా నీదే!" అన్నాడు.

వజీరు అన్నాడు– "పదిహేను రోజులు ఒంటరి కారాగార వాసం చేసాక అడవి గుర్రం మచ్చికైనట్లు యువరాజు కూడా అత్యంత విధేయుడైన కుమారుడిగా మారతాడు. నా మాట విశ్వసించండి"

ప్రభువుకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. తన పక్కనే హాయిగా నిద్రపోయే కుమారుడు శిథిల దుర్గంలో ఖైదీగా ఉండగా ఏ తండ్రికైనా ఎలా నిద్ర పడుతుంది?

శిథిల దుర్గంలో యువరాజుకు అన్ని సౌఖ్యాలూ ఉన్నాయి స్వేచ్ఛ తప్ప. దైవప్రార్థన చేసి యువరాజు తన మంచంపై మగతగా నిద్రించాడు. తన తండ్రిని దూషించినందుకు పశ్చాత్తాపపడుతూ.

ఆ శిథిల దుర్గం జిన్ను పిశాచాల నిలయమని ఎవరికి తెలుసు?

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## ✻ 173, 174, 175వ రాత్రి కథలు ✻

***షహర్జాది కథ చెప్పసాగింది-***

ఈ మూడు రాత్రులూ నేను కొద్దికొద్ది విషయాలనే ముచ్చటిస్తాను సమయాభావం వలన. ఈ జిన్ను పిశాచాలు నేలలో గాలిలో నివసిస్తాయి. కొన్ని స్వతహాగా మంచివి. కొన్ని మానవులకు, ఇతర జంతువులకు అపకారం చేస్తాయి.

మనుషుల్లా వీటిలో కొన్ని దైవాన్ని నమ్మేవి, కొన్ని దైవాన్ని విశ్వసించని కాఫిర్లుంటాయి. ఇవి బహురూపులు. తేళ్లు, బల్లులు, సరీసృపాలుగా రూపు మార్చుకోగలవు. జంతు, పక్షి, జలచర రూపాలు వీటికి సాధ్యం. ఎవరిపైనన్నా వ్యామోహమో, కోపమో కలిగితే వారిని ఆవేశించి తమ అదుపులోకి తీసుకుంటాయి.

మంత్రగాళ్లు, మంత్రగత్తెలు కొందరు జిన్ను భూతాలను అదుపులోకి తీసుకుని శత్రువులపై ప్రయోగిస్తారు. దేవుని రక్షరేకు ఉన్నవారికి జిన్ను పిశాచాలు అపాయం కలిగించలేవు.

జిన్ను - జిన్ను అనే అరబిక్ పదానికి అర్థం- దాచు, దాగి ఉండు, ఇంద్రియాలతో గ్రహించలేనిది;

మజ్ను - ఆవహింపబడినవాడు, ఉన్మత్తుడు; జిన్నా- తోట, ఈడెను, స్వర్గం; జిన్నయా-గ్రామదేవతలు.

పవిత్ర గ్రంథం ఖురాన్‌లో 29 సార్లు జిన్ను పదము పేర్కొనబడింది. మహమ్మదు ప్రవక్త (అల్లా అనంత కరుణ అతడిపై ప్రసరించును గాక) ఈ లోకంలోకి జిన్నులకు, మనుష్యులకు సందేశకుడిగా దైవముచే పంపబడినాడు.

72వ సూరా అల్-జిన్ జిన్ను పిశాచాల గురించి తెలుపుతుంది.

జిన్నులను పూజించడాన్ని పవిత్ర గ్రంథం నిషేధించింది. వారిని దేవతల స్థాయి నుంచి దిగువకు దించి మానవులతో సమాన స్థానాన్ని ఇచ్చినది. వారి పాప పుణ్య కార్యాలకు వారే బాధ్యులు.

సొలొమాన్ ప్రభువుకు మనుషులు, చీమలు, పక్షులు, జిన్ను పిశాచాలపై అధికారము ఇవ్వబడినది. తొలి దేవాలయ నిర్మాణంలో జిన్ను భూతాలు సొలొమాన్‌కు సహకరించాయి.

జిన్ను భూతాలు తమ తరువాత పుట్టిన మానవజాతిని అల్పజాతిగా భావిస్తాయి. తమకున్న మానవాతీత శక్తులు తమను ఉన్నత స్థాయిలో ఉంచినట్లు భావిస్తాయి. అగ్ని సంభూతులమైన తమతో మట్టితో తయారు చేయబడిన మనిషి సమ ఉజ్జీ కాడనేది వారి విశ్వాసం.

ఒక భావన ప్రకారం జిన్నులు మూడు రకాలు- 1) గాలిలో ఎగిరేవి, 2) కుక్కలు, పాములుగా ఉండేవి, 3) మనుషుల్లా ఒకచోట నుంచి మరోచోటుకు పోయేవి.

మనుషులు కూడా మూడు రకాలు- 1) దేవుడి సందేశాన్ని గ్రహించక చతుష్పాద జంతువులా బతికేవాళ్లు, 2) దేవుని విశ్వాసులై దైవరక్షణలో జీవించేవారు, 3) మానవ దేహం ఉండి సైతాను ఆత్మ కలిగినవారు.

జిన్నులు 1) అదృశ్యరూపులుగా, అగ్ని, వాయువుల నుంచి సృజించ బడినవి, 2) మానవ ఇంద్రియాలకు కానరానివి- దేవతలు, దెయ్యాలు, మానవ అంతర్గత భాగాలు.

కొన్ని జిన్ను పిశాచాలు విషాగ్నుల నుంచి (సముమ్ అగ్నులు) జిన్నా-స్వర్గంలో సృజించబడినవి.

దేవదూతలు బుధవారం నాడు, జిన్నులు గురువారం నాడు, మనుషులు శుక్రవారం నాడు వెయ్యేళ్ల కాలవ్యవధిలో సృజించబడినారు. మంచి నడవడిక గల జిన్నులకు విముక్తి లభిస్తుంది. జిన్నులకు మానవస్త్రీలతో సంబంధాలు నిషేధించ బడినా అనేక కథలలో దారితప్పిన జిన్నులు మానవ స్త్రీలను బలవంతాన ఎత్తుకుపోయి వారితో జీవించడాన్ని వర్ణించబడినాయి. జిన్నులను వివాహం చేసుకున్న వారికి దేవుడిపై విశ్వాసం, భయం పోతాయని కొందరు విశ్వసిస్తారు.

జిన్నులు మానవులను ఆవహించడం ద్వారా, వారి శరీరంలో ప్రవేశించడం ద్వారా, వారి చెవుల్లో గుసగుసలాడడం ద్వారా మానవ ప్రవర్తనను ప్రభావితం చేస్తారు.

వస్వస్ అనేది జిన్నుల వశీకరణ శక్తి-మనసులో గుసగుసలాడి వశపరచుకునే శక్తి.

జిన్నులు, మానవులు తొలుత స్వచ్ఛత, అమాయకత్వంలో సృష్టింపబడినా దేశ కాలమాన పరిస్థితులలో వారి ఫిత్రా-సహజ ప్రవృత్తిలో మార్పు రావచ్చును.

జిన్నులు ఎప్పుడుపడితే అప్పుడు మానవ దేహంలో ప్రవేశించలేవు. అభద్రతా భావం, విషాద ప్రేమ, ఆందోళనల వలన ఆత్మ బలహీన పడినపుడు (ధయిఫా) జిన్నులు మనిషి శరీరంలో ప్రవేశిస్తాయి.

మంచి నడవడికగల జిన్ను పిశాచాలను జిన్-ఇస్లామ్‌గా, చెడు పిశాచాలను జిన్-కాఫిర్ అని పిలుస్తారు. జిన్నులు ఆడ మగ భూతాలుగా ప్రవర్తిస్తూ కాపురాలు చేస్తాయి, పిల్లల్ని కంటాయి.

***అని షహర్జాది జిన్నుల గురించి వివరించింది.***

# * 176వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

యువరాజు కమర్ అల్-జమాన్‌ను నిర్బంధించిన శిథిల దుర్గం అనాది రోమన్ల కాలంలో కట్టబడి ఇన్నేళ్లుగా పాడుబడి ఉన్నది. ఆ భవనం వెనకనున్న

తోటలోని పాడుబడ్డ బావిలో ఇబ్లిస్ వంశానికి చెందిన ఇఫ్రితా యువతి–మైమునా నివసిస్తున్నది. భూగర్భ జిన్నులకు ప్రభువైన దిమిర్యాతుడి కుమార్తె ఆమె. గుణశీలాల్లో పేరెన్నికగన్నది, దేవుని విశ్వాసులలో అత్యున్నత స్థానాన్ని పొందిన జిన్ను భూతమామె.

అర్ధరాత్రి ఆమె తన బావి నుంచి ఆకాశంలోకి ఎగిరి శిధిల దుర్గంపైన ఎగుర్తుండగా ఆమెకు ఎన్నడూ లేనిది కోటలోని ఓ గదిలో దీపం వెలుగుతూ ఉండడం చూసి ఆశ్చర్యపోయింది. ఉత్కంఠత ఎక్కువ కాగా ఆమె అక్కడ గాఢ నిద్రలో ఉన్న కాపలా భటులను దాటి కమర్ అల్–జమాన్ గదిలోకి ప్రవేశించింది అదృశ్యరూపాన. దుఃఖంతో దిగులు చెంది అలసిసొలసి నిద్రిస్తున్న ఆ రాకుమారుడి సౌందర్యాన్ని చూసి నిశ్చేష్టురాలై నేలపై దిగి కాలి మునివేళ్లపై నడుస్తూ అతడి మంచం దగ్గరకు చేరింది మానవకన్య రూపంలో.

*అతడి మూసి ఉన్న నేత్రాలు మీన ద్వయాన్ని గుర్తుతెచ్చేను*
*అతడి కెంపువర్ణ బుగ్గలు గులాబీ రేకల్ని చిన్నబుచ్చేను*
*నా హృదయం అరచింది పారవశ్యాన నేడు*
*అతడి దేహపు ఒంపుసొంపులలో నా ఒంటరితనాన్ని నిద్రపుచ్చేను*

మైమునా కృతజ్ఞతలు తెలుపుకున్నది దైవానికి– "ఇంత పరిపూర్ణ సౌందర్యాన్ని సృజించిన జగత్ప్రభువుకు వందనాలు. ఈ అందాల రాశిని ఈ శిధిల దుర్గంలో బంధించిన వారికి నా తెగడ్తలు. వారికి తెలియదా పాడుబడిన భవనాలలో జిన్నులు సంచరిస్తారని? ఇతడిని నా సంరక్షణలో ఉంచి సర్వదా కాపాడుకుంటాను".

అనుకుని ఆమె సుతారంగా ముందుకు వంగి రాకుమారుడి పెదాలపై, కనురెప్పలపై, చెక్కిళ్లపై ముద్దులాడి నిద్రలేవని అతడిపై మరల దుప్పటి కప్పి కిటికీ గుండా బయటకు ఎగిరి గాలిలో విహరిస్తూ ఆలోచించసాగింది.

అదే సమయంలో ఆమెకు మరో జిన్ను పిశాచపు భయంకర రెక్కల చప్పుడు వినవచ్చింది. అతడు షామ్ హురిష్ కుమారుడైన దహనాష్. సులేమాన్ ఇబిన్ దావూద్ ఆధిపత్యాన్ని అంగీకరించని తిరుగుబాటుదారుడు. శీఘ్ర గమనం కలిగిన గర్వపోతు, దుష్టభావనలు కలవాడు.

దహనాష్ పిశాచం రాకుమారుడికేదన్నా అపకారం తలపెడతాడన్న ఆలోచన రాగా వెంటనే ఇఫ్రితా మైమునా ఓ డేగలా దహనాష్‌పై దూకి మట్టికరిపించాలనుకుని సన్నద్ధం కాగా ఆమెను గమనించి ఆ పిశాచి అన్నాడు– "ఓ మైమునా, పిశాచ ప్రభువు కుమారితా! సులేమాన్ చక్రవర్తి పవిత్ర ముద్రికపై ఆన! నేనెవరికీ అపకారం చేయబోను. నన్ను నమ్ము. నీ ఉగ్రదాడి నుంచి నాకు రక్షణ నివ్వు. శరణు, శరణు"

మైమునా అన్నది– "నిజం చెప్పు దహనాష్! అర్ధరాత్రి ఎవరికి అపకారం చేయడానికి బయల్దేరావు? అబద్ధమాడితే నీ రెక్కల్ని విరగగొట్టి, నీ చర్మాన్ని కాల్చి, నీ ఎముకల్ని చూర్ణం చేస్తాను. అప్పుడు ఎవరూ నిన్ను కాపాడలేరు నానుంచీ!"

దహనాష్ అన్నాడు– "దిమిర్యాత్ పుత్రికా, మహా శక్తివంతమైన నాయకురాలా! నేనీ రాత్రి ఓ వింత విషయాన్ని శోధించడానికి ఇటు వచ్చాను. అది నీకు సమంజసంగా అనిపిస్తే నాకు నేల, గాలి, సముద్రంలో ఉన్న నా శత్రువుల నుండి రక్షణను కలిగించు. ఇదే నా విన్నపం".

మైమునా జవాబిచ్చింది– "సులేమాన్ ఇబిన్ దావూద్ ముద్రికపై ఆన! నిర్భయంగా చెప్పు. నీకు నా రక్షణ అనుగ్రహిస్తున్నాను".

దహనాష్ అన్నాడు– "నేనిప్పుడే చైనా దేశపు సరిహద్దులలో గొప్ప రాజు ఘయ్యూర్ రాజ్యం నుంచి వస్తున్నాను. అతడు అనేక దుర్గముల కధిపతి. అతడి సేనావాహిని మన జిన్నుల సైన్యంతో సరితూగినది. అతడి అంతఃపుర స్త్రీలు వానలో స్నానించిన పూలకన్నా స్వచ్ఛంగా, అందంగా ఉన్నారు. వేయి గంటల్లో వేయి లీగులు ప్రయాణం చేయగల నాకే అతడి రాజ్యాన్ని చూసి ముచ్చటేసింది. అన్నిటికన్నా నన్నెక్కువ కట్టిపడేసింది రాజు కుమార్తె యువరాణి 'బుదుర్' అసమాన సౌందర్యం.

ఆమెను వర్ణించడానికి నా జిహ్వ సరిపోదు. నేనెంతగా వర్ణించినా ఆ వర్ణన కేవలం నూరవ వంతును మాత్రమే తెలపగలుగుతుంది.

ఆమె శిరోజాలు ప్రియతముల విరహవేదనంత నల్లగా ఉంటాయి. అవి మూడు నదుల్లా పాయలుగా చీలి ఆమె పాదాలనంటుతాయి.

ఆమె చెక్కిళ్లు రెండు రేకలుగా చీలిన బంగరు చేమంతులు.

ఆమె వదనం ఎంత ప్రకాశవంతమంటే చిరకాలంగా విడిపోయిన ప్రేమికులు అకస్మాత్తుగా కలుసుకున్నపుడు ప్రగాఢ కాంతులతో వెలిగే ముఖాలంత కాంతివంతంగా ఉంటుంది.

ఆమె వదనంపై వెన్నెల కాంతులీన ఆమె మరల వెన్నెలలు కురిపిస్తుంది.

ఆమె నాసిక ఓ అద్భుత ఖడ్గం; ఆమె స్ఫటిక చర్మం అడుగున ఊదాద్యుతులున్న మధువు ప్రవహిస్తూ ఆమెకు కెంపువర్ణ శోభలనిస్తుంది.

ఆమె అధరాలు సులేమాన్ పగడపు శిలా రోచిస్సులను కలిగి ఉంటాయి. అన్ని దాహాలను తృప్తిపరచే అపురూప జలాలు వాటిపై స్రవిస్తుంటాయి.

ఆమె వక్షోజాలు కవల ఫలాలుగా దంత నిర్మితమై నునుపుగా మెరుస్తుంటాయి. ప్రియుడి అరచేతుల్లో ఇమిడేందుకు తహతహ లాడుతున్నట్లు కానవస్తాయా తరుణి కుచకుంభాలు.

ఆమె పొత్తికడుపుపై చిన్ని చొట్టలు అరబిక్ అక్షరాల్లా అపురూపమైన వెలుగు నీడలతో కానవస్తాయి.

ఆమె జఘనాలు ఘనమైనవి. సన్నని నడుము, చక్కని పిరుదులు.

***ఎలా మోస్తుందో ఆ సన్నని నడుము***
***ఆ వక్షోజ భారాన్ని,***
***ఎలా నడుస్తుందో ఆ అందాల భామిని***
***భరిస్తూ తన జఘన భారాన్ని.***
***ఎలా మోస్తున్నాయో ఆ సుకుమార పాదాలు***

రెండు చలువరాతి స్తంభాలు ఆమె కాళ్లు. రెండు చంద్రశిలా నిర్మితాలు ఆమె పాదాలు. ఆమె అందం వర్ణనాతీతం. ఆమె ఘయ్యూర్ రాజు కుమార్తె యువరాణి 'బుదుర్'" అన్నాడు దహనాష్ ఉద్వేగభరిత స్వరంతో.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 177, 178, 179వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

దహనాష్ చెబుతున్నాడు– "ఘయ్యూర్ ప్రభువుకున్న ఏకైక ఆశయమల్లా తన కుమార్తెనెప్పుడూ ఆనందంగా ఉంచడం. ఆమె కోసం ఏడు అద్భుత భవనాలను నిర్మించాడు. స్ఫటిక, అలబాస్టర్, పింగాణి, వివిధ శిలానిర్మితం, వెండి, బంగారు, వజ్ర భవనాలవి. దేని ప్రత్యేకత దానిదే. ఆ స్వప్న భవనాలకు సరితూగే ఫలపుష్ప వనాలు, జలపాతాలు, సెలయేర్లు, వాటి వద్ద తిరుగాడే పక్షి జంతుతతులు.

ఏడాదికొక భవనంలో ఆమె ఏ బాధ ఎరుగకుండా పెరిగింది. ఓ మైమునా, ఆ భోగభాగ్యాల్ని చూసి నా తల తిరిగిపోయింది. ఎందరో ఇరుగు పొరుగు రాజులు, రాజకుమారులు ఆమెను వివాహమాడాలని భావించినా, ఆమె తన తండ్రితో అన్నది– "నేనిక్కడ నా రాజ్యంలో నా తండ్రి సంరక్షణలో, నా ప్రజల ప్రేమాభిమానాల మధ్య మహారాణిలా బతుకుతున్నాను. పట్టువస్త్రాల బరువును, మృదుత్వాన్నే భరించలేని నా దేహం పరాయి మగవాడి స్పర్శ కందడమనే ఊహనే నేను భరించలేను. తండ్రీ, దయ ఉంచి వివాహ ప్రస్తావన తేవద్దు"

ఒకసారి ఒక పరాక్రమశాలి, మహా భాగ్యవంతుడు అయిన రాకుమారుడు అనేక అపురూప కానుకల్ని పంపి రాకుమారితో వివాహం చేయమని ప్రభువుకు విజ్ఞాపన పంపగా ఆమె తన తండ్రితో అన్నది– "తండ్రీ! ఇదిగో అత్యంత పదునైన చురకత్తి! దీనితో నా గుండెలో పొడిచి ఆనక నా శవానికి పెండ్లి చేయి. నేను కాదనను" అని ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేయబోగా ప్రభువు వారించి ఆమెను సమర్ధవంతులైన చెలికత్తెలు, దాయీల సంరక్షణలో ఉంచినాడు.

నేను ప్రతిరాత్రి ఆమె గదికి అదృశ్య రూపాన వెళ్లి ఆమె అందాలను తిలకించి మైమరచిపోతాను. ఆమెను బలవంతంగా ఆక్రమించి అనుభవించాలన్న కోర్కెను అణిచిపెట్టి ఇంత కాలము నియమ నిష్ఠలతోనే ఉంటున్నాను. ఆమెకు ఏ రకంగానూ ఆపద కలిగించకుండా కేవలం నేత్రానందంతోనే తృప్తి చెందుతున్నాను.

నా మాటలు నమ్మలేకుంటే ఓ మైమునా, నాతో రా! ఆ సౌందర్యరాశిని చూసి నీవే నిర్ణయించుదువుగాని నిజమో అబద్ధమో" అన్నాడు దహనాష్.

మైమునా ఇఫ్రితాలో ఆసక్తి పెరిగింది.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 180వ రాత్రి కథ ✳

షహర్జాదీ కథ చెప్పసాగింది-

మైమునా నవ్వింది ఆగ్రహం, అధికారం మేళవించిన నవ్వుతో. నవ్వుతూనే తన రెక్కను బలంగా విసిరి దహనాష్ పిశాచాన్ని ఈడ్చికొట్టి అన్నది- "నీవు వెళ్లి ఆ రాకుమారిని ఇక్కడకు తీసుకునిరా! నేను నిర్ణయిస్తాను ఆమె అందచందాల గొప్పదనాన్ని. ఆమెకన్నా నా సంరక్షణలో ఉన్న యువకుడే సుందరుడని నేనంటాను".

దహనాష్ అన్నాడు- "రాణీ! నేనింతవరకు ఈ యువకుడిని చూడలేదు. చూస్తేనే కదా నేను ఇద్దరినీ పోల్చి తమ భావన సరైనదని చెప్పగలిగినది"

మైమునా మండిపడింది- "ఏదో ఒక వంకతో షోడశ కళాప్రపూర్ణుడైన రాకుమారుడిని చూద్దామనుకుంటున్నావు. సరే, నీకో అవకాశమిస్తాను. చూసి కింకలు వచ్చిన ఒంటెలా కిందపడతావేమో కాస్త జాగ్రత్తలో ఉండు. ఒకసారి అతడిని చూసాక పిచ్చిపిచ్చి ఆలోచనలు మనసులో చేరి వెధవ వేషాలు వేస్తే నీ రెక్కలు విరగగొట్టి, నీ కళ్లు పీకి నిన్ను శాశ్వతంగా గుడ్డివాడిని చేస్తాను. నాతో రా, ఈ యువకుడిని చూసి అప్పుడు చెప్పు ఎవరు అందమైనవారో!"

దహనాష్‌ను వెంటబెట్టుకుని మైమునా వెళ్లింది కమర్ అల్-జమాన్ నిద్రిస్తున్న గదిలోకి. వెళ్లి అతడు కప్పుకున్న వస్త్రాన్ని తీసింది మెల్లగా. ఆ యువకుడి సౌందర్యాన్ని వీక్షించిన దహనాష్ శిలలా ప్రమాన్పడిపోయాడు. అయినా వెంటనే తేరుకుని అన్నాడు- "రాణీ మైమునా! నీ మాటలు నిజమే. ఇతడు అపురూప సౌందర్యవంతుడు. అయితే యువరాణి 'బుదుర్' ఇతడికి నకలులా కనిపిస్తుంది. ఒకే అచ్చులో పోతపోసిన రెండు దివ్య మంగళ విగ్రహాలు వీరివి".

మైమునా అతడిని వెక్కిరిస్తూ అన్నది- "అవునా! పోయి వెంటనే నీ 'బుదుర్' యువరాణిని తీసుకునిరా, ఈ యువతీ యువకులను పక్కపక్కనే ఉంచి పరీక్షించి తుది నిర్ణయం చేద్దాం"

ఆమె రెక్కల విసురుకు తన తలకొమ్ము ఊడినంత పని కాగా, దహనాష్ కాస్త సర్దుకుని గాలిలోకి బలంగా విసిరిన ఈటెలా దూసుకుపోయాడు.

ఒక గంట గడిచింది. తన భుజాలపై మోసుకుని తీసుకువచ్చాడు బుదుర్ యువరాణిని నిద్రిస్తున్న స్థితిలోనే దహనాష్ పిశాచి. ఆమె దేహంపై నిండా కప్పి

ఉన్నది సిల్కు వస్త్రం బంగరు జరీ అంచుతో, అనేక రంగుల దారాలతో నేసినది. ఆమె వదనాన్ని కప్పి ఉంచినది మరో అపురూపమైన మేలిముసుగు. ఆ అంగీ చేతులపైన వ్రాయబడి ఉన్నవి ఈ అక్షరాలు.

*–"మూడు విషయాలు ఆమెను అవునని అననివ్వవు*
*తెలియని భయాలు, తెలిసిన భీకర దృశ్యాలు*
*ముగ్ధమనోహరమై మూర్తీభవించిన ఆమె రూప చిత్రాలు"*

"గంట సమయం పట్టిందా నీకు. ఈ పూబోడిని చైనా నుంచి ఖలిదాన్‌కు తీసుకురావడానికి? మధ్యలో ఆగావా ఆమె అందచందాలను అవలోకిస్తూ" అని ఉరిమింది మైమునా.

దహనాష్ ఎంతో పదిలంగా ఆ బాలికను కమర్ అల్–జమాన్ పడుకుని ఉన్న శయ్యపై పడుకోబెట్టి, ఆమె మేలి ముసుగును తీసినాడు. మైమునా కూడా కమర్ ముఖంపైనున్న వస్త్రాన్ని తొలగించి చూసింది. దహనాష్, మైమునా లిద్దరూ నిశ్చేష్టులైనారు ఒకే రూపంగా ఉన్న ఆ ఇరువురిని చూసి. ఇరువురూ పూర్ణచంద్ర వదనులు, సింహ మధ్యములు, నితంబశ్రోణులు కలవారు. నిద్రలో కలలు కంటూ చిరునవ్వుల వెన్నెలలు చిందిస్తున్నారు.

మైమునా అన్నది– "నీవన్నది నిజమే. అయినా స్త్రీ పురుషులను పోల్చి చూసినపుడు పురుషుడికే అధిక అంగములనిచ్చాడు దేవుడు".

దహనాష్ తగ్గలేదు– "పురుషుడికి మగసిరి ఉండవచ్చు కాని స్త్రీ లోయలలో అది దిగబడినాక గెలుపు స్త్రీలదేనని మరవవద్దు".

"అవునా!" అరిచింది మైమునా– "ఇప్పుడు మనమిద్దరం వీరి అంద చందాలను వర్ణిస్తూ కవితలల్లుదాం. నీకిష్టమేనా ఈ పోటీ"

దహనాష్ అన్నాడు– "రాణీ! నేనూ చిన్నపాటి కవినే. నాతండ్రి షామ్ హురిష్ నాకు కవిత్వంలో శిక్షణనిచ్చాడు".

మైమునా వర్ణించసాగింది కమర్ అల్–జమాన్ అందచందాలను–

*"మల్లెపూల పరిమళాలను విరజిమ్ముతూ*
*మరులు కురిపించే దేహమిది*
*ఏ మానవ మల్లికా సాటిరాదు దీనికి*

*నల్లటి చీకటి గోపురంలోకి విరజిమ్మింది*
*రాత్రి, గుప్పెడు తారలను ఈ దేహంలోకి*
*ఏ మానవ తారకా సాటిరాదు దీనికి*
*చల్లటి అమృత ధారలను విరజిమ్మింది*
*ధాత్రి, ఈ తియ్యటి చెలమలున్న దేహంలోకి*
*ఏ మానవ అధరామృతమూ సాటిరాదు దీనికి"*

దహనాష్ అభినందించాడు ఉద్వేగంతో మైమునా పలుకులను నిజాయితీగా, నిస్సంకోచంగా.

తానూ వర్ణించినాడు యువరాణి బుదుర్ సొబగులను-

*"డమాస్కస్ ద్రాక్షవనాలు, నింపినాయి*
*ఆమె అధరాల వద్ద ప్రశస్త మధువును*
*అది నీకు అందదు అదృష్టం లేకుంటే*
*బాగ్దాద్ గులాబి తోటలు నింపినాయి*
*ఆమె దేహంపై వెన్నెల, పొగమంచును*
*అది నీకు అందదు అదృష్టం లేకుంటే"*

ఆ కవితను వింటూ ఆశ్చర్యంగా చూసింది మైమునా అతడి కవిత్వ శైలిని ఆనందిస్తూ-

***ఇంతలో తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

## ✻ 182వ రాత్రి కథ ✻

**షహర్జాది కథ చెప్పసాగింది-**

మైమునా అభినందించింది దహనాష్‌ను అతడి భీభత్స రూపానికి అడుగున అందమైన కవితాత్మ ఉన్నందుకు- "అయినా, నేను యువరాణి 'బుదుర్' యువరాజు కమర్ అల్-జమాన్‌కు సాటి వస్తుందని నేననుకోవడంలేదు" అని తీక్షణంగా చూసింది దహనాష్ వేపు ఆమె కోపపు చూపులను తప్పించుకోవడానికి అతడు నల్లిలా మారి శయ్యలో దాక్కున్నాడు.

మైమునా కోపం తగ్గి అన్నది– "మామూలు రూపంలోకి రా, లేకుంటే నిన్ను మంటలలో మాడ్చివేస్తాను. అయినా మనం ఒక మధ్యవర్తిని నియమించి అతడిని నిర్ణయించమందాము వీరిరువురిలో ఎవరు అందగాళ్లో!"

దహనాష్ యధారూపుడై మైమునా ప్రతిపాదనకు అంగీకరించాడు.

మైమునా తన పాదంతో నేలపైన నొక్కగానే బయట భూమి చీలినట్లై ఓ భీకరరూపుడైన ఇఫ్రిత్ పిశాచం ప్రత్యక్షమైనాడు. అతడి తలపై ఆరు కొమ్ములు ఒక్కొక్కటి నాలుగు వందల ఎనభై క్యూబిట్ల పొడవున్నది, అంతే పొడవున్న మూడు చీలికల తోకలు, అతడు గూనివాడు, కుంటివాడు. ముక్కుండే చోటున ఉన్నాయి పెద్ద పెద్ద కళ్లు, అతడి చేయి– ఒకటి అయిదువేల అయిదు వందల యాభై అయిదు క్యూబిట్ల పొడుగుండగా, ఇంకో చేయి కేవలం అర్ధ క్యూబిట్ పొడవున్నది. అవి పెద్ద గంగాళాల్లా ఉండి, సింహపు గోళ్లను కలిగి ఉన్నాయి. అతడి పాదాలు గుర్రపు గిట్టల్లా చీలి ఉండగా, అతడి శిశ్నం ఏనుగు శిశ్నానికి నలభైరెట్లు పెద్దదిగా అతడి కాళ్ల మధ్య వేలాడుతున్నది. అతడి పేరు కష్‌కష్ ఇబిన్ ఫక్రాష్ ఇబిన్ అత్రాష్ – అబు హన్ ఫాష్ వంశీకులు.

కష్ కష్ తన శరీరాన్ని కుంచింపచేసి మైమునా పాదాల వద్ద ఉన్న నేలను ముద్దాడి– "రాణీ, ఈ బానిస తమ ఆజ్ఞకై ఎదురుచూస్తున్నాడు" అన్నాడు.

మైమునా అన్నది– "సేవకుడా, విధేయతలో నిన్ను మించినవారు లేరు. నిన్నిక్కడకు రప్పించడానికి గల కారణం– ఈ శయ్యపై ఉన్న మానవ యువతీ యువకులలో ఎవరు ఎక్కువ అందంగా ఉన్నారో నిష్పాక్షికంగా నిర్ణయించడం".

కష్ కష్ తన తోకను, చేతిని ఎత్తి పట్టుకుని ఆ జంటను తేరిపారా చూసి అన్నాడు– "జననాంగాలలో మినహా ఇద్దరూ ఒకరిని మించి మరొకరు శోభలు కలిగినవారు. అయితే వీరిలో ఎవరు గొప్ప అనేది తేల్చడానికి నేనో పాట పాడతాను.

*స్థిరమైన ప్రేమ కావాలి*
*శీలవతియైన సుకుమారికి*
*గండుతుమ్మెదలా తిరుగుబోతు వద్దు*
*హంసలా అల్లుకునే ప్రియుడు కావాలి*

*మకరందం మధురంగానే ఉంటుంది. కాని*

*ఉప్పటి కన్నీటిని మెచ్చని వాడు వద్దు"*

"నీ కవిత్వం బాగానే ఉంది. నీ నిర్ణయం చెప్పు నిలకడగా" అన్నది మైమునా.

కష్ కష్ అన్నాడు- "మనం అదృశ్య రూపులుగా ఉండి వారిని మేల్కొలుదాం. వారి ప్రవర్తనను గమనిస్తే చాలు ఈ సమస్యకు సమాధానం దొరుకుతుంది సులువుగా!"

దహనాష్ అన్నాడు- "గొప్ప ఆలోచన! నేను మరల నల్లిగా మారి వాళ్లను నిద్ర లేపుతాను".

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# ∗ 183వ రాత్రి కథ ∗

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

నల్లిగా మారిన దహనాష్ వెంటనే వెళ్లి కమర్ అల్-జమాన్ మెడపై కుట్టి అదృశ్యమైనాడు. బాధతో ఉలిక్కిపడి లేచిన రాకుమారుడు తన మెడపై తడుముకుని మగతనిద్రలోనే ఆ చేతిని క్రిందకు దించగా అది అతడి పక్కనే నిద్రిస్తున్న యువరాణి బుదుర్ నగ్న తొడలను తాకింది. వెన్నలా మెత్తగా, వెచ్చగా ఉన్న నెలజవ్వని స్పర్శ, కస్తూరి పరిమళాలను వెదజల్లుతున్న ఆమె ఊపిరి అతడిలో వింతైన గగుర్పాటును ఆశ్చర్యాన్ని కలుగచేసాయి. నెమ్మదిగా లేచి అతడు తన పక్కనే నిద్రిస్తున్న రాకుమారి అందాలను కన్నార్పక చూడసాగినాడు.

అతడిలో అప్పటివరకు స్త్రీలపై ఉన్న ఏవగింపు, తిరస్కారణ ధోరణి తుడిచిపెట్టుకుపోయినాయి. ఈమెను ఏమని వర్ణించాలి? అద్భుతమైన గోపురమున్న అందాల దుర్గము గానా, అత్యంత విలువైన ముత్యముగానా, కెంపు వర్ణాలు మెరిసే గులాబిగానా, ఏమని? అతడికి నచ్చింది ఆమెను అపురూప గులాబీగా భావించడం.

ఆ గులాబిపై వాలి, ఆ పరిమళాలను ఆఘ్రాణిస్తూ, ఆమె నగ్న దేహాన్ని వణుకుతున్న తన అంగుళిలతో తడుముతుంటే అతడిలో ఏదో తెలియని తపన,

ఉద్రేకం, వేడి ఒక్కుమ్మడిగా వరదలా దూకి అతడిని ఉక్కిరిబిక్కిరి చేసాయి. ఆమెను తన కౌగిలిలోకి తీసుకుని ఏదో చెయ్యాలన్న భావన. ఎంత నిగ్రహించుకున్నా ఆపలేకపోతున్నాడతడు.

ఆమె జఘన శ్రోణి, కుచకుంభ ద్రోణి, కనుదోయి, నౌకారూపున ఉన్న నాభితో కూడిన పొట్టభాగము, సన్నని నడుము అన్నీ అతడిలో శృంగార భావనల నుద్దేపించాయి.

దహనాష్ ఇంతలో ఆ బాలికను కుట్టి తన విష ప్రభావాన ఆమెను మరింత గాఢ నిద్రలోకి పంపగా, యువరాజు క్రీడలకు ఆమెకు మెలకువ రాలేదు. కమర్ అల్–జమాన్ వేడెక్కిన తన పెదవులతో దొండపండు రంగులో మెరుస్తున్న 'బుదుర్' యువరాణి అధరాలను స్పృశించి దీర్ఘ చుంబనాన్నిచ్చినాడు. అయినా ఆమె నిద్ర నుంచి మేల్కొనలేదు. అతడు ఆమెను ముద్దాడుతూ ప్రేమగా పలకరించాడు– "ఓ ప్రియురాలా, నా హృదయమా, నా నేత్రమా, నా ప్రాణమా, నిద్రలే, నేను యువరాజు కమర్ అల్–జమాన్‌ను!"

ఆమె నిద్ర లేవలేదు. దైవేచ్ఛ ఇది అనుకుంటూ అతడు నిద్రిస్తున్న ఆ యువతిని పూర్తిగా ఆక్రమించుకుని శృంగార క్రీడలో మునగడానికి నిశ్చయించుకున్నాడు.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 184వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

అదృశ్యరూపులై ఈ తతంగాన్నంతా చూస్తున్న మైమునా, దహనాష్, కష్కష్‌లు తేరుకున్నారు. ముందుగా మైమునా చెప్పబోయింది– "యువరాజు సఫలీకృతుడైతే అది పందెం లెక్కలోకి రాదని".

బుదుర్ తన పొట్టపై పడుకుని ఉన్నది. ఆమెపైనున్న పలుచని అంగీ ఆమె ఎత్తుపల్లాలను మరింత అందంగా చూపిస్తున్నది. ఆమెను మామూలుగా పడుకోబెట్టి ఆమెను ఆక్రమించాలనుకున్న సమయంలో యువరాజు మనసులో అతడి తండ్రి మెదిలాడు. మరుక్షణంలో అతడి ముఖాన రంగులు మారినాయి.

"ఖచ్చితంగా ఇది తన తండ్రి చేసిన కుట్ర. ఈ గది గోడలోని రంధ్రం గుండా ఈ చుట్టుపక్కలే ఉండి అంతా చూస్తూ ఉండి ఉంటాడు. రేపు అంటాడు– 'కుమారా! స్త్రీ అంటేనే పడదన్నవాడివి రాత్రిపూట ఆ యువతినేం చేసావు! రాత్రిళ్లు శృంగారం జరుపుతావు కాని నా వంశానికి వారసుడినివ్వడానికి వివాహం చేసుకొమ్మంటే నన్ను నానా దుర్భాషలాడుతావు' అని అడిగితే నేను అబద్ధాల కోరుగా అతడి దృష్టిలో మిగిలిపోనా! ఈ రాత్రి నన్ను నేను నిగ్రహించుకుని రేపు ఉదయమే నా తండ్రికి చెప్పి ఈ సుందరిని వివాహమాడి నా కోరికను తీర్చుకుంటాను న్యాయ విధానంలో. ఆ విధంగా నా తండ్రి మాటను మన్నించిన వాడినౌతాను" అనుకుని తన చేతికున్న ఉంగరాలలో అత్యంత విలువైన ఉంగరాన్ని ఆమె వేలికి తొడిగి, ఆమె ఉంగరాన్ని తన వేలికి పెట్టుకుని, ఆమెపై దుప్పటి కప్పి హృదయంలో విరహవేదన అధికమవుతున్నా సముదాయించు కుంటూ అటువేపు తిరిగి నిద్రకొరిగాడు.

అది చూసిన మైమునా ఆనందపడింది. అప్పటివరకూ తానే గెలుస్తున్నా ననుకున్న దహనాష్ గెంతులు మాని నిశ్శబ్దంగా నిలబడినాడు.

ఈసారి మైమునా నల్లిగా మారి బుదుర్ తొడపైన కుట్టి దహనాష్ విషాన్ని నిర్వీర్యం చేసి కొంచెం ముందుకువెళ్లి గులాబిరేకలను కప్పుతున్న త్రిభుజాకార వనాన్ని దాటి అదృశ్యమైనాడు. నల్లి కుట్టిన బాధకు నిద్రలేచిన రాకుమారి బుదుర్ కనులు తెరిచి తన పక్కనే నిద్రలో ఉన్న యువకుడిని చూసి మొదట భయం తరువాత ఆశ్చర్యం, ఆ తరువాత మెచ్చుకోలు, ఆనందం, మైమరుపు రాగా ఆమె ఆలోచనలో పడింది.

"ఇది కలా, నిజమా! ఇతడెవరు? నా తండ్రిచే ఎన్నిక చేయబడి, నన్నాకర్షించడానికి, నాలో ప్రేమ రగిలించడానికి నా శయ్యపై చేరిన రాకుమారుడా! ముందు ఇతడిని కనులారా చూసి తరువాత ఏం చెయ్యాలో నిర్ణయించుకోవచ్చు"

అటు తిరిగి పడుకుని ఉన్న యువరాజు వదనాన్ని చూసి మరింత సంబర పడిందామె. "ఇతడు నా ఇన్నాళ్ల ప్రతికూలతను నశింపచేయవచ్చిన సొగసుకాడు" అనుకుంటూ అతడిని మృదువుగా ముద్దాడింది. "లే, నిద్రలే, రాకుమారా! నేను బుదుర్ యువరాణిని. నీ వధువును. నీ మధువును, నన్నందుకో నీవు" అన్నదామె అనునయంగా.

మైమునా మాయవల్ల గాఢనిద్రలో ఉన్న రాకుమారుడు నిద్ర లేవలేదు. తన స్పర్శ అతడిని నిద్ర లేపనందుకు సంశయపడి ఆమె అతడి దగ్గరకు చేరి తన బాహువులతో అతడిని చుట్టి తన ముందరి భాగాన్ని అతడి వెనుక భాగానికి హత్తుకున్నది గాఢంగా. “రాకుమారా! రా! నేను నీ వశురాలనైతి. నాలో మండే అగ్నిని చల్లార్చు. నా వక్షోజ బంతిపూలతో ఆటలాడు, నా తోటలోని లోయలో స్నానించు. నా ప్రేమ తొలి ఫలాలను రుచిచూడు. నేను నీ దానిని” అంటూ గుసగుసలాడిందా కన్య రాకుమారుడి చెవిలో.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 185వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

తన గుసగుసలకు నిద్రలేవని గుణవంతుడిని తన కోమలతనూ భారంతో కప్పివేసి ఒడలెల్లా ముద్దాడుతూ, తన దేహమెల్ల కామాగ్నిలో జ్వలించ బుదుర్ యువరాణి శృంగారేచ్ఛను తెలిపింది నిద్రిస్తున్న ఆ యువకుడికి- “ప్రియతమా! నాలో కోరికను రేకెత్తించి ఇలా స్తబ్దతగా ఉండిపోవడం న్యాయమా! నేను నీ పొందు కోరుతున్న ఆడజింకను. రా! నన్ను నీ బాహువులలో బంధించు”

అతడింకా మైమూన్ మాయామంత్రాల వల్ల గాఢ నిద్రలోనే ఉన్నాడు. యువరాణి బుదుర్ అతడిని ముద్దాడుతూ అన్నది- “కనులు తెరచిచూడు, సొగసుకాడా, నేను నీకు తగిన జోడైనదానిని. నేనిక్కడ అగ్నికీలలలో సతమతమవుతుంటే నీ నుంచి ప్రవహిస్తున్న పరిమళాల గాలి ఆ జ్వాలలను మరింత అధికం చేస్తున్నవి. ఈ మంటను చల్లార్చు. లేకుంటే అది నన్ను కాల్చివేయగలదు”

అంటూ ఆమె అతడి విశాలమైన నుదురును, శంఖం లాంటి మెడను, చంద్రశిలలా మెరుస్తున్న ఛాతీని, చలువరాతి పడవలాంటి కడుపును సుతారంగా తాకి తన చేతిని అతడి మగసిరి వేపు పోనిచ్చి తనకు లేనిది, అతడికి ఉన్నది క్షణక్షణం వృద్ధి చెందుతున్న దానిని చూసి విస్మయమొందినది. సహజ ప్రేమలో దేని అవసరం దేనికున్నదో సహజసిద్ధంగా తెలుస్తుంది. ఆమెలో కాంక్ష మరింత రేగగా, ఆమె అధరాలు అతడి అధరాలను ముద్దాడి అతడి మగసిరి ఆమె లోయలో అదృశ్యం కాగా, ఊయలలూగినట్లు కాసేపు ఆనందపు అలజడి. ఆ తరువాత

ఏది ఎలా జరగాలో అలా జరిగి ఒక తుఫాను అనంతర నిశ్శబ్దం. అరమోడ్పు కన్నుల ఆనందం, రెండు దేహ మేఘాల ఒరవడిలో జనించిన ఉరుములు, విద్యుల్లతలు అదృశ్యమై ప్రశాంతత.

ఇంకా నిద్రపోతున్న అతడిని అదిమిపెట్టుకుని ఆమెకూడా నిద్రలో మధుర స్వప్నాలననుభవిస్తూ పారవశ్యాన కనులు మూసుకునగా మైమునా ఆమెను తన మంత్రశక్తులతో గాఢనిద్రలోకి పంపింది.

విజయం తనదైనా మైమునా తనతో పందెంలో ఓడిపోయిన దహనాష్‌ను అభినందించి అతడు కోరుకున్న వరాలనిచ్చి శక్తులను దురుపయోగం చేయరాదని హెచ్చరించింది. కష్‌కష్‌ను తన సందేశకులకు అధికారిగా పదోన్నతినిచ్చి అతడిని ప్రత్యేకంగా అభినందించి అన్నది– "మీరిరువురూ ఇప్పుడు ఈ యువతిని కసుగందకుండా తీసుకువెళ్లి ఆమె గదిలోని శయ్యపై పూర్వస్థితిలో ఉంచి రాగలరు. భవిష్యత్ కాలంలో యువరాణి బుదుర్ నా అంతరంగిక మిత్రులలో ఒకరు కానున్నది".

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 186వ రాత్రి కథ ✳

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

మైమునా ఆజ్ఞ ఇవ్వగానే దహనాష్, కష్‌కష్‌లు గాఢ నిద్రలో ఉన్న యువరాణి బుదుర్‌ను ఎత్తుకుని తీసుకుని వెళ్లి ఆకాశ మార్గాన ఆమె గదిలో శయ్యపై పరుండబెట్టి ఎవరి దారిన వారు నిష్క్రమించారు.

మైమునా తన సంరక్షణలో ఉన్న యువరాజు కమర్ అల్–జమాన్ కనుబొమలపై ముద్దుల నుంచి తానూ వెళ్లిపోయింది.

తెల్లవారయ్యేసరికి మెలకువ వచ్చిన కమర్ అల్–జమాన్ తన ప్రియురాలి కోసం వెదికినాడు. ఎవరూ కనిపించకపోయేసరికి గది బయట గుర్రుపెట్టి నిద్ర పోతున్న కాపలా భటుడిని నిద్రలేపి గద్దించి అడిగాడు– "ఎవరు వచ్చారు రాత్రి నా గదికి? ఎప్పుడు వెళ్లిపోయారు? రాత్రి నా శయ్యపై నిదురించిన యువతి ఎటు వెళ్లింది?"

వాడన్నాడు– “అయ్యా, తెల్లవారుజాము వరకు నేను మెలకువగానే ఉన్నాను. ఎవరూ లోనికి రాలేదు, బయటకు పోలేదు. ఇప్పుడే కాస్త కునుకుపట్టింది. ఎవరూ తమరికి నిద్రాభంగం కలిగించకుండా గుమ్మానికి అడ్డంగా పడుకున్నాను. తమరు నిద్ర లేపితేనే మెలకువ వచ్చింది”.

యువరాజుకు కోపం వచ్చింది– “ఎవరు నాకీ అబద్ధాలు చెప్పమని పురమాయించింది? నిజం చెప్పు. నా తండ్రి నిన్ను ఈ విధంగా చెప్పమన్నాడా? లేకుంటే రాత్రి నా పక్కనే ఉన్న అందాల యువతి ఎలా వచ్చింది, ఎలా వెళ్లిపోయింది?

భటుడన్నాడు– “దైవంపై ఆన! తమరంటున్నది ఒక్కముక్క నాకర్థం కావడం లేదు”

కోపంతో మడిపడి యువరాజు పక్కనే ఉన్న దుడ్డుకర్ర తీసుకుని భటుడిని చావబాదినాడు. వాడు కుయ్యోమొర్రో అని ఏడుస్తూ తన కేమీ తెలియదని మొత్తుకుంటుంటే యువరాజు అతడి కాళ్లూ చేతులు కట్టి లాక్కువెళ్లి, భవనంలోనున్న పాడు బావిలోకి దించాడు నడుముకు తాడుకట్టి.

శీతాకాలపు చల్లదనానికి బావినీళ్లు మంచులా అతిశీతలంగా ఉన్నాయి. తనకు చావు తప్పదనుకున్న భటుడు లబలబలాడుతూ తనను బావి బయటకు లాగితే నిజం చెబుతానని ప్రమాణం చేసాడు. అది నమ్మి యువరాజు అతడిని బావిలోంచి బయటకు లాగి నిజం చెప్పమన్నాడు. వాడు తెలివిగా ఆలోచించి నీళ్లలో తడిసిన బట్టలు చల్లగా ఉండి వణుకు పుడుతున్నదని, మార్చుకుని వస్తానని చెప్పి, అటునుంచి అటే ప్రభువు వద్దకు పరిగెత్తి గజగజ వణుకుతూ అన్నాడు– “ప్రభూ! కొంప మునిగింది. రాత్రి యువరాజు గారికి ఏ పీడకల వచ్చిందో ఏమో తెల్లవారగానే నిద్రలేచి నా గదిలోకి రాత్రి వచ్చిన యువతి ఏమయ్యిందని అడుగుతూ, నాకేమీ తెలవదంటే చావగొట్టి బావిలో పడవేసినాడు. తమరే నన్ను కాపాడాలి”.

ప్రభువు అక్కడే ఉన్న వజీరు వేపు కోపంగా చూసాడు– “నీ సలహా విని నేను రాకుమారుడిని దెయ్యాల కొంపలో ఉంచాను. రాత్రి ఏదో కామినీ పిశాచం అతడి గదిలోకి వెళ్లినట్లుంది, ఇదంతా నీ ఆలోచనే కనుక నీవే వెళ్లి రాకుమారుడెలా ఉన్నాడో చూసి నాకు చెప్పాలి!”

దేవుడా అనుకుంటూ వజీరు రాకుమారుడి గది దగ్గరకు వెళ్లాడు. భటుడు దూరంగా నిలబడి తన జాగ్రత్తలో తానున్నాడు. వజీరు చాలా నేర్పుతో గది

తలుపులు తెరిచి ముందు తల, తరువాత కుడికాలు, ఆ తరువాత మొత్తం శరీరాన్ని గదిలోనికి పోనిచ్చి చుట్టూ చూసాడు. గదిలో శయ్యమీద రాకుమారుడు ప్రశాంతంగా కూర్చుని పవిత్ర గ్రంథం పఠిస్తున్నాడు.

ధైర్యం వచ్చిన వజీరు రాకుమారుడు తన వేపు చూడగానే అన్నాడు– "శుభోదయం, రాకుమారా!"

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# ✳ 187వ రాత్రి కథ ✳

**షహర్జాది కథ చెప్పసాగింది-**

"శుభోదయం, రాకుమారా!" అన్నాడు వజీరు ముఖాన చిరునవ్వు పులుముకుని "ఈ భటుడు మమ్మల్ని భయపెట్టాడు అకారణంగా. అతడు చెప్పిన మాటలకు తమరున్న పరిస్థితికి పొంతన లేదు. వాడిని తీవ్రంగా శిక్షిస్తాను".

రాకుమారుడన్నాడు– "వాడు మూర్ఖుడు, నపుంసకుడు, కనుక క్షమిద్దాం. తమరు పెద్దవారు, అనుభవజ్ఞులు. తమరు చెప్పాలి రాత్రి నా గదిలోకి ఆ అందాల రాశిని ఎలా ప్రవేశపెట్టారు, నాకు మెలకువ వచ్చేసరికి ఆమెనెలా తీసుకుపోయారు. అదీ ఈ అడ్డగాడిద నా గది గుమ్మానికి అడ్డంగా పడుకుని ఉండగా!"

అనుకోని ప్రశ్నకు వజీరు కళ్లు తేలేసినంత పని చేసాడు– "రాకుమారా! తమరేదో దుస్వప్నం కని ఉంటారు. నేనుగాని, తమ తండ్రిగారు కాని ఏ యువతినీ తమ గదిలోకి పంపలేదు. తమరి మనసులోంచి ఈ అనుమానాన్ని తొలగించండి".

కమర్ అల్–జమాన్‌కు కోపం వచ్చింది– "తమరు వయసులో పెద్దవారని తమాయించుకుంటున్నాను. రాత్రి నేను ఈ శయ్యమీద ఇక్కడ నా రెండు కళ్లతో చూసాను. ఈ రెండు చేతులతో స్పృశించాను. మీరు నా మనసు మార్చడానికి చేసిన ప్రయత్నంగా భావించి ఉదయాననే మీకా శుభవార్త చెప్పి ఆమెను నాకిచ్చి పెండ్లి చేయమని అడుగుదామనుకున్నాను. ఇప్పుడు మీరు ఏమీ తెలియదంటున్నారు. ఆ భటుడికన్నా దుర్మార్గులు మీరు" అంటూ తన దగ్గర్లో ఉన్న మంచినీటి పాత్రను వజీరు వేపు విసిరేసరికి అది వజీరు పొట్టలో గట్టిగా తగిలింది. బాధతో కుయ్యోమొర్రో అని కేకలు పెడుతూ వజీరు, అతడి వెనక ప్రాణభయంతో కాపలా భటుడు విల్లునుంచి వెలువడిన బాణాల్లా ప్రభుసన్నిధికి చేరుకున్నారు.

"ప్రభూ! ఈ భటుడు చెప్పింది నిజమే. రాకుమారుడు ఉన్మత్తుడై ఉన్నాడు. నాపై పాత్రను విసిరి నన్ను చావగొట్టబోయినాడు" అన్నాడు వజీరు.

ప్రభువుకు కోపం వచ్చింది– "నా కుమారుడికేదైనా అపకారం జరిగిందా నిన్ను శిథిలదుర్గంలోని ఎత్తైన గోపురంపై కొరత వేయిస్తాను. పద వెళ్దాం, నేను స్వయంగా నా కనులతో చూసి న్యాయ నిర్ణయం చేస్తాను" అన్నాడు ఉగ్రంగా.

ప్రభువు, వజీరు, భటుడు ముగ్గురూ చడీచప్పుడు లేకుండా యువరాజు గదిలోకి ప్రవేశించారు. మంచం మీద కూర్చుని ప్రశాంతంగా పవిత్ర గ్రంథం పఠిస్తున్నాడు కమర్ అల్–జమాన్ ఎప్పటిలానే.

ప్రభువు కుమారుడినడిగాడు– "శుభోదయం కుమారా! ఈరోజు ఏవారం?"

రాకుమారుడన్నాడు– "ఎటువంటి ప్రశ్న ఇది? ఈరోజు శనివారం" అన్నాడు వినయంగా.

ప్రభువు వజీరు వంక తీక్షణంగా చూసి– "కుమారా! రేపేవారం?" అన్నాడు గుచ్చిగుచ్చి అడుగుతున్న విధాన.

యువరాజు అన్నాడు– "ఈ ప్రశ్నలడగటానికా మీ ముగ్గురు కట్టకట్టుకు వచ్చింది? సరే, ఈరోజు శనివారం, రేపు ఆదివారం, ఎల్లుండి సోమవారం. ఆ తరువాత మంగళ, బుధ, గురు, శుక్ర వారాలు వస్తాయి. అవునా! శుక్రవారం పవిత్రదినం" అన్నాడు దాదాపు అరుస్తున్నట్లు.

**తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 188వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

ప్రభువు ముఖంలో వెలుగు వచ్చింది. తన కుమారుడికి పిచ్చి పట్టలేదు. భూతమూ ఆవహించలేదు. హమ్మయ్య అనుకుని– "కుమారా! స్వచ్ఛమైన అరబిక్ భాషలో చెప్పు. ఇది ఏ నెల?"

యువరాజు అన్నాడు– "ఈనెల ధుల్ కదాహ్, వచ్చేనెల ధుల్ హిజ్జా, తరువాత ముహర్రం, తరువాత సఫర్, మొదటి రబియా, రెండవ రబియా, మొదటి జుమాదా, రెండవ జుమాదా, రజాబ్, షాబాన్, రమాదాన్, షావాల్ – సరిగా చెప్పానా?"

ప్రభువు తన వజీరు వేపు చీదరించుకున్నట్లు చూసి అన్నాడు– "నీవు పిచ్చివాడివి. ఆ వెధవ కాపలా భటుడు పిచ్చివాడు. దరిద్రపుగొట్టు వెధవల్లారా!"

"కుమారా! పొరబాటు జరిగింది. ఈ ఇద్దరు పనికిరాని వెధవలు నిన్ను పిచ్చివాడిగా జమకట్టి నాకు ఫిర్యాదు చేసినారు. వాళ్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే!" అన్నాడు ప్రభువు.

కమర్ అల్–జమాన్ అన్నాడు– "తండ్రీ! నీవన్నా నిజం చెప్పు. ఇప్పటి దాకా ఓపిక పట్టి ఉన్నాను. ఏ క్షణమైనా నా నరాలు తెగిపడేట్లున్నాయి. నీవు నీ వజీరు రాత్రి నా గదిలోకి పంపిన యువతి ఎక్కడ. ఆమెను వివాహమాడడానికి నాకే అభ్యంతరమూ లేదు. ఆమె కౌగిలిలోని వెచ్చదనం నా రక్తాన్ని ఇంకా మరిగిస్తూనే ఉన్నది".

ప్రభువు ఒక్కక్షణం కొయ్యబారిపోయి, కాస్త తేరుకుని అన్నాడు– "కుమారా! దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు. నీపై భూత పిశాచాల ప్రభావం పడకుండా కాపాడును గాక! నీకేమైనా పీడకల వచ్చిందా? నీవు తిన్న ఆహారంలో మసాలా దినుసులు ఎక్కువైనాయా? నీ ముందు వివాహ ప్రస్తావన తేరాదని కదా మన ఒప్పందం! నీ అనుమతి లేకుండా మేమెవరమూ ఇకముందు ఆ విషయం గురించి మాట్లాడము".

యువరాజు ఆశ్చర్యంగా అన్నాడు– "అయితే రాత్రి నా శయ్యమీదకు వచ్చిన యువతి మీరు పంపిన బాలిక కాదా! మా మధ్య జరిగిన ప్రేమ యుద్ధానికి కొన్ని ఋజువులున్నాయి. నా శృంగార ఆయుధానికి ప్రేమరక్తం అంటుకుని ఉన్నది తెల్లవారేకల్లా. అది ఋజువు కాదా! నేను కడిగి శుభ్రం చేసినది నిజం!"

ప్రభువు అన్నాడు– "అది సగం నిజం చెబుతుంది. మిగతా సగం ఋజువు కావాలంటే యువతి కనిపించాలి కదా?"

కమర్ అల్–జమాన్ అన్నాడు– "ఆ రక్తం, ఈ ఉంగరం నీకు ఋజువులుగా కనిపిస్తాయి. సావధానంగా పరీక్షించు" అని తన అనామిక వేలికి ఉన్న ఉంగరాన్ని తండ్రికి ఇచ్చాడు.

ప్రభువు ఆ ఉంగరాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. అది తన దేశంలో తయారయ్యే ఉంగరాల లాంటిది కాదు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## ✳ 191వ రాత్రి కథ ✳

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ప్రభువు ఆశ్చర్యపోయాడు. తన కుమారుడు ఖచ్చితంగా శృంగార కేళిలో పాల్గొన్నాడు. అతడి లోదుస్తులపై కొద్దిపాటి రక్తపు మరకలున్నాయి. ఆ ఉంగరంపై విదేశీ గుర్తులున్నాయి. కాని ఏ దేశమో చెప్పరాకున్నది. ఖచ్చితంగా ఏదో కామినీ పిశాచము కలిగించిన శృంగార భ్రాంతి కావచ్చునా? దీనిలో వజీరు కుట్ర ఏమన్నా ఉన్నదా, లేక, కాపలాభటుడి పాత్ర ఏమిటి? అని వజీరు వంక కోపంగా చూసాడు. వజీరు గజగజ వణుకుతూ అన్నాడు.

"ప్రభూ! తమకు తెలియకుండా నేనేపనీ చేయను. దైవం మీద ఆన! దీనిలో నా హస్తమేమీ లేదు".

యువరాజు అన్నాడు- "మీ తర్జన భర్జనలాపండి. నన్ను ఈ శిథిల దుర్గంలోని గదిలో బంధించారు, వివాహం చేసుకోనన్నానని. ఇప్పుడు నాకు నచ్చిన యువతి నా శయ్యపై చేరింది. ఆమెతో నాకు వివాహం చేయమంటే నాకు పిశాచం ఆవహించిందని, పిచ్చి పట్టిందని అనుకుంటున్నారు. ఆమె గతరాత్రి నాతో శయనించిన మాట నిజం. ఈ ఉంగరం ఆమెది. నా ఉంగరం ఆమె దగ్గరున్నది. ఆమెను వెదికి నా హృదయ వేదనను చల్లార్చవలసిన బాధ్యత మీది. లేకుంటే నేనిలాగే కృంగి కృశించి మరణిస్తాను".

ప్రభువు దుఃఖితుడైనాడు. వెంటనే రాకుమారుడిని సముద్రతీరం పక్కనే ఉన్న రాజభవనానికి తరలించి తాను స్వయంగా అతడి బాగోగులు చూడసాగినాడు.

కమర్ అల్-జమాన్ ప్రేమకథలను చదువుతూ, మనశ్శాంతికై పవిత్ర గ్రంథాన్ని పారాయణం చేస్తూ కాలం గడపసాగినాడు. ప్రేమికులు పడిన కష్టాలను కవుల భాషలో చదువుతూ-

*పిచ్చి ప్రేమికుడా, గులాబీల యుద్ధంలో*
*గుండెకు గాయం చేసిన ముల్లు*
*గుర్తుందా నీకు?*
*ఓడిపోయి నీవామె వలపు పాదాలకు*
*హృదయాన్నర్పించి నిలబడడం*
*గుర్తుందా నీకు?*
*ఆమె దేహపు పరిమళాలు వాయువీచికల*
*నలుముకుని నిన్ను చుట్టేయడం*
*గుర్తుందా నీకు?*
*ఆమె చేతులు తామరతూడులై*
*నీ కంఠాన్ని సున్నితంగా కౌగిలించడం*
*గుర్తుందా నీకు?*

రాకుమారుడలా ప్రేమ రాగాలలో పరితపిస్తున్నాడు తన రాజ్యంలో.

అక్కడ యువరాణి బుదుర్‌ను శయ్యపై ఉంచి దహనాష్, కష్కష్ భూతాలు తమతమ దారులలో పోయాయి.

తెల్లవారే రాకుమార్తెకు మెలకువ వస్తుండగా తాను రాత్రి పొందిన అనుభవాలు చల్లని గాలుల్లా ఆమెను స్పృశించ, ఆ తమకంలోనే ఆమె కనులు తెరవకుండానే తన ప్రియుడిని కౌగిలించుకోగోరి తన చేతులతో అతడిని చుట్టి బంధించాలనుకున్నది. కాని శయ్యపై ఏమీ తగలకపోయేసరికి ఆమె కళ్లు తెరచి చూసింది. పక్కనే ఎవరూ లేకపోయేసరికి బిగ్గరగా కేకపెట్టింది. ఆ కేక విని ఆమె దాయి, మిగతా తొమ్మిదిమంది సేవికలు ఉరుకుల పరుగులతో ఆమె వద్దకు వచ్చి అడిగారు– "అమ్మా! ఏమయ్యింది?"

***అంతవరకూ చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## ∗ 193వ రాత్రి కథ ∗

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

భయభయంగా తన చుట్టూరా మూగి– "అమ్మా, ఏమయ్యింది?" అని అడుగుతున్న తన సంరక్షకురాలిని, చెలికత్తెలతో అన్నది రాకుమారి– "మీకు

తెలియనట్లు నటిస్తున్నారే! రాత్రంతా నా శయ్యపై నాతో ఉన్న సుందర యువకుడేడి? నా హృదయాన్ని దోచిన మనోహరుడినెక్కడ దాచినారు?"

అనుభవజ్ఞురాలైన సంరక్షకురాలన్నది– "అమ్మా! యువరాణివి, తమ కిటువంటి మాటలు శోభస్కరం కాదు. నీవు పరిహాసపూర్వకంగా ఈ మాటలంటే ఆనందమే!"

యువరాణి బుదుర్ అన్నది కోపంగా– "మీరందరూ కావలి కాస్తుండగానే మానసచోరుడొకడు నా మందిరంలో ప్రవేశించి నన్ను తన దానినిగా చేసుకున్నాడా? ఎటువంటి అంతఃపురమిది? నా కన్యాత్వం పోయినాక మీ రక్షణకు విలువేది?"

దాయి అన్నది– "అమ్మా! మేమే పాపం ఎరుగము. రాత్రి వేసిన తలుపులు అలాగే ఉన్నాయి. నీవు నీ మంచం మీదే ఉన్నావు. అత్యంత కట్టుదిట్టమైన రక్షణ గలదీ అంతఃపురం. మగ పురుగు లోనికి వచ్చే వీలులేనిది. తమరేదో దుస్వప్నాన్ని కని ఉంటారు".

"అవునా! అయితే నా దేహంలో లేని భాగము అతడి కటి ప్రదేశంలో ఉన్నది. అది నా లోపలి భాగంలోకి వెళ్లగా కాస్త రక్తస్రావమైనది కాని ఆ అనిర్వచనీయమైన బాధ నాలో అమరత్వాన్ని కలిగించింది. ఏమిటా క్రీడ?"

దాయి గగ్గోలు పెట్టింది– "అమ్మా! తమరి ప్రతిమాటా తగులుతున్నది మాకు ఈటెల పోటులా. ఈ విషయం ప్రభువుకు తెలిస్తే మా అందరి మెడలపై తలలుండవు. తమరేదో ఉన్మత్త స్థితిలో ఉన్నారు".

రాకుమారి మండిపడింది– "నాకు పిచ్చి పట్టిందంటున్నారా? అవును నాకు పిచ్చే! ప్రేమ పిచ్చి. మీతో నిజమెలా చెప్పించాలో నాకు తెలుసు'' అంటూ ఆమె అక్కడ గోడకు వేలాడుతున్న ఖడ్గాన్ని తీసుకుని ఆ చెలికత్తెల వేపు ఉగ్రంగా రాసాగింది.

వాళ్లు ప్రాణభయంతో పారిపోయి ఒకరినొకరు తోసుకుంటూ రాజ సమ్ముఖానికి చేరుకున్నారు. దాయి కన్నీళ్లతో ప్రభువు ఘయ్యూర్ పాదాలను కడిగి తన గోడును వెలిబుచ్చింది.

రాజు అడిగాడు– "నీవు చెప్పిన మాట నిజమేనా? గత రాత్రి ఆమె తన కన్యాత్వాన్ని పోగొట్టుకున్నదా?"

దాయి అన్నది– “నా కళ్లతో చూసాను ప్రభూ! ఆమె లోదుస్తులపై రక్తపు మరకలు. రాకుమారి మాటలలో కొత్త చురకలు”.

రాజు ఘయ్యూర్ ఉన్నవాడున్నట్లు అంతఃపురానికి పరుగు పరుగున వచ్చాడు– “యువరాణీ! ఇది నిజమా! రాత్రి ఎవరో అపరిచితుడు నీకు చేయకూడని పని చేసాడా! నీ కన్యాత్వాన్ని దోచుకున్నాడా?”

యువరాణి సమాధానమిచ్చింది– “నీవు విన్నది నిజమే తండ్రీ! కాని అతడు నా గదిలోకి ఎలా వచ్చాడు, ఎలా మాయమైనాడు, నన్ను నిద్రలో ఉండగా నన్నెలా ఆక్రమించుకున్నాడు, ఇంత కట్టుదిట్టమైన కాపలా ఉన్న అంతఃపురంలో. ఇప్పుడతడేమైనాడు?” అని రెట్టించి అడిగింది యువరాణి.

ప్రభువు ఘయ్యూర్ ఆమెను కోపించబోగా ఆగ్రహంతో యువరాణి తన దుస్తులను చింపి, కత్తితో పొడుచుకోబోతుంటే ప్రభువు అతికష్టం మీద ఆమెనాపి కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు కావించాడు.

తరువాత తన దేశంలో ప్రసిద్ధికెక్కిన జ్యోతిష్కులను, వైద్యులను, పండితులను పిలిపించి తరుణోపాయమడిగాడు. “ఎవరైతే నా కుమార్తె వ్యాధిని నివారణ చేసి ఆమెను మామూలు స్థితికి తీసుకువస్తారో అతడికి ఆమెనిచ్చి వివాహం చేయడమే గాక అర్ధరాజ్యమిస్తాను. ప్రయత్నించి విఫలులైనవారికి శిరచ్ఛేదం చేయబడుతుంది” అని ప్రకటించాడు.

తమ విద్యలు, శక్తియుక్తులపై ప్రగాఢ నమ్మకమున్నవారు ప్రయత్నించారు. ఫలితం లేక దాదాపు నలభైమంది తలలు కోల్పోయారు. వారి తలలు గుట్టగా రాజభవన ద్వారం ముందు పేర్చబడినాయి. దానితో ఇంకెవ్వరూ రాకుమారికి వైద్యం చేయడానికి సాహసం చేయలేదు.

యువరాణి బుదుర్‌కు స్నేహితుడైనవాడు, దాయి కుమారుడు మార్జవాన్, సోదర సమానుడు. అతడు దైవ విశ్వాసి. మంత్రతంత్ర విద్యలు, తాయెత్తులు, జ్యోతిషశాస్త్రం, మాయా మంత్రాలు, హిందూ, ఈజిప్టు గ్రంథాలు పఠించినవాడు. అనేక దేశాలు పర్యటించి అపార అనుభవాన్ని రంగరించుకున్నవాడు. అతడు స్వదేశానికి వచ్చాడు. అతడు వచ్చేసరికే రాజభవనమంతా గందరగోళంలో మునిగి ఉన్నది రాకుమారి ప్రవర్తనతో.

నగరపు ముఖద్వారం వద్ద వెక్కిరిస్తున్నట్లు కానవచ్చాయి నలభై కపాలాలు. ఏమిటివి అని అడిగితే దారేపోయేవాళ్లు సమాధానమిచ్చారు– "'వైద్యుల చేతకాని తనానికి వాళ్ల తలలు సమాధానం చెబుతున్నాయి". మార్జవాన్ ఆ కపాలాల నవ్వులో కనుగొన్నాడు కొత్త మార్గాన్ని.

**షహర్జాది ఆ రాత్రికి కథ చెప్పడం ఆపింది.**

## ✻ 194వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

మార్జవాన్ సరాసరి తన తల్లి దగ్గరకు వెళ్లి యువరాణి 'బుదుర్'కున్న అనారోగ్యం గురించి తెలుసుకున్నాడు. తన తల్లి సలహాతో యువతి వేషంలో యువరాణి బుదుర్ ఉన్న భవనానికి వెళ్లినాడు. అక్కడ కాపలా ఉన్న నపుంసకుడు అడ్డుపెట్టగా మార్జవాన్ తల్లి ఆతడికి బహుమతినిచ్చి, పొగిడి కేవలం ఓ గంటసేపు సమయం అడిగి లోపలకు వెళ్లింది మార్జవాన్‌తో సహా.

మార్జవాన్‌ను చూసి యువరాణి బుదుర్ ఎంతో సంతోషపడి అన్నది– "సోదరా! నీవుకూడా నాకు పిచ్చి పట్టిందనుకుంటున్నావా?"

మార్జవాన్ తన దుస్తులలోంచి జ్యోతిష గణన పట్టికలను, మంత్ర గ్రంథాలను, కొవ్వొత్తిని తీసి ఆమె ముందుంచినాడు.

***–"వాళ్లన్నారు ఆమెకు పిచ్చిపట్టిందని***
***నేనన్నాను అది నీ దృక్కోణం***
***ఆమె వేపు నుంచి చూడు***
***అప్పుడంతా సౌందర్య నిర్మాణం'***

యువరాణి బుదుర్ జరిగిన సంగతంతా అతడికి సవిస్తరంగా తెలిపింది. మార్జవాన్ గ్రహ గణన చేసి అన్నాడు– "సోదరీ, కొద్ది దినాలు ఓపికపట్టు. ఈసారి నేను వచ్చేప్పుడు నీ ప్రియుడితో సహా నీ ముందుకు వస్తాను".

అదేరోజు సాయంకాలం మార్జవాన్ ఆ నగరాన్ని విడిచి దేశాటన ప్రారంభించాడు. నగరం తరువాత నగరం, ద్వీపం తరువాత ద్వీపం అలా నెల రోజులపాటు తిరిగినా ఎక్కడా యువరాణి బుదుర్ గురించి ప్రస్తావన వినబడలేదు.

అయితే సముద్ర తీరాన ఉన్న 'తరబ్' పట్టణంలో ఎవరో యువరాజు కమర్ అల్–జమాన్ గురించి గుసగుసలు పోవడం గమనించి, ఆ కథ, యువరాణి బుదుర్ కథలా ఉండడంతో, అక్కడవాళ్లనడిగాడు– "యువరాజు కమర్ అల్–జమాన్ దేశమేది?"

వాళ్లన్నారు– "నడిచివెళ్తే ఆరునెలలు, సముద్ర ప్రయాణమైతే ఒకనెల – ఆ ఖలిదాన్ పట్టణం".

నౌకలో ప్రయాణం చేసి మార్జవాన్ ఖలిదాన్ దేశానికి దగ్గరలో ఉన్నపుడు తుఫాను బారిన పడగా నౌక ధ్వంసమైంది. గజ ఈతగాడు కావడంతో మార్జవాన్ ఈదుకుంటూ తీరానికి చేరి సొమ్మసిల్లి పడిపోయాడు.

అతడు తీరానికి చేరిన ప్రాంతంలోనే కమర్ అల్–జమాన్, అతడి తండ్రి షారియార్ ప్రభువు ఉంటున్నారు. దైవేచ్ఛతో అదే రోజున వజీరు ప్రభు సందర్శనార్థమై వచ్చి తీరాన పడి ఉన్న యువకుడిని తీసుకురమ్మని తన సేవకులను పంపినాడు.

మార్జ్వాన్ తేరుకున్నాక అతడికి మంచి దుస్తులనిచ్చి, ఆహార పానీయాలతో స్వస్థత చేకూర్చి అతడు పరదేశి అని తెలిసాక, వివిధ రకాల ప్రశ్నలు వేసి అతడికి వైద్యశాస్త్రంలో అనుభవం ఉందని గ్రహించాడు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 195, 196వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

వజీరు అన్నాడు మార్జవాన్‌తో– "నీవు గనుక యువరాజు కమర్ అల్–జమాన్ వ్యాధి నయం చేస్తే నేను, నా ప్రభువు, మా దేశం యావత్తూ నీకు ఋణపడి ఉంటుంది"

"దైవం నన్ను కరుణించాడు. అంతా మనమంచికే" అనుకున్నాడు మార్జవాన్ తనలో తాను. "యువరాజుకేమయ్యింది?" అని అడిగాడు వజీర్‌ను.

"నేనయితే అతడికి పిచ్చి పట్టిందనుకుంటున్నాను. మా ప్రభువేమో చెడుదృష్టి సోకి యువరాజు ప్రవర్తనలో మార్పు వచ్చిందంటున్నాడు" అని జరిగిన కథంతా చెప్పాడు.

మార్జవాన్‌కు అర్థమయ్యింది యువరాణి బుదుర్‌ను ప్రేమలో పడవేసిన వాడు కమర్ అల్–జమాన్ అని. వజీర్‌తో అన్నాడు– “నేనొక్కసారి యువరాజును చూస్తే చెప్పగలుగుతాను ఆ వ్యాధి మందులకు లొంగుతుందా, లేదా అనేది”.

వజీరు తనతోపాటు మార్జవాన్‌ను తీసుకువెళ్ళి ప్రభువు షారియార్‌కు, యువరాజు కమర్ అల్–జమాన్‌కు పరిచయం చేసాడు.

యువరాజును చూడగానే ఆనందం పట్టలేక మార్జవాన్ అన్నాడు– “ఒకే రూపంలో ఉన్న ఇద్దరు అపురూప సుందరులను సృజించిన దైవమునకు కృతజ్ఞతలు.

*నేను గుర్తు తెచ్చుకోవాలనుకుంటున్నాను*
*అందుకే నేనీ పాట పాడుతున్నాను.*
*వాళ్లన్నారు నాకోసం వేచి ఉన్నది మధుపాత్ర*
*వీణ మౌనంగా వేచి ఉన్నదంటున్నాను.*
*నేను గుర్తు తెచ్చుకోవాలనుకుంటున్నాను*
*నీవు ధరించిన నీలి వస్త్రాన్ని*
*నాకోసం వేచి ఉన్న మధుపాత్రను*
*మౌనంగా వేచి ఉన్న వీణాగానాన్ని*
*నేను గుర్తు తెచ్చుకోవాలనుకుంటున్నాను*
*యూసుఫ్ అందాలను*
*సాల్ ముందు పాడిన దావీదు పాటను*
*క్రీస్తు తల్లి మేరీ ప్రేమ సందేశాన్ని*
*నేను గుర్తు తెచ్చుకోవాలనుకుంటున్నాను*
*ఒక్కరాత్రి నా జీవితాన్ని మార్చిన కథను*
*నా పక్కనే శయనించి మాయమైన బాలికను*
*నన్ను తన జ్ఞాపకాలలో బందీ చేసిన ఆమె ధైర్యాన్ని*

కమర్ అల్–జమాన్ అతడివేపు చూసి అన్నాడు– “పరదేశీ, నా మనసులో ఉన్న భావాలను నీవెలా చెప్పగలిగినావు ఇంత స్పష్టంగా!”

ప్రభువు, వజీర్‌లు ఆశ్చర్యపోయారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న రాకుమారుడు ఇప్పుడు మరల మాట్లాడుతున్నాడు. వారికానందం వేసింది.

మార్జ్‌వాన్ యువరాజు శయ్య పక్కనే కూర్చుని గుసగుసగా అతడి చెవిలో అన్నాడు– "యువరాజా! నీవు కలవరపడుతున్న ఆ లతాంగి ఘయ్యూర్ ప్రభువు కుమార్తె యువరాణి బుదుర్. ఆమె నా సోదరి వరుసకు.

కమర్ అల్–జమాన్ వెంటనే లేచి కూర్చున్నాడు– "పద వెళ్దాం!"

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 197, 198, 199వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

మార్జ్‌వాన్ చెప్పింది విన్న యువరాజు కమర్ అల్–జమాన్ అన్నాడు– "ఇంకెందుకాలస్యం, పద వెళ్దాం!"

తన కుమారుడి ఆరోగ్యం ఓ అద్భుతంలా కుదుటపడేసరికి షారిమాన్ ప్రభువు మార్జ్‌వాన్‌ను ఎంతగానో పొగిడినాడు. అనేక బహుమతులు, ప్రశస్తమైన దుస్తులనిచ్చి గౌరవించినాడు.

ప్రయాణానికి తగు సన్నాహాలు మొదలైనాయి. కాని ప్రభువు షారియార్ తన కుమారుడిని పంపేందుకు ఇష్టపడతాడా? కమర్ అల్–జమాన్ దిగులు పడుతుంటే మార్జ్‌వాన్ సలహా ఇచ్చాడు. మనం వేటకు వెళ్తున్నామని చెప్పి వెళ్దాం. అర్ధరాత్రి అటునుంచి అటు ఘయ్యూర్ ప్రభువు పట్టణం వేపు వెళ్దాం. తమ తండ్రికి బాధ కలుగకుండా ఓ లేఖ వ్రాసి మన శిబిరంలో ఉంచినట్లయితే అతడు కూడా కొద్దిరోజులు బాధపడినా తరువాత సర్దుకుంటాడు".

ఎంతో ప్రయత్నం మీద ప్రభువు షారియార్ ఒప్పుకున్నాడు వేటకు ఈ యువకులను పంపడానికి. ఒక ఒంటెనిండా వేటకవసరమైన వస్తువులు, ఆయుధాలు, రెండు అద్భుతమైన గుర్రాలు, సిబ్బందిని ఇచ్చి పంపినాడు ప్రభువు.

అర్ధరాత్రి తమ శిబిరంలో ఓ లేఖ ఉంచి యువకులిద్దరూ ఘయ్యూర్ ప్రభువు పట్టణం వేపు దూసుకుపోయారు.

చాలారోజులు ప్రయాణం తరువాత వాళ్లు ఘయ్యూర్ ప్రభువున్న పట్టణానికి చేరుకున్నాక ఓ సత్రంలో విడిది చేసారు. అక్కడ మార్జ్‌వాన్ సలహాతో

యువరాజు కమర్ అల్-జమాన్ జ్యోతిష్కుడి వేషం వేసుకున్నాడు. ఇద్దరూ స్నాన గృహంలో శుభ్రపడి పులికడిగిన ముత్యాల్లా మెరుస్తూ మరుసటిరోజు ఉదయాన రాజభవనం వేపు వెళ్లారు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 200వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

కమర్ అల్-జమాన్ జ్యోతిష్కుడి వేషంలో రాజభవనపు ప్రధాన ద్వారం వద్ద ఉన్న ద్వారపాలకులు, సైనికులను చూసి గొంతెత్తి అరవసాగినాడు-

గుర్తుంచుకోండి
ప్రియతమ ప్రజలారా,
నేను పేరొందిన జ్యోతిష్కుడిని.
మాయామంత్ర విద్యలు తెలిసినవాడిని
ఇంద్రజాల, మహేంద్రజాల టక్కుటమార
గోకర్ణ విద్యలలో ఆరితేరినవాడిని
నిధుల రహస్యాలు, మంత్రసిద్ధులు
చీకటి క్షుద్రవిద్యలు, తాయెత్తులు
అన్నీ నా దగ్గరున్నాయి.
ప్రియతమ ప్రజలారా
గుర్తుంచుకోండి
ఇసుకలో వ్రాస్తాను మంత్రాక్షరాలను
ఇట్టే నిలదీస్తాను భూత పిశాచాలను
అష్టదిగ్బంధనం చేస్తాను దెయ్యాలను
గృహ సమస్యలకు, కుటుంబ సమస్యలకు
భార్యాభర్తల మధ్య అనుకూల దాంపత్యానికి
వ్యాధి నివారణకు, వశీకరణకు
తాయెత్తులున్నాయి.
మీ ప్రేమ నాకు చాలు

రుసుము చెల్లించనక్కర్లేదు
మీరు విజయం సాధిస్తే కానుకలివ్వండి
శత్రువు ప్రతి ఎత్తుగడకూ
నా వద్ద ఉన్నది ప్రత్యేక తాయెత్తు.
గుర్తుంచుకోండి ప్రజలారా
నేను మహా మాంత్రికుడిని
ప్రజలకు మిత్రుడిని.

అక్కడ గుంపుగా పోగైన వాళ్లందరూ అతడిని చూసి ఆశ్చర్యపోయారు. ఇంత చక్కని యువకుడు రేపు దుర్మరణం పొందనున్నాడా! వారిలో ఒకడన్నాడు– "కుమారా! అటుచూడు. అవి నలభై కపాలాల గుట్ట. ఎందరో పేరుమోసిన వైద్యులు, జ్యోతిష్కుల తలలవి. వెళ్లిపో ఇక్కడ నుంచి. ప్రభువు లోపలికి పిలిచాడంటే వెళ్లక తప్పదు. వెళ్లినాక యువరాణి ఆరోగ్యం కుదుటపడలేదనుకో, నీది నలభై ఒకటవ తల ఆ గుట్టపైకెక్కుతుంది".

జ్యోతిష్కుడి వేషంలో ఉన్న కమర్ అల్–జమాన్ అన్నాడు–

"నేను జ్యోతిష్కుడిని
నేనింకా అరవై ఏళ్లు బతుకుతాను.
నా జాతకమే నేను చెప్పలేకపోతే
ఈ విద్యలన్నీ దండగ కాదా!
నాకు శుక్రదశ ఇప్పుడు
నాకు తిరుగులేదిప్పుడు!"

అక్కడవాళ్లు అన్నారు– "కుమారా! నీమీద నీకున్న నమ్మకం మమ్మల్ని ముగ్ధులను చేస్తున్నది. అయితే నీ అల్పాయుష్షు నిన్ను కత్తికెర చేస్తున్నది కదా!"

ఆ గొడవ తన రాచమందిరపు కిటికీలోంచి చూస్తున్న ప్రభువు ఘయ్యూర్ కంటబడింది. తన వజీర్‌ను పంపి జ్యోతిష్కుడిని తన వద్దకు పిలిపించుకున్నాడు ప్రభువు.

ప్రభువు ఘయ్యూర్‌ను చూడగానే జ్యోతిష్కుడి వేషంలో ఉన్న యువరాజు కమర్ అల్–జమాన్ అత్యంత వినయ విధేయతలతో ప్రభువుల హస్తాల మధ్య ఉన్న నేలను ముద్దాడి–

"ప్రభువుల ముందు జ్ఞానులు
మోకరిల్లుతారు ఎనిమిది విషయాలకు
జ్ఞానం, బలం, శక్తి, దానశీలత
అదృష్టం, విజయాలు
పక్షిరెక్కలపై పక్షిగొంతు లాంటి స్వరం
అపురూప విషయాలపై ఆసక్తి"

ఆ మాటలు విని ప్రభువు ఘయ్యూర్ యువ జ్యోతిష్కుడి అందచందాలకు ఆశ్చర్యపోయినాడు– "జ్యోతిష్కుడా, నీకీ జ్యోతిష్కుడి దుస్తులు అసలు నప్పలేదు. నా కుమార్తె వ్యాధిని నీవు నయం చేయగలిగితే నేను ఆనందంగా ఆమెను నీకిచ్చి వివాహం చేస్తాను. నీ మందులు, మంత్ర తంత్రాల వల్ల ఆమె ఆరోగ్యం కుదుట పడకపోతే, నీకు మరణ దండన తప్పదు"

జ్యోతిష్కుడు సరేనన్నాక ఘయ్యూర్ ప్రభువు అంతఃపుర భటుల అధికారిని పిలిపించి జ్యోతిష్కుడిని అంతఃపురంలోకి తీసుకువెళ్లమన్నాడు.

అంతఃపురంలోని అభ్యంతర మందిరంలో జ్యోతిష్కుడిని కూర్చోబెట్టి యువరాణి బుదుర్‌ను తీసుకురమ్మని చెలికత్తెలతో చెప్పినాడు అంతఃపుర రక్షకభటుల అధికారి. ఆతడితో అన్నాడు జ్యోతిష్కుడి వేషంలో ఉన్న కమర్ అల్–జమాన్– "నేను ఆమెను చూడకుండానే ఆమె వ్యాధి నయం చేస్తాను. మా ఇద్దరి మధ్య ఓ తెర ఏర్పాటు చేయగలరు".

నపుంసకుడైన రక్షకభట అధికారికి ఆ యువకుడి ధైర్యం, మనోనిబ్బరం, రూపం అన్నీ నచ్చాయి– "కుమారా! పర్యవసానం తెలిసీ నీవీ సాహసానికి ఒడిగడుతున్నావు. ఆమెను చూడకుండానే వ్యాధిని నయం చేయగలవా?"

కమర్ అల్–జమాన్ నవ్వి అన్నాడు– "ఈ జ్యోతిష గణనాయంత్రం, ఈ మంత్ర తంత్రాల గ్రంథాలు, ఈ మంత్రదండం చాలా విలువైనవి. మిత్రమా! నేను గెలిచినాక నీకెన్ని కానుకలు ఇస్తానో చెబుతాను. కళ్లు మూసుకుని ఈ గవ్వలను నీ చేతుల్లోకి తీసుకుని పట్టిక మీద వేయి, నీకర్థమవుతుంది నా శక్తి".

మరింత ఆశ్చర్యపోయిన నపుంసక అధికారి గవ్వల్ని విసిరాడు జ్యోతిష్కుడు పరచిన బంగరు, వెండి జలతారు వస్త్రంపై.

"అదృష్టవంతుడివి మిత్రమా! నీ గవ్వలు ఆరు సంఖ్యను సూచిస్తున్నాయి కదా – ఆరు వెల్లకిలా మూడు బోర్లాపడి. ఆరు సంఖ్య హూపో పక్షికి చిహ్నం. ఇవ్వాల్టికి ఆరు నెలలలోపునే నీకు పదోన్నతి, స్వేచ్ఛ లభిస్తాయి".

నపుంసక అధికారి ఇంకా ఆనందపడి జ్యోతిష్కుడికి వలసిన సదుపాయాలు కలిగించాడు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 201, 202, 203, 204వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఆ అభ్యంతర మందిరంలో అడ్డంగా ఒక తెర ఏర్పాటు చేసారు. తెరకిటు పక్కన జ్యోతిష్కుడు, నపుంసక అధికారి ఉన్నారు. జ్యోతిష్కుడు కలం, కాగితం తీసుకుని లేఖ వ్రాసినాడు–

"ఖలిదాన్ ద్వీపాల చుట్టుపక్కల దేశాలకు ప్రభువైన షారిమాన్ కుమారుడు కమర్ అల్–జమాన్ స్వయంగా వ్రాస్తున్న లేఖ! అల్ కుసుర్, అల్ బుదుర్ పట్టణాలకు రాజు ఘయ్యూర్ ప్రభువు ఏకైక కుమార్తె యువరాణి అల్–బుదుర్‌కు ప్రేమతో వ్రాయునది!

నా హృదయంలోని ప్రేమాగ్ని తీవ్రతను వర్ణించడానికి పదాలు చాలడం లేదు. సిరా దానిని వ్యక్తీకరించలేకపోవచ్చును కాని నా రక్తం ఆ విషయంలో వెనుకంజ వేయదు. ఆ మంత్రముగ్ధమైన రాత్రి నీవు నాలో రగిలించిన ప్రేమ నన్ను మరింత కాల్చివేస్తున్నది. ఈ లేఖతో పాటు ఆ రాత్రి నీవు నా వేలికి తొడిగిన అంగుళీయకమును నీవు నన్ను గుర్తించడానికి జతపరుస్తున్నాను. ఎవరి హృదయాన్ని నీ చూపులనే అగ్నితో కాల్చినావో – ఎవరి మనసును సుడిగుండంలా మార్చినావో – అతడు నీ వద్దకు వచ్చినాడు నిన్ను వెదుక్కుంటూ – ప్రియతమా, రా! –నీ కమర్ అల్–జమాన్".

ఇంతలో అంతఃపురం సేవిక వచ్చి అన్నది– "యువరాణి అల్–బుదుర్ తాను ఏ జ్యోతిష్కుడినీ కలవనని చెప్పమన్నది".

జ్యోతిష్కుడు అన్నాడు– "ఆమె రానక్కరలేదు. ఈ లేఖను ఆమెకు ఇవ్వు" అని లేఖను, ఉంగరాన్ని అందమైన వస్త్రంలో చుట్టి ఇచ్చాడు.

పరిచారిక దానిని రాకుమారికి ఇవ్వగానే ముందు కోపించినా, ఆసక్తితో ఆమె ఆ అద్భుత వస్త్రాన్ని విప్పగానే లేఖ, దానిలోంచి ఉంగరం జారి నేలమీద పడింది. అది చూడగానే ఆశ్చర్యపడిన యువరాణి లేఖను చదివి ఒక్కక్షణం నివ్వెర పోయినా, వెంటనే తన గది నుంచి పరుగు పరుగున వచ్చి అభ్యంతర మందిరంలోని తెరను నెట్టి ఆ యువకుడి ముందు కన్నార్పకుండా చూస్తూ నిలబడింది.

ఆమెను చూసి కమర్ అల్-జమాన్ కూడా నిలబడి ఆమెను తదేకంగా ప్రేమ దృక్కులతో చూడసాగినాడు.

అచ్చుగుద్దినట్లు ఒకేరూపంలో ఉన్న వారినిద్దరినీ చూసిన నపుంసక అధికారి విస్మయుడై అలా చూస్తూనే ఉండిపోయాడు.

ఒకరినొకరు గుర్తుపట్టినవారై ఆ ప్రేమికులిరువురు ఒకరి కౌగిలిలో మరొకరు ఒదిగి, ప్రేమ పావురాల్లా కువకువలాడసాగినారు.

నపుంసక అధికారి వారినక్కడే వదిలి పరుగు పరుగున ఘయ్యూర్ ప్రభువు వద్దకు వెళ్లగా, ప్రభువు అన్నాడు- "ఏమయ్యింది! నలభై ఒకటవ తల అలంకరణకు సిద్ధమైనదా!"

నపుంసక అధికారి అన్నాడు- "ప్రభూ! ఈ యువ జ్యోతిష్కుడిని తమరు సరిగా గమనించనట్లున్నారు. అతడు రాకుమారి బుదుర్‌లు అచ్చుగుద్దినట్లు ఒకే రూపురేఖలు. ఎంతోకాలం తరువాత కలిసిన ప్రియ స్నేహితుల్లా వారు ఇతర ప్రపంచంతో నిమిత్తం లేకుండా ప్రేమకబుర్లలో పడినారు. తాము స్వయంగా వచ్చి చూస్తే సర్వం తమకే బోధపడుతుంది".

ఘయ్యూర్ ప్రభువు ఎంతో ఉద్వేగంతో తన కుమార్తె గదికి వచ్చేసరికి ఆ యువ ప్రేమికులు పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకుంటున్నవాళ్లు లేచి నిలబడి అతడి ముందున్న నేలను ముద్దాడినారు.

జ్యోతిష్కుడి వేషంలో ఉన్న కమర్ అల్-జమాన్ అన్నాడు- "నేను ఖలిదాన్ ద్వీపాల ప్రభువు షారిమాన్ కుమారుడైన కమర్ అల్-జమాన్‌ను" అని ఆ అద్భుత రాత్రి నుంచి ఆనాటి వరకు జరిగినదంతా సవివరంగా తెలియజేసినాడు.

ఘయ్యూర్ ప్రభువు ఆశ్చర్యపడి అన్నాడు- "ఈ కథను నిశితమైన సూదితో కంటిమూలల్లో లిఖిస్తే, భవిష్యత్తరాల వారికి పాఠాలను నేర్పుతుంది" అని పలికి తన రాజ్యంలో ప్రసిద్ధ లేఖకులతో ఆ అద్భుత గాథను గ్రంథస్థం చేయించాడు.

మతపెద్దలైన ‘కాదీ’లను, సాక్షులను రప్పించి యువరాణి బుదుర్‌కు, యువరాజు కమర్ అల్-జమాన్‌కు వివాహ పత్రాన్ని వ్రాయించినాడు. మార్జవాన్, అతడి మాతృమూర్తి ఈ పెళ్లికి ముఖ్య బాధ్యతలు స్వీకరించినారు. నగరమంతా వేడుకలు ఘనంగా జరిగాయి.

కొన్ని వారాలు గడిచాయి. ఓరోజు రాత్రి కమర్ అల్-జమాన్‌కు కలలో తండ్రి షారిమాన్ ప్రభువు దుఃఖంతో విలపిస్తూ కనిపించాడు. నిద్రనుంచి మేల్కొన్న కమర్ అల్-జమాన్‌ను చూసి యువరాణి బుదుర్ అన్నది- “ప్రియతమా! ఏమిటి అలా కూర్చుని ఉండిపోయావు? కడుపునెప్పిగా ఉన్నదా? సొంపు కషాయం చేసి ఇస్తాను. లేక తలనెప్పిగా ఉంటే చందనపట్టీ వేసి చల్లబరుస్తాను. అజీర్ణంగా ఉంటే పొట్టను వేడినీటితో తడిపిన పట్టీతో తుడిచి గులాబి నీళ్లను చిలకరిస్తాను. నా కంటిదీపమా! నీవలా దిగులుపడుతూ కూర్చుంటే నాకు భయమవుతున్నది” అన్నది రాకుమారి బుదుర్.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## ✻ 205, 206వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

తన తండ్రి కలలోకి రాగా కన్నీటి పర్యంతమై దిగాలుగా కూర్చున్న కమర్ అల్-జమాన్‌ను ఓదారుస్తూ బుదుర్ యువరాణి అన్నది- “నా కంటి దీపమా! నీ మనోవ్యథ నాకు వివరించు. బాధ పంచుకుంటే తగ్గుతుంది కదా!”

కమర్ అల్-జమాన్ అన్నాడు- “రాత్రి నా తండ్రి కలలో కనిపించాడు. ఆయన అనారోగ్యంగా ఉన్నాడు. మనం మా దేశానికి వెళ్దాం. నాతో వచ్చేందుకు సిద్ధమేనా ప్రియా?”

బుదుర్ యువరాణి అన్నది- “ప్రియసఖుడా, నీవెక్కడ ఉంటే నాకక్కడే స్వర్గం. నీ కష్టసుఖాలు నావి కావా! వెంటనే ప్రయాణ సన్నాహాలు కావిద్దాం” అని తన తండ్రికి వార్త పంపింది.

ఘయ్యూర్ ప్రభువు తన కుమార్తె పిలుపు వినగానే అర్ధరాత్రి అని సంకోచించకుండా వేగంగా యువరాణి మందిరానికి వచ్చి- “అమ్మా! ఏమన్న ఆపద సంభవించిందా?” అన్నాడు భయాందోళనలతో.

రాకుమారి అన్నది– “రేపు ఉదయమే మేము ఖలిదాన్ వెళ్లదలుచుకున్నాము. తగు ఏర్పాట్లు చేయగలరు. అక్కడ రాకుమారుడు కమర్ అల్–జమాన్ తండ్రిగారైన షారిమాన్ ప్రభువు అస్వస్థతకు గురై, తన కుమారుడిని కలవరిస్తున్నాడని తెలియవచ్చింది. తమరి అనుమతి కోసం ఇంత అర్ధరాత్రి పిలవవలసి వచ్చింది. క్షమించగలరు” అన్నదామె.

ఘయ్యూర్ ప్రభువు అన్నాడు– “తప్పక వెళ్లవలసిందే! అయితే ఏడాదికల్లా మరల మీరిరువురు ఇక్కడికి వస్తామని ప్రమాణం చేయాలి”.

తెల్లవారేసరికల్లా ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. గుర్రాలు, ఒంటెలపై రకరకాల వస్తువులు, కానుకల నుంచి సేవకులను తోడుగా పంపుతూ అల్లుడు కుమార్తెలకు సాదరంగా వీడ్కోలు చెప్పినాడు ఘయ్యూర్ ప్రభువు, మార్జవాన్‌లు.

ముప్పైరోజులు ప్రయాణించి ఆ బృందం ఓ చక్కటి మైదానాన్ని చేరుకున్నది. ఫలవృక్షాలు, సెలయేర్లు, పూలమొక్కలున్న ఆ ప్రదేశాన వాళ్లు విశ్రాంతి తీసుకుందామనుకున్నారు. యువరాణి, యువరాజుల శిబిరం ఓ ఖర్జూర వృక్షపు చల్లని నీడలో ఏర్పాటు చేయగా అలసి ఉన్న ఆమె వెంటనే గాఢంగా నిద్రపోయింది.

మిగతా శిబిరాల ఏర్పాట్లు పూర్తికాగానే సేవకులకు విందు చేసుకునేందుకు అనుమతినిచ్చి వారంతా సందడి సందడిగా ఆ ఏర్పాట్లతో ఉండగా రాకుమారుడు కమర్ అల్–జమాన్ తమ శిబిరంలో బుదుర్ యువరాణి గాఢ నిద్రలో ఉండడం గమనించినాడు. ఆమెను చూస్తుంటే అతడికి వారి తొలిరాత్రి సమాగమం గుర్తుకు వచ్చింది.

ఆకుపచ్చ పసుపు మిశ్రిత తివాచీలపై అందంగా శయనించి ఉన్నదామె. ఆమె తలగడ కెంపు ఎరుపురంగులో ఉండి, ఆమె దేహంపై కప్పి ఉన్న పలుచటి వస్త్రం ఏప్రికాట్ లేత గులాబి వర్ణంతో, ఆమె లోదుస్తులు నీలిరంగు మొసుల్ సిల్కు తళతళలతో మెరుస్తూ ఉండగా, సెలయేటి నుండి వస్తున్న చల్లటి వాయు వీచికలకు అప్పుడప్పుడు ఆమె కప్పుకున్న తెల్లటి సిల్కువస్త్రం పక్కకు తొలగి ఆమె నాభి చిటికెడంత కస్తూరి, కుంకుమలు నింపిన కలశంలా మనోహరంగా కానరాగా తన్మయుడైనాడు రాకుమారుడు.

*నిదురపో చిన్నారీ నిదురపో హాయిగా*
*ఖర్జూరపు చెట్లు తాగుతున్నాయి చల్లని ఎండను*
*స్వర్ణ భ్రమరమొకటి సరసాలాడేను గులాబీలతో*
*నిద్రలో నీ అధరాలు చిరునవ్వులు కురిసేను*
*నిదురపో ప్రియసఖీ నిదురపో హాయిగా!*

*నిదురపో నెరజాణా నిదురపో హాయిగా*
*చెదరనీకు ఆ చిరునవ్వుల విద్యుల్లతను*
*నీ ముంగురుల మేఘాలు ముసురుతున్నాయి*
*అధరాలపై అమృత వర్షం అదుగో కురుస్తున్నది*
*నిదురపో జవరాలా నిదురపో హాయిగా!*

*నిదురపో లలితాంగీ నిదురపో హాయిగా*
*కదలనీకు నీ స్తన ద్వయాన్ని నిదుర గాఢతలో*
*అలలలా కదులుతూ అవి నన్ను కదిలించేను*
*పాలకడలి దాగున్న ఫలములే కదా అవి*
*నిదురపో ప్రేమపావురమా నిదురపో హాయిగా!*

*నిదురపో కోమలీ నిదురపో హాయిగా*
*స్వర్ణ సైకత శ్రోణి నీ జఘన ద్రోణి*
*మనోహర శ్రేణి నీ అంఘ్రి చరణాలో నీలవేణి*
*మధురసము లొలికించు నీ సురుచిరవాణి*
*నిదురపో మనోరంజనీ నిదురపో హాయిగా!*

*నిదురపో ప్రాణేశ్వరీ నిదురపో హాయిగా*
*నా హృదయ పద్మమ్ము రగులుతున్నది ప్రేమాగ్నిలో*
*నీ దేహపు చందన, గులాబి స్పర్శ కావాలి దానికి*
*ఒంటరి తనపు శీతలత్వాన్ని ఓడించేందుకు*
*నిదురపో నెచ్చెలీ నిదురపో హాయిగా!*

భార్యతో శృంగారకేళికై మనసు త్వరపడగా కమర్ అల్-జమాన్ ఆమె పక్కనే శయనించి ఒక్కో వస్త్రాన్ని సున్నితంగా తొలగిస్తూ గులాబీ లోయను కప్పి ఉన్న లోదుస్తులకున్న సిల్కు దారాన్ని లాగబోగా అతడి దృష్టి నాకర్షించింది, ఆమెకు

రక్షరేఖగా అక్కడ మెరుస్తున్న కార్నెలియన్ ఎరుపు తాయెత్తు ఫలకం అత్యంత సున్నితమైనది పలుచనిది. దానిపై మంత్రాక్షరాలు లిఖించబడి ఉన్నాయి.

సున్నితంగా లాగగానే ఆ సిల్కుతాడు, కార్నెలియన్ ఫలకం ఓ హారంలా అతడి చేతిలోకి వచ్చాయి. బహుశా మార్జవాన్ ఆమెకు రక్షగా ఇచ్చిన తాయెత్తని గ్రహించాడు యువరాజు. గాఢనిద్రలో ఉన్న యువరాణి బుదుర్ భర్త చర్యలను గమనించలేదు. ఆ ఫలకంపై ఏమి వ్రాసి ఉందో తెలుసుకోవాలనే కుతూహలం పెరగగా రాకుమారుడు బుదుర్ యువరాణిపై వస్త్రాన్ని సరిచేసి దుప్పటి కప్పి శిబిరం బయటకు వచ్చాడు సూర్యకాంతిలో దానిని సరిగా చూసేందుకు. ఆ తాయెత్తు చతుర్ముఖములు కలిగి ఒక్కో ముఖంపై ఒక్కో అక్షరం, బొమ్మ చిత్రించబడి ఉన్నాయి. అతడా ఎర్రటి ఫలకాన్ని పైకెత్తి పట్టుకోగానే ఎక్కడి నుంచి వచ్చిందో ఓ పెద్ద పక్షి దానిని ముక్కున కరచుకుని వేగంగా దాపులనున్న చెట్లపైకి ఎగిరిపోయింది. ఆ హఠాత్పరిణామానికి నిశ్చేష్టుడైనాడు యువరాజు కమర్ అల్–జమాన్.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# ✳ 207వ రాత్రి కథ ✳

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఎర్రగా ధగధగా మెరుస్తూ దోరమగ్గిన దొండపండులా, రక్తమెండిన మాంస ఖండంలా కానవస్తున్న కెంపు తాయెత్తును చూసి ఓ పెద్ద పక్షి చివాలున వచ్చి ముక్కున కరుచుకుని వేగంగా ఎగిరిపోయి చెట్టు చిటారుకొమ్మన కూర్చున్నది రాకుమారుడు కమర్ అల్–జమాన్‌ను వెక్కిరిస్తున్నట్లుగా. ఆ హఠాత్పరిణామానికి దిగ్భ్రాంతికి గురైన యువరాజు నోరు తెరచి అలా చూస్తూండిపోయాడు ఆశ్చర్యంగా.

తెప్పరిల్లినాక అనుకున్నాడు– "అయ్యో! ఎంత పొరపాటు చేసాను. నా కుతూహలం ఎంత పనిచేసింది. ఈ తాయెత్తు నా ప్రియసఖికి ప్రాణసమానం కావచ్చు. అందుకే దానిని భద్రంగా అక్కడ దాచుకున్నది. ఇప్పుడు దానిని పక్షి ఎత్తుకుపోయిందంటే బాధపడదా! ఏది ఏమైనా ఈ పక్షిని వెంబడించి ఆ కెంపు తాయెత్తును స్వాధీనం చేసుకుంటాను" అని తర్కించి ఆ పక్షి ఉన్న చెట్టు దగ్గరకు వెళ్లి గురిచూసి రాయి విసిరాడు.

ఆ పక్షి ఆ చెట్టు నుంచి మరో చెట్టుకు ఎగిరి, విలాసంగా కూర్చున్నది. చేసేదేమీ లేక యువరాజు కాస్త దూరంలో చతికిలబడినాడు. అతడిని ఆటపట్టించడానికన్నట్లు అది కూడా నేలపైకి దిగి వచ్చి కాస్త దూరంలో నిలబడి రెక్కలల్లల్లాడ్చింది పరిహాసపూర్వకంగా. యువరాజు లేవగానే అది గాలిలోకి ఎగిరింది. అతడు గెంటితే అది గెంతింది. అలా గంటలు గంటలు గడిచాయి. ఎగుర్తూ గెంతుతూ ఆగుతూ ఆ పక్షి, దానిని వెంబడిస్తూ రాకుమారుడు మైదానాలు, గుట్టలు, లోయలు దాటి శిబిరాలకు చాలా దూరంగా వెళ్లినారు. చీకటి పడేవేళకు ఇద్దరూ అలసిపోయారు. ఆ రాత్రి నిద్రపోయాక మరల మొదలైంది వేట. పగలంతా పరిగెత్తడం దొరికినవేవో తిని నిద్రపోవడం. ఆ పక్షి ఎప్పుడు ఏమి తినేదో తెలియదు కాని తెల్లవారేసరికల్లా ముక్కున కెంపు తాయెత్తుతో ప్రత్యక్షమయ్యేది- "రా పట్టుకోనన్ను" అన్నట్లు. పది రాత్రులూ, పగళ్లు గడిచాయి. పదకొండవ రోజు ఉదయానికల్లా ఆ పక్షి రాకుమారుడిని సముద్ర తీరాన ఉన్న ఓ నగరపు ద్వారం వద్దకు రాగానే తన ముక్కున ఉన్న కెంపును కోటగోడపై పెట్టి మూడుసార్లు అరిచింది- కమర్ అల్-జమాన్ అన్న ధ్వని వచ్చేట్లు. అతడు కోటగోడ వద్దకు రాగానే మరల తాయెత్తును నోట కరుచుకుని కోట గోడలమీదుగా ఎవరికీ అందనంత ఎత్తులో ఎగిరి సముద్రం వేపు వెళ్లి మేఘాల్లో అదృశ్యమైంది.

రాకుమారుడు కమర్ అల్-జమాన్ దుఃఖానికి అంతులేదు. నిస్సహాయత, తనలోని దుఃఖాన్ని మరింత ఎక్కువ చేసింది. కెంపు కార్నిలియన్ తాయెత్తు పోగొట్టినందుకు యువరాణి బుదుర్ ఎంత బాధ పడుతుందో ననుకుని, తాను ఆమెను ఒంటరిగా వదిలి వచ్చినందుకు ఏమనుకుంటుంది, తన తండ్రి ప్రభువు షారిమాన్‌కు ఆమె ఏమని సంజాయిషీ ఇస్తుంది – అని ఇలా పలువిధాల ఆలోచిస్తూ అతడు ఆ నగర వీధుల్లో అన్యమనస్కంగా తిరగసాగినాడు.

*నీ రక్షణలో ఉండాల్సిన యువరాణిని వదిలి వచ్చావు*
*ఆమెకు ప్రాణప్రదమైన దివ్యమణిని పక్షికిచ్చావు*
*అజాగ్రత్తలో రెండిటినీ పోగొట్టుకున్నావు*
*మృత్యువు ఎదురొచ్చినా వదిలిపోనన్నావు*
*పక్షి వెంబడి పడి పరాయిదేశ మేగినావు*
*నీ ఉద్దేశం మంచిదే, విధికి తలొగ్గినావు.*

ఆ పరాయి దేశంలో ఎవరూ అతడిని కనీసం పలకరించలేదు. అలా నడుస్తూ నడుస్తూ అతడు నగరాని కావల ఉన్న ఉద్యానవనంలోకి వెళ్లి అక్కడ మొక్కలకు నీళ్లు పోస్తున్న తోటమాలిని చూసి "అస్సలామ్ లేకుం" అన్నాడు.

అతడు యువరాజు కమర్ అల్-జమాన్‌ను చూసి అభివాదం చేసినాడు. యువరాజు అడిగాడు- "ఈ నగరంలో ఎవరూ కొత్తవాడిని ఆదరించరా? పైపెచ్చు కోపంగా, ప్రాణాలు తీసేటంత క్రూరంగా చూస్తున్నారెందుకు?"

అతడన్నాడు- "రాకుమారా! కొన్నేళ్ల క్రితం పశ్చిమదిక్కు నుంచి పడవలలో వచ్చిన పరాయి దేశస్థులు విశ్వాసులైన స్థానికులందరినీ వధించి ఈ పట్టణాన్ని ఆక్రమించుకున్నారు. ఈరోజు వారికి పండుగరోజు కాబోలు అందుకే నిన్ను చూసీ చూడనట్లు వదిలేసారు. వాళ్లు స్నానం చేయరు, చర్మపు దుస్తులు ధరిస్తారు. ఎండు మాంసం, చేపలు కాల్చుకు తింటారు. నురగ వచ్చే బీరు ద్రవం తాగుతూ ఇక్కడ విధ్వంసం సృష్టించినారు. స్నాన గృహాలను కూల్చివేసినారు. కొత్త దుకాణాలను తెరిచినారు. వాటిలో వారి మహిళలు గుర్రపు మూత్రం కంపుకొట్టే నురగలు పొంగు ద్రవాన్ని అమ్ముతారు. ఆ ఆడవాళ్లు స్నానం చేయరు. ముఖానికి సున్నం, కోడిగుడ్డు పెంకులపొడి పులుముకుంటారు. దుమ్మూ ధూళి నుంచి తప్పుకోవడానికి అవసరమైన వస్త్రాలు ధరించరు. నరక లోకపు అగ్నులు కూడా వీళ్లను శుద్ధి చేయలేవేమో! నేనిక్కడ దేవుడు నిర్దేశించినంత కాలం బతికి కన్నుమూస్తాను దైవ స్మరణలో!"

ఆ దయామయుడైన తోటమాలి తన ఆశ్రయంలో ఉన్న రాకుమారుడు కమర్ అల్-జమాన్‌ను తన ఇంటికి తీసుకువెళ్లి ఆతిధ్యమిచ్చినాడు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 208వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

యువరాజుతన కథనంతా తోటమాలికి చెప్పినాడు. తోటమాలి అన్నాడు- "యువరాజా! దైవకృపతో యువరాణి బుదుర్ ఖలిదాన్ చేరుకుని నీ తండ్రి మనోవేదన తగ్గించే ఉంటుంది. నీవు దిగులుపడకు. ఇక్కడ నీకు పూర్తి రక్షణ దొరుకుతుంది. ఈ పట్టణం నుంచి ఖలిదాన్ వెళ్లాలంటే ముందుగా నల్లమర్రి

దీవి చేరుకోవాలి. అక్కడ నుంచి ఖలిదాన్‌కు వెళ్లే నౌకలో నీవు నీ దేశం చేరుకోవచ్చు".

బయటకు వెళ్తే అపరిచితుల మధ్య ఏ ప్రమాదం ముంచుకువస్తుందో అని భయపడిన కమర్ అల్-జమాన్ తోటమాలి సంరక్షణలో ఉండి నల్లమబ్రి దీవికి వెళ్లే పడవ కోసం ఎదురుచూడసాగినాడు. ఈలోగా వాతావరణం అనుకూలించ లేదు. తుఫాను భీభత్సంతో సముద్రం అల్లకల్లోలమై కానవచ్చింది.

అక్కడ యువరాణి బుదుర్ నిద్రలేచి తన ప్రియసఖుడి కొరకు అటు యిటు చూసింది. తన లోదుస్తులు వదులుగా ఉండడం, కార్నెలియన్ తాయెత్తు కానరాకపోవడంతో ఆందోళన చెంది అనుకున్నది- "సోదరా, మార్జవాన్ నీవు నా రక్షణకై ఇచ్చిన తాయెత్తు నాకు ఆపదను తెచ్చినదా!" అనుకుని బహుశా యువరాజు దానిని పరీక్షించడానికి బయటకు తీసుకువెళ్లి ఉంటాడని ఊహించి వేచి ఉన్నది. గంటలు గడచినా యువరాజు రాకపోయేసరికి ఆమె తగుజాగ్రత్తలు తీసుకున్నది తన రక్షణకై. రెండు రోజులు గడిచాయి. సాహసవంతురాలైన యువరాణి బుదుర్ శిబిరాలలోని మిగతా వారికి అనుమానం రాకుండా తాను యువరాజు కమర్ అల్-జమాన్ దుస్తులు ధరించి, నడుము పటకాను వజ్రాలు పొదిగిన బంగరు పిడిగల బాకును తగిలించి, తలపై హరివిల్లు రంగుల సిల్కు తలపాగా నుంచి దానిని ఒంటె వెంద్రుకల దారంతో గట్టిగా బిగించి పరిచారికకు తన దుస్తులు తొడిగి, చేతిలో కొరడా పట్టుకుని తాను యువరాజులా పరిచారిక యువరాణి బుదుర్‌లా తన బృందంతో అనేక దినాలు ప్రయాణం చేసి సముద్ర తీరాన ఉన్న ఓ పట్టణాన్ని చేరుకున్నది. ఆ పట్టణ ప్రధాన ద్వారం వద్ద శిబిరాల నేర్పరచి అక్కడ వారినడిగింది ఆ పట్టణం గురించి. వాళ్లన్నారు- "ఈ పట్టణం నల్లమబ్రి ద్వీప నగరం. దీనికి పాలకుడు అర్మానస్".

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 209వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

అక్కడి వాళ్లన్నారు- "ఇది అర్మానస్ ప్రభువు పాలించే నల్లమబ్రి ద్వీప నగరం. అతడి కుమార్తె హయ్యత్ అల్-నఫస్ అందాల రాశి. ఈరోజు ఆమె

పుట్టినరోజు. అందుకే వేడుకలు జరుగుతున్నాయి. ఈరోజు ప్రజలందరికీ విందు భోజనాలు ఏర్పాటు చేయబడినాయి.

కమర్ అల్-జమాన్ వేషంలో ఉన్న యువరాణి బుదుర్ ఓ లేఖ వ్రాసి అర్మానస్ ప్రభువుకు పంపింది- "ప్రభూ! నేను ఖలిదాన్ ప్రభువు షారిమాన్ కుమారుడు కమర్ అల్-జమాన్‌ను. దేశాటనలో భాగంగా తమ పట్టణాన్ని చేరుకున్నాను. తమరు ఈ కానుకలు స్వీకరించగలరు" అని లేఖతోపాటు అనేక విలువైన వస్తువులను సేవకులకిచ్చి పంపింది మారువేషంలో ఉన్న యువరాణి బుదుర్.

షారిమాన్ ప్రభువుతో సత్సంబంధాలు కలిగి ఉన్న అర్మానస్ ప్రభువు వెంటనే తన వజీరు, అధికారులను పంపి అతిధికి స్వాగత సత్కారాలు చేసి తన భవనంలో తగు ఏర్పాట్లు చేసినాడు. మూడు రోజులపాటు విందులు, వినోదాలతో గడిచాయి.

మగవేషంలో ఉన్న యువరాణి బుదుర్ అందచందాలకు ముగ్ధుడైన అర్మానస్ ప్రభువు తన కుమార్తె హయ్యత్ అల్-నఫస్‌నిచ్చి వివాహం చేయ సంకల్పించి అన్నాడు- "కుమారా! నా కుమార్తె పదిహేనేళ్ల ప్రాయంలో ఉన్నది. నీవంగీకరించేట్లయితే నేను మీ ఇద్దరికీ వివాహం చేసి నా రాజ్యాన్ని మీకప్పగించి నేను విశ్రాంతి తీసుకుంటాను".

యువరాణి బుదుర్‌కు ఓ క్షణం ఏ సమాధానమివ్వాలో తోచలేదు. తెలివిగలది కనుక ఆలోచించింది- "నాకిప్పటికే యువరాణి బుదుర్‌తో వివాహ మైందని చెబితే ధర్మశాస్త్రం నాలుగు వివాహాలను ఆమోదిస్తున్నది గనుక వివాహం చేసుకోవచ్చు అంటాడు ప్రభువు. నేను యువరాజును కాదు అతడి వేషంలో ఉన్న యువరాణి బుదుర్‌ను అని చెబితే తానే నన్ను బలవంతంగా వివాహం చేసుకోవడానికి ప్రయత్నం చేయవచ్చు. వివాహ అభ్యర్థనను తిరస్కరిస్తే ఇప్పటి వరకు ఉన్న మర్యాద పోయి నా ప్రయాణానికి ఇబ్బందులు కలిగించవచ్చు. దైవ నిర్ణయంతో నేను ప్రస్తుతం యువరాజు రూపంలో ఉన్నాను. ఈ రహస్యాన్ని ఇలాగే కొనసాగించి చూద్దాం. ప్రతి సమస్యకూ పరిష్కారం, ప్రతి విషానికి విరుగుడూ ఖచ్చితంగా ఉంటాయి. అయితే దేనికైనా కాలం కలిసిరావాలి. అంతేకాక ప్రియసఖుడు కమర్ అల్-జమాన్ వచ్చేసరికి అతడి పేరుమీద ఓ రాజ్యాన్ని, రాణిని కూడా సంపాదించిన

దానినౌతాను కదా! వివాహానంతర శోభన కార్యక్రమాలతోనే గొడవ. దానికి కూడా ఏదో ఉపాయం ఆలోచిస్తాను” అనుకుని

“ప్రభూ! నేను తండ్రిచాటు కుమారుడిని. వివాహానికి నాకు అభ్యంతరం లేదు”

ఆ మాటలు వినగానే అర్మానస్ ప్రభువు ఆనందపరవశుడై కాదీలను, సాక్షులను రావించి వజీర్లు, అమీర్లు, అధికారుల సమక్షంలో వివాహ ఒప్పందం ఖరారు గావించినాడు. అంతేకాక తాను పదవీత్యాగం చేసి కమర్ అల్-జమాన్‌ను ప్రభువుగా పట్టాభిషిక్తుడిని గావించి వివాహాన్ని ఘనంగా జరిపించినాడు.

ఆ రాత్రి పెండ్లి కుమార్తె హయ్యత్ అల్-నఫస్ సర్వాలంకార శోభితయై శోభనపు గదిలోకి ప్రవేశించింది పరిచారికలు, గాయనీమణుల కోలాహలం మధ్య. నూతన వధూవరులను ఆ అందంగా అలంకరించబడిన గదిలో వదిలి నవ్వుల కేరింతల మధ్య వారు నిష్క్రమించారు. మారువేషంలో ఉన్న యువరాణి బుదుర్ తాను పెండ్లి చేసుకున్న యువరాణి హయ్యత్ అల్-నఫస్ మేలిముసుగు తొలగించి ఆ సుందర వదనాన్ని చూసింది. ఆ వధూమణి కూడా చంద్రుడిలా మెరిసిపోతున్న తన వరుడి వదనాన్ని గాంచింది ప్రేమతమకంతో.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 210వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

మాయావరుడు, వధువు ఒకరినొకరు చూసుకున్నారు ప్రేమ నిండిన నేత్రాలతో. బుదుర్ యువరాణి తన వధువైన హయ్యత్ అల్-నఫస్ చంచల నయనాలను, స్వచ్ఛమైన నీటితో నిండిన సరోవరాల్లాంటి నేత్ర ద్వయాన్ని, నునుసిగ్గుల శోభలతో అరవిరిసిన గులాబీల చెక్కిళ్లతో ప్రకాశించిన వదనాన్ని చూసి సంతోషపడింది. ఎండ కన్నెరుగని ఆ సుకుమారి తన వరుడు తన అందాలను తిలకిస్తున్నాడన్న భావన ఆమె హొయలును ద్విగుణీకృతం చేయగా ఆమె నెమ్మదిగా తల పైకెత్తి తన భర్త మోమును చూసి ఆ సౌందర్యానికి ముగ్ధురాలై కనులల్లాడించుచు

సిగ్గుతో తలమునకలు కాగా శిరసొంచి కాలి బొటనవేలితో నేలపై రేఖలు గీస్తూ నిలబడింది. యువరాణి బుదుర్ ఆ బాలికను దగ్గరకు తీసుకుని పెదాలపై తియ్యని ముద్దు నుంచి ఆమెను తన పక్కనే శయ్యపై పరుండమని సంజ్ఞ చేసి తానూ ఆమె పక్కన శయనించి, వధూమణి వస్త్రాలనొక్కొక్క దానిని వయ్యారముగా తీసి కేవలం పలుచటి వస్త్రం నెమలి పింఛపు రంగు కలది ఆమె పాలరాతి దేహాన్ని ఆచ్ఛాదించి ఉండగా, పసిపాపను జోలపాడి నిద్రబుచ్చినట్లు మధుర గీతాలను పాడగా చిన్నారి పెళ్లికూతురు తియ్యటి కలలు కంటూ ఆదమరచి నిద్రపోయింది.

యువరాణి బుదుర్ తాను పూర్తి వస్త్రధారణతోనే ఆమె పక్క నిద్రపోయి తెల్లవారకమునుపే మేల్కొని తన గదికి వెళ్లి యధావిధి దైనందిన కార్యక్రమాలను నిర్వర్తించినది. ఆమె సింహాసనమెక్కినాక అనేక ప్రజోపకరమైన పనులను అమలుచేయడంతో కొత్త ప్రభువుపై ప్రజలకు అమేయ భక్తి విశ్వాసాలు ఏర్పడినాయి.

ఆరోజు ఉదయాన అర్మానస్ ప్రభువు, మహరాణి ఇరువురు రాకుమారి హయ్యత్ అల్-నఫస్‌ను శోభనరాత్రి విశేషాలను గుచ్చి గుచ్చి అడిగారు. ఆమె అన్నది- “నా భర్త చాలా అందమైనవాడు. నన్ను తన పెదాలతో చుంబించి కౌగిలిలోకి తీసుకుని అద్భుతమైన పాటలను పాడుతుండగా నేను మరో లోకంలోకి వెళ్లిపోయాను. అతడు నా పక్కనే నిదురించినాడు”.

ఆ సాయంకాలం మరల యువరాణి  బుదుర్ తన వధువు వద్దకు వచ్చినపుడు మహరాజు, మహరాణిలు తనను అడిగిన ప్రశ్నలను దాచకుండా చెప్పింది చిన్నారి పెళ్లికూతురు హయ్యత్ అల్-నఫస్. ఆ రాత్రి కూడా చక్కని పాటలు పాడుతూ వధువు మెలకువగా ఉండగానే ఆమె దుస్తులను ఒక్కొక్కటి విప్పి నగ్నంగా ఉన్న ఆ బాలికను కౌగిలిలోకి తీసుకుని నుదుటిపై చుంబించి అన్నది- “నీకు మగవాళ్లంటే ఇష్టమా?”.

నఫస్ అన్నది- “అంతఃపుర కాపలాభటులైన నపుంసకులను, మా తండ్రిని తప్ప అన్య పురుషుని కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు తమరు నా జీవితంలో ప్రవేశించారు. నాకూ ఓ సందేహమున్నది. ఆడవారికి లేనిది మగవారికి ఉన్నది ఏమిటి?”

యువరాణి బుదుర్ అన్నది నవ్వుతూ– "అది ఒంటరి వేలు. చాలా తుంటరిది. ఉద్రేకమెక్కువ. స్వర్గాన్ని, నరకాన్ని చూపించగల నిట్టాడి. దానికి యావ ఎక్కువ".

హయ్యత్ అల్–నఫస్ హడిలిపోయింది– "అమ్మో!" అని తన చేతుల పదివేళ్లతో ముఖాన్ని దాచుకున్నది భయపడుతున్నట్లుగా.

మారువేషంలో కమర్ అల్–జమాన్‌గా నటిస్తున్న యువరాణి బుదుర్ నవ్వుతూ అన్నది ఆ చిన్నారిని లాలిస్తూ– "ప్రియురాలా! భయపడకు. ఏదో ఒక మంచిరోజున నీకు నా మాటలలోని నిజానిజాలు అర్థమవుతాయి. నిద్రపో హాయిగా!" వెచ్చని ఆమె దేహస్పర్శకు కరిగిన వెన్నలా హయ్యత్ అల్–నఫస్ నిద్రలోకి జారుకున్నది.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 211వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

మరుసటి రోజు ఉదయం మారువేషంలో ఉన్న యువరాణి బుదుర్ తన గదికి వెళ్లగానే మహారాజ దంపతులు వచ్చి తమ కుమార్తె హయ్యత్ అల్–నఫస్‌ను నఖశిఖ పర్యంతం పరీక్ష చేసారు. "ఈ రాత్రి అన్నా నీ లోదుస్తులు రక్తంతో తడిచాయా? నీ భర్త నీతో హాయిగా గడిపాడా? ఏవి ఎక్కడా నఖదంత క్షతాలే కానరావే! కాస్తయినా నలగని మల్లెపూవులా ఉన్నావు" ఇలా అనేక ప్రశ్నలు వేసి హయ్యత్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆశాభంగం చెందారు. మహరాజుకు కోపం వచ్చింది– "అందగాడు, షారిమాన్ ప్రభువు కుమారుడని నా ఏకైక కుమార్తెనిచ్చి పరిణయం చేసి, రాజ్యాన్నప్పగిస్తే కనీస కృతజ్ఞత లేదా ఈ రాకుమారుడికి. ఈ రాత్రి కనుక అతడు నీ కన్యాత్వాన్ని దోచుకోకపోతే రేపు అతడికిచ్చిన అధికారాన్ని నేను లాక్కుని అతడిని ఈ దేశం నుంచి బహిష్కరిస్తాను. ఇది నా హెచ్చరిక!" అని అరుస్తూ మహరాజు వడివడిగా తన భవనానికి నిష్క్రమించాడు మహారాణితో కలిసి.

రాత్రి యువరాణి బుదుర్ రాగానే ఆ విషయాన్నంతా చెప్పింది హయ్యత్ అల్–నఫస్. యువరాణి బుదుర్ అన్నది– "చిన్నారీ, నేనంటే నీకు ఇష్టమా?" అవునని తలూపింది హయ్యత్.

"నేను నీకో రహస్యం చెబుతాను. ఇది మనిద్దరి మధ్యే ఉండాలి" అని దేవుడి మీద ప్రమాణం చేసాక, కమర్ అల్-జమాన్ వేషంలో ఉన్న యువరాణి బుదుర్ తన వధువైన హయ్యత్‌కు జరిగిన కథంతా చెప్పింది. "కొద్ది రోజుల్లో కమర్ అల్-జమాన్ రాగానే మన ముగ్గురం ఆనందకరమైన కొత్త జీవితాలను ప్రారంభించవచ్చు.

ప్రస్తుత గండం గడిచేందుకు నావద్ద ఓ ఉపాయమున్నది" అని పలికి తోటలోని ఓ కోడిపుంజు మెడ కోసి రక్తాన్ని చిన్ని గిన్నెలో తెచ్చింది యువరాణి బుదుర్. దానిని హయ్యత్ అల్-నఫస్ లోదుస్తులకు, తొడలకు, మధ్యలో గులాబి రేకలకు అంటించినాక ఇద్దరూ నిద్రకుపక్రమించారు.

***అంతవరకు కథ చెప్పి షహర్జాది మౌనం వహించింది.***

# * 212వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

యువరాణి బుదుర్ తన వధువైన హయ్యత్ అల్-నఫస్ దుస్తులకు కోడి రక్తాన్ని అంటించి, తెల్లవారే తన గదికి వెళ్లేముందు మహరాజ దంపతులు అడిగితే ఏం చెప్పాలో హయ్యత్‌కు చెప్పి వెళ్లిపోయింది. ఎంతో ఆతురతతో వచ్చిన మహరాజు మహరాణి తమ కుమార్తె బట్టలకంటిన రక్తపు మరకలను చూసి 'హమ్మయ్య' అనుకున్నారు. మహరాణి ఆ రక్తసిక్త లోదుస్తులను ఓ వెల్వెట్ వస్త్రంపై ఉంచి అంతఃపురంలో ఊరేగింపుగా తీసుకువెళ్లింది. మహరాజు విందు వినోదాలకు ఏర్పాట్లు చేయించాడు. అంతఃపుర స్త్రీలు హయ్యత్ అల్-నఫస్‌ను ఆశీర్వదించి, స్నాన గృహానికి తీసుకువెళ్లి శుద్ధి కార్యక్రమాలు చేసినారు. యువరాణి బుదుర్ మారువేషంలో సభా కార్యక్రమాలు, రాచకార్యాలు నిర్వర్తించి రాత్రి సమయానికి అంతఃపురానికి చేరుకునగా ఇద్దరు నెచ్చెలులుగా కౌగిళ్లలో ఒరిగి కమర్ అల్-జమాన్ రాకకోసం కలలు కనసాగినారు.

అక్కడ ఖలిదాన్‌లో కమర్ అల్-జమాన్ తండ్రి తన కుమారుడు మరణించాడని నిశ్చయానికి వచ్చి సంతాపంలో మునిగి ఉన్నాడు.

తోటమాలి గృహంలో ఉన్న కమర్ అల్-జమాన్ నల్లమ్రద్రి ద్వీపానికి తీసుకువెళ్లే పడవకోసం ఎదురుచూస్తున్నాడు.

అలా దిగులుగా కూర్చున్న కమర్ అల్-జమాన్‌కు పక్కనే ఉన్న చెట్ల మీద పెద్ద కలకలం వినిపించింది. అంతలోనే రెండు పక్షులు భీకరంగా కొట్లాడుకుంటూ రెక్కలతో బాదుకుంటూ, ముక్కులతో పొడుచుకుంటూ కాలిగోళ్లతో రక్కుకుంటూ కొట్టుకునగా ఒక పక్షి ప్రాణాలు కోల్పోయి విగత జీవిగా నేలమీద పడింది. గెలిచిన పక్షి వికటాట్టహాసం చేస్తూ ఆకాశంలోకి ఎగిరింది. కమర్ అల్-జమాన్ ఆశ్చర్యంతో చూస్తూ ఉండగానే మరో రెండు పక్షులు వచ్చి చనిపోయిన పక్షి వద్ద ఒకటి తల దగ్గర, రెండవది తోక దగ్గర నిలబడి కాసేపు దుఃఖించాయి. తరువాత తమ ముక్కులు, గోళ్లతో ఓ గోతిని తవ్వి దానిలో ఆ పక్షిని పాతిపెట్టి మట్టికప్పాయి. ఆ తరువాత అవి ఆకాశంలోకి ఎగిరి కొద్దిసేపట్లోనే తమ వాడిని చంపిన పక్షిని గాయపరిచి తీసుకువచ్చి పక్షిని పాతిపెట్టిన మట్టిపై పడవేసి నిర్దాక్షిణ్యంగా దాని మెడ కొరికి, పొట్ట చీల్చి, పేగులు బయటకు లాగి చంపి అక్కడే పడవేసి ఎగిరిపోయాయి.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## ✻ 216వ రాత్రి కథ ✻

**షహర్జాది కథ చెప్పసాగింది-**

ఆ పక్షుల పోట్లాటను, అంతిమ ఘట్టాన్ని చూసి నివ్వెరపోయినాడు కమర్ అల్-జమాన్. తమ పక్షిని చంపిన శత్రువును జంపి సమాధిపై పడవేసి పక్షులెగిరి పోయాక యువరాజు నెమ్మదిగా వెళ్లి చచ్చిన పక్షిని తదేకంగా చూసాడు. వాడిగోళ్లతో పక్షులు ఆ పక్షి పొట్టను చీల్చగా దాని పొట్టలోని పేగులు బయటకు రావడమే గాక వాటిమధ్య ఎర్రటి మాంస ఖండంలా మెరుస్తూ కనిపించింది కెంపు కార్నెలియాన్ తాయెత్తు. యువరాజు ఆశ్చర్యానికంతులేదు.

అతడిలో ఆశ చిగురించింది. ఆ తాయెత్తు బిళ్లను నీళ్లతో శుభ్రంగా కడిగి తన దుస్తులలో దాచి, తోటమాలి తనను కోరిన విధంగా తోటలో చెదలు పట్టిన చెట్టును నరకడానికి గొడ్డలి తీసుకువచ్చి, నడుముకు జనపనార తాడు బిగించి కట్టుకుని ఎండిన చెట్టును నరకసాగినాడు. ఆ చెదలు పట్టిన చెట్టు

నేలకూలగా ఒకచోట ఠంగున మోగిన శబ్దం వినబడింది. యువరాజు అక్కడ మట్టిని కెల్లగించి చూడగా, కంచు తలుపు దానికింద కొన్ని మెట్లు భూగర్భ గృహంలోకి దారితీసాయి. ఆద్-థాముద్ కాలం నాటిదేమో ఆ గుహ, లోపల ఇరవై పెద్ద పాత్రలు కానవచ్చాయి. ఒకదానిలో ఎర్ర బంగారు కణికలు, మిగతావాటిలో బంగరు పొడి, ఎర్ర బంగారు కణికల మిశ్రమం నింపబడి ఉన్నాయి.

అవన్నీ చూసాక యువరాజు మరల మెట్లెక్కి పైకివచ్చి కంచు తలుపు మూసి తోటమాలి రాకకై ఎదురుచూడసాగినాడు.

తోటమాలి రాగానే సంతోషవదనంతో యువరాజును సమీపించి అన్నాడు– "కుమారా! మంచివార్త. మూడు రోజుల తరువాత ఈ నగరం నుంచి నల్లమర్రి దీవికి వెళ్లే పడవ ప్రయాణం కానున్నది".

కమర్ అల్-జమాన్ ఆనందానికి అంతే లేదు. అతడన్నాడు– "తండ్రీ! ఈరోజు అన్నీ శుభవార్తలే! నీకా విశేషాలు చూపిస్తాను".

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# ✻ 217, 218, 219వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

తోటమాలిని రాకుమారుడు ఆ గుహలోకి తీసుకువెళ్లి ఆ ఇరవై జాడీలను చూపించాడు– "తండ్రీ! మన మత ధర్మం ప్రకారం ఈ ధనమంతా నీది. ఊరూ పేరు తెలియని నాలాంటి వాడికి ఆశ్రయమిచ్చినందుకు దైవం నీకిచ్చిన కానుక ఈ నిధి".

తోటమాలి కన్నీరు కారుస్తూ అన్నాడు– "నాయనా! ఈ వయసులో నాకు నిధులతో పని లేదు. దైవాన్ని స్మరిస్తూ ఈ ఆఖరి రోజులలో ప్రశాంతంగా కాలం గడపడమే. నీవే తీసుకో ఈ ధనాన్ని. కుమారా, నాకు కొద్ది దీరాములు చాలు, నా పార్థివ దేహంపై కప్పే వస్త్రం కొరకు".

కమర్ అల్-జమాన్ అన్నాడు– "తండ్రీ! పరిమళభరిత హస్తభూషణా! న్యాయాన్యాయ, ధర్మాధర్మ విచక్షుణడవు. నీవు సగము నేను సగము ఈ నిధులను పంచుకుందాము".

తోటమాలి అన్నాడు- "కుమారా, నా తల్లి నాకు జన్మనిచ్చి తొంభై ఏళ్లయ్యింది. ఈ తోటలోనే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఈ ఏటి నీరే ఈ మొక్కలకు పోసాను, కాని నాకు ఈ నిధి గురించి తెలియలేదు. నేనీ పట్టణంలో బతికి ఉన్న ఆఖరి దైవ విశ్వాసిని. నేనిక్కడే తనువు చాలించాలనుకుంటున్నాను. కుమారా! నీవన్నట్లు పది జాడీలు నీవు తీసుకువెళ్లు. మిగతా పది జాడీలను నాకు అంత్యక్రియలు జరిపించిన వారికి కృతజ్ఞతగా ఇచ్చుకుంటాను.

అంతేకాక ఈ నిధులున్న కలశాలను ఇలాగే తీసుకువెళ్తే ఇక్కడివాళ్లు, పడవలోని వాళ్లు నీకు కీడు చేయ అవకాశం ఉంది. మన తోట ఈ ఏడాది ఆలివ్ కాయలతో సమృద్ధిగా ఉన్నది. నేను నీకోసం మరో ఇరవై మట్టికుండలను తెస్తాను. వాటిలో సగం బంగరు కణికలు, బంగరు పొడి ఉంచి మిగతా సగం ఆలివ్ పళ్లతో నింపుదాము"

కమర్ అల్-జమాన్ ఆ విధంగానే చేసి తన చేతికి ఉన్న కార్నెలియన్ తాయెత్తును ఒక వస్త్రంలో ఉంచి దానిలో ఓ చిన్ని తోలుముక్కపై తన పేరు వ్రాసి మూటకట్టి మొదటి పాత్రలో ఉంచినాడు. ఆ విధంగా ఇరవై జాడీలలో అడుగున బంగరు కణికెలు, పొడి ఉంచి పైన దట్టంగా ఆలివ్ కాయలను నింపి మూతను సీలుచేసి గోనెసంచి చుట్టి ప్రయాణానికి అనువుగా చేసినాడు. కార్నెలియాన్ తాయెత్తు ఉన్న జాడీపై ప్రత్యేక గుర్తును ముద్రించినాడు రంగులతో.

నావికులు వచ్చి ఇరవై జాడీలను మోసుకుపోయి పడవలో ఉంచినారు. మరునాటి ఉదయమే పడవ బయల్దేరుతుందని తెల్లవారు నాలుగు జాముకల్లా కమర్ అల్-జమాన్ పడవలో ఉండాలని, లేకుంటే నౌక అతడు లేకుండానే వెళ్లిపోతుందని నౌక సరంగు హెచ్చరించినాడు.

రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న తోటమాలికి ఆ మధ్యాహ్నం విపరీతమైన జ్వరం రావడంతో అతడు పలవరించసాగినాడు. కమర్ అల్-జమాన్ పరిచర్యలెన్ని చేసినా ప్రయోజనం లేకపోయింది. రాత్రి తెల్లవార్లూ తోటమాలి పక్కనే కూర్చుని ఉన్నాడు యువరాజు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✻ 220, 221, 222వ రాత్రి కథ ✻

## షహర్జాదీ కథ చెప్పసాగింది-

ఆ రాత్రంతా తోటమాలికి సపర్యలు చేస్తూ పక్కనే కూర్చుని ఉన్నాడు యువరాజు. తెల్లవారుజామున ఆ వృద్ధుడు దైవాన్ని స్మరిస్తూ- “కుమారా, ఆ పరాత్పరుడు అల్లాయే! మహమ్మదు అతడి సందేశకుడు” అంటూ ఆఖరి శ్వాస పీల్చుకున్నాడు తోటమాలి.

ఒంటిచేత్తో అతడికి అంతిమ సంస్కారాలు చేసి, తెల్లటి వస్త్రం ఆ తోటమాలి పార్థివ దేహానికి కప్పి అతడిని సగౌరవంగా ఖననం చేసి, నౌకాధిపతి హెచ్చరిక గుర్తుకురాగా ఓడరేవు వద్దకు పరిగెత్తాడు.

అప్పటికే పడవ వెళ్లిపోయింది. మరల దురదృష్టం తనను చుట్టుముట్టిందని బాధపడుతూ కమర్ అల్–జమాన్ తన నెత్తీ నోరూ మొత్తుకుంటూ ఇంటికి వచ్చాడు. ఆ కార్నెలియన్ తాయెత్తును రెండోసారి పోగొట్టుకున్నాడన్న సత్యం అతడిని మరింత కలచివేసింది. దైవంపై భారం వేసి మిగతా జాడీలలో బంగరు కణికలు, పొడి, ఆలివ్ కాయలు నింపి వాటిని సీలు చేసి నల్లమర్రి దీవికి తీసుకువెళ్లే పడవ కోసం నిరీక్షించసాగినాడు.

కమర్ అల్–జమాన్ లేకుండానే నల్లమర్రి దీవికి బయల్దేరిన పడవ ఏ ఆటంకమూ లేకుండానే నిర్ణీత ఓడరేవుకు చేరుకున్నది. తన భవనపు కిటికీ లోంచి సముద్రంలో ప్రయాణిస్తూ వచ్చిన రెండు తెరచాపల నౌకను చూసి ఆనందపడిన యువరాణి బుదుర్ మారువేషంలోనే ఓడరేవుకు వెళ్లింది సేవకులు వెంటరాగా.

నౌకలోని అధికారులు, వ్యాపారులు పట్టణ ప్రభువుకు అన్ని సరుకులూ చూపించారు. అనేక దేశాల నుంచి తెచ్చిన అద్భుత వస్త్రాలు, ఎంబ్రాయిడరీ చేయబడిన దుస్తులు, తెరలు, చైనా, హిందూ దేశపు ఔషధాలు, కాటుకలు, సౌందర్య సామాగ్రి, సుగంధ తైలాలు, లేపనాలు, వజ్రాలు, రత్నాలు, పగడాలు, అంబరు, కస్తూరి, గుగ్గిలం, ముత్యాలు, కర్పూరం, చందనం, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు, చింతపండు, అల్లం, అంతేకాక ఆఖరి రేవు నుంచి తెచ్చిన ప్రశస్తమైన ఆలివ్ కాయలు అన్నీ ప్రభువు ముందుంచినారు.

**తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# * 223, 224, 225వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

యువరాణి బుదుర్‌కు ఆలివ్‌కాయలంటే చాలా ఇష్టం. అందుకని ఆమె ఇరవై జాడీల ఆలివ్ కాయలను కొని తన భవనానికి పంపమన్నది. నౌకాధిపతి అన్నాడు– "ప్రభూ! దురదృష్టవశాత్తు ఈ ఆలివ్ కాయల యజమాని తగు సమయానికి పడవ ఎక్కలేదు. అమ్మడానికి అందుకే సంకోచిస్తున్నాను".

యువరాణి బుదుర్ అన్నది– "వీటిని నేను కొనదలుచుకున్నాను. వెల ఎంత?"

"ప్రతి జాడీ ఆలివ్‌ల వెల వంద దీరాములు పలుకుతుంది ఈ దీవిలో" అన్నాడు నౌకాధికారి.

"నేను వేయి దీరాములిచ్చి కొంటున్నాను" అని అప్పటికప్పుడు ఇరవై వేల దీరాములు తెప్పించి ఇచ్చి ఇరవై జాడీలను తన మందిరానికి చేర్పించిందామె.

రాజమందిరానికి వచ్చినాక యువరాణులు బుదుర్, హయ్యత్‌లు, పెద్దపెద్ద పళ్లెరాలలో పరిచారికలు ఆలివ్ కాయలను నింపుతుండగా వాటిలోని బంగరు కణికెలు, పొడి వాళ్ల కంటబడి ఆశ్చర్యపోయారు. ఆఖరి జాడీ ఖాళీ చేస్తుంటే దానిలోంచి జారిపడింది ఓ చక్కని వస్త్రపు మూట. కమర్ అల్–జమాన్ వేషంలో ఉన్న యువరాణి బుదుర్ దానిని విప్పి చూసింది. అద్భుతం! ఆ వస్త్రంలోపల తనకు మార్జవాన్ ఇచ్చిన కెంపు కార్నెలియాన్ తాయెత్తు, దానితోపాటు కమర్ అల్–జమాన్ అని వ్రాసి ఉన్న తోలుముక్క కనిపించాయి.

యువరాణి బుదుర్ ఆనందానికంతేలేదు. పరిచారికలు వెళ్లిపోయాక హయ్యత్‌ను కౌగిలించుకుని ప్రేమాతిశయాన పలికింది యువరాణి బుదుర్– "సఖీ, హయ్యత్! మన యువరాజు క్షేమంగా ఉన్నాడు. మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయిప్పుడు"

ఆమె వెంటనే నౌకాధికారిని సభకు పిలిపించింది– "ఎవరు ఈ ఆలివ్ జాడీల యజమాని?" అన్నది కోపాన్ని నటిస్తూ.

"అతడు తోటమాలి అనుయాయుడు ప్రభూ!" అన్నాడు నౌకాధిపతి.

"మీరు అడిగినంత పైకాన్ని చెల్లిస్తాను. వెంటనే వెళ్లి అతడిని తీసుకురావాలి. మీ సరుకులన్నీ నేనే కొంటాను. పైపెచ్చు మీకు సుంకాన్ని తొలగిస్తాను".

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 226, 227, 228వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

అన్నిరకాలుగా లాభాన్ని పసిగట్టిన నౌకాధికారి వెంటనే నౌకను వేగంగా తోటమాలి ఉన్న పట్టణం వేపు పరిగెత్తించాడు. కథ సుఖాంతమయ్యేప్పుడు అన్నీ కలిసి వస్తాయంటారు. కొద్ది రోజుల్లోనే వాళ్లు ఆ నిషిద్ధ నగరానికి చేరుకుని తోటలోకి వచ్చారు.

తోటమాలి పోయిన దుఃఖం, పడవ వెళ్లిపోయిన దురదృష్టం కమర్ అల్-జమాన్‌ను క్రుంగదీయగా నీరసంగా కనిపించాడతడు.

నౌకాధిపతి తన సేవకులతో యువరాజును పట్టి బంధించి, పక్కనే పెట్టి ఉన్న ఇరవై ఆలివ్ జాడీలను తీసుకుని ఓడకెక్కించాడు.

"ఎందుకు నన్నిలా బంధించి తీసుకువెళ్తున్నారు?" అడిగాడు యువరాజు.

"నీమీద నల్లమర్రి దీవి ప్రభువుకు ఎవరో ఫిర్యాదు చేసారు. నీవు అందమైన ఆడపిల్లలను మోసం చేసావని. ఆ ద్వీపంలో నీ నేరాలకు విచారణ జరిగాక తగిన శిక్ష విధించబడుతుంది".

యువరాజు అన్నాడు- "కష్టాలన్నీ నన్నే ఎందుకు వెంటాడుతున్నాయో అర్థం కాదు. దైవం నన్ను పరీక్షిస్తున్నాడు. ఈ చీకటి తొలగి నేను వెలుగునెప్పుడు చూస్తానో!"

అనేక రోజుల ప్రయాణం తరువాత నౌక నల్లమర్రి దీవికి చేరుకున్నది. దూరం నుంచే నౌక రావడానిని గమనించిన యువరాణి బుదుర్ ఒక ఉపాయాన్ని పన్నింది.

నౌక రేవులో ఆగగానే నౌకాధికారి తన వద్ద బందీగా ఉన్న యువరాజును, అతడికి చెందిన ఇరవై ఆలివ్ జాడీలను, అంతకు ముందు ఆలివ్ జాడీల అమ్మకం వలన వచ్చిన ఇరవై వేల దీనారాలను సభలో ప్రభువు సన్నిధిన ఉంచినాడు. ప్రభువు వేషంలో ఉన్న యువరాణి బుదుర్ నౌకాధికారికి విశేషమైన ధనమిచ్చి అతడిని పంపివేసింది సగౌరవంగా.

ఆ తరువాత యువరాజును స్నాన గృహానికి పంపించి, అతడు శుభ్ర పడినాక కొత్త దుస్తులు ధరింపచేసి అతడికి వజీరు హోదాను ప్రకటించింది. తనను అకారణ నేరంపై శిక్షించబోతున్నారని భయపడిన యువరాజు కమర్ అల్–జమాన్ తనకు జరుగుతున్న సత్కారాలకు ఆశ్చర్యపోయినాడు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

# ✻ 229, 230వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

యువరాణి బుదుర్ తన ప్రియసఖి హయ్యత్‌తో అన్నది– "చెలీ! మనకు శుభ ఘడియలు వచ్చినాయి. మన ఇష్టసఖుడిని చూడాలని నీకూ మనసౌతున్నది కదా! నేను సభలో ఉన్నపుడు నీవు తెరచాటు నుండి చూడవచ్చు. మారువేషంలో ఉన్న నాకు నకలుగా కానవస్తాడతడు. కాకుంటే కాస్త బక్కచిక్కి ఉన్నాడు".

ఆ ఉదయం కమర్ అల్–జమాన్‌ను ప్రభు మందిరంలోకి తీసుకువచ్చారు. గద్దెపై విలాసంగా కూర్చుని ప్రభువు వేషంలో ఉన్న యువరాణి బుదుర్, తెరచాటున ఉండి గమనిస్తున్నది హయ్యత్. కమర్ అల్–జమాన్ ప్రభువు చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడి తలవంచి నిలబడినాడు.

"నీ సౌందర్యం మా మనసును దోచుకున్నది. యువకుడా! అందుకే నీకు మేమీ సత్కారాలను, మర్యాదలను చేస్తున్నాము" అన్నది యువరాణి బుదుర్.

కమర్ అల్–జమాన్ అన్నాడు– "ప్రభూ! నాకిదివరకే వివాహమైనది. నా భార్య యువరాణి బుదుర్. ఘయ్యూర్ ప్రభువు కుమార్తె. నా అదృష్టం వక్రించి మేము విడిపోయాము".

యువరాణి బుదుర్ అన్నది– "విడిపోయాక ఇంకా దిగులెందుకు యువకుడా! ఈ దేశపు ఆచారాలలో మగవాడిని మగవాడు కౌగిలించుకోవడం తప్పుకాదు. పైగా నీవు సుందరుడివి, యువకుడివి. ప్రేమించడం, ప్రేమించబడడం నేరం కాదుకదా?"

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## ✻ 231, 232వ రాత్రి కథ ✻

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

యువరాణి బుదుర్ అన్నది– "ప్రేమ అనేది ఓ మధుర భావన.

*దేవుని స్నేహితుడు 'లాట్'*
*దేవదూతలతడిని దర్శించవచ్చినపుడు*
*అతిధులను రక్షించేందుకు*
*తన కుమార్తెలనే ఊరి జనానికివ్వబోలేదా*
*వెనక్కి తిరిగి చూసిందతడి భార్య*
*ఉప్పుస్తంభమై పోయింది ఊరి చివర*
*ఏది తప్పు, ఏది ఒప్పు ఎవరు చెప్పగలరు?*
*కాస్త ఉప్పు, కాస్త చక్కెరతో తప్పులేదు!"*

యువరాజు కమర్ అల్–జమాన్ అన్నాడు– "ప్రభూ! నా అనుభవమంతా నా ప్రియురాలితోనే!"

యువరాణి అన్నది–

*"నీ దేహంపై అధికారం నీకున్నది*
*వెనకా, ముందా అనేది విచక్షణ*
*ప్రేమ ప్రకోపించినపుడు ఏ దారైనా ఒకటే*
*అంతా అయిపోయాక ఆనందమే ఋజువు"*

యువరాజు అన్నాడు–

*"ఎందరో కన్యలు సుందరాంగులు మీ సొత్తు*
*ఎందుకు ప్రభూ ఈ బానిసపై కాంక్ష*

*ఎందరో లావణ్యవతులు మీ సంపదలు*
*ఎందుకు ప్రభూ వెనకదారిపై ఆసక్తి?"*

యువరాణి బుదుర్ నవ్వింది-

*రా వెళ్దాం చెట్ల నీడలోకి*
*నారింజ రసాలు, అత్తిపళ్లున్న తోటలోకి*
*ఎత్తుగా పెరిగిన గులాబి పొదరిళ్లలో*
*అసలు గులాబీ తోటను చూడడానికి*

*రా! వెళ్దాం సెలయేటి వాగులోకి*
*నిమ్మలు, దానిమ్మలున్న దారిలోకి*
*వొలిచి తిన్నవారికి వొలిచినంత*
*అసలు దానిమ్మలతో ఆడడానికి*

*రా! వెళ్దాం జింకలు లేళ్లున్న లోయలోకి*
*ఖర్జూరాలు, తేనెతుట్టలున్న గుహలోకి*
*తిని, తాగినవారికి తాగినంత*
*అసలు తేనె మధువు గ్రోలడానికి*

*రా వెళ్దాం ఇసుక తిన్నెలున్న చోటుకి*
*కలబంద పూలక్కడ విరిసిన మాటుకి*
*ముళ్లు, తేళ్ల గురించి ముచ్చట వద్దు*
*అసలు విషమంతా ఉన్న ప్రేమ తాగడానికి*

యువరాజు కర్థమయ్యింది. ఈ ప్రభువుకు కన్యలకన్నా యువకులపైనే ప్రీతి అని. "ఎలా తప్పించుకోవాలి" ఆలోచిస్తున్నాడతడు.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 233, 234వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

"తప్పు చేయకుండా ఎలా తప్పుకోవాలి" ఆలోచిస్తున్నాడు కమర్ అల్-జమాన్. ప్రభువు సంజ్ఞ చేయగానే సేవకులంతా వెళ్లిపోయారు. ఆ గదిలో

మిగిలిందల్లా కమర్ అల్-జమాన్, ప్రభువు వేషంలో ఉన్న యువరాణి బుదుర్, తెర వెనుక ఆసక్తిగా గమనిస్తున్న హయ్యత్ అల్-నఫస్.

చక్కని మెత్తని శయ్య, చుట్టూ తెరలు. గది లోపలకు సెలయేటి నుండి వీస్తున్న చల్లటి గాలి. యువరాజును శయ్యపై కూర్చుండబెట్టి తానూ అతడి పక్కనే శయనించింది యువరాణి బుదుర్. నెమ్మదిగా అతడి చేతిని తీసుకుని తన లోదుస్తులలోకి పోనిచ్చింది. అదిరిపడినాడు యువరాజు. ప్రభువు వేషంలో ఉన్న స్త్రీ ఆమె. అంతేకాక అతడి చేతికి తగిలింది కెంపు కార్నెలియాన్ తాయెత్తు. అప్పుడు చూసాడాతడు తనపై రాజోచిత వస్త్రాల్ని ఒక్కటొక్కటి తొలగిస్తూ కేవలం లోదుస్తులలో ఉన్న యువరాణి బుదుర్. ఆమె గులాబి తోటపై ఉన్న వస్త్రం మీద మెరుస్తున్నది ఆ కెంపు తాయెత్తు. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు యువరాజు కమర్ అల్-జమాన్.

***షహర్జాది కథ చెప్పడం ఆపింది.***

## * 235వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

అతడి ఆశ్చర్యాన్ని గమనించి యువరాణి బుదుర్ కిలకిలా నవ్వింది- "అర్ధరాత్రి వచ్చి అర్ధాంతరంగా మాయమయ్యే మహానుభావా! మరచిపోయావా నీ ప్రియసఖి బుదుర్‌ను" అని అతడిని గాఢంగా కౌగిలించుకున్నది. ఇరువురి కళ్ల నుంచి ఆనందబాష్పాలు జలజలా రాలినాయి.

*ఇది ఆనంద సమయం*
*ప్రేమికులు మరల కలిసిన అద్భుత విషయం*
*వారి నవ్వులు పూలుగా విరిసినవి*
*వారి మాటలు పరిమళాలువెదజల్లినవి*
*జ్ఞాపకాల సెలయేటిలో ఉద్వేగపు అలలవి*
*వేదనలు తొలిగి తీరానికి చేరుకున్నవి.*

ఇరువురూ తమ గాధలను చెప్పుకున్నారు. యువరాణి హయ్యత్‌ను పిలిచి పరిచయం చేసింది యువరాణి బుదుర్. వాళ్లు వెంటనే ప్రభువు అర్మానస్‌కు

కబురు పంపించారు. మహారాజు మహారాణి వచ్చేసరికి మరల ప్రభువేషంలో యువరాణి బుదుర్ ఉచితాసనాన కూర్చుని ఉన్నది. పక్కనే యువరాజు కమర్ అల్–జమాన్, ఇంకో పక్కన హయ్యత్ అల్–నఫస్. మహారాజ దంపతులను ఉచితాసీనులను చేసి, ఆశ్చర్యంతో చూస్తున్న వారికి యావత్ కథను వివరించింది యువరాణి బుదుర్.

అర్మానస్ ప్రభువు ఆశ్చర్యపడి అన్నాడు– "మీ కథ అద్భుతమైనది. కంటి మూలలందు లిఖిస్తే రేపటి తరాలకు ఆదర్శప్రాయమై నిలుస్తుంది. స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపాలు మీరు".

యువరాణి బుదుర్ అంగీకారంతో యువరాజు కమర్ అల్–జమాన్‌కు యువరాణి హయ్యత్ అల్–నఫస్‌కు వివాహమయ్యింది.

అర్మానస్ ప్రభువు తన రాజ్యాన్ని, కుమార్తెను యువరాజు కమర్ అల్–జమాన్‌కు అప్పగించాడు. వెంటనే ఈ వార్తను ఖలిదాన్ ప్రభువైన షారిమాన్‌కు తెలియబరచేందుకు వార్తాహరులను పంపినాడు.

ఆనందంతో ఉప్పొంగిన షారిమాన్ ప్రభువు రాజ్యమంతటా వేడుకలు చేయించినాడు. ఘయ్యూర్ ప్రభువు, అర్మానస్ ప్రభువు, షారిమాన్ ప్రభువులు తమ సైన్యాలను పంపి అవిశ్వాసులు ఆక్రమించుకున్న నగరాన్ని విముక్తం చేయగా మరల ఆ పట్టణం విశ్వాసులతో కళకళలాడసాగింది. కమర్ అల్–జమాన్ సూచనలతో తోటమాలి సమాధిపై గొప్ప గోపురమును కట్టించినారు.

యువరాణి బుదుర్, యువరాణి హయ్యత్‌లు గర్భవతులై మగపిల్లలను కన్నారు. మూడు దేశాలు, నాలుగు పట్టణాలలో వేడుకలు కనులవిందుగా జరిగాయి. దైవ విశ్వాసులై అందరూ హాయిగా జీవించారు.

***అంతవరకు కథ చెప్పి షహర్జాది అన్నది- "ఇప్పుడు మీరు విన్న యువరాణి బుదుర్, యువరాజు కమర్ అల్-జమాన్ కథకన్నా అద్భుతమైన కథ చెప్పబోతున్నాను".***

# * 236-237వ రాత్రి కథ *

షహర్జాది కథ చెప్పసాగింది-

# IV. సలీమ్-జమీలా కథ

షహర్జాది అన్నది- ఈ కథ సుందర రూపుడైన మచ్చలేని సలీమ్, సౌందర్యరాశి అయిన జమీలాల కథ.

కుఫా పట్టణంలో ఓ భాగ్యవంతుడైన వ్యాపారి కుమారుడు, ముఖాన చిరునవ్వు మాయనివాడు, బహు సుందరుడైనవాడు సలీమ్.

అతడు జన్మించిన ఏడు రోజుల తరువాత వ్యాపారి సంతకు వెళ్లి తన భార్య కోసం ఓ బానిస యువతిని చూసాడు. అయితే ఆమెకు అప్పటికే ఓ అందాల పసిపాప ఉన్నది. ఆ చిన్నారిని ఆమె తన వీపుకు వస్త్రంతో కట్టుకున్నది.

ఆ పసిపాపను చూడగానే వ్యాపారి హృదయం ద్రవించింది. యాభై దీనారా లిచ్చి ఆమెను కొనుక్కుని విక్రయ పత్రాలు వ్రాయించి ఆ బానిస స్త్రీని తన భార్యకు కానుకగా నివ్వగా, బుద్ధిమంతురాలైన ఆతడి భార్య అన్నది- "ఎందుకు ఇంత ధనము వెచ్చించి తల్లీ పిల్లను కొన్నారు? బాలింతనైనా నా పని నేను చేసుకోగల శక్తి నాకున్నది".

వ్యాపారి అన్నాడు- "ప్రియతమా! ఎందుకో తెలియదు ఈ పసిపాపను చూడగానే నాకనిపించింది ఈమె దినదిన ప్రవర్ధమానమై ఇరాక్, పర్షియా, అరబ్బు దేశాలలోనే సాటిలేని అందగత్తెగా భాసిల్లుతుందని"-.

వ్యాపారి భార్య అడిగింది బానిసస్త్రీని- "నీ పేరేమిటమ్మా?" అని.

ఆ యువతి సమాధానమిచ్చింది- "నాపేరు 'ఇజ్దిహార్-సౌభాగ్యం', నా కుమార్తె పేరు 'హజబా-సంపద".

వ్యాపారి అన్నాడు- "మనమామెకు కొత్తపేరు అందం-జమీలా అని పేరుపెడ్దాం!"

అందరికీ ఆ పేరు నచ్చింది. అప్పటి నుంచి సలీమ్-జమీలాలు ఆ ఇంటిలో అల్లారుముద్దుగా పెరిగారు.

అయిదవ ఏట సలీమ్‌కు 'సున్నతి' జరిగినపుడు ఆ బాలుడు నెప్పితో ఏడ్వక చిరునవ్వు మాయక హుషారుగా కనిపించాడు. ఎర్రటి పల్లకిలో ఉంచి ఆ బాలుడిని కుఫా వీధులలో ఊరేగించినారు. అతడి పక్కనే జమీలా కూర్చుని సిల్కు రుమాలుతో వీచుచుండగా బంధుజనం 'లులులు' అంటూ కేరింతలు కొడుతుండగా అందంగా అలంకరించబడిన కంచరగాడిద ఆ పల్లకిని మోసుకురాగా వేడుక అద్భుతంగా జరిగింది. బంధుమిత్రులందరూ ఆ బాలుడిని ఆశీర్వదించి విందు భోజనాలనంతరం ఎవరిళ్లకు వారు నిష్క్రమించారు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 238వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ఇరువురికి పన్నెండేళ్ల వయసు వచ్చింది. వ్యాపారి అన్నాడు సలీమ్‌తో- "కుమారా! జమీలా నీ సోదరి కాదు. ఆమె మన బానిస కుమార్తె. ఆమెకూడా యుక్త వయసుకు వచ్చింది. ఇక స్వేచ్ఛ, ఆటపాటలుండవు. ఆమె మేలిముసుగు ధరిస్తుందిక నుంచి. ఆమెకు సరైన బానిసనిచ్చి వివాహం చేస్తే మనకు మరో బానిస లభిస్తాడు. వీళ్లిద్దరూ నీకు బానిసలుగా, సంపదలను వృద్ధి చేస్తారు"

సలీమ్ అన్నాడు- "ఆమె నా సోదరి కాదంటున్నావు. ఆమెను నా భార్యగా చేసుకుంటాను. అప్పుడు మామధ్య ఎడబాటు ఉండదు".

వ్యాపారి, వ్యాపారి భార్య అనుమతించగా ఆ ఇద్దరూ భార్యభర్తల వలె కలిసి ఉండసాగినారు. అయిదేళ్లు గడిచాయి. అంత అందమైన, వినయ సంపన్నురాలైన, విజ్ఞానముతో నిండిన బాలిక ఆ చుట్టుపక్కల లేదని జనము అనుకోసాగినారు. సలీమ్‌తో పాటు జమీలా కూడా పవిత్ర గ్రంథము ఖురాన్, కుఫా వ్రాతశైలి, సాహిత్యం, కవిత్వం, సంగీతం, వీణాగానం అన్నిటిలో నైపుణ్యాన్ని సాధించింది. ఒక్క పదం చెబితే దానిని పదిహేను రకాలుగా రాగాలలో, చరణాలలో ఇమిడ్చి సంభాషణగా, పాటగా అలవోకగా ఆశువుగా చెప్పగల వైదుష్యాన్ని సంపాదించింది.

ఒక సాయంకాలం వారు తోటలోని చేపలతొట్టె దగ్గర చలువరాతిపై కూర్చుని పుచ్చకాయలు, అల్మండ్‌లు, బాదంపప్పు, వేయించిన మొక్కజొన్న గింజలు తింటూ, చల్లగాలిలో అల్లనల్లన వీస్తున్న మల్లెల, గులాబీల పరిమళాల నాస్వాదిస్తూ ఇచ్చకాలాడు తున్నారు.

*"సఖీ, ఈరోజు కురుస్తున్నది నింగి*
*రంగు రంగుల పూలు, పక్షుల నీవేళ*
*ఎటు చూసినా సుగంధాలే, పక్షుల కిలకిలలే*
*పొగమంచు బిందువులు చూడు చెలీ*
*నీ కురులపై ముత్యాల హారములైన వీవేళ*
*విహరిద్దామా కలల నావపై స్వప్నలోకంలో!"*

జమీలా అన్నది–

*"బంగరు ఖర్జూర వృక్షాల చెంత*
*అపురూప పొదరిళ్లలోన*
*నీలినింగి గోపురము కింద*
*హాయిగా నిదురించెదము రావోయీ*
*కలల కన్న పసందైన వాస్తవమే నీముందున్నది*
*విహరిద్దాము ప్రణయ నావపై నిజలోకంలో"–*

సలీమ్ అన్నాడు–

*"రాత్రి చీకటిలో గుసగుసలాడేను*
*ఖర్జూరపు వృక్షాలు ఒకదానితో ఒకటి ప్రేమగా!*
*వాటి ఆకుపచ్చ శిరోజాలు గాలిలో*
*ఊగుతూ ఊదుతున్నాయి వేణువును హాయిగా!*
*విహరిద్దామా కలల నావపై స్వప్నలోకంలో!"*

జమీలా అన్నది–

*"పక్షుల కిలకిలారవములు ప్రస్తుతించె దైవాన్ని*
*పూలసుగంధాలు పులకింపజేసె పుడమి తల్లిని*
*ప్రేమను మించిన పారవశ్యమేమున్నది భువిలో!*
*ప్రేమికుల హృదయాలే పెద్ద సముద్రాలు కాదా!*
*విహరిద్దాము ప్రణయనావపై నిజలోకంలో!"*

ఇలా ఆ ప్రేమికులు సరాగాల సల్లాపాలలో మైమరచి హాయిగా కాలం గడుపుతున్నారు.

అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.

# * 239వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

అయ్యో! అయ్యో, దైవం మన నుదుటిపై వ్రాసిన రాతను ఏ మానవ హస్తమూ తుడిచివేయలేదు కదా! రెక్కలున్నా ఏపక్షీ విధి నిర్ణయాన్ని దాటలేదు. ఆనంద సముద్రంలో ఇంత వరకు జీవితాన్ని గడిపిన సలీమ్-జమీలా జంటకు ఏ కష్టాలు ప్రాప్తించనున్నవో!

ఖలీఫా సామంత ప్రభువైన కుఫా పట్టణ అమీర్ చెవిన పడింది జమీలా అందచందాల వర్ణన. ఖలీఫా అంతఃపురంలో ఉండాల్సిన యువతి ఓ సామాన్య వ్యాపారి ఇంట్లో ఉండడమేమిటి అనుకున్నాడతడు. ఏదో విధంగా ఆమెను తీసుకుపోయి ఖలీఫాకు అందజేస్తే ఆతడి మంచిదృష్టిలో ఉండవచ్చు అనుకున్నాడు ఆ కుఫా ప్రభువు. ఆ సమయంలో దైవ విశ్వాసుల నాయకుడు అబ్ద్ అల్-మాలిక్ ఇబిన్ మార్వాన్ ఖలీఫాగా పాలన చేస్తున్నాడు.

కుఫా ప్రభువు తన ప్రణాళిక విజయవంతం కావడానికి మహా చతురురాలు, వంచన, మాయమాటలతో ఇతరులను మాయపుచ్చగలిగినది; అనేకమంది బానిస యువతులకు వివిధ పనులలో శిక్షణ నిచ్చిన దానిగా పేరుపొందిన ఓ వృద్ధ వనితకు ఆ బాధ్యత నప్పగించాడు.

“నీవు వెళ్లి ఏదో ఉపాయంతో ఆ సౌందర్యరాశి ‘జమీలా’ను నాకు అప్పజెప్పేట్లయితే నీకు వేయి బంగారు నాణేలనివ్వడమే గాక నిన్ను అనేక విధాల సత్కరిస్తాను” అని చెప్పి ముందుగా వంద దీనారాలిచ్చి పంపినాడు.

ఆ వృద్ధ మహిళ సంతోషించి సన్యాసిని వేషం వేసుకున్నది. వంటిపై సన్యాసినులు ధరించే వస్త్రాలు, మెడలో వేయి గవ్వలమాల, తన నడుముకు ఎండిన సొరకాయ బూర, చేతిలో కర్రతో వంగి నడుస్తూ వ్యాపారి ఇంటికి వచ్చింది.

“దైవం మిమ్ము దయతో చూచును గాక! అతడు జగద్రక్షకుడు, కరుణామయుడు. అతడే అన్నీ ఇచ్చేవాడు. అందరినీ ఆదరించేవాడు” అంటూ వ్యాపారి ఇంటి తలుపు తట్టింది.

ఎంతో అనుభవజ్ఞుడైన ఆ వ్యాపారికి ఎదురుగా ఉన్న సన్యాసినిపై గౌరవభావ మెందుకో కలగలేదు. ఆ సన్యాసినికి ఇతడిని చూడగానే శత్రువును చూసిన భావం కలిగింది. వ్యాపారి అనుకున్నాడు రక్షణనిచ్చే వాక్యాలుగా– "నా ఎడమచేతి అయిదువేళ్లు నీ కుడి కంటిలో గుచ్చుకుంటాయి. నా కుడిచేతి అయిదువేళ్లు నీ ఎడమకంటిలో గుచ్చుకుంటాయి, నీవేదైనా చెడు తలపుతో వస్తే" అని తనకు అండగా ఉండమని దైవాన్ని స్మరించాడు."

ఆ వృద్ధ సన్యాసిని అన్నది– "నన్ను లోనికి రానిస్తే దైవప్రార్థన ముగించి వెళ్లిపోతాను. నీకు నీ కుటుంబ సభ్యులకు మేలు జరుగుతుంది"

అతడన్నాడు– "ఇది ప్రార్థనామందిరం కాదు. ఈ వీధి చివర మసీదు ఉన్నది. అటుగా వెళ్లు!"

ఆ వృద్ధ మహిళ అన్నది– "కుఫా నగరంలో సన్యాసినులను ఆదరించని వాళ్లు కూడా ఉన్నారా! నేను డమాస్కస్ వజీరులాంటి వారికి ఆశీస్సులనందజేసిన దానిని. కుఫా నగరంలోని దైవ విశ్వాసుల ఇంటిలో దైవప్రార్థన చేసి వారి గృహాలకు పవిత్రత కలిగేట్లు ఆశీర్వదిస్తాను" అని బలవంతంగా లోపల అడుగుపెట్టింది. వ్యాపారి అన్నాడు– "నీ పవిత్రతపై నాకు నమ్మకం కలగలేదు. దయచేసి నీ దారిన నీవు వెళ్లిపో!"

అప్పుడే అటుగా వచ్చిన సలీమ్‌ను చూసి అన్నదా వృద్ధురాలు– "ఇతడు పేరుగాంచిన దైవవిశ్వాసి, సుందరుడైన సలీమ్ అనుకుంటాను. కుమారా! నీ తండ్రి సంశయాన్ని పటాపంచలు చేసి కొద్ది నిముషాల పాటు నన్ను నీ ఇంటిలో దైవప్రార్థన చేసేందుకు అనుమతినిప్పించు"

ఇంతలో అటుగా వచ్చిన 'జమీలా'ను చూసిన ఆ వృద్ధ మహిళ అనుకున్నది– "ఈ బాలిక నిజంగా పరిశోధించతగినదే!" అనుకుని ఇంటిలో నేలపై కూర్చుని 'మక్కా' దిక్కుకు తిరిగి ప్రార్థన ప్రారంభించింది. ఇంతలో బయట నుంచి ఎవరో పిలవగా వ్యాపారి అటుగా వెళ్లాడు.

దైవప్రార్థన అనంతరం సలీమ్–జమీలాల అభ్యర్థనతో ఆ వృద్ధ సన్యాసిని వారు తెచ్చిన రొట్టె, పండ్లరసాలను ఆరగించింది.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 240వ రాత్రి కథ *

### షహర్జాదీ కథ చెప్పసాగింది-

ఆ వృద్ధ సన్యాసిని మాయలో పడిన సలీమ్-జమీలాలు ఆమెకు తమ ఇంటిలోని ఓ గదినిచ్చి దానిలో ఒక చాప, పరుపు, మంచినీటి కూజా, కాసిని తినుబండారాలు ఉంచినారు.

ఆమె పెద్దగొంతుతో ఖురాన్‌లోని ఆయతులను చదివి కాసేపు ధ్యానం చేసి, నిద్రలోకి జారుకున్నది. మరుసటి రోజున వ్యాపారి, అతడి కుమారుడు సలీమ్ బజారుకు వెళ్లగానే వృద్ధ సన్యాసిని వ్యాపారి భార్యకు, జమీలాకు ధర్మ సంగతులు బోధించి వారి మనసులను రంజింపచేసింది.

సాయంకాలం కాగానే వారి అనుమతి తీసుకుని కుఫా నగరంలోని పవిత్ర స్థలాలను చూసి వస్తానని వెళ్లిపోయింది.

ఇలా ఉదయాన తండ్రీ కొడుకులు బజారుకు వెళ్లినాక రావడం, వారు తిరిగి రాకమునుపే వెళ్లిపోవడం, ఆ ఇంటిలో ఉన్నంతసేపు ధార్మిక విషయాలు, వీరగాథలు చెబుతూ ఆ ఇంటి యజమానురాలిని, జమీలాను, పరిచారికలను తన మాయలో పడవేసింది. ఒక్కరోజు ఆమె రాకపోయినా వాళ్లు ఉండలేని స్థితికి వచ్చారు. అలా పదిరోజులు గడిచాయి.

పాపం జమీలా! అమాయకురాలు. మోసగత్తె వలలోకి తానంతట తానే నడచి వెళ్తున్నది. ఎలా బయటపడుతుందో ఏమో! విధి తలపు ఎలా ఉన్నదో!

వృద్ధ సన్యాసిని వెళ్లి కుఫా ప్రభువును కలిసింది. అతడన్నాడు- "ఓ చతురమతీ! సాలెగూటి దారాల చిక్కును విడదీయగలదానా, నీ సాలెగూటిలో సీతాకోకచిలుక ఇంకా చిక్కుకోలేదా?"

ఆమె నవ్వి అన్నది- "తమరు నాకు గురుసమానులు. తమ మనసు కనుగొనడం నాకు కష్టతరమే! మొత్తానికి ఓ అపురూపమైన సీతాకోకచిలుక గురించి విన్నారు తమరు. మీరు విన్నదానికన్న అందమైనది ఆమె. ఆమె పలుకులు తేనెజల్లులు. ప్రశాంత వనంలో ప్రవహించే సెలయేటి గలగలలు. ఆమె లేడికళ్లు ప్రేమతో ప్రకాశించే నీలి సరస్సులు. ఎటువంటి రాతిగుండెనైనా కరిగించేయ గలవామె వాడి చూపులు"

కుఫా ప్రభువు అన్నాడు– "మరెందుకిక ఆలస్యం. ఇవిగో వేయి దీనారాలు. పని ముగించి మిగతా ధనాన్ని సంపాదించుకో!"

అలా నెలరోజులు గడిచాయి. వ్యాపారి కిష్టంలేకపోయినా అత్తాకోడళ్ల సఖ్యత వలన సన్యాసిని రాకపోకలకు అడ్డు లేకపోయింది. ఒకరోజున ఉదయమే వచ్చి ఇంటిలో వ్యాపారి, సలీమ్ లేని విషయాన్ని గమనించి ఆ వృద్ధ వనిత జమీలాతో అన్నది– "ఓ చిన్నారీ! ఇన్నేళ్లుగా మీ దంపతులు ఏకశయ్యాగతులైనా నీవు గర్భము దాల్చలేదు. దయగల నీ అత్తగారు ఈ విషయాన్ని నాతో ప్రస్తావించింది. ఈరోజు శుక్రవారం. దేవుని విశ్వాసులు, నిరంతర ప్రార్థనలతో ధ్యానంలో, ఎల్లప్పుడూ దేవుని సన్నిధికి దగ్గరగా ఉండే అనేకమంది సాధువులు, వలీలు నాకు పరిచితులు. దేవుని పేరుమీద వారు భూత పిశాచముల పీడ వదిలించ సమర్థులు. సంతాన లేమితో బాధపడేవారికి పుత్రులనివ్వగలరు. వ్యాధులను నయం చేస్తారు. గుడ్డివారికి చూపును, కుంటివారికి నడకనిస్తారు. మృతులను సమాధుల నుంచి సజీవుల కావించగలరు. ఒక్కసారి వారిని దర్శిస్తే నీకు శుభం కలుగుతుంది".

జమీలా పలికింది వినయంగా– "ఈ ఇంటి యజమాని, నాభర్త అనుమతి తీసుకుని గాని నేను ఈ ఇంటి గడప దాటలేను"

వృద్ధ సన్యాసిని అన్నది– "మాతృదేవత లాంటి అత్తగారి అనుమతి తీసుకుని నాతో రా!"

అత్తగారు తలూపింది. "సాయంకాలం యజమాని వచ్చే సమయానికి ముందే నీ కోడలు నీ ఇంట్లో ఉంటుంది. ఈ శుక్రవారం శుభవేళ ఆమెకు సాధు సందర్శనం లభించి ఏడాదికల్లా పండంటి కుమారుడు జన్మిస్తాడు. నీవుకూడా రావచ్చు" అన్నది వృద్ధ సన్యాసిని.

అత్తగారు అన్నది– "నాకూ రావాలనే ఉన్నది. కాని మోకాళ్ల నెప్పులు... మెట్లెక్కి దిగలేను. నేను వస్తే తిరిగి రావడానికి ఆలస్యమవుతుంది. సాధుమూర్తివి ధార్మికురాలివి. మీరు వచ్చే వరకు నేను వేచి చూస్తూ ఉంటాను".

మొగమాటం ఎంత అనర్థాలకు దారితీస్తుందో కదా. జపమాల తిప్పుతూ వృద్ధ సన్యాసిని, ఆమె వెనక బురఖా దుస్తులలో జమీలా వీధులను దాటి రాజ భవనపు తోటలోని ప్రార్థనా మందిరం దగ్గరకు చేరుకున్నారు. ఆ తోట ఫలపుష్ప

వృక్షాలు, వివిధ రకాల పక్షులు, జంతువులతో సందడి సందడిగా ఉన్నది. జమీలాను తోటలోని విలాసమండపం వద్ద కూర్చోబెట్టి వృద్ధ సన్యాసిని రహస్య ద్వారం ద్వారా ప్రభుమందిరంలోకి వెళ్లింది. అక్కడ తోటలో జమీలా బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా బెదురు చూపుల హరిణంలా బిగదీసుకుని కూర్చున్నది.

**షహర్జాది కథ చెప్పడం ఆపింది.**

## * 241వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

కుఫా ప్రభువు తన గది కిటికీలోంచి జమీలాను చూసాడు. దాహం వేయగా ఆమె పక్కనే ఉన్న జలధార వద్ద నీరు తాగేందుకు తన ముఖంపై ఉన్న మేలి ముసుగును తొలిగించింది. మబ్బుల మాటు నుంచి బయటపడిన చంద్రబింబం లాంటి ఆమె వదనాన్ని చూసి కుఫా ప్రభువు ఆశ్చర్యచకితుడై వెంటనే తన అంగరక్షకుల అధికారిని పిలిచి ఆజ్ఞలు జారీచేసినాడు.

ఆ అధికారి పరిచారికలతో వచ్చి జమీలాను బలవంతంగా ఒంటెపై కెక్కించి, కుఫా ప్రభువు ఇచ్చిన లేఖను తీసుకుని డమాస్కస్ వెళ్లి అక్కడ అంతఃపుర అధికారికి అప్పగించాడు. దారి పొడుగూతా జమీలా ఎవరితో మాట్లాడకుండా వెక్కిళ్లు పడుతూ దుఃఖిస్తూనే ఉన్నది.

డమాస్కస్‌లో ఖలీఫాకు కొత్త బానిస వచ్చిన సంగతి తెలియగానే ఆతడు తన భార్యను, సోదరిని పిలిచి అన్నాడు– "కుఫా ప్రభువు మన సామంతరాజు. నాకు ఓ అందాలరాశిని కానుకగా పంపినాడు. ఆమె ఏదో దూరదేశపు రాకుమార్తె అట. కుఫా పట్టణంలో వ్యాపారస్తుల వద్ద పెరిగి సకల విద్యలలో నైపుణ్యం సాధించినదని అతడు లేఖ వ్రాసినాడు"

వాళ్లన్నారు– "దైవ విశ్వాసుల అధినాయకుడా, ఖలీఫా! నీ సంతోషమే మా సంతోషము. ఆ బానిస యువతిని చూసి వస్తాము"

ఖలీఫా తరపున అతడి సోదరి దహియా అంతఃపురంలోకి వెళ్లి ఆ అందాల యువతి జమీలాను పరామర్శించింది.

జమీలా అడిగింది దుఃఖంతో గాద్గదికమైన స్వరంతో– "అమ్మా! నాపేరు జమీలా. నేనిప్పుడు ఎక్కడ ఉన్నాను. నా భవిష్యత్తేమిటి?"

స్వతహాగా కరుణాహృదయురాలైన దహియా అన్నది- "చిన్నారీ! భయపడకు. నీవిప్పుడు నా సోదరుడైన ఖలీఫా అబ్ద్ అల్-మాలిక్ ఇబిన్ మార్వాన్ సంరక్షణలో డమాస్కస్‌లో ఉన్నావు. నీకేమీ లోటు రాదిక్కడ"

ఇంతలో ఖలీఫా వచ్చి అన్నాడు- "యువతీ! నీ వదనాన్ని కప్పిన మేలి ముసుగును తీసి నా కనులకు పండుగ కానిమ్ము"

భయంతో మరింత బిగదీసుకున్న జమీలాను చూసి ఖలీఫా తన ఆసక్తిని తొలగదోసి జమీలాను తన కొరకు సిద్ధం చేయాల్సిన బాధ్యతనప్పగించి రాచకార్యముల నిర్వహణకు వెళ్లినాడు.

దహియా ఆ యువతిని స్నాన గృహానికి తీసుకువెళ్లి స్నానానంతరం చక్కటి దుస్తులు తొడిగి ఆమె శిరోజాలపై ముత్యాలు, మణులు, రత్నాల నగలతో అలంకరించింది.

మనోవేదనకు మందులేదన్నట్లు ఆ రాచమందిరంలోనూ ప్రశాంతత లభించక జమీలా దిగులుతో కృంగి కృశించసాగింది.

అక్కడ వ్యాపారి ఇంట్లో అంతటా విషాదమే! సలీమ్ ఇంటికి రాగానే తన ప్రియసఖి జమీలా కనబడక తల్లడిల్లినాడు. వ్యాపారి వచ్చాక అతడు మరింత ఆందోళనతో బయటకు పోయి చుట్టుపక్కల మసీదులలో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో తన కుమారుడైన సలీమ్‌తో సహా వెళ్లి కుఫా ప్రభువు దగ్గరకు వెళ్లి మొర బెట్టుకున్నాడు.

తనకు చేతనైనంత సహాయం చేస్తానని చెప్పి సైనికాధికారి వద్దకు పంపించినాడు. సైనికాధికారి అడిగాడు కుర్చీలో దర్జాగా కూర్చుని తన కుడికాలుపై ఎడమకాలునుంచి- "ఏమిటి మీ ఫిర్యాదు?"

సలీమ్ అన్నాడు- "ఓ వృద్ధ సన్యాసిని నిన్న మధ్యాహ్నం నా భార్యను తీసుకుని పవిత్ర సాధువుల ఆశీస్సులునందజేయిస్తానని వెళ్లినది. ఈరోజు వరకూ వాళ్లు కానరాలేదు"

అధికారి అడిగాడు- "ఆ వృద్ధ సన్యాసిని ఊరు, పేరు ఏమిటి?"

తమకు తెలియదన్నారు వాళ్లు. "మీరు కుఫా ప్రభువుకు కావలసిన వాళ్లు, సైనికులను పంపి వెదికిస్తాను" అని చెప్పి వాళ్లను పంపివేసాడు.

వాళ్లు మరల కుఫా ప్రభువు వద్దకు వెళ్లారు, సైనికాధికారి వెంటరాగా.

కుఫా ప్రభువు అన్నాడు– "యువకుడా! చింత వద్దు" అని సైనికాధికారికి కనుసైగ చేసాడు. "ఏడాదిలోపు నీ భార్య దొరకకపోతే నేనే స్వయంగా పదిమంది బానిస కన్యలను గట్టి వక్షోజాలు, పిరుదులున్న వారిని కానుకగా ఇస్తాను. అంతేకాక ఈ సైనికాధికారి మరో పదిమంది బానిసలను నీకివ్వగలడు. నీకు చెందాల్సింది తప్పక నీకు చెందుతుంది. విధి నిర్ణయం మార్చలేనిది"

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 242వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

కుఫా ప్రభువు మాటలకు కలతచెందిన వ్యాపారి, సలీమ్‌లు తమ ఇంటికి చేరుకున్నారు. మనసు వికలమై సలీమ్ మంచాన పడ్డాడు. కన్ను మూసినా, కన్ను తెరచినా జమీలా కనిపిస్తుంటే కంటికి నిదురేమి పడ్తుంది?

వ్యాపారి మరింత కుంగిపోయాడు. తన మాటను పెడచెవిన పెట్టి వృద్ధ సన్యాసినిని చేరదీసి చిక్కుల్లో పడ్డాక ఇప్పుడు ఎంత దుఃఖించినా ఏమి ఫలము! ఒకప్పుడు సుఖ సంతోషాలతో కళకళలాడిన ఇల్లు ఇప్పుడు స్మశాన నిశ్శబ్దంలో ఉన్నది. కుమారుడు రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నాడు. ఆ వ్యాపారి అలా దుఃఖంతో కుములుతున్నపుడు కటిక చీకటిలో కాంతి కిరణంలా కానవచ్చాడో పర్షియన్ వైద్యుడు.

అతడు వ్యాపారి ఇంటికి వచ్చి సలీమ్‌ను పరీక్షించి అన్నాడు– "మనసు, హృదయం దెబ్బతిన్నవాడి దేహం శుష్కిస్తుంది. నా మంత్రశక్తులతో కారణాన్ని కనుక్కోడానికి ప్రయత్నిస్తాను"

అతడు నేలమీద కూర్చుని ధ్యాన నిమగ్నుడై మంత్రించిన ఇసుకను చిన్న గుట్టగా పోసి దానిపైకి అయిదు తెల్లటి గవ్వలు, మూడు నల్లటి గవ్వలు, రెండు ఎర్రటి కర్రముక్కలు, ఒక పసుపుపచ్చ పులిగోరు విసిరినాడు. అవి పడిన విధానాన్ని చూసి అన్నాడు– "మీ జమీలా బహుశా బస్రాలో... కాదు, కాదు... మూడు నదులున్న దేశం– డమాస్కస్‌లో రాజభవనంలో, ఆమె కూడా ఈ యువకుడిలా జబ్బుపడి ఉన్నది"

వ్యాపారి అన్నాడు– "మహానుభావా! వీరిద్దరినీ కలిపితే నీకు మూడు తరాలు సుఖంగా బతికేటంత ధనమిస్తాను" అని నాలుగు వేల దీనారాలనిచ్చాడు.

ఆ పర్షియన్ వైద్యుడు డమాస్కస్‌కు బయల్దేరుతూ– "కుమారా! నాతోరా!" అన్నాడు సలీమ్‌తో. వ్యాపారి తన కుమారుడికి అయిదువేల దీనారాలు, ఖర్చులకు మరో వేయి దీనారాలిచ్చి తన కుమారుడి బాధ్యతను ఆ వైద్యుడికప్పగించాడు.

వారం రోజుల్లో సలీమ్ ఆరోగ్యం కుదుటపడింది. సలీమ్‌పై పుత్రవాత్సల్యమేర్పడిన పర్షియన్ వైద్యుడు వ్యాపారి అనుమతితో సలీమ్‌ను తీసుకుని డమాస్కస్ బయల్దేరినాడు.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## * 243వ రాత్రి కథ *

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

డమాస్కస్ చేరుకున్న వైద్యుడు అక్కడ ఓ ముఖ్య ప్రదేశంలో మందుల దుకాణము తెరిచాడు. రకరకాల రంగురంగు ద్రవాలు, లేహ్యాలు, లేపనాలు, పొడులు, మూలికలు కనులకింపుగా స్ఫటికపాత్రలలో ఉంచినాడు. అంబరు, కస్తూరి, గుగ్గిలపు పరిమళాలతో ఆ దుకాణము అత్యంత సుగంధభరితంగా ఉండింది.

ఏడు చుట్ల తలపాగా తలకు చుట్టుకుని, మహావైద్యుడి దుస్తులలో పర్షియన్ వైద్యుడు, అతడికి అనుచరుడిగా సలీమ్ ఆ దుకాణంలో ఉండి అందరినీ ఆకర్షించినారు. నీలిరంగు సిల్కు జుబ్బా, కాశ్మీరి జాకెట్, తలపై అందమైన టోపీతో సలీమ్ మరింత అందగా కానవచ్చినాడు.

ఆ పర్షియన్ వైద్యుడు నాడీ పరీక్ష, కంటిరంగు, మూత్ర పరీక్షతో రోగ నిదానము చేయగలిగిన సమర్థుడు. త్వరలోనే అతడి పేరు ఆ చుట్టుపక్కల గొప్పగా వ్యాపించింది. ఆనోటా ఈనోటాబడి అది ఖలీఫా, అతడి సోదరి దహియా చెవికి చేరింది. ఆమె తన ప్రధాన చెలికత్తె రజియాను పంపింది.

రజియా అందంగా అలంకరించబడిన కంచరగాడిదనెక్కి ఆ దుకాణమునకు వచ్చినది. ఆ గాడిదపైనున్న జీను రత్నాలు, జరీఅంచుగా ఉన్న ఖరీదైన

వస్త్రాలచే అలంకరించబడి ఉన్నది. సైనికులు, పరిచారికలు వెంటరాగా ఆమె దుకాణంలోకి వచ్చి ఆ గురుశిష్యులైన వైద్యుల సత్కారాన్ని పొంది, రాజసముగా కూర్చుని అంతఃపురంలో అంతుపట్టని వ్యాధితో బాధపడ్తున్న యువతికి వైద్యం చేయడానికి రమ్మని ఆహ్వానించింది.

వైద్యుడు వెంటనే ఓ రంగురంగు గీతలున్న కాగితాన్ని నేలపై పరిచి దానిపై గవ్వలు విసిరి అవి పడిన గళ్లను లెక్కపెట్టి ధ్యాన నిమగ్నుడై అన్నాడు– "అమ్మా! నీవు చెప్పిన బాలిక ఈ దేశానికి చెందినది కాదు"

అవునన్నది రజియా– "ఆమె పేరు జమీలా. కుఫా పట్టణం నుంచి కొద్ది వారాల క్రితమే డమాస్కస్ వచ్చినది" అన్నది.

పర్షియన్ వైద్యుడు కనులు తెరచి సలీమ్ వేపు చూసాడు. అతడి వదనం ఆనందంతో తొణికిసలాడడం గమనించి అన్నాడు– "అమ్మా! ఆ బాలిక వయసు పదహారేళ్లుండవచ్చు". "కుమారా! ఇటువచ్చి మన అతిధికి పండ్లరసము నివ్వు"

పండ్ల రసము తాగుతూ రజియా సలీమ్‌ను చూసి అతడి సౌందర్యానికి ముగ్ధురాలైంది. ఈలోగా పర్షియన్ వైద్యుడు మరల గవ్వలు విసిరి ప్రార్థన చేసాడు.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# * 244వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది–**

"కుమారా!" అనని పిలిచాడు సలీమ్‌ను ఆ పర్షియన్ వైద్యుడు. "వైద్య గ్రంథంలో ఇబిన్ సినా చెప్పిన ఎనిమిదవ పద్ధతిలో చేసిన మందు ఓ సీసా పట్టుకునిరా!"

రజియా అడిగింది– "వైద్యుడా! ఈ యువకుడెవరు? నీ కుమారుడా లేక నీ బానిసా?"

వైద్యుడు చిరునవ్వు నవ్వుతూ అన్నాడు– "అమ్మా! ఇతడు నా కుమారుడే కాని ఇప్పుడు తమ సేవకుడు"

ఈలోగా సలీమ్ కుఫిక్ శైలిలో తాను వచ్చినట్లు జమీలాకు తెలిసేలా చిత్ర సందేశాన్ని ఓ వస్త్రంపై వ్రాసి దానిలో మందు సీసానుంచి ఒక చిన్ని సంచిలో పెట్టి రజియాకిచ్చాడు.

వైద్యుడన్నాడు– “గౌరవనీయురాలైన రాణీ! ఈ వస్త్రంలో చుట్టిన మందును ఉదయం, రాత్రి రోజుకు రెండుమార్లు ఓ ఉద్ధరిణె మందు తాగమనగలరు. ఆమె ఆరోగ్యం వెంటనే కుదుటపడుతుంది”

వైద్యుడికి పది దీనారాలు చెల్లించి ఎంతో సంతోషంగా రజియా ఆ మందుసీసాను తీసుకుని రాజభవనానికి వెళ్లి జమీలాకిచ్చింది.

తల్లిలాంటి ఆమె మనసును గాయపరచడం ఇష్టంలేని జమీలా సంచిలోని మందుసీసాను తీయగా, సీసా చుట్టూ ఉన్న వస్త్రం ఆమెకంటబడింది. దానిపై కుఫిక్ శైలిలో వ్రాసి ఉన్న చిత్రం, సలీమ్ సంతకం, సందేశం కనబడగానే ఆమెలో మునుపటి కళ కనబడసాగింది.

రజియా అంటూనే ఉన్నది– “చిన్నారీ! ఇది విచిత్రంగా లేదూ! అతడు ముమ్మూర్తులా నీలా ఉన్నాడు. అతడి కళ్లు, అతడి ముఖంపై ఎడమవేపు ఉన్న పుట్టుమచ్చ, అతడి సౌందర్యం ఏ యువతినైనా ఇట్టే ఆకర్షిస్తుంది”.

ఆ మందు ఓ గుక్కతాగి జమీలా అన్నది– “అమ్మా! నీ దయ ఎంతో గొప్పది. నీ మాటలు వినగానే నాలో కొత్త ఉత్సాహం పొంగుతున్నది. నాకు ఆకలిగా ఉన్నది” అంటూ పరిచారికలు తెచ్చిన భక్ష్యాలను హాయిగా తినసాగింది.

జమీలా వ్యాధి నయమైనందుకు రజియా సంతోషంగా ఆ వార్త నందించ డానికి ఖలీఫా వద్దకు వెళ్లింది. ఖలీఫా ఆ వార్త విని వైద్యుడికి ఇమ్మని వేయి దీనారాల నిచ్చినాడు. వాటిని తీసుకుని జమీలా వద్దకు వెళ్లింది రజియా.

ఈలోగా జమీలా కుఫిక్ శైలిలో చిత్రలేఖ వ్రాసి ఖలీఫా ఇచ్చిన దీనారాల సంచిలో ఉంచింది రజియాకి తెలియకుండా. మరుసటి రోజు రజియా వైద్యుడి వద్దకు వెళ్లి ఖలీఫా ఇచ్చిన దీనారాల సంచిని బహుమతిగా ఇచ్చి వైద్యుడిని ప్రశంసించింది.

సలీమ్ ఆ దీనారాల సంచిలో ఉన్న జమీలా వ్రాసిన ఉత్తరాన్ని చదివాడు. తనను కుఫా ప్రభువు ఆజ్ఞతో అతడి సేవకుడెలా బలవంతంగా డమాస్కస్ తీసుకు

వచ్చారో వివరంగా వ్రాసిందామె. అది చదివి సలీమ్ దుఃఖంతో విలపిస్తూండగా కారణమడిగింది దయార్ద్రహృదయురాలైన రజియా.

వైద్యుడు ఆమెకు వివరించసాగినాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 245వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

వైద్యుడన్నాడు- "దయామయీ! నీవు తప్ప మాకు దిక్కెవరు? అంధకారంలో వెలుగు రేఖవైనావు నీవు. నీ కరుణతో నిండు ప్రాణాలు రెండు కాపాడబడుతున్నాయి. కుఫా నగరపు ప్రముఖ వ్యాపారి కుమారుడు ఈ సలీమ్. వ్యాపారింట్లో పెరిగి పెద్దదైనది జమీలా. సలీమ్-జమీలాలు వివాహం కాకపోయినా భార్యాభర్తలుగా జీవిస్తున్నారు. ఇరువురూ ఇంకా పదహారేళ్ల పసిప్రాయంలో ఉన్నారు. తమకు కృతజ్ఞతతో మేమిస్తున్నది రెండువేల దీనారాలు. ఇంకా మేము ఇవ్వగలవారము. ఇవి కేవలం తమకు మేమిచ్చు కానుకలుగా గ్రహించగలరు. అన్యథా భావించవలదు" అన్నాడు వైద్యుడు ఎంతో వినయంగా.

రజియా ఆలోచించింది. కరుణతో కూడిన వాత్సల్యమామెను కదిలించగా ఆమె బజారులో ఆడపిల్లలు ధరించే వస్త్రాలు; ఆభరణాలు, అలంకరణ సామాగ్రి తెచ్చి తానే స్వయంగా సలీమ్‌ను ఆడపిల్లగా అలంకరించి, బురఖా తొడిగి తనతోపాటు అంతఃపురానికి తీసుకువెళ్లింది.

అడ్డుచెప్పిన అంతఃపుర కావలి భటుల అధికారిని శాంతపరచి ఆడవేషంలో ఉన్న సలీమ్‌ను లోనికి తీసుకువెళ్లి- "కుమారా! ఈ దారిలో వెళ్లి ముందుగా ఎడమవేపుకు, ఆ తరువాత కొంత దూరము పోయాక కుడివేపుకు, మరల కుడివేపుకు వెళ్లి అయిదు ద్వారములు లెక్కవేసి ఆరవ ద్వారము తెరచి ఆ గదిలోకి వెళ్లు. అక్కడ నీకు కావలసిన సదుపాయాలుంటాయి. నేను ఓ గంట తరువాత అక్కడకు జమీలాను పంపిస్తాను. మీరు మాట్లాడుకున్నాక నిన్ను నేను స్వయంగా నీ దుకాణం వద్దకు తీసుకువెళ్తాను" అన్నదామె.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 246వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

రజియా చెప్పిన విధంగానే సలీమ్ రాజమందిరంలో ఉన్నత గోపురమున్న ఆవరణలోకి ప్రవేశించాడు. ఆ గోపురముపై దైవ వాక్యములు వేల రేఖలలో స్వర్ణ వర్ణముతో లిఖించబడి ఉన్నాయి. గోడలకు, కిటికీలకు గులాబి రంగు తెరలు, నేలపై హిందూదేశము నుంచి తెచ్చిన తివాచీలు అందముగా పరచబడి ఉన్నాయి. పెద్దపెద్ద మేజాబల్లలపై వివిధ రకాల వస్త్రాలు పరచి వాటిపైన వివిధ రకాల భక్ష్యాలు, ఫలాలు చూడగానే నోరూరేట్లుగా అమర్చబడినాయి. మల్లెల నగరం డమాస్కస్ ఆ పరిమళాలతో మత్తెక్కే విధంగా తన పేరు సార్థకం చేసుకున్నదా! ఆవరణలో తిరిగితే ఎవరికంటైనా పడవచ్చునని ఆడవేషంలో ఉన్న సలీమ్ వెల్వెట్ వస్త్రాలతో అలంకరించబడిన గద్దె ఉన్న గదిలోకి వెళ్లి దానిపై కూర్చుని నిద్రకొరిగాడు.

ఇంతలో అతడికి సిల్కు వస్త్రాల సవ్వడి వినిపించి మెలకువ వచ్చింది. రాచదుస్తులు ధరించిన యువతి, తనతోపాటు ఓ పరిచారిక తలనిండా మల్లెపూలున్నది సైకామోర్ కొయ్యతో చేసిన వీణను పట్టుకురాగా గదిలోకి వచ్చింది. ఆమె ఎవరో కాదు ఖలీఫా సోదరి దహియా రాణి.

"ఎవరు నీవు? ఖలీఫా పంపిన కొత్త బానిసవా? ఓ అందాల కనులదానా, మాటలు రావా!" అన్నది దహియా రాణి నవ్వుతూ ఆడవేషంలో ఉన్న సలీమ్‌ను చూసి.

ఆమె రాగానే గాభరా పడుతూ సలీమ్ గదిలో ఓ మూల తలవంచుకుని నిలబడినాడు. ఆమె తనతో వచ్చిన పరిచారికను పంపి జమీలాను రప్పించింది కరుణాహృదయురాలైన దహియా రాణి.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 247వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

దహియారాణి అన్నది- "ఎందుకో తెలియదు కాని నీ గురించి రజియా చెప్పగానే నీపై పుత్ర వాత్సల్యమేర్పడింది. ఇక్కడ జమీలాను చూసినాక మీ

అపురూపమైన ప్రేమను కనులారా తిలకించి నేను ముగ్ధురాలనయ్యాను. మీకు సహాయం చేయడానికి దైవం నాకు అవకాశాన్నిచ్చాడని భావించాను. నా సోదరుడు ఖలీఫా ఏ తప్పూ చేయడని నమ్మకం. అతడు ఖచ్చితంగా మీకు మేలు చేస్తాడు. అందుకే నేను స్వయంగా, మీ దంపతుల మధ్య రాయబారినైనాను"

ఆమె మాటలు విన్న సలీమ్‌కు కన్నులు ధారాపాతంగా వర్షించగా అతడు మౌనంగా విలపించినాడు. ఇంతలో రజియాతో పాటు వచ్చిన జమీలా దహియా రాణికి అభివాదం చేయగా రాణి అన్నది– "చిన్నారీ! ఈమే నీ వ్యాధికి కారకురాలు, చికిత్స కూడా ఈమే! ఒక్కసారి ఆమె మేలి ముసుగును తొలగించు, గుర్తు పడుదువుగాని" అన్నది నవ్వుతూ.

రాణి ఆజ్ఞను శిరసావహించి జమీలా యువతి వేషంలో ఉన్న సలీమ్ ముసుగు తొలగించి సంతోషం పట్టలేక అతడి చేతుల్లోనే మూర్ఛితురాలైంది. దహియా రాణి ఆమెపై చల్లటి గులాబి జలాలను జల్లగా మేల్కొన్నది జమీలా.

వారి ఆనందాన్ని కళ్లారా చూసిన దహియారాణి వారిని ఆశీర్వదించి అన్నది– "మీ జంట కనులముచ్చటగా ఉన్నది. మీరిరువురూ సంగీత సాహిత్యాలలో ఒకరికొకరు సాటి అని విన్నాను. నాకోసం చక్కని ప్రణయగీతాలను వినిపించండి" అన్నదామె విలాసంగా ఆ గద్దెపై కూర్చుని.

ఒకరి కౌగిలిలో ఒకరు ఒరిగిన ఆ ప్రేమజంట విడివడి అక్కడ ఉన్న వీణను శృతి చేసి– సలీమ్ పాడినాడు–

*"నేను తెచ్చాను నీకోసం*
*కుఫా సిల్కు వస్త్రంలో దాచిన పూలను*
*పుప్పొడి సుగంధాలింకా ఆరని ఫలాలను*

*నేను తెచ్చాను నీకోసం*
*సూడాన్‌లో దొరికే స్వర్ణ భస్మమును*
*డమాస్కస్ మల్లెపూల దండలను*

*నేను తెచ్చాను నీకోసం*
*అరబ్బు దేశాల సుగంధ వాయువీచికలను*
*రాత్రి ముసుగు కప్పుకున్న ఆకుల గలగలలను"*

జమీలా సమాధానమిచ్చింది-

*"నీవు వచ్చావు చాలు నాకది*
*నీలి సముద్రంపై ఎగిరే తెల్లటి పక్షిలా*
*నా ప్రాణాన్ని నిలబెట్టే జగత్సాక్షిలా*

*నీవు వచ్చావు చాలు నాకది*
*గులాబివనంలో బుల్‌బుల్ పిట్టలా*
*ఆకుపచ్చతోటలో పారే సెలయేరులా*

*నీవు వచ్చావు చాలు నాకది*
*చీకటిపై పరచిన వెన్నెల దుప్పటిలా*
*జలధిపై ప్రకాశిస్తున్న సూర్యకాంతిలా*

*నేను తెచ్చాను నీకోసం*
*నిలిపి ఉంచిన నా ప్రాణాన్ని*
*నీవు వచ్చావు చాలు నాకది*
*నిలిచిపోయిన ప్రాణం మరల బ్రతికినది"*

ఆ పాటలింకా ప్రతిధ్వనిస్తుండగానే ఖలీఫా ఆ గదిలోకి ప్రవేశించాడు. అతడి అనుకోని రాకకు ఆశ్చర్యపడిన ముగ్గురూ లేచి నిలబడి అతడి చేతుల మధ్యలోని నేలను ముద్దాడినారు.

ఖలీఫా అన్నాడు- "చాలా అద్భుతంగా పాడినారు మీరు. నా మనసు పులకించింది"

దహియా రాణి అన్నది- "వీరి కథ తమకు విన్నవిస్తాను. ఖలీఫాగా న్యాయనిర్ణయం తమరే చేయగలరు".

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 248వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఖలీఫా అన్నాడు– "జమీలా ఆరోగ్యం కుదుటపడిందని విని నేను వచ్చాను. సోదరీ, నీవు నాకోసం మరో బాలికను సిద్ధం చేసినావా! కృతజ్ఞతలు"

దహియా రాణి అన్నది– "ప్రభూ, వీళ్లు తమ సేవాభాగ్యంతో తరించవలసిన వాళ్లే. కాని న్యాయ ధర్మ పరిరక్షకులైన ఖలీఫా తమరు. దైవ విశ్వాసుల అధినేతగా జరిగిన తప్పును సరిదిద్దవలసిన వారు" అని పలికి సలీమ్–జమీలా కథను సవివరంగా విన్నవించి "ఈ కథకు ముగింపు తమరే చెప్పాలి!" అన్నది.

సుల్తాన్ అబ్ద్ అల్–మాలిక్ ఇబిన్ మార్వాన్ అన్నాడు– "నీవు చెప్పిన సలీమ్–జమీలా కథను బట్టి వారిరువురూ క్షమింపదగినవారు"

దహియా రాణి అన్నది– "దైవం ముందు తమరు దోషిగా నిలబడకుండా ఉండేందుకు నేనీ సాహసం చేయవలసి వచ్చింది. వీళ్లే ఆ సలీమ్–జమీలాలు" అని పలుకగా ఆమె సూచనల ననుసరించి ఖలీఫా చేతుల మధ్యన ఉన్న నేలను ముద్దాడినారు. దహియా అన్నది– "కుఫా ప్రభువు యూసుఫ్ అల్ ధఫాకి తన స్వార్థం కోసం జమీలాను అపహరించి ఆమెను పదివేల దీనారములిచ్చి కొన్నానని అబద్ధమాడినాడు. ఈ చిన్నారులు తమ కరుణకు పాత్రలు కావలసినవారే కాని వేరు కాదు"

ఖలీఫా మరుసటి రోజు సభలో పర్షియన్ వైద్యుడిని ఆస్థాన వైద్యుడిగా నియమించాడు. సలీమ్–జమీలాలకు స్వేచ్ఛ ప్రకటించి కాదీలను పిలిపించి వివాహ పత్రము వ్రాయించి అనేక కానుకలనిచ్చి సాగనంపినాడు.

కుఫా ప్రభువు యూసుఫ్ అల్ దఫాకిని మందలించడమే గాక అతడిని, అతడికి సహకరించినవారిని పదవుల నుంచి తొలగించినాడు. వ్యాపారిని కుఫా ప్రభువుగా నియమించి తప్పును సరిదిద్ది దైవం దృష్టిలో, ప్రజల దృష్టిలో మంచి స్థానాన్ని పొందినాడు ఖలీఫా అబ్ద్ అల్–మాలిక్ ఇబిన్ మార్వాన్. ఆ యువజంటకు దహియా రాణి రాజమాతగా అండగా ఉండగా సలీమ్–జమీలాలు హాయిగా కలకాలం జీవించారు"

***-అని కథ ముగించింది షహర్జాది. "ప్రభూ ఇప్పుడు నేను చెప్పబోయే కథ మరింత రసవత్తరమైనది.***

# V. అలా అల్-దిన్ అబు షామత్ కథ

షహర్జాది అన్నది- కైరో నగరంలో వ్యాపారకూటమి నాయకుడైన షామ్స్ అల్-దిన్ అచంచల దైవ విశ్వాసిగా, నిజాయితీ పరుడిగా, వినయశీలిగా, పరోపకారిగా, ధనవంతుడిగా అనేకమంది బానిసల యజమానిగా పేరుకెక్కినాడు.

ఒకరోజు పవిత్ర శుక్రవారం నాడు స్నాన గృహానికి వెళ్లి పక్కనే ఉన్న క్షురకుడితో కేశ సంస్కారం చేయించుకుంటూ అద్దంలో తన ముఖాన్ని చూసుకునే సరికి నల్ల వెంట్రుకలకన్నా తెల్ల వెంట్రుకలెక్కువ కనిపించేసరికి మనసు కలత పడింది. ప్రార్థనలనంతరం అతడు వడివడిగా ఇంటికి వెళ్లాడు దిగాలుపడిన ముఖంతో.

ఎప్పుడూ హుషారుగా ఉండేవాడు గంటుపడిన ముఖంతో రావడానిని గమనించిన భర్య కంగారుపడింది.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## ✻ 249-250వ రాత్రి కథ ✻

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ఎంతో చలాకీగా ఉండే తన భర్త ఏదో కోల్పోయినట్లు బాధపడుతూ ఇంటికి వచ్చేసరికి వ్యాపారి భార్య కారణమేమని అడిగింది.

షామ్స్ అల్-దిన్ అన్నాడు- "ఏమని చెప్పను నా మనసులో ఆందోళన గురించి. ఇప్పటికే నా కాళ్లు సమాధి ద్వారం ముంగిట ఉన్నాయి. ఇద్దరు ముగ్గురు పిల్లలతో కళకళలాడాల్సిన లోగిలి నిశ్శబ్దంగా కానరావడం లేదా. ఆ మాట మనసులో కెక్కాక నాకు చాలా బాధగా ఉన్నది" అన్నాడతడు.

వినయశీలి అయిన ఆమె అన్నది- "సంతానం దైవనిర్ణయం కాదా! దిగులు చెందవద్దు"

అతడిలో ఎప్పుడూ లేనిది కోపం హద్దులు దాటింది. భార్యను నిందిస్తూ అన్నాడు- "నీవు వంధ్యవు. నీవలనే నా వంశం నాతో ముగుస్తున్నది. నిన్ను వివాహమాడి ఇప్పటికి నలభై ఏళ్లు గడిచాయి. నీకిప్పుడు యాభైమూడేళ్లు. నా విత్తనాలు ఇసుకలో పోసిన నీటిలా ఇంకిపోయాయి కాని మొక్క మొలవలేదు"

ఆమెకూ కోపం వచ్చింది- "అనరాని మాటలన్నావు నన్ను. నేనేమీ నీవన్నట్లు నీళ్లింకే అడుగులేని ఇంకుడుగుంతను కాను. నీ విత్తనాల్లో బలం లేకపోతే నేలనంటే ఏమిలాభం. పిల్లల్లేరని నేను బాధపడని క్షణమున్నదా! వేడిలేని మగడి వీర్యం వేయిసార్లు గుంటలో పడినా వేరున్న మొక్క పుడ్తుందా? నీ చేతనైనది నీవు చేసావు. నలభై ఏళ్ల కాపురాన్ని చులకన చేసి మాట్లాడావు. మాటకు మాట నేనూ అనగలను. పో! పోయి నీ ఇంద్రియాన్ని బలపరచే మందులు వాడు. అప్పుడు చూద్దువుగాని నా నేల సారవంతమైనదో కాదో!"

వ్యాపారి ఠపీమని సమాధానమిచ్చాడు- "నా ఎరుకలో లేదు కాని, నీకు తెలిస్తే చెప్పు. అటువంటి మందుంటే ఈరోజునుంచే వాడతాను"

ఆమె అన్నది తగ్గకుండా- "ఏ వైద్యుడినైనా అడుగు ఇస్తాడు వాజీకరణ మందులను. ఇతరులను నిందించడం మొదలెడితే ఇరకాటంలో పడతారు ఎవరైనా!"

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 251వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

భార్య అన్న మాటలకు బాధపడినా స్వతహాగా మంచివాడైన వ్యాపారి మరుసటి రోజు ఉదయమే ఓ వైద్యుడి దగ్గరకు వెళ్లాడు.

వైద్యుడన్నాడు- "శుభోదయం! ఈరోజున తమరే నా మొదటి రోగి. తమకే వైద్య అవసరం వచ్చి ఇటు వచ్చారు?"-

వ్యాపారి అన్నాడు- "నలభై ఏళ్లయ్యింది వివాహమై. సంతానలేమితో బాధపడ్తున్నాను. తమవద్ద తరుణోపాయముంటే చెబుతారని ఆశ" అన్నాడు కాస్త గుంభనంగా.

వైద్యుడన్నాడు- "ఎటువంటి మందు కావాలి! తినేదా, చప్పరించేదా, ముక్కులో వేసుకునేదా, మింగేదా?"

వ్యాపారి అన్నాడు- "ఏదైనా ఫరవాలేదు. అది నా ఇంద్రియాన్ని చిక్కపరచి పిల్లల్ని కనేట్లు చేయగలగాలి"

వైద్యుడనుకున్నాడు– "ఇతడేమో వయోవృద్ధుడిలా ఉన్నాడు. ఈ వయసులో సంతాన లేహ్యాలు ప్రమాదకరమే!" అనుకుని– "మిత్రమా! నా దగ్గర మందులైపోయాయి. పక్కనే ఉన్న వైద్యుడినడుగు"

వ్యాపారి రెండో వైద్యుడినడిగాడు. అతడు ఇంకొకరి దగ్గరకు, ఇలా అతడు సాయంకాలమయ్యే వరకు తిరుగుతూనే ఉన్నాడు. వైద్యులు వినయంగా తమవద్ద మందు లేదంటూనే తన వెనక నవ్వుకోవడానిని వ్యాపారి గమనించాడు. ఆశలపై నీళ్లు జల్లినట్లై దిగాలుగా కూర్చుని ఉండగా వ్యాపారపు మధ్యవర్తులలో పెద్దమనిషి, కాకుంటే బుద్ధిలో వంకరబుద్ధి, గంజాయి తిని, మధువు తాగి బజారు వేశ్యలతో కాలం గడిపే శామ్‌సమ్ అటుగా వచ్చాడు. అంతటి చెడ్డవాడికీ ఎందుకో వ్యాపారి అంటే గౌరవం. చిన్నబోయి తలదించుకుని కూర్చున్న వ్యాపారిని చూసి పరామర్శ చేసాడు– "ఏమిటీ సంగతని".

వ్యాపారి అన్నాడు– "నలభై ఏళ్లయ్యింది వివాహమై, కాని, పిల్లలు లేరు నాకు. ఈరోజు పట్టణంలోని ప్రతి వైద్యుడినీ సంప్రదించాను. అందరూ మందు లేదని చెప్పి, చాటుగా నవ్వుకుంటున్నారు. అదే నా విచారానికి కారణం".

శామ్‌సమ్ అన్నాడు– "నాకో దీనారమివ్వు. నీ దగ్గర స్ఫటిక పాత్ర చిన్నది ఉంటే ఇవ్వు. దానిలో నీవడిగిన మందు తెస్తాను"

వ్యాపారి ఆశ్చర్యపోయాడు– "మిత్రమా! ఇవిగో రెండు దీనారాలు తీసుకో. ఇదిగో స్ఫటిక పాత్ర"

రెండు దీనారాలను తీసుకుని శామ్‌సమ్ బజారుకెళ్లి – రెండు తులాల చైనా క్యూబెబ్‌లు, ఒక తులం అమోనియా జనపరసం, ఒకతులం సింహళ ఎర్ర దాల్చినచెక్క, పది తెల్ల యాలకులు మలబార్ ప్రాంతానివి, అయిదు హిందూ దేశపు అల్లంముక్కలు, అయిదు మిరపకాయలు, ఒకతులం హిందూ అనాస పువ్వు, అరతులం అడవి తులసి తెచ్చి అన్నిటినీ దంచి, పొడిచేసి, జల్లెడ పట్టి ఆ మెత్తటి పొడికి ప్రశస్తమైన తేనె కలిపి, దానిపై అయిదు గింజలెత్తు కస్తూరిని, ఒక తులం చేప జన్న (గుడ్లు)ను కలిపి ఆ రసాయనంపై గులాబి నీళ్లు చల్లి వ్యాపారిచ్చిన స్ఫటిక పాత్రలో ఉంచి దానిని వ్యాపారికిచ్చినాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 252వ రాత్రి కథ *

## షహర్జాదీ కథ చెప్పసాగింది-

స్ఫటిక పాత్రలో తాను తయారుచేసిన వాజీకరణ కషాయాన్ని ఉంచి దానిని వ్యాపారికిచ్చి అన్నాడు శామ్‌సమ్– “మిత్రమా, మూడురోజుల పాటు మసాలా దట్టించిన పావురాల వేపుడు, చేపల పులుసు, గొర్రెపొట్టేలు వృషణాలను నేతితో వేయించి వీటిని మాత్రమే తినాలి. ఆ తరువాత భార్యతో సుఖ సంసారం చేయి, సంతానం కలగకపోతే నా గడ్డాన్ని గొరిగించి నా ముఖం మీద ఉమ్మేయవచ్చు” అన్నాడతడు.

వ్యాపారి అన్నాడు– “శామ్‌సమ్, నీలో ఇంత వైద్య పరిజ్ఞానముండి ఇలా అల్లరి చిల్లరగా తిరగడానికి కారణమేదో ఉండి ఉంటుంది. నీకు నా కృతజ్ఞతలు. నీ మందు (దవా) దేవుని ఆశీస్సు (దువా)తో నాకు సంతానం కలిగితే నీకు మరిన్ని దినారాలనిస్తాను సంతోషంగా”

శామ్‌సమ్ చెప్పినట్లు వ్యాపారి మూడురోజుల పాటు ఆహార నియమాలు పాటించి, భార్యతో సమాధానపడి, ఆమెతో సరస సల్లాపాలకు దిగినాడు. ఎంత పోట్లాడుకున్నా ఒకరిపై ఒకరికి ప్రేమ ఉండడంతో ఇద్దరూ క్షమాపణలు వేడుకుని తప్పు తనదంటే తన దనుకుని మరల హాయిగా నవ్వుకున్నారు. మూడురోజులు మసాలా దినుసులు నిండిన ఆహారం తినేసరికి వ్యాపారి వంట్లో రక్తం ఉరుకులు పరుగులు పెడ్తున్నది. నాలుగవ రోజు రాత్రి అతడు శామ్‌సమ్ ఇచ్చిన మందును తినేసరికి అతడి రక్తం ఉవ్వెత్తున పొంగింది. ఎప్పుడూ లేనిది ఆ రాత్రి అతడికి పునర్యవ్వనము వచ్చినట్లై ఉద్రేకం, స్తంభన, ఉష్ణత, స్ఖలనము, చిక్కదనము, పునః కోరిక, తాపము పరాక్రమించ, అతడి భార్య గొప్పగా సహకరించడంతో ఆ దంపతులకు మహానంద ప్రాప్తి కలిగింది. ఓ వారంపాటు ఆ దంపతులు ఆనంద కేళిలో కాలం గడిపారు.

మూడు నెలలు గడిచాయి. వ్యాపారి భార్య అన్నది– “నాకు నెలసరి ఆగిపోయింది. వేవిళ్లు వస్తున్నాయి”

ఇద్దరూ ఆనంద పరవశులైనారు. భర్త లాలన పాలనలో తొమ్మిది నెలలు గడిచాయి. ఒక మంచిరోజున వ్యాపారి భార్యకు పురుటినెప్పులెక్కువై పండంటి

కొడుకును కన్నది. పుట్టినప్పుడే ఏడాది వయసున్న బాలుడిలా ఉన్న ఆ శిశువును చూసి కాన్పు చేసిన దాయి కూడా ఆశ్చర్యపోయింది.

ఆ శిశువుకు స్నానం చేయిస్తూ అల్లా, ప్రవక్త, ఆలి నామములను ఆ బాలుడి చెవిలో పలికి, పొత్తిళ్లలో చుట్టి తల్లికి అప్పచెప్పింది అనుభవజ్ఞురాలైన దాయి. అందరూ సంతోషంగా మిఠాయిలు పంచుకుని తిన్నారు.

వ్యాపారి తనకు సాయంచేసిన శామ్‌సమ్‌కు వంద దీనారాలను కానుకగా ఇచ్చి సంతోషపెట్టినాడు.

ఏడవ రోజున గదిలో ఉప్పును జల్లినారు. మధ్యాహ్న సమయానికి వ్యాపారి వచ్చి- ''ఎక్కడ మనకు అల్లా ఇచ్చిన కానుక'' అంటూ ఆ బాలుడిని ఎత్తుకుంటున్నపుడు పక్కనే ఉన్న పరిచారిక చూసింది ఆ బాలుడి ఎడమతొడపై ఉన్న చిన్ని పుట్టుమచ్చను. అంతేకాక అతడి రెండు బుగ్గలపై నల్లగా మెరుస్తున్నవి రెండు పుట్టుమచ్చలు. వ్యాపారి అన్నాడు ఆనందంగా ఈ పిల్లాడి పేరు అలా అల్-దిన్ అబు షామత్. అందరూ అతడిని 'అబు షామత్'గా పిలువసాగినారు.

నాలుగేళ్లపాటు అతడికి అతడి తల్లి, మరో ఇద్దరు దాయిలు పాలిచ్చినారు. అందరి రక్షణలో అతడు యువసింహంలా, మల్లెల తెల్లదనం, గులాబీల ఎర్రదనంతో అత్యంత ఆకర్షణీయంగా తయారైనాడు. ఆడపిల్లలు అతడి సమవయస్కులు, పెద్ద పిల్లలు అతడంటే పడిచచ్చేవాళ్లు. అయినా అతడు ఎవరినీ దగ్గరకు రానీయకుండా గోళ్లతో రక్కుతూ భయపెట్టేవాడు. అందుకని వాళ్లు అతడు నిద్రపోతున్నపుడు అతడి ముఖాన్ని ముద్దులతో ముంచెత్తేవారు.

అందుకని వ్యాపారి ఆలోచించి ఆ బాలుడికి చెడుదృష్టి తగలకుండా ఇంటిలో ఓ భూగర్భ మాళిగ, అన్ని వసతులతో కూడిన గదిని నిర్మించి బాలుడిని అక్కడ ఉంచి అతడి చుట్టూరా పరిచారికులను, నపుంసక పనివాళ్లను పనులు చేయడానికి నియమించినాడు. అక్కడే అతడికి పవిత్ర గ్రంథం ఖురాన్‌ని, ఇతర విషయాలను బోధించడానికి గురువులను నియమించినాడు. తన కుమారుడికి గడ్డం మీసాలు వచ్చేవరకు ఆ గదిలోనే ఉంచాలని నిర్ణయించుకున్నాడు వ్యాపారి.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# ✳ 253వ రాత్రి కథ ✳

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఒక్కోసారి మనం మంచి ఉద్దేశంతో తీసుకునే నిర్ణయాలు మనలను ఇబ్బందులపాలు చేస్తాయి. దానికి తోడు పరిస్థితులు ప్రతికూలమైనపుడు పరిణామాలు భిన్నంగా ఉంటాయి.

చెడుదృష్టి సోకకుండా తన కుమారుడిని ఓ భూగర్భ గదిలో ఉంచి పెంచడం వ్యాపారికి చేదు అనుభవాన్నివ్వబోతున్నది.

ఎప్పటిలాగే వ్యాపారి షామ్స్ అల్-దిన్ తన దుకాణానికి వెళ్లాడు. ఆ మధ్యాహ్నం అబు షామత్‌కు భోజనం తీసుకువెళ్లిన నపుంసక పనివాడు తలుపు వేయడం మరచిపోయాడు. గదిలో పచార్లు చేస్తున్న కుర్రవాడు వెంటనే ఆ తలుపు తెరుచుకుని ఇంటిలోకి వచ్చేసరికి అతడి తల్లి అనేకమంది ధనవంతులు, అమీర్లు, వజీర్ల భార్యల మధ్య కూర్చుని చతుర సంభాషణల్లో మునిగి ఉన్నది. అందరూ స్త్రీలే కనుక వాళ్లు ముసుగులు తీసేసి వివిధ భక్ష్యాలను తింటూ, పండ్ల రసాలను తాగుతూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

అకస్మాత్తుగా ఆ పధ్నాలుగేళ్ల యువకుడు వారి ముందు ప్రత్యక్షమయ్యే సరికి వాళ్లు చకచకా తమ వస్త్రాలతో ముఖాలను కప్పుకుంటూ అన్నారు- "ఎటువంటి విషయమిది. పరాయి మగవాడు రాకూడని ఈ చోటుకు ఈ యువకుడెలా రాగలిగినాడు?"

షామ్స్ అల్-దిన్ భార్య అన్నది- "మీరందరూ ఈ బాలుడి నామకరణోత్సవానికి వచ్చిన వారే కదా! చెడుదృష్టి సోకకుండా నా భర్త ఇతడిని భూగృహంలో దాచి ఉంచినాడు. ఇప్పుడితడికి పధ్నాలుగేళ్లు. నా కుమారుడు, నా కడుపు పంట, నా భర్తకు గౌరవం, మా కలల దీపం ఇతడు అబుషామత్!"

"అవునా!" అని వారు ఆశ్చర్యపడి ఆ పిల్లవాడిని ఆశీర్వదించినారు. వారందరూ వెళ్లిపోయాక అబు షామత్ అన్నాడు- "అమ్మా! ఆ చీకటిగదిలో ఎన్నాళ్లుండాలి నేను. రేపటి నుంచి నేను నా తండ్రితో కలిసి బయటకు వెళ్తాను"

ఆమె అన్నది- "నాయనా! తప్పకుండా వెళ్లు. నీ తండ్రి ఈ పట్టణపు వ్యాపారస్తుల నాయకుడు. వేయి దీనారాలకు తక్కువ విలువ ఉన్నదేదీ కొనడు,

అమ్మడు. అరేబియా సుల్తాను, ఇతర మహమ్మదీయ ప్రభువులకు కావాల్సిన వస్త్రాలను అమ్ముతాడు. కైరో పట్టణం మొత్తంలో నీ తండ్రి సలహాని అడగని వ్యాపారి ఉండడు"

తల్లికి కృతజ్ఞతలు తెలిపి మరల తన గదిలోకి వెళ్లిపోయాడు అబు షామత్.

ఆ రాత్రి వ్యాపారి వచ్చినాక అతడి భార్య అన్నది– "చెడుదృష్టి అంటూ ఎన్నాళ్లు ఆ బాలుడిని గదిలో ఉంచుతావు. విధి నిర్ణయం తప్పించడం ఎవరి వలనా కాదు. ఎవరికో ఏదో కీడు జరిగిందని నీ కుమారుడికి రక్షణ పేరుతో నిర్బంధాన్నిచ్చావు. రేపు నీవు చనిపోతే నీ వారసుడినని అబు షామత్ ఎలా ఋజువు చేయగలుగుతాడు?"

వ్యాపారి కళ్లు తెరుచుకున్నాయి– "రేపు అతడిని నాతో తీసుకు వెళ్తున్నాను" అన్నాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 254వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

భార్య సలహా విని ఆలోచనలో పడిన వ్యాపారి తన కుమారుడిని తనతో పాటు దుకాణానికి తీసుకువెళ్లడానికి నిశ్చయించుకున్నాడు.

మరుసటిరోజు ఉదయాన తన కుమారుడు అబు షామత్‌కు స్నానం చేయించి, విలువైన వస్త్రాలు తొడిగి, శాటిన్ అంగీ, బంగరు జరీ అంచు ఉన్న చారల తలపాగా తొడిగి ప్రశస్తమైన తెల్లని కంచరగాడిద మీద తన వెనక కూర్చోబెట్టుకుని దుకాణానికి వెళ్తుంటే ఆ యువకుడి సౌందర్యానికి దారిన పోతున్న జనులు నోరెళ్లబెట్టి చూడసాగినారు.

"ఆహా! ఎవరీ పదునారు కళల చందమామ! ఏ తల్లి కన్న నోముల పంట ఇతగాడు" అనుకుంటున్నపుడు, శామ్‌సమ్ చూసాడు వ్యాపారిని, యువకుడిని. గంజాయి, మధువు, కామం మూడు దినుసులు అతడి దృష్టినెప్పుడో చెడగొట్టాయి. వాడనుకున్నాడు– "ఈ వ్యాపారికి కూడా కుర్రవాళ్ల స్పర్శ కావాల్సి వచ్చినట్టున్నది.

ముందు ద్వారం మూసుకున్నదేమో, వెనక తలుపు తెరుస్తున్నాడనుకుంటా. అయినా నాకు తెలియని పిల్లవాడు, ఇంత అందగాడు ఇతడెవరు? అయినా ఒకసారి కదిలిద్దాం తీగ, అప్పుడు డొంక దానంతటదే కదుల్తుంది" అనుకుని కనబడిన వారందరితో ముచ్చటలు పెట్టసాగినాడు. "దైవమా! ఎటువంటి కాలం వచ్చింది. ఎంతో పవిత్రుడు, అందరికీ ఆదర్శప్రాయుడని పేరు తెచ్చుకున్నవాడు ఈరోజున ఓ కుర్రవాడిని వెనకబెట్టుకుని ఊరేగుతున్నాడు. చింత చచ్చినా పులుపు చావలేదనుకుంటా" అంటూ అవాకులు, చవాకులు పేలుతూ పుకారు సృష్టించాడు. అన్నిటికన్నా వేగంగా పోయేది, ఆకర్షణీయమైనది, ప్లేగువ్యాధిలా వ్యాపించేది పుకారే కదా!

ఆ మాట ఆనోటా ఈనోటా పడి వ్యాపారస్తుల కూటమికి చేరింది. ఇదేమీ తెలియని వ్యాపారి తన దుకాణానికి బాలుడిని తీసుకువెళ్లి కుమారుడితో వ్యాపార మెలకువలు మాట్లాడుతూ కూర్చున్నాడు. వ్యాపారస్తులలో కొందరు అటుగా వచ్చి దూరం నుంచే వ్యాపారిని అతడిని అంటిపెట్టుకుని తిరుగుతున్న అబు షామత్‌ను చూసి శామ్‌సమ్ చెప్పింది నిజమేనని నిర్ధారించుకున్నారు.

వాళ్లనుకున్నారు– ప్రతిరోజూ మనం అందరికీ అతడే ఆదర్శమనుకుని వ్యాపారం మొదలుబెట్టే ముందు అతడి ముందు నిలబడి తలవంచుకుని ఏడు ఆయతులు చదువుతాము. ఈరోజు మనం మన కళ్లతో చూసాము, అతడు చిన్నపిల్లాడిని వెంటబెట్టుకుని బహిరంగంగా తిరగడం. అటువంటి వాడు మనకు నాయకుడిగా ఉండతగడు"–

వాళ్ల అనుమానానికి ఆజ్యం పోస్తూ శామ్‌సమ్ మరిన్ని పుకార్లు సృష్టించాడు. కొందరికి శునకానందముంటుంది కదా.

ఉదయాననే తనవద్దకు వచ్చి పవిత్ర గ్రంథం నుంచి ఏడు శ్లోకాలు పఠించేవారు ఆరోజు రాకపోయేసరికి వ్యాపారికి ఆశ్చర్యం వేసింది. అతడు ఆలోచిస్తుండగానే పొగబెట్టిన శామ్‌సమ్ అతడిని పలకరించాడు.

వ్యాపారి అన్నాడు– "ఏమి కారణమో తెలియదు శామ్‌సమ్, ఈరోజు వ్యాపారులు దైనిక దైవప్రార్థనలకు రాలేదు"

శామ్‌సమ్ అన్నాడు– "నేను అనవచ్చునో అనకూడదో తెలియదు కాని, వ్యాపార విఫణిలో పెద్ద పుకారు ఉన్నది, వాళ్లలో కొంతమంది నిన్ను పెద్దగా తొలగించాలనుకుంటున్నారు"

వ్యాపారి అన్నాడు– "నేనేమీ తప్పు చేయలేదు. అయినా ఏమిటా పుకారు? నన్ను వ్యాపారస్తుల పెద్ద అనే గౌరవం నుంచి తొలగదీసేది?"

శామ్‌సమ్ అన్నాడు కాస్త వెకిలిగా– "పెద్దాయనా! నాలాంటి అనుభవజ్ఞుడిని మించిపోయావుగా సరస సల్లాపాలలో. వ్యాపారస్తులు చూసారు నీవు ఒక బాలుడిని వెంటబెట్టుకుని వీధుల్లో నిర్లజ్జగా తిరగడం" అన్నాడు వాడు. "ఈ బాలుడు దుకాణంలో ఉన్నది ఈగలు తోలడానికా. అయినా నేనొక్కడినే నిన్ను సమర్థించాను. నేనన్నాను– 'ఆ బాలుడు బహుశా షామ్స్ అల్–దిన్ భార్య తరుపు బంధువు కావచ్చు లేదా టాంటా, బాగ్దాద్ పట్టణాల నుంచి వచ్చిన వాడు కావచ్చు, నేను వెళ్లి నిజము కనుక్కుని వస్తాను' అని వచ్చానిక్కడకు. అయినా ఆ పిల్లాడు బహు అందగాడులే!"

వ్యాపారి అవాక్కైనాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 255వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

వ్యాపారి ఒక్కక్షణం దిగ్భ్రాంతి చెంది అన్నాడు– "శామ్‌సమ్, ఏమి టంటున్నావు. గంజాయి తిని, మధువు తాగి నీకు మతి చెడినట్లున్నది. గుర్తు తెచ్చుకో నీవేకదా నాకు ఓ అద్భుత రసాయనాన్నిచ్చావు.. ఆ మందు వల్లనే మా దంపతులకు సంతానం కలిగింది. నీకు నామకరణం రోజున వంద దీనారాల నిచ్చాను, మరచిపోయావా! ఆ బాలుడే ఇతడు అబు షామత్. మా ఇంటి వెలుగు. మా వంశవృక్ష ఫలం. నీవే అతడిని అల్లా దయతో మా ఇంటికి చేర్చావు. నీవే అన్నీ మరచి ఈ మాటలంటావా? దుష్టుల దృష్టి ఈ బాలుడిపై సోకకుండా పదేళ్ల నుంచి ఈ బాలుడిని నా ఇంటిలోని భూగర్భ గదిలో దాచి పెంచాను. అదే నా తప్పు"

ఆ మాటలకు అంతటి దుర్మార్గుడైన శామ్‌సమ్ అదిరిపోయాడు. వెంటనే వ్యాపారి కాళ్లపై పడి క్షమించమని కోరి అన్నాడు– “నీ వంశవృక్ష ఫలాన్ని దైవం కాపాడు గాక! అంత చక్కటి బాలుడిని అందరికి పరిచయం చేయకుండా దాచి నీవు చేసిన చిన్న పొరపాటు ఈ పుకారుకు కారణమైనది. ఇంత వెన్న ఇంత తేనెతో మా అందరి నోటిని తీపిగా చేస్తే తియ్యటి మాటలు వెలువడి మిమ్మల్ని ఆశీర్వదించేయి కాదా! గంగాళం నిండా పాయసం చేసి మాకు తినిపించు, నీ యశస్సు మరల కాంతివంతమవుతుంది”.

వ్యాపారి షామ్స్ అల్–దిన్ మనసు కాస్త ప్రశాంతత నొందింది– “పాయస మేమిటి, నవరసాలు, నవ కాయ పిండి వంటలు, నలుగురు మెచ్చే భక్ష్యాలు, అనేక రకాల మాంసాలు వడ్డించే విందు చేస్తాను. నా తోటలో ఆ విందుకు వ్యాపారులనందరినీ పిలుస్తాను. రేపు మధ్యాహ్నం విందుకు నీవు కూడా తప్పక రావాలి. సాయంకాలం ప్రార్థనా సమయంలో అందరకు తెలియజేస్తాను. నీవు నా తరపున అందరినీ ఆహ్వానించు శామ్‌సమ్!” అన్నాడు వ్యాపారి.

వ్యాపారి తన కుమారుడిని తీసుకుని ఇంటికి వెళ్లి రేపటి విందుకు అన్ని ఏర్పాట్లు చేసినాడు. ఆరునెలలు ఆకుపచ్చటి పచ్చిక మేసి బలిసిన గొర్రెలను పొయ్యిపై కాల్చి చేసిన వంటకాలు, వెన్నతో కాల్చిన పిట్టల మాంసం వేపుళ్లు, రకరకాల పేస్ట్రీలు, పళ్లు, పళ్లరసాలు, జైని వీధిలో దొరికే పలురకాల భక్ష్యాలను బల్లలపై అమర్చినాడు.

పెద్దవాళ్లకు, పిల్లలకు వేర్వేరు చోట్ల వాటిని అమర్చి పిల్లలు, అరమరికలు లేకుండా ఆడుకుంటూ విందు ఆనందించడానికి తగిన ఏర్పాట్లు చేసినాడు.

అతిథులు వచ్చారు అనుకున్న సమయానికి. విందు అద్భుతంగా సాగుతున్నది. అందరూ అబు షామత్‌ను ఆశీర్వదించారు. షామ్స్ అల్–దిన్‌ను అభినందించారు. అయితే ఆ అతిథులలో ఉన్నాడు ఒక వ్యక్తి. అతడికి పిల్లలతో సరసాలు ఇష్టం. అతడున్న వీధిలో ఏ అందమైన పిల్లవాడు అతడి పాల బడకుండా తప్పించుకోలేదు. అతడి పేరు తునాయి మహమూదు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 256వ రాత్రి కథ ✳

## షహర్జాదీ కథ చెప్పసాగింది-

పిల్లల కేరింతలు, ఆటపాటలు, మాటలు వినబడగానే తునాయి మహమూదు మనసులో అలజడి రేగింది. పండ్లు ఎన్ని తిన్నా కాస్త పక్వానికొస్తున్న పచ్చికాయ రుచే వేరు అనుకున్నాడతడు. ఏదో అత్యవసర కార్యమున్నవాడిలా లేచి నెమ్మదిగా బాలుర కోసం కేటాయించిన పందిరి కిందకు వచ్చాడు. పిల్లలందరినీ అతడి కళ్లు నిశితంగా చూసేసరికి వారిలో నాజూకుగా నవనవన్మేషంగా కానవచ్చాడు అబు షామత్.

ఎలాగోలా ఆ పిల్లవాడిని ఆ గుంపు నుంచి రప్పిస్తే ఈ చెట్ల గుబురుల్లో "ఆహా..." అనుకున్నాడతడు. ఆడుతూ తిరుగుతూ తన అతిథులతో మాట్లాడుతూ ఉండగా అతడు మూత్ర విసర్జన చేసి రావాలనిపించి పక్కనే ఉన్న చెట్లచాటుకు అబు షామత్ వెళ్లాడు.. అది గమనించాడు తునాయి మహమ్మదు. ఇప్పుడు వెళ్లి అతడిని పట్టుకుంటే అరుస్తాడేమో! వేరే పథకం ఆలోచించాలి అనుకుని పిల్లల ముందుకు వెళ్లాడు. పిల్లలు అతడి చుట్టూ మూగి గోలగోల చేస్తుంటే అన్నాడతడు- "మీలో ఎవరైనా సరే అబు షామత్‌ను కైరో పట్టణ పొలిమేరల్లోకి వచ్చేట్లు చేయగలిగితే అతడికి బ్రహ్మాండమైన దుస్తులు అడిగినన్ని నాణేలు ఇస్తాను"

వాళ్లలో కొందరు కొంటె కుర్రాళ్లన్నారు- "అది చిటికెలో పని. ఏరోజు రావాలో చెప్పు. నీ నాణేలు సిద్ధంగా ఉంచు"

వాళ్ల దగ్గర మాట తీసుకుని తునాయి మహమ్మదు మరల పెద్దలున్న వేపు వెళ్లిపోయాడు. అబు షామత్ వచ్చీరాగానే వాళ్లన్నారు- "ఓ అబు షామత్! ఇన్నాళ్లూ చీకటి కొట్లో పడి ఉన్నావు. ఇప్పుడైనా డమాస్కస్, అలెప్పో, బాగ్దాద్ నగరాలను చూసి రావచ్చుగా! నీ తండ్రి దగ్గరున్నంత ధనం మా దగ్గరుంటే మేము కైరో వదిలి కనీసం రెండుసార్లు విదేశాలు తిరిగి వచ్చేవాళ్లం" అన్నారు వాళ్లు అతడికి నూరిపోస్తూ.

వారిలో కాస్త తెలివైనవాడు అన్నాడు- "నేను మంచి గురువుల దగ్గర చదువుకున్నాను. ఆయన దేశసంచారం గురించి చక్కగా చెప్పేవాడు.

*దేశసంచారికి దొరికే ఆనందాలు*
*సుదూర దేశాల సుందర దృశ్యాలు*
*నీలిసంద్రపు నీటిలో మేలిముత్యాలు*
*ఇసుక తిన్నెలపై వెలిగే శంఖాలు*
*గుర్తు చేస్తాయి గుంద్రటి భుజాలు*
*మరపుకు తెస్తాయి మన నగర అందాలు!"*

అబుషమత్ అన్నాడు– "నీవన్నది నిజమే కావచ్చు. కాని స్వంత ఇంటిలో ఉన్న సుఖము గొప్పది కదా!"

వాళ్లన్నారు– "బావిలోని కప్పకు తెలిసిన ప్రపంచమెంత? నీటి బయట పడిన చేప కథ ఏమిటి? అబు షామత్ ఖచ్చితంగా ఆడపిల్ల, ఇంటిపట్టునే ఉండాలనుకునే ఇంటి కుందేలు"

వాళ్ల మాటలు వింటుంటే రోషంతో అతడి బుగ్గలు కందిపోయాయి రక్తవర్ణపు గులాబీల్లా. విందు అయిపోయి అతిథులు నిష్క్రమించాక తండ్రి వద్దకు వెళ్లాడు అబు షామత్. "తండ్రీ చూసావా నా దగ్గర ఉన్న బాకు. నాకు దేశ సంచారానికి అనుమతి నివ్వు. లేకుంటే నీ కళ్లముందే కత్తితో పొడుచుకుని చచ్చిపోతాను". అబు షామత్ తల్లి ఒకటే ఏడుపు. ఆమె అన్నది– "కొడుకా! అంతమాట ఎందుకు అంటావు. నీ తండ్రి దీనికిష్టపడడెందుకంటే ప్రయాణంలో అనుకోని ప్రమాదాలు జరుగుతాయి. నీవింకా చిన్న పిల్లాడివి"

ఈలోగా బయటనుంచి తన స్నేహితులు పిలువగా షామ్ అల్‌దిన్ వ్యాపారి వెళ్లిపోయాడు, కుమారుడితో ప్రస్తుతం దేశసంచారపు ఆలోచనను విరమించు కొమ్మని చెప్పి.

అబు షామత్ తల్లి అన్నది– "నాయనా! మీ తండ్రి ఒప్పుకోడు. నేను నా దగ్గర ఉన్న ధనం ఇస్తాను. అంతేకాక నీ తండ్రి ఇంటిలో ఉంచిన వస్త్రాలు ఉ న్నాయి"

అబు షామత్ అన్నాడు– "త్వరగా ఇవ్వు. నాయన వచ్చేలోపునే నేను వెళ్లిపోతాను"

అతడి తల్లి పది ఒంటెలపై వస్త్రాల మూటలను సర్దించి తోటలో సిద్ధంగా ఉంచింది. వ్యాపారి ఇంటికి వచ్చేసరికి ప్రయాణ సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## ✻ 257వ రాత్రి కథ ✻

**షహర్జాది కథ చెప్పసాగింది-**

వ్యాపారి వచ్చి ప్రయాణ సన్నాహాలలో ఉన్న కుమారుడికి శతవిధాల నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు ప్రయాణం వాయిదా వేయమని.

అబు షామత్ అన్నాడు– "తండ్రీ, నీకు అవిధేయుడనైనందుకు క్షమించు. నన్నిప్పుడు వెళ్లనివ్వకపోతే, ఈ సరకులనిక్కడే వదిలిపెట్టి నేను చింకిపాతలలో సన్యాసిగా ఇల్లు విడిచిపోతాను. లేదా కత్తితో పొడుచుకుని చచ్చిపోతాను"

వ్యాపారి కర్థమయ్యింది తానిక ఆతడి నిర్ణయాన్ని మార్చలేనని– "కుమారా, నీమీద పుత్రవాత్సల్యం నన్ను నీ ప్రయాణం వాయిదా వేయమని అర్థింప చేస్తున్నది. సరే నీకు మరో నలభై ఒంటెల సరుకునిస్తాను. నీ రక్షణగా సేవకులను పంపుతాను. ఈ మొత్తం యాభై ఒంటెల సరుకును జాగ్రత్తగా అమ్ము. అలెప్పిలో వస్త్రాలకు గిరాకి లేదు. దారిలో కుక్కలలోయలోకి ప్రవేశించకు. అది సింహాల ఎడారిలో ఉన్నది. ఆ ఎడారిలో బదావి నాయకుడు సరయి పేరుమోసిన బందిపోటు దొంగ. అటు పోవద్దు"

అబు షామత్ అన్నాడు– "విధి నిర్ణయం మార్చలేనిది. నాకు చెందాల్సింది నాకు చెందుతుంది"

వ్యాపారి భార్య వేయి ప్రార్థనలు చేసింది. పవిత్ర సాధువులకు వంద గొర్రెలనిస్తానని మొక్కుకుని దేశసంచారులకు రక్షకదేవత వంటి అబ్ అల్ కదిర్–జిలానికి మొక్కులు మొక్కింది.

వ్యాపారి తనకు నమ్మకస్తుడైన ఒంటెల యజమాని కమాల్‌తో అన్నాడు– "మిత్రమా, ఈ రోజునుంచి నా కంటిదీపమైన అబు షామత్‌ను నీ రక్షణలో ఉంచు

తున్నాను. నాయనా, అబు షామత్ ఈ కమాల్ నీకు పెంపుడు తండ్రిగా వ్యవహరిస్తాడు. ఇవిగో వేయి బంగరు దీనారాలు. వీటిని పొదుపుగా వాడుకో! వెళ్లగానే సరకులు అమ్మడానికి తొందరపడకు. మంచి సరకు ఎప్పుడైనా అమ్ముడు పోతుంది. సహనం, సమయం, సంయమనం వ్యాపారికి ఉండాల్సిన లక్షణాలు. నిజాయితీ ఎప్పుడూ మంచి ఫలితాలనిస్తుంది. కాని ఎక్కువ సమయం తీసుకుంటుంది.

అబు షామత్ వ్యాపార నిమిత్తం కైరో పొలిమేరలు దాటాడన్న వార్త తునాయి మహమూదుకు తెలిసింది. అతడు వెంటనే వేగంగా పోగలిగిన కంచరగాడిదలు,, గుర్రాలు, ఒంటెలు వాటిపై వ్యాపార సరకులు ఉంచి బయల్దేరాడు "ఎడారిలో ఎవరేమి చేసినా అడిగేవారే లేరు" అనుకుంటూ. రెండు రోజుల్లోనే అతడు అబు షామత్ ఉన్న చోటుకు చేరుకుని అతడి పక్కనే తన గుడారాన్ని ఏర్పరిచాడు.

ఆరోజు సాయంకాలం తన శిబిరంలో విందుకు అబు షామత్‌ను ఆహ్వానించాడు. అయితే అబు షామత్ నంటిపెట్టుకుని కమాల్ ఉండడంతో తునాయి మహమూద్ పథకం విఫలమయ్యింది. ఎటువంటి ఆటంకం లేకుండా వ్యాపార కూటమి డమాస్కస్ చేరుకున్నది.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

# * 258వ రాత్రి కథ *

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

తునాయి మహమూద్‌కు డమాస్కస్, కైరో, అలెప్పో, బాగ్దాద్ పట్టణాలలో ఇళ్లున్నాయి. అక్కడ అతడు వ్యాపార నిమిత్తం వచ్చినప్పుడల్లా బస చేస్తూ స్నేహితులతో విందు వినోదాలు గడుపుతూ ఉంటాడు.

డమాస్కస్ రాగానే తునాయి తన ఇంటికి వెళ్లి విందు వినోదాలకు ఏర్పాట్లు చేసి డమాస్కస్ పొలిమేరలో విడిది చేసిన అబు షామత్‌కు ఆహ్వానం పంపాడు ఒక సేవకుడితో. పెంపుడు తండ్రి కమాల్ సలహా ప్రకారం అబు షామత్ తునాయి ఆహ్వానాన్ని వినయంగా తిరస్కరించినాడు. డమాస్కస్‌లో వ్యాపార వ్యవహారాలు కొద్దిరోజులలోనే ముగియగా వాణిజ్య బృందం అలెప్పోకు చేరుకున్నారు. అక్కడ

కూడా తునాయి ఆహ్వానాన్ని అబు షామత్ తిరస్కరించాడు. తునాయికి కోరిక తీవ్రం కాసాగింది. అందని ద్రాక్ష పండునెలాగైనా అందిపుచ్చుకోవాలనుకున్నది నక్క. బాగ్దాద్‌కు వెళ్లే దారిలో మొదటి మజిలీలో అందరూ శిబిరాల నేర్పరచుకున్నారు. తునాయి తన శిబిరంలో విందు ఏర్పాట్లు చేసి స్వయంగా వెళ్లి అబు షామత్‌ను ఆహ్వానించాడు. తప్పనిసరి పరిస్థితుల్లో బయల్దేరినాడు అబు షామత్. అది చూసి అన్నాడు కమాల్– "కుమారా! అతడి ఉద్దేశం అర్థం కావడం లేదా నీకు. అతడిని 'రెండు వ్యవహారాలవాడు' అని ఊరకే అనలేదు.

***వృద్ధుడేమాటా ఊరికే చెప్పడు***
***అనుభవాల మూట వీపుపై ఉన్నది***
***అందుకే అతడు ముందుకు వంగి నడుస్తాడు***
***నేలపై ఉంటుంది వృద్ధుడి చూపు***
***నక్కలు తీసిన గోతుల్లో నడవకుండా!***
***నీలాంటి యువకుల తలలుంటాయి నింగిలోన***
***పాదాలెటు పోయేదీ పాపము తెలియదు***
***గోతిలో పడ్డాక బతుకు ఘోరమగును***
***కుమారా! వృద్ధుడేమాట ఊరకే చెప్పడు"***

అబు షామత్ అన్నాడు– "అతడు మన ఊరివాడు. పైగా నన్నేం చేయగలడు, తింటాడా?"

కమాల్ అన్నాడు– "తినడమే కాదు తిని అరిగించుకోగలడు. ఇప్పటికే చాలామందిని తిన్నాడు"

అబు షామత్ నవ్వి "చూద్దాం!" అని వేగంగా నడుస్తూ తునాయి శిబిరానికి చేరుకున్నాడు. ఎంతో ఆదరాభిమానాలతో చిరునవ్వులు చిందిస్తూ ఆహ్వానించాడు 'తునాయి'. తన పథకం ఫలిస్తున్నందుకు సంతోషపడుతూ. అద్భుతమైన భక్ష్యాలు,, అనేక రకాల మాంసపు కూరలు, అపురూపమైన మధువులు, పండ్లరసాలు - ఇరువురూ ఛలోక్తులు విసురుకుంటూ పోటీపడి తిని, ఒకే కప్పు నుంచి మధువు తాగినారు. మత్తు తలకెక్కి కళ్లు మసక గమ్మతున్న సయంలో తునాయి మహమూద్ తన రెండు చేతులను అబు షామత్ గులాబి బుగ్గల కానించి ముద్దుపెట్టుకో బోయినాడు. అంత మత్తులోనూ కమాల్ అన్న మాటలు గుర్తుండి అబు షామత్

వెంటనే తన చేతినడ్డుపెట్టగా తునాయి చుంబనం అతడి చేతికి తగిలింది. వేడెక్కి పోతున్న తునాయి వెంటనే తన చేతుల్ని అబు షామత్ మెడచుట్టూ వేసి దగ్గరకు లాక్కోబోయినాడు. "ఏమిటీ పని?" అంటూ విడిపించుకున్నాడు అబు షామత్. తునాయి అన్నాడు-

*"నీ కళ్లలో మెరుస్తున్నది అగ్నిజ్వాలా*
*చూడు ఆ లేత యవ్వన శోభ ఎలా*
*లేక అది ప్రేమ కాంతిగుచ్ఛమా*
*దుప్పి కొమ్ములా నిగుడుతున్నది చాలా*
*దీపమున్నపుడే ఇల్లు చక్కబెట్టుకో*
*యవ్వనమున్నపుడే దారులు వెదుక్కో యిలా*
*ఎటు మొదలుబెట్టి ఎటుపోతుందో*
*శృంగారికి తెలియునా ఉచితానుచితాలు ఎలా?"*

అబు షామత్ అతడి పట్టునుంచి బయట పడడానికి ప్రయత్నించాడు కాని మధువు మత్తు అతడిని నక్క తవ్విన గోతిలో పడవేయబోయింది. ఏది జరగకూడదని కమాల్ అనుకున్నాడో అది జరిగే క్షణమొచ్చిందా?

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# * 259వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

"పిల్లాడికి కాస్త పద్ధతి నేర్పుదాం" అనుకుని ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్పడం మొదలెట్టినాడు తునాయి.

అదృష్టవశాత్తు అబు షామత్‌కు ఆఖరి నిముషంలో జ్ఞానోదయమై తనను లాగుతున్న తునాయిని నెట్టివేసి అన్నాడు- "నీకు కావాల్సిన సరుకు నా దగ్గర లేదు. ఇంకెక్కడైనా ప్రయత్నం చేసుకో" అని చెప్పి తన శిబిరం వేపు త్వరత్వరగా వెళ్లిపోయాడు అబు షామత్ తునాయి ప్రార్థనలు పట్టించుకోకుండా.

అతడిని చూసి ఆందోళనలో అన్నాడు కమాల్- "కుమారా! తప్పు జరిగిందా?"

“లేదు” అని సమాధానమిచ్చాడు అబు షామత్. “ఇక అతగాడి ఆహ్వానాలు లెక్కచేయను. నా జాగ్రత్తలో నేనుంటాను. మనం బయల్దేరుదాం”

కమాల్ అన్నాడు– “ఇప్పుడు మనం కాస్త ఇబ్బందిలో ఉన్నాం. ఇక్కడ నుంచి దారిలో బదావిల దాడులు జరగవచ్చు. అందరం కలిసి వెళ్తేనే సురక్షితంగా బాగ్దాద్ చేరుకోగలుగుతాము”

అబు షామత్ ఒప్పుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అతడి బిడారు ఎడారిలో ప్రయాణిస్తూ కొన్నిరోజులకు బాగ్దాద్‌కు ఒక్కరాత్రి ప్రయాణమంత చేరువకు వచ్చింది. కమాల్ అన్నాడు– “కుమారా! ఇప్పుడు మనం కుక్కలలోయ దగ్గరలో ఉన్నాం. ఇక్కడ ఆగవద్దు. ఎంతదూరం వీలైతే అంత దూరం వెళ్తే బాగుంటుంది. బాగ్దాద్ పట్టణపు ద్వారాలు మూసే ముందు మనం పట్టణంలో ప్రవేశిస్తే మనకు మంచిది”

అబు షామత్ అన్నాడు– “నేనేమీ పిరికివాడిని కాను. చీకటి పడినాక ప్రయాణంలో దారి తప్పవచ్చు మనం. అప్పుడు పరిస్థితి మరింత అగమ్యగోచరం కాదా! అంతేకాక నేను ప్రభాత సమయాన బాగ్దాద్ నగర సౌందర్యాన్ని చూడ దలుచుకున్నాను. ఆ అందాలు తిలకించడానికే నేనింత దూరం వచ్చింది”

కమాల్‌కు ఇష్టం లేకపోయినా వాళ్లు ఆ రాత్రికి అక్కడ మజిలీ చేసినారు. వెన్నెల ఎడారి ప్రాంతమంతా వెండి దుప్పటి కప్పినట్లున్నది. అబు షామత్ కొద్దిగా భక్ష్యాలు తిన్నాక అక్కడ అత్యంత సుందరంగా కనిపిస్తున్న లోయలో కొంతదూరం నడిచి చెట్టుకింద కూర్చున్నాడు.

***“ఇరాక్ దేశపు రాణీ***
***కవుల, కళాకారుల నిశానీ***
***ముత్యాల నగరమా, ఉద్యానవన శోభినీ***
***ఎన్ని కలలు కన్నాను నిన్ను చూడాలని***
***వస్తున్నాను నేను, నీ కౌగిలి చేరనీ”***

అతడలా అనుకుంటూ ఉండగానే గుర్రపు డెక్కల చప్పుడు, ధూళిమేఘాలు, అశ్వికుల అరుపులు, వంద గొంతుల చప్పుళ్లతో ఆ లోయలోని ప్రశాంతత చెదిరి పోయింది. నేల యీనినట్లు వచ్చిన ఆ బదావిల గుంపును చూడగానే అందరి

గుండె దిటవు చెదిరిపోయింది. కొద్ది నిముషాల్లోనే వాళ్లు శిబిరాలను ముట్టడించి, అక్కడివాళ్లను నిర్దాక్షిణ్యంగా హతమార్చి, ఒంటెలను, కంచరగాడిదలను, సరుకులను తీసుకుని వచ్చినంత వేగంగానే మాయమైనారు. తన కళ్లముందే జరిగిన ఈ విధ్వంసానికి దిగ్భ్రాంతి చెంది తనవాళ్ల మరణానికి బావురుమని ఏడ్చినాడు అబు షామత్.

అన్ని శవాల మధ్య తన పెంపుడు తండ్రిగా వచ్చిన కమాల్ శరీరం బల్లెపుగాట్లతో పడి ఉన్నది. ఆ దృశ్యానికి భీతిచెందిన అబు షామత్ వెనక్కి తిరిగి చూడకుండా పరిగెత్తాడు బాగ్దాద్ వేపు. తన విలువైన వస్తువులు, దుస్తులను మూటకట్టి, మరల దొంగల దృష్టి పడకుండా, అలా పరిగెడ్తూనే ఉన్నాడు.

అలా అతడు రాత్రంతా పరిగెత్తి బాగ్దాద్ ద్వారాల వద్దకు చేరుకుని అక్కడ ఉన్న జలధార దగ్గర సొమ్మసిల్లి పడిపోయాడు. కాసేపటికి తేరుకుని కాసిని నీళ్లు తాగి నిద్ర ముంచుకురాగా ఆ పక్కనే నిద్రకు జారుకున్నాడు.

ఈలోగా తునాయి మహమూద్ ఆ రాత్రి ఆగకుండా ప్రయాణం చేసి దగ్గరదారిలో తన బిడారితో సహా బాగ్దాద్ చేరుకున్నాడు కేవలం కొద్ది నిముషాల తేడాతో. అలసిపోయిన తన గుర్రానికి జలధార వద్ద నీటిని తాగిస్తూ అక్కడ సొమ్మసిల్లి పడి ఉన్న అబు షామత్‌ను చూసాడు తునాయి మహమూదు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ∗ 260వ రాత్రి కథ ∗

***షహర్జాది కథ చెప్పసాగింది-***

అబు షామత్‌ను ఆ స్థితిలో చూసిన తునాయి మహమూద్ మనసు పరిపరి విధాల పోయింది. స్ఫటికశరీరం, తెల్లటి దంతపు ఛాయ, ఎడమతొడపై మెరుస్తున్న పుట్టుమచ్చ - ఇతడు అదృష్టవంతుడా, దురదృష్టవంతుడా! షామత్ పేరులో దురదృష్టమున్నది కదా! ఇప్పుడేం చెయ్యాలి. ఉన్నవాడిని ఉన్నట్లే గుర్రం మీద ఎక్కించుకుని ఎడారిలోకి దౌడు తీసి వ్యవహారం ముగించాలా, లేక అతడికి మెలకువ వచ్చేవరకు ఉండి, కాస్త అనునయంగా, ఆప్యాయతతో మాట్లాడి, బాగ్దాద్ ఇంటికి తీసుకువెళ్లి నింపాదిగా పని చెయ్యాలా అని కాసేపు తర్జనభర్జనలు పడినాడు.

ఎండపొడ ముఖంపై పడగానే ఉలిక్కిపడి లేచిన వెంటనే అబు షామత్ చూసాడు తన పక్కనే ఉన్న తునాయి మహమూదును.

మహమూదు అన్నాడు– "భయపడకు కుమారా! ఏమీ కీడు జరిగింది నీకు. ఎందుకిలా పడి ఉన్నావు? ఏది నీ శిబిరం, నీ సేవకులు?"

అబు షామత్ నెమ్మదిగా జరిగినదంతా చెప్పినాడు. తునాయి అన్నాడు– "దేవుడు నిన్ను కాపాడినాడు. సంపద పోయినా ప్రాణం మిగిలింది నీకు.

*ధనం పోతే ఫరవాలేదు*
*సంపాదించుకోవచ్చు మరల*
*ప్రాణం మిగిలింది చాలు*
*కృతజ్ఞతలు తెలియచేయి దైవానికి మరల*
*గోళ్ళు కత్తిరించి పారేసినా పెరుగుతాయి*
*ధనం పోయినా పెరుగుతుంది మరల*

నా యింటికి రా! మనది ఒకే పట్టణం. నా సంపదలు నీవి. నా ప్రాణం నీది. నన్ను నమ్ము" అంటూ ఓ తండ్రిలా మాట్లాడుతూ అబు షామత్‌కు నమ్మబలికి తనతోపాటు ఇంటికి తీసుకు వెళ్లినాడు. తన వెనక కూర్చున్న బాలుడి శరీర స్పర్శతో తునాయి మహమూదు శరీరంలో ఎన్నో పులకరింతలు, మనసులో ఎన్నో పలకరింతలు.

అతడిని తన ఇంటిలోని స్నానగృహానికి తీసుకువెళ్లి తానే స్వయంగా వళ్లు తోమి, సబ్బు రాసి, స్నానం చేయించి ఖరీదైన దుస్తులు తొడిగి అక్కడ ఉన్న చెట్ల చల్లని నీడలో కూర్చున్నాడు ఆ బాలుడి పక్కనే. ఆ భవనం తెలుపు నీలి పింగాణి ఫలకాల కాంతిలో చల్లగా ఉండి మనసుకు ప్రశాంతతనిస్తున్నది. అరుదైన కర్పూర చందన దాల్చినచెక్కల ధూమ పరిమళాలు ఆవరణలో వ్యాపిస్తూ ఉండగా, ఆవరణ మధ్యన జలధార మంద్రధ్వనుల జాలువారుతుండగా కళ్లమీద నిద్రాదేవత తన ప్రభావాన్ని చూపించసాగింది. కాసేపు కునికిపాట్ల తరువాత ఇరువురూ తమకు నచ్చిన భక్ష్యాలను తిని, పండ్లరసాలు, మధువు సేవించసాగినారు.

*బుగ్గలు గులాబి వర్ణశోభల వెలిగినా*
*ప్రేమజ్వాలకది సరిపోదు*

*కెంపు అధరాలు కాంతులు విరజిమ్మినా*
*కామ దాహజ్వాలకది సరిపోదు*
*నీలి నేత్రాలు చూపుల బాకులు విసిరినా*
*గుండెజ్వాలకది సరిపోదు*
*పాలరాతి దేహం లతలా చుట్టుకుపోయినా*
*దేహజ్వాలకది సరిపోదు*
*ఏదో వెండి జలధార విరుచుకుపడాలి*
*అప్పుడైనా కామజ్వాల కదిసరిపోదు.*

అబు షామత్ అన్నాడు– "నీవెందుకెప్పుడూ ఒకేరకమైన అభ్యర్థనతో విసిగిస్తున్నావు? నీకు కావాల్సిన సరుకు నా దగ్గర లేదు. ఒకవేళ తప్పక నేను దాని నమ్ముకుంటే ఆ తరువాత నీకు ఆ సరుకును ఉచితంగా ఇస్తాను" అని అబు షామత్ ఆ ఇంటినుంచి పారిపోయాడు.

అలా పారిపోయి బాగ్దాద్ నగర వీధుల్లో తిరుగుతూ తిరుగుతూ ఓ మసీదు వద్దకు వెళ్లి పాదరక్షలు విడిచి లోపలకు పోతుండగా ఇద్దరు బహుశా తండ్రీ కొడుకులు అటుగా వెళ్తూ అబు షామత్‌ను చూసి ఆగి అతడిని నఖశిఖ పర్యంతం పరీక్షించి వారిలో ఒకడన్నాడు– "అస్సలాము లేకుం. ఎవరు కుమారా నీవు?"

అబు షామత్ అన్నాడు– "అస్సలాము లేకుం. తమకు శాంతి కలుగు గాక! నేను కైరో వ్యాపారుల సంఘం అధ్యక్షుడి కుమారుడిని. నాపేరు అబు షామత్. నేను పరదేశిని"

వారిలో పెద్దవాడన్నాడు– "మనం వెదకబోతున్న తీగ కాలికి తగిలింది. పరదేశి దొరికాడు"

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 261వ రాత్రి కథ ✳

***షహర్జాది కథ చెప్పసాగింది-***

వయసులో పెద్దవాడు తండ్రి వయసున్నవాడు అన్నాడు– "పరదేశీ, నీవు మాకు సాయం చేసేట్లయితే నీకు అయిదువేల దీనారాలు ఇస్తాము. వాటిలో

వేయి నీకు కావాల్సిన దుస్తులకు, మరో వేయి ప్రశస్తమైన గుర్రాన్ని కొనుక్కోవడానికి. ఎందుకు ఇలా చేస్తున్నామని నీవడుగవచ్చు. నీకు తెలిసే ఉంటుంది మన ధర్మం ప్రకారం ఒకసారి 'తలాక్' అని విడాకులిస్తే మరల ఆమెను మూడు నెలల పదిరోజుల తరువాత ఏ సమస్యా లేకుండా వివాహం చేసుకోవచ్చు. రెండోసారి 'తలాక్' అని విడాకులిచ్చినా అదేవిధంగా మరల తన భార్యతో కలిసి ఉండవచ్చు. అదే మూడోసారి అన్నాడనుకో ఆమె పరాయిస్త్రీ అవుతుంది. ఈసారి ఆమె మరల కావాలనుకుంటే ఎవరైనా ఆమెను వివాహమాడి ఆమెతో ఒకరోజైనా గడిపినాక మరల కొంతకాలము అనంతరమే పునర్వివాహం చేసుకోగలుగుతాడు.

కొద్దిరోజుల క్రితం ఈ యువకుడు నా కుమార్తెకు మూడోసారి తలాక్ చెప్పి ఆమెను పరాయిస్త్రీగా చేసుకున్నాడు. కాని ఇతగాడికి నా కుమార్తె అంటే ఎంతో ఇష్టం. అందుకని ఆమెను మరల వివాహం చేసుకునేందుకు ధర్మపద్ధతిలో ఎవరినైనా వివాహం చేసి, ఒకరాత్రి అతడితో కాపురం చేసాక విడాకులిప్పించి తరువాత మరల వివాహం చేసుకోవాలనేది ఇతడి ఆలోచన.

స్థానికులయితే చిక్కులు రావచ్చు గనుక పరదేశి కొరకు వెదుకుతుంటే దైవ నిర్ణయమేమో నీవు కనిపించావు. నా కుమార్తె ఇప్పుడు ఇతడి ఇల్లు వదిలి నాయింట ఉన్నది. ఈ చిక్కుముడి విప్పేటందుకు మేము నీకిస్తున్న బహుమతి అనుకో!"

అప్పుడున్న పరిస్థితిలో అబు షామత్ ఒప్పుకున్నాడు.

ఆ యువకుడన్నాడు– "నీకు జరగబోయేది ధర్మసమ్మతమైన వివాహం. ఆమెతో కలయిక నీకు నచ్చి రేపు విడాకులివ్వను అనవుగాని ఒకవేళ అన్నావనుకో నాకు అది కొత్త సమస్య తెచ్చిపెడ్తుంది. అందుకని నీవు మరో ఒప్పందం మీద సంతకం చెయ్యాలి. అదేమిటంటే నీవు మాట తప్పితే నాకు నష్టపరిహారం కింద పదివేల దీనారాలు చెల్లించవలసి ఉంటుంది".

అబు షామత్ ఒప్పుకున్నాక ముగ్గురూ వెళ్లి కాది వద్ద రెండు ఒప్పందాల మీద సంతకాలు చేసినారు. అబు షామత్‌ను చూడగానే ఎందుకో తెలియదు 'కాది'– న్యాయమూర్తికి ఓ విధమైన కోరిక కలిగింది.

యువకుడిని సాగనంపి ఆ పెద్దాయన అబు షామత్‌ను తన ఇంటికి తీసుకువెళ్లి ఓ గదిలో కూర్చోబెట్టి తన కుమార్తెను పిలిచి ఒప్పందం గురించి

చెప్పి అన్నాడు– "చాలా అందగాడు ఈ పరదేశి. ధర్మసమ్మతంగానే నీవతడి భార్యవిపుడు. ఈ రాత్రికి సుఖపడు. కలలా గడిచిపోతుంది. మరల నీవు నీ పాత భర్తను పెండ్లియాడవచ్చు" ఆమె అన్యమనస్కంగానే తల ఊపింది.

తన ఇంటికి వెళ్లిన ఆ యువకుడు ఓ వృద్ధ దాయిని పిలిచి అన్నాడు– "అనుభవజ్ఞురాలివైన ఓ తల్లీ! ఎలాగోలా నీవు ఆ యువకుడు ఈ రాత్రి నా భార్యతో కాపురం చేయకుండా చూడు. నీకు నూరు దీనారాలనిస్తాను"

"అదెంత పని. చిటికెలో చేస్తా" నన్నదామె.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 262వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ఆ వృద్ధదాయి వెంటనే ఆ పెద్దాయన ఇంట్లోకి వెళ్లి అబు షామత్ కూర్చున్న గది పక్కన నిలబడి అన్నది తన మాటలు అతడికి వినబడేలా–

"నాయనా! నీకేమైనా తెలుసునా, ఈమధ్యనే విడాకులు తీసుకున్న యువతి గురించి. ఆమెకు ప్రతిరోజూ ఇదిగో ఈ మందు పూసి, స్నానం చేయిస్తాను కుష్ఠువ్యాధి తగ్గేందుకు. అయినా నా ప్రయత్నమే కాని జబ్బు బాగా ముదిరింది కాదా!"

అబు షామత్ కంగారుపడి– "అమ్మా నీవనేది నిజమేనా!"

ఆమె అన్నది– "ఎవరు నాయనా నీవు, పరదేశిలా ఉన్నావు. ఆరోగ్యం జాగ్రత్త" అని ఇంకేమీ చెప్పకుండా చకచకా నడుస్తూ ఆడవాళ్లుండే గదుల వేపు వెళ్లింది.

ఆమెకు ఆ యువతి కనబడింది గదిలో ఒంటరిగా ఏదో ఆలోచిస్తూ. ఆమె దగ్గరకు వెళ్లి అన్నది వృద్ధదాయి– "అమ్మాయీ, నేను నీ దగ్గరకు వస్తుంటే ముందు గదిలో ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు. అతడు మీకు తెలిసినవాడా? ఎందుకంటే మన హమామ్ స్నానగృహాల నిర్వాహకుడు నాతో చెప్పాడు– ఆ పరదేశికి కుష్ఠువ్యాధి ఉన్నదని. అయినా నాకెందుకమ్మా ఈ గొడవ. ఏదో తెలిసిన

విషయం చెబుదామని వచ్చాను. ఆరోగ్యం జాగ్రత్త!" అని చెప్పి ఆమె ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా అదృశ్యమయ్యింది.

రాత్రి చీకటి క్రమేపీ కమ్ముకున్నది. బయట వెన్నెల, గదిలో చీకటి. అబు షామత్ వేచిచూస్తూ ఖురానులోని పవిత్ర వాక్యములను మృదు మధురంగా పాడ సాగినాడు. అతడి గొంతులోని స్వచ్ఛత, తియ్యదనం అలలుగా వెళ్లి ఆ యువతి చెవులను చేరుకున్నది. ఆమె తెలివైనది. "కుష్ఠువ్యాధి సోకినవాడు ఇంత గొప్పగా పాడలేడు కదా! ఆ వృద్ధ దాయి ఏదో పితలాటకం పెట్టడానికే వచ్చినట్లుంది" అనుకుని అబు షామత్ గానాన్ని శ్రద్ధగా వినసాగింది. అబు షామత్ అప్పుడు సాల్ ప్రభువు ముందు దావీదు పాడిన అపురూప గీతాలను శ్రావ్యంగా పాడసాగినాడు.

అవి వింటూ ఆమె హిందూ దేశపు వీణ తీసుకుని తంత్రులను సవరించి

*"ఇక్కడ ఉన్నది విరహంతో వేగుతున్న మృగనయని*
*అతడేమో అడవిలో వెదుకుతున్నాడు జింక కోసమని*
*దారి తప్పినాడేమో పాపం దిక్కులు చూస్తున్నాడు*
*పాట పాడి రమ్మని పిలుస్తున్నదా నవమోహిని!"*

ఆమె గొంతు వినగానే ఆశ్చర్యపోయాడు అబు షామత్. "ఏ కుష్ఠురోగీ వీణాతంత్రులు సవరించలేదు. అంత రాగయుక్తంగా పాడలేదు. ఏదో కుట్ర పన్నినట్లుంది ఆ ముసలి వగ్గు" అనుకున్నాడు.

అతడు సమాధానంగా–

*"నవమోహిని పిలుస్తున్నదని నాకూ తెలుస్తున్నది*
*పరదాలు దాటి రాలేక ప్రాణం లాగుతున్నది*
*ఏదో ఒక అపశృతి ఆపుతున్నదా మనలను*
*ఆమె చెక్కిళ్ల గులాబీల చూడ మనసౌతున్నది"*

అతడి పాటలోని లోతైన భావం ఆమెను పారవశ్యాన ముంచగా ఆమె అతడిని తన గదిలోకి తీసుకురమ్మని ఆహ్వానించింది. అతడు ఆమె గదిలోకి వెళ్లేప్పటికి ఆమె తెరచాటున ఉన్నది.

అతడు వెళ్లి అక్కడ ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఆమె అన్నది– "స్వాగతం! ఒకరోజు భర్తా! ఎంత అద్భుతంగా పాడినావు. కాని, నీకు నాకు మధ్య ఏదో మసకతెర!"

అతడన్నాడు– "కలకంఠ కాకలీధ్వని అటువంటి రోగగ్రస్థులకుండదు కదా! పొరపాటు జరిగిందెక్కడో!"

ఆమె అన్నది– "మనలనిద్దరిని కలవకుండా చేసేందుకా ముసలి దాయి పన్నిన పన్నాగం కావచ్చు. కాకుంటే ఒకే కథ ఇద్దరికి చెప్పింది కదా! అయినా నన్ను చూడు నీ అనుమానం పటాపంచలవుతుంది" అని తెరచాటు నుండి అతడి ముందుకువచ్చి తన మేలి ముసుగు వస్త్రాలను, పై దుస్తులను ఒక్కటొక్కటిగా తొలగిస్తూ పూర్తి నగ్నంగా నిలబడి అతడిముందు ప్రాణమొచ్చిన పాలరాతి శిల్పంలా, మచ్చలేని చందమామలా, మరులుగొలుపుతూ, తన ఘనవక్షోజ సంపదను, సరుగుడు చెట్లమాటున దాగిన గులాబి తోటను, వెన్నెలలో వెలిగే ఇసుక తిన్నెల లాంటి ఊరువులను చూపిస్తూ అబుషమత్ గుండెలు జల్లనగా నడిచింది. వంటిపై ఏ మచ్చా లేదు. అతడి అనుమానం పటాపంచలైనది.

అతడన్నాడు– "నన్ను చూడు. నాకూ ఏ వ్యాధీ లేదు" అంటూ అతడు తన వస్త్రములను వర్జించి ఆమె ముందు నగ్నంగా నిలబడినాడు; కొండరాళ్ల నుంచి వస్తున్న స్వచ్ఛమైన సెలయేరులా, పసిపాప కన్నులంత నిర్మలంగా అతడి దేహఛాయ.

ఆమె కర్థమయ్యింది తన పూర్వభర్త పన్నాగం ముదుసలి దాయిని పంపించి తనదైన గులాబితోటలో కొత్తదొంగ పడకుండా ఎత్తు వేసాడన్న సంగతి. ఆమె కనులలో అద్భుతమైన మెరుపు మెరిసింది.

అతడిని శయ్యపైకి లాక్కువెళ్లి మీదపడింది– "రా జకారియస్, రా ఋజువు చేసుకో నీ పుంసత్వాన్ని. కోసుకుపో గులాబిపూలను, దోచుకుపో సంపదలన్నిటిని, ప్రవహించే సెలయేటి నీటిని. రా!"

అబు షామత్‌కు ఆమె దేహస్పర్శ అత్యంత ఉద్రేకాన్ని కలిగించగా అతడు ఆమెను తన బాహువులలో బంధించి ఉబలాటపడుతున్న మగసిరిని విజయ తోరణాన్ని దాటించి, స్ఫటిక దారిగుండా చప్పున నడిపించి, కాస్త సంశయించి

ముందుకు వెనకకు డోలాయమానుడై తన లోలకాన్ని కదిలించి అద్భుతమైన ప్రేమ విఫణిలో సోమవారపు సౌందర్యాన్ని, మంగళవారపు మాధుర్యాన్ని, బుధవారపు బుద్ధి కుశలతను, గురువారపు తీపి గుర్తులను కొనగలిగినన్ని కొని శుక్రవారం నాడు మంచి విశ్వాసిలా ఆగి ప్రార్థన చేసి పూబాల పూలతోటలో విహరించి ఏది విరజిమ్మాలో అది విరజిమ్మి నవమోహిని కౌగిలిలో, ఆమె వేసే ఎత్తుకు పైఎత్తుల్లో, కొండలు లోయలు, మిట్టపల్లాలలో, అమృత జలాలు తాగుచు, అటు ఇటు కదలికల, అద్భుత కలకూజితాల మధ్య ఇరువురూ ఒక్కటవగా కాస్త అలిసి ఒకరి కౌగిలిలో ఒకరు సొమ్మసిల్లినారు.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## * 263వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

తెల్లవారింది. ఒకరోజు భర్త తన పక్కనే హాయిగా నిద్రిస్తున్న ఒకరాత్రి భార్యను నిద్రలేపి– "రాత్రి మనం ఒకరి పేరు మరొకరు తెలుసుకునే సమయమే లేకపోయింది. నాపేరు అబు షామత్" అన్నాడు అతడు.

తన పేరు "జుబేదా" అని చెప్పిందామె సిగ్గుపడుతూ బుగ్గలలో గులాబీలు పూస్తుండగా.

"నాకు అనుమతి నివ్వు జుబేదా, నేను వెళ్లాలి. ఈరోజు ఉదయం పది గంటలకల్లా నేను నీకు విడాకులివ్వకపోతే పదివేల దీనారాలు చెల్లించాలి నీ పూర్వభర్తకు. నా దగ్గర ఒక్క దీరాము కూడా లేదు. అయినా నీవు నాకందజేసిన సౌఖ్యానికి నా కృతజ్ఞతలు" అన్నాడు అబు షామత్.

"పేరు సరిగ్గా సరిపోయింది నీకు. కాని నిన్ను నేను విడవడం లేదు. ఏదో మార్గం ఆలోచిస్తాను. ఒక పనిచేయి. నా తండ్రి వచ్చి నిన్ను 'కాది' వద్దకు తీసుకువెళ్లినాక నీవు ఆ న్యాయమూర్తి చెవిలో చెప్పు– 'నాకు విడాకులిష్టం లేదు. నేనివ్వను' అప్పుడు న్యాయమూర్తి అంటాడు– 'ఒక్క యువతి పొందుకోసం నీవు అయిదువేల దీనారాలు, వేయి దీనారాల దుస్తులు, వేయి దీనారాల గొప్ప గుర్రం వదిలేయడమే కాక పదివేల దీనారాలు పరిహారం చెల్లించబోతున్నావా?' అంటాడు.

నీవు చెప్పు– ‘ఆమె ఒక్కో శిరోజము పదివేల దీనారాల విలువ చేస్తుంది’. కాది అంటాడు– ‘న్యాయం నీ పక్కన ఉన్నది. నష్టపరిహారం చెల్లించు ఆ యువకుడికి”

జుబేదా చెబుతున్నది– “అబు షామత్, నీవు గమనించే ఉంటావు ఆ ‘కాది’ కూడ రెండు దిక్కుల ఆనందం పొందేవాడేనని పుకారు. బహుశా నీవంటే కాస్త కనికరం చూపిస్తాడేమో” అన్నది కన్నుగీటుతూ.

అబు షామత్ అన్నాడు– “నా బతుకు గమ్మత్తుగా ఉన్నది. ఒక వేటగాడి నుంచి మరో వేటగాడికి అదీ వెనక ద్వారాల వేపు ఆశగా చూసేవాళ్ల వేపు నడుస్తున్నది. ఆ వ్యాపారం, వ్యవహారం నాకు ఇష్టంలేదు”

జుబేదా నవ్వింది– “ఎప్పుడైతే నిన్ను కాది పదివేల దీనారాలు కట్టమన్నాడో నీవు కాస్త నటించాలి. నేను చూపిస్తాను ఎలాగో– కదిలించు నీ పిరుదులను ఇలా– క్షణకాలం. పిర్రల పిచ్చివాళ్లకు అర్థం అవుతుంది ఆహ్వానం. నీకు ఖచ్చితంగా పరిహారం చెల్లించేందుకు వ్యవధి ఇస్తాడు”

ఇంతలో జుబేదా తండ్రి నుంచి పిలుపు వచ్చింది అబు షామత్‌కు. చకచకా దుస్తులు ధరించి జుబేదా తండ్రితో కలిసి ఇద్దరూ ‘కాది’ దగ్గరకు వెళ్తుండగా దారిలో వారికి జుబేదా పూర్వభర్త కలిసాడు.

కాది దగ్గర అబు షామత్ తనకు జుబేదా చెప్పిన విధంగానే ప్రవర్తించాడు. అబు షామత్ క్రీగంటచూపులు, అతడి నడక, పిరుదులు, ఊరువుల కదలికలు కాదిలో బొడ్డుకింద ఏదో అలజడి రేపినాయి. అబు షామత్ ‘కాది’ చేతిని ముద్దాడి అతడి చెవిలో నాకు విడాకులు ఇవ్వడం ఇష్టంలేదు అని చెప్పగానే పారవశ్యంలో ఉన్న కాది అన్నాడు– “నీకు పదిరోజులు గడువిస్తున్నాను. పరిహారం చెల్లించడానికి. లేకుంటే జైలుశిక్ష, జరిమానా తప్పవు”

మరోసారి ‘కాది’ చేతులను ముద్దాడగానే ‘కాది’ అనుకున్నాడు– “పదివేల దీనారాలకన్నా ఎక్కువ విలువ చేస్తాడీయువకుడు. ఆ డబ్బు నేనే యిస్తాను నేననుకున్న పని జరిగితే!”

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 264వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

'కాది' దగ్గర సెలవు తీసుకుని జుబేదా తండ్రి, ఆమె పూర్వభర్త దిగ్భ్రాంతితో చూస్తుండగానే అబు షామత్ ఆనందంగా జుబేదా దగ్గరకు వెళ్లాడు. ఆమె అతడికి వంద దీనారాలిచ్చి సంతకు వెళ్లి విందు భోజనానికి కావల్సినవన్నీ- భక్ష్యాలు, మధువులు, పండ్లు, పేస్ట్రీలు, అన్నీ తెప్పించింది. ఇద్దరు కాసేపు సరస సంభాషణలతో కాలం గడిపి శృంగారకేళిలో సంతోషపడి కాస్త ఉద్రేకాలుపశమించాక ముందు గదిలో దీపాలు వెలిగించి సాహితీ సంగీత సవాళ్లు విసురుకోసాగినారు. వారి గాన మాధుర్యానికి రాళ్లు కరిగాయి. నీలినింగిలో ఎగిరే పక్షులు కాసేపాగి తన్మయత్వంతో విన్నాయి. ఎవరో తలుపు తట్టిన చప్పుడు కాగా అబు షామత్ వెళ్లి తలుపు తెరిచి చూసాడు.

మారు వేషాలలో సంచరిస్తున్న ఖలీఫా హరూన్ అల్ రషీదు, వజీరు జాఫర్, అంగరక్షకుడు మన్సూర్, కవి అబు నువాస్ – నలుగురూ ఖలీఫా కోరిక ప్రకారం బాగ్దాద్ నగరంలో దరవేషుల వేషాల్లో అటుగా వచ్చి అబు షామత్- జుబేదాల స్వరమాధుర్యానికి అచ్చెరువంది కాసేపు ఆగి పాట విని వెంటనే తలుపు తట్టినారు.

జుబేదా తెరచాటున ఉండగా అబు షామత్ అతిథులకు ఆహార పానీయాలందించి వారిని సుఖాసీనుల జేయగా వారన్నారు– "దరవేషులకు తిండికన్నా సంగీత సాహిత్యాలు శక్తినిస్తాయి. ఇందాక నీతోపాటు అద్భుతంగా పాడిన స్త్రీ గొంతు మేం విన్నాము".

అబు షామత్ అన్నాడు– "ఆమె నా భార్య జుబేదా" అని తన కథనంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. దరవేష వేషంలో ఉన్న ఖలీఫా అన్నాడు– "పదివేల దీనారాల గురించి దిగులు చెందకు. నేను బాగ్దాద్ దరవేషుల గుంపుకు నాయకుడిని. నలభైమంది సభ్యులున్న మేము దేవుని కృపవలన నీకు ఏదోరకంగా సాయపడతాము. సరే, మేము నీ భార్య జుబేదా గానం విన ముచ్చటపడుతున్నాము, ఆమెకభ్యతరం లేకపోతే! కుమారా, సంగీతమనేది కొందరకు భోజనం, కొందరికి ఔషధం, కొందరికి మంచి నిద్రనిచ్చే మధుర పానీయం. మాకు ఈ మూడూ కలిసిన అద్భుత రసాయనం"

ఆ రాత్రి జుబేదా, అబు షామత్‌ల సంగీత సాహిత్యాలు, కవి అబు నువాస్‌ల చమత్కార సంభాషణలతో అపురూపమైన రాత్రిగా గడిచింది. తెల్లవారుజాము కావడానికింకా సమయముండగానే ఎవరూ చూడకుండా వంద బంగరు దీనారాల సంచిని అక్కడున్న వస్త్రం కిందకు నెట్టి ఆ ప్రియ దంపతులకు కృతజ్ఞతలు తెలిపి వెళ్లిపోయినాడు ఖలీఫా తన వాళ్లతో కలిసి.

మధ్యాహ్న సమయమైంది. ఖలీఫా ఉంచిన దీనారాల సంచి కనబడగా జుబేదాకిచ్చినాడు అబు షామత్. తలుపు తీసిన చప్పుడవగా ఇంటిముందు తనను వెదుక్కుంటూ వచ్చిన ఓ అబిస్సినియన్ బానిస అన్నాడు– "కుమారా! నీవు బాగ్దాద్‌లో ఉన్న విషయం మాకు తునాయి మహముద్ వలన తెలిసింది. అతడు నీవెక్కడున్నావో కనుక్కున్నాడు తన మిత్రుడైన 'కాది' చెప్పడం వలన. ఆ విషయం నీ తండ్రికి వార్త పంపగా అతడు యాభై కంచరగాడిదలపై ప్రశస్తమైన వస్త్రాలు, ఇతర వస్తువుల నిచ్చి నన్ను పంపినాడు. ఇదిగో నీ తండ్రి వ్రాసిన లేఖ!"

"అబు షామత్! కుమారా! నీకు నేను పంపుతున్న సరుకు వెల యాభైవేల దీనారాలు. వ్యాపారంలో ఒడిదుడుకులు సహజమే! దైవం నీకు తోడుగా ఉండును గాక" అని వ్రాసి సంతకం చేయబడి ఉన్నది ఆ లేఖలో.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 265వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

తండ్రి పంపిన లేఖ చూడగానే అబు షమత్ కంట నీరు వరదలై పొంగింది. తన మీద ప్రేమతో తండ్రి తన పెళ్లికానుకగా ఆ సంపదలనిచ్చినట్లు భావించాడు అబు షామత్. ఆ సరకులను తెచ్చిన అబిస్సినియన్ బానిసకు కృతజ్ఞతలు తెలిపి నూరు దీనారాల బహుమతినిచ్చి అతడి సాయంతో సరుకులను ఇంటి ఆవరణలో నిలిపినాడు. తన ప్రియభార్య జుబేదాను, ఆమె తండ్రిని పిలిచి ఆ విషయాన్ని చెప్పగా అందరూ సంతోషించినారు. జుబేదా అన్నది– "నా మొదటి భర్తకు నా పూలతోటలో ఎలా విహరించాలో తెలియదు. సగందారిలోనే చప్పబడిపోయేవాడు. అబు షామత్ అటువంటివాడు కాదు. శిఖరాగ్రానికి తీసుకువెళ్లి మరల వెనక్కి తీసుకు రాగలడు"

ఆమె తన మొదటి భర్త వద్దకు వెళ్లననడంతో ఆమె తండ్రి అన్నాడు– "నాకు అబు షామత్‌తో వచ్చిన ఇబ్బంది లేదు కాని నీ పూర్వభర్త దిగాలు ముఖమేసుకు కూర్చున్నాడు".

అబు షామత్ అన్నాడు– "నాకు జుబేదా కన్నా ఈ సంపదలు ముఖ్యం కాదు. కావాలంటే ఆ పదివేల దీనారాల కన్నా ఎక్కువ విలువ చేసే ఈ సరుకులను అతడికి ఇచ్చేస్తాను"

ఇష్టంలేని ఇల్లాలుతో కాపురమెందుకని ఆ యువకుడు తనకు నష్ట పరిహారంగా వచ్చిన పదివేల దీనారాలు, పైన అబు షామత్ దయతో ఇచ్చిన కొంత సరుకుతో తృప్తిపడినాడు. 'కాది' తన బాధను మనసులోనే అణుచుకున్నాడు.

జుబేదా, అబు షామత్‌లు ఆనందకేళిలో మునిగితేలారు. ఇరువురి మనసులలో కవితా ధారలు కురిసి పాటలుగా పల్లవించాయి. పదిరోజులిట్టే గడిచి పోయాయి. అబు షామత్ అన్నాడు– "నేనా దరవేషుల నేత మాటల మీద ఆధారపడి ఉంటే ఈపాటికి జైలుపాలై ఉండేవాడిని".

ఆ రాత్రి కూడా వాళ్లు ఆటపాటలతో ఆవరణలో హాయిగా ఆనంది స్తున్నపుడు తలుపు తట్టిన చప్పుడైంది. తలుపు తీసి చూడగా ఎదురుగా ఉన్నారు దరవేషులు. అబు షామత్ అన్నాడు– "ఆహ్వానం! అబద్ధాలకోరులకు! మిమ్మల్ని నమ్ముకుని ఉంటే టైగ్రిస్ నదిలో నిట్టనిలువుగా మునిగి ఉండేవాడిని. కాని మీరంటే మాకిష్టం"

అంటూ వారికి అద్భుతమైన ఆతిథ్యాన్నిచ్చాడు. జుబేదా కూడా తన అపురూప మంత్రముగ్ధ స్వరంతో వారి హృదయాలను ఆనంద డోలికలనూగించింది.

దరవేషుల నేత అలా బయటకు వెళ్లగానే కవి అబు నువాస్ నెమ్మదిగా అబు షామత్ పక్కన చేరి అతడి చెవిలో....

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 266వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

అబునువాస్ అన్నాడు చెవిలో గుసగుసలాడుతూ– "కుమారా! నీ తండ్రి దగ్గర్నుంచి సరుకు రావడానికి ఎన్నిరోజులు పడుతుంది?"

అబు షామత్ అన్నాడు– "నలభై అయిదు రోజులు". అబునువాస్ అడిగాడు– "నిన్ను ఎడారి బదావీలు దోచుకోవడం, తునాయి మహమదు రక్షించడం, నీవు జుబేదాను వివాహమాడడం ఇవన్నీ పదిరోజులలో సాధ్యమవుతాయా?"

అబు షామత్ గుండె దడదడ లాడింది– "అవును, ఈ ఆనంద సమయంలో ఆ విషయమే ఆలోచించలేదు"

అబునువాస్ అన్నాడు– "అదుగో ఆ దరవేషుల నేత ఎవరో తెలుసా! అతడే దైవ విశ్వాసుల అధిపతి, మహా చక్రవర్తి, బాగ్దాద్ నగర ఖలీఫా హరూన్ అల్ రషీదు. ఇతడు వజీరు జాఫర్, అతడు–మన్సూర్, నేను కవి అబునువాస్‌ను"

అబు షామత్ గజగజ వణుకుతూ అన్నాడు– "అంత దయకు ప్రాప్తుడనవ డానికి నా దగ్గరేమి చూసినాడు ఖలీఫా!"

అబునువాస్ అన్నాడు– "నీలోని అంతఃబాహిర సౌందర్యాన్ని, అందమె ఆనందం అనే అతడి సిద్ధాంతానికి నిదర్శనంగా ఉన్న నీ ప్రవర్తన. అందుకే నీకు ఆ సంపదలను పంపి మరల నీ ముఖారవిందాన్ని చూడడానికి వచ్చినాడు".

ఖలీఫా లోపలికి రాగానే కృతజ్ఞతాభావంతో అబు షామత్ లేచి నిలబడి అతడి చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడి అన్నాడు– "ప్రభూ! ఈ అజ్ఞాని తెలియక చేసిన తప్పులను క్షమించండి"

ఖలీఫా నవ్వుతూ అన్నాడు– "రేపు రాజభవనానికి వచ్చి కనబడు". ఆ తరువాత కాసేపు సంగీత సాహిత్యాలతో కాలక్షేపం చేసాక ఖలీఫా నిష్క్రమించాడు తన అనుచరులతో.

మరుసటి రోజున అత్యంత విలువైన కానుకలను తీసుకుని తన భార్య జుబేదాతో రాజభవనానికి వెళ్లాడు అబు షామత్. ఆ బహుమతులు స్వీకరించి ఖలీఫా అన్నాడు– "నీవే ఒక బహుమతి! ప్రభువుల కొలువులో ఉండదగిన వాడివి. నిన్ను వ్యాపారస్తుల కూటమికి నాయకుడిగా నియమిస్తున్నాను"

ఆ తరువాత కొద్దికాలానికి అబుషామత్‌ను రాజభవన మధుశాల నిర్వాహకుడిగా, తనకు మధువు నందించేవాడిగా నియమించాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 267వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

అబు షామత్ వినయానికి, సౌందర్యానికి, గానసౌరభానికి ముగ్ధుడైన ఖలీఫా అతడికి ఏది కావాలన్నా ఇవ్వాలని అనుకున్నాడు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా! ఒకరోజున హృదయరంజని అనే ఖలీఫాకిష్టమైన బానిస మనోహరంగా గానం చేస్తుంటే ఖలీఫా, జాఫర్, మస్రూర్, అబు షామత్‌లు ఆనందిస్తున్నారు. ముఖ్యంగా ఒంటరితనం, దేశసంచారం గురించి ఆమె పాడుతుంటే అబు షామత్‌కు తన జీవితం గుర్తుకొచ్చి కన్నీళ్లు పెట్టుకున్నాడు.

ఖలీఫా అనుకున్నాడు హృదయరంజని పాట అబు షామత్‌కు బాగా నచ్చిందని– "ఏమిటయ్యా అబు షామత్, బాగా నచ్చిందా పాట! పాటేకాదు పిల్లకూడా నీదే! జాఫర్, హృదయరంజనిని ఆమెకున్న నలభై బానిసలు, నగలు, నాణేలు, సంపదలతో సహా అబు షామత్‌కు స్వాధీనం చేయి. రేపు నీవు స్వయంగా హృదయ రంజనిని అబు షామత్‌కు అప్పగించు".

కంగారుపడిన అబు షామత్ ఖలీఫా చేతుల మధ్యన ఉన్న నేలను ముద్దాడి అన్నాడు– "ప్రభువుకు చెందిన వస్తువును తాకే అర్హత లేనివాడిని. నన్ను కరుణించండి" అని మొత్తుకున్నాడు.

ఖలీఫా అన్నాడు– "నీ భార్య అసూయ చెందుతుందని భయపడ్తున్నావా, సరే, జాఫర్ బానిసల సంతకు వెళ్లి పదివేల దీనారాల విలువచేసే సుందరాంగిని కొని అబు షామత్‌కు ఇవ్వు"

ఖలీఫా అనుమతితో వజీరు జాఫర్, అబు షామత్‌లు బాగ్దాద్ బానిసల సంతకు వెళ్లారు. అదే సమయంలో నగర పాలనాధికారి వలీ– అమీర్ ఖాలిద్ పధ్నాలుగేళ్ల తన ఏకైక కుమారుడి కోసం బానిస స్త్రీని కొందామని బానిసల సంతకు వచ్చాడు. అయితే వలీ కుమారుడు భారీశరీరం, అనాకారి, కాస్త గూని, పెద్ద నోరు, దుర్వాసనతో, ముంతాఫికుగా పిలవబడినవాడు. ఎప్పుడు పెద్దవాడవు తాడో అతడి భారీశరీరం మగతనానికి అడ్డు వస్తుందేమోనని భయపడుతున్న అతడి తల్లి ఓ రోజున అతడి బట్టలపై తెల్లవారుజామున పడిన తెల్లటి మరకలను

చూడగానే ఆమెకు సంతోషమేసి ఆ సంగతి తన భర్తకు చెప్పి పిల్లవాడిని సంతకు తీసుకువెళ్లి సరైన బానిస స్త్రీని కొనుక్కురమ్మని పురమాయించింది.

ఆ సంతలో తెలుపు, చామనఛాయ, నలుపు రంగులో ఉన్న బానిస స్త్రీలు, గ్రీకు, చైనా, అబిస్సినియా, పర్షియా దేశాలవాళ్లు బారులు తీరి నిలబడి ఉన్నారు. వారిని చూసి వెళ్లబోతుండగా బానిస వ్యాపారి అన్నాడు– “ఈమెను చూడండి, అయిదువేల దీనారాలు వెల గల అందాల భరిణె!” అంటూ శిబిరంలో ఉన్న ఆమెను ఆ నలుగురి ముందుకు తీసుకువచ్చాడు. ఆమెను చూసీ చూడగానే వలీ కుమారుడు ‘ముంతాఫికు’ “ఈమె నాకు కావాలి, కావాలి” అంటూ గొడవ చేయసాగినాడు. అతడిని చూసిన బానిసల వ్యాపారి అనుకున్నాడు– “వీడికిచ్చి ఈ అందాలభామను బాధపెట్టడం కన్నా చంపడం మేలు”

అదే సమయంలో అబు షామత్ కూడ జాఫర్‌కు తన సమ్మతి తెలిపాడు. జాఫర్ అడిగాడు– “ఏమిటమ్మా నీపేరు”

ఆమె అన్నది మెల్లగా– “యాస్మిన్”. మల్లెపూవులా ఉన్నదామె.

“అయిదువేల దీనారాలు ఆమె ఖరీదు” అన్నాడు బానిస వ్యాపారి.

“ఆరువేల దీనారాలిస్తా” అన్నాడు ముంతాఫికు

“ఎనిమిది వేలు” అన్నాడు అబు షామత్.

“ఎనిమిదివేల ఒక దీనారం” అరిచాడు ముంతాఫికు

“తొమ్మిదివేల ఒకటి” అన్నాడు వజీరు జాఫర్

“దానికంటె ఒకటెక్కువ” కేకబెట్టాడు ముంతాఫికు

“పదివేలు” అన్నాడు అబు షామత్.

ఎక్కడ ఆ బానిసను ముంతాఫికు కివ్వాల్సివస్తుందో అని ఆ బానిస వ్యాపారి వెనువెంటనే “ఒకటోసారి పదివేలు, రెండోసారి పదివేలు, మూడోసారి పదివేలు” అని బానిసను అబు షామత్‌కిచ్చాడు. వజీరు జాఫరు వెంటనే పైకం చెల్లించి ఆ బానిసను అబు షామత్ కప్పగించినాడు. తన కళ్లముందే తనకు నచ్చిన సుందరి పరాయివాడి పాలవడంతో వలీ కుమారుడు ముంతాఫికు వలవల ఏడుస్తూ నేలపై

పడి గిలగిలా కొట్టుకుంటుంటే ఆ పిల్లవాడిని చూసి అందరూ నవ్వుకోసాగినారు. వలీ–అమీరు–ఖాలిదు నానా విధాలుగా బతిమలాడి ఆ పిల్లాడిని ఎలాగోలా తన ఇంటికి తీసుకుపోయాడు.

అబు షామత్ తనతో వచ్చిన యాస్మిన్‌ను చూసి జుబేదా ముచ్చట పడింది. ఇద్దరి మధ్య త్వరలోనే అద్భుత స్నేహం కుదిరింది. యాస్మిన్‌ను రెండవ భార్యగా స్వీకరించాడు అబు షామత్ తన భార్య జుబేదా అనుమతితో. కొద్దిరోజులకే యాస్మిన్ గర్భవతి అయ్యింది.

వలీ ఖాలిదు తన కొడుకును ఇంటికి తీసుకువెళ్లాక అతడి భార్య పెద్ద గొడవ పెట్టుకున్నది. ఎంత పెద్ద పట్టణానికి వలీ అయినా పెండ్లాము ముందు పిల్లిలా తలూపవలసి వచ్చింది. అక్కడ ముంతాఫికు మంచం మీద మంకుపట్టు పట్టి కూర్చున్నాడు. పక్కనే వలీభార్య అతడిని ఓదారుస్తున్నపుడు వాళ్లింటికి వారి దూరపు బంధువైన ఓ వృద్ధమహిళ సహాయమర్థించడానికి వచ్చింది.

ఆమె కుమారుడు బాగ్దాద్ గజదొంగ ‘అహమద్ ఇస్సారికు’ యావజ్జీవ జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. దొంగతనం అతడి అలవాటు. ఇంటి యజమాని చూస్తూండగానే తలుపును మాయం చేయగలడు, గోడ దగ్గర నిలబడి మూత్రం పోస్తున్నట్లే ఉండి గోడకు రంధ్రం చేయగలడు, చీమ చిటుక్కుమనకుండా గోతులు తవ్వగలడు. ఎదుటి వ్యక్తితో మాట్లాడుతూనే అతడి కనురెప్పల వెంట్రుకలు కత్తిరించ గలడు. అందమైన యువతితో మాట్లాడుతూనే ఆమె కంటి కాటుక మాయం చేయగలడతడు.

అతడి తల్లిని ఆదరంగా ఆహ్వానించి తన కష్టాన్ని చెప్పుకున్నది ముంతాఫికు తల్లి.

వృద్ధమహిళ అన్నది– “నీవు జైలులో ఉన్న నా కుమారుడిని విడిపించు. అతడెంత సమర్థుడంటే ఆ యాస్మిన్ బానిస యువతిని తెచ్చి నీముందు నిలబెట్టగలడు”

ముంతాఫికు తల్లి ఆ మాట వలీ ఖాలిదుకు చెప్పడం కోసం శోభనం రోజు నాటి వధువులా తయారై ఖాలిదు ముందు నిలబడి అతడిలో కామవాంఛ రగిలించింది. ఎంతవాడైనా కాంతా దాసుడే కదా!

ఆమె అన్నది– "ముందు దైవం మీద ప్రమాణం చేయి నేనడిగింది ఇస్తానని, అప్పుడు నీకు కావాల్సింది నీవు తీసుకుందువు గాని"

అతడు ప్రమాణం చేసాక అసలు కథ చెప్పింది. తప్పనిసరి పరిస్థితుల్లో వలీ అంగీకరించి తన భార్య ఇష్టాన్ని మన్నించాడు.

మరుసటి రోజు జైలు సందర్శించి అహమదు ఇస్సారికును పరామర్శించినాడు వలీ ఖాలిదు– "నీవు పశ్చాత్తాపపడుతున్నావా?"

"అవును" అని సమాధానమిచ్చాడు అహమదు. అతడిని తీసుకుని ఖలీఫా వద్దకు వచ్చాడు వలీ ఖాలిదు.

"ఇంకా బతికే ఉన్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు ఖలీఫా.

"ప్రభూ, వంచకుల మెడ కత్తికి తెగదు" అన్నాడు అహమదు ఖలీఫా చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడుతూ. "నేను గజదొంగనే కాని, ఎవరినీ చంపలేదు. వంచన నా నైజం. ఏదన్నా అత్యంత విలువైనది చూసినపుడు నా చేతులు చిటపటలాడుతాయి. అది నా చేతికి అందినాకే మనసు నెమ్మదిస్తుంది"

ఖలీఫా నవ్వి అన్నాడు– "నీవు గజదొంగవు. కాని నిజం చెబుతున్నావు. ఇప్పుడు చెబుతున్నదీ వంచన కావచ్చు, నీకో అవకాశం ఇస్తాను పశ్చాత్తాప పడడానికి. వజీరు జాఫర్! ఇతడి కాళ్లకు చేతులకు, మెడకు వేసిన సంకెళ్లు తీయించు. అహమదు నిన్ను నియమిస్తున్నాను ఓ ప్రత్యేకమైన హోదాలో. బాగ్దాద్‌లో ఎక్కడ దొంగతనం జరిగినా ఆ దొంగను నీవే పట్టుకోవాలి. దొంగకే తెలుస్తుంది దొంగల గురించి. నీకు వలీతో సమానంగా జీతమిస్తున్నాను" అంటూ అప్పటికప్పుడు ఖలీఫా ఆజ్ఞలు జారీచేసినాడు.

అటు చావు తప్పింది, ఇటు పదవి దక్కింది. ఆ సంతోషంతో అతడు తన స్నేహితుడైన పాతదొంగ యూదుడు ఇబ్రహీం మధుశాలకు వెళ్లి తనకిష్టమైన మధువు తాగి ఊగుతుండగా, వార్త తెలిసిన అతడి తల్లి వృద్ధ మహిళ అతడిని ఇంటికి తీసుకుపోయి, మత్తు దిగినాక యాస్మిన్‌ను తెచ్చే పని అప్పగించింది.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 268వ రాత్రి కథ *

## షహర్జాదీ కథ చెప్పసాగింది-

ఖలీఫా తన పద్ధతి ప్రకారం నెలలో మొదటిరోజు మహారాణి దగ్గరకు వెళ్లి రాజ్య వ్యవహారాలు, ఇతరాలు ముచ్చటించి ఆమె సలహా తీసుకుంటాడు. ఆమెతో అంతరంగిక విషయాలు ముచ్చటించేప్పుడు రాణి గదికి ముందున్న గదిలోని ఓ ప్రత్యేకమైన పెట్టెలో తన దగ్గర ఎల్లప్పుడూ ఉండే అంబరు–టర్క్వాయిస్ పూసల హారమును, పావురపు గుడ్ల పరిమాణంలో ఉండే కెంపులు పొదిగి ఉన్న బంగరు పిడిబాకు, రాజముద్రిక, దేశ సంచారమప్పుడు వాడే చిన్ని స్వర్ణలాంతరును పెట్టి పెట్టెకు తాళం వేసి మరల వెళ్లేప్పుడు వాటిని తీసుకువెళ్తాడు.

రాజులకు గూఢచారులున్నట్లు గజదొంగలకూ సమాచారమిచ్చే వాళ్లుంటారు. ఆ విధంగా రాజభవనంలో ఏది ఎక్కడుందో, ఎవరు ఏం చేస్తారో ఆ వ్యవహారమంతా అహమదు–ఇసారికుకు తెలుసు. అందుకే అతడు నెలలో మొదటిరోజు వరకు నిరీక్షించాడు.

అర్ధరాత్రి బానిసలంతా నిద్రపోయాక, ఖలీఫా, బేగంల గదిలో దీపము ఆర్పివేసి వారు గాఢనిద్రలో శయనించాక, నల్లపిల్లిలా అతడు చడీచప్పుడు చేయకుండా రాజభవనపు గోడదూకి రాణి గది ముందు ఉన్న గదిలోని పెట్టె తాళం తీసి ప్రశస్తమైన ఆ నాలుగు వస్తువులను తన దుస్తులలో దాచి మరల తాళం వేసి వచ్చినదారినే నిశ్శబ్దంగా నిష్క్రమించాడు.

రాజభవనం నుంచి సరాసరి ఆ గజదొంగ అబు షామత్ ఇంటి ఆవరణలో ప్రవేశించి పెరటిలో ఓ మూల పాలరాళ్లు పరచి ఉన్నచోట ఓ ఫలకాన్ని తీసి దానికింద గొయ్యి తవ్వి వాటిలో పూసలహారం, పిడిబాకు, రాజముద్రిక ఉంగరాన్ని ఉంచి, తన కష్టానికి ప్రతిఫలంగా బంగరు లాంతరును ఉంచుకున్నాడు. మరల గోతిపై పాలరాతి పలకనుంచి ఏ ఆనవాళ్లూ లేకుండా జాగ్రత్తపడి అక్కడి నుంచి తప్పుకున్నాడు. పని ముగించి మరల తనకిష్టమైన ఇబ్రహీం మధుశాలకు వెళ్లి పీకల్దాకా తాగి మత్తుగా నిద్రపోయాడు.

తెల్లవారే ఖలీఫా పెట్టె తీసిచూస్తే లోపల అంతా ఖాళీ. తన వస్తువులు కాజేసి దొంగ తనకు సవాలు విసిరాడు. వాడిని పట్టుకోకపోతే అది ఎంత

అవమానం! అక్కడ ఉన్న నపుంసక బానిసలు కాళ్లావేళ్లా పడ్డారు. తమకే పాపం తెలియదని విన్నవించారు. కోపంతో మండిపడుతూ ఖలీఫా తన భవనానికి వెళ్లి ఎర్రగా అగ్నిజ్వాలలా కానవచ్చే అంగీ ధరించాడు. అందరికీ తెలుసు ఖలీఫా ఆ దుస్తులలో ఉంటే ఎవరి తలో ఎగిరిపోతుందని. అధికారులను వజీరులను పిలిపించాడు వెంటనే. వజీరు జాఫరు ముఖాన నెత్తురుచుక్క లేదు. అతడి చూపులు ప్రభువు పాదాలపై స్థిరంగా ఉన్నాయి, మనసులో భయం అతడిని ఊపేస్తుండగా.

అదే సమయంలో వలీ అమీరు ఖాలీదు అతడితోపాటు అహమదు ఇస్సారికు ఖలీఫా ముందుకు వచ్చారు. ఖలీఫా అడిగాడు– "ఓ అమీరు ఖాలీదు; బాగ్దాదు నగరంలో శాంతిభద్రతలెలా ఉన్నాయి"

ఖాలిదు విషయం తెలియక అన్నాడు– "అంతా బాగానే ఉంది ప్రభూ!" కాని, ఏదో ఉపద్రవం ముంచుకు వచ్చిందని అతడికర్థమయ్యింది ఖలీఫా దుస్తులు, మాటలు చూడగానే.

"నాకు నా రాజ్యంకన్నా ప్రియమైన వస్తువులు పోయాయి, నీవేమో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయంటున్నావు. రేపు ఉదయానికల్లా అవి నా ముందుండకపోతే నీ తల కోట గుమ్మానికి వేళ్లాడుతుంది" అన్నాడు కోపంగా బుసలు కొడుతూ ఖలీఫా.

వలీ గజగజా వణుకుతూ అన్నాడు– "ప్రభూ! ఈ అహమదు ఇస్సారికు బాగ్దాద్ నగరంలోని దొంగల వివరాలు తెలిసినవాడు. దొంగలను పట్టాల్సిన బాధ్యత ఇతడిది. బాధ్యుడు ఇతడే!"

అహమదు ఇస్సారికు అన్నాడు– "ప్రభూ, తమరు నాకు బాధ్యత నప్పగించారు నామీద ఎంతో దయతో! రేపు ఉదయానికల్లా దొంగను మీకప్ప గిస్తాను. అయితే అంతఃపురంలోని వారినందరినీ తనిఖీ చేసే అధికారమివ్వగలరు. వజీరు జాఫరు కావచ్చు, మన్సూరు కావచ్చు, ఇంకెవరైనా సరే, వలీ ఖాలిదైనా, మధుశాల నిర్వాహకుడు అబు షామత్ అయినా, రాజభవన పర్యవేక్షకులైనా" అన్నాడు అహమదు ఇస్సారికు. "ఒకవేళ దొంగను పట్టుకోలేకపోతే నా తల నరికించండి!"

కాస్త శాంతించాడు ఖలీఫా. వెంటనే అహమదు ఇస్సారికు అడిగినట్లు ఫర్మానా వ్రాసి ఇచ్చినాడు– "ఎవరో ఒకరి తల నేలరాలాల్సిందే! అది దొంగదా,

నీదా అనేది నీ నేర్పు మీద ఆధారపడి ఉంటుంది. చివరకు యువరాజని తేలినా అతడిని బహిరంగంగా ఉరిదీయిస్తాను” అన్నాడు ఖలీఫా.

అహమదు ఇస్సారికు వెంటనే వజీరు జాఫర్ సైనికులిద్దరిని, వలీ భటుల నిద్దరిని, కాది భటులనిద్దరిని తీసుకుని ముందు వజీరు జాఫరు ఇంటిని, తరువాత వలీ, తరువాత కాది ఇలా ఎవరయితే ఖలీఫాకు అంతరంగికులో వారి ఇళ్లను సోదా చేసి, సాయంకాలానికి అబు షామత్ ఇంటికి చేరుకున్నాడు.

అహమదు ఇస్సారికు తన చేతిలో కాస్త బరువైన ఇత్తడి దండము గదలాంటిది పట్టుకుని సైనికులతో వచ్చి తనను లోనికి ఆహ్వానించిన అబుషమత్‌తో అన్నాడు– “నీ ఇంటిలో దొంగ వస్తువులున్నాయని కాదు, అందరి ఇళ్లూ తనిఖీ చేసి నీ ఇల్లు చేయకపోతే నాకు మాట వస్తుంది కాదా! నీపై నాకసలు అనుమానమే లేదు” అంటూనే ఇంటిముందు నేలపై ఇత్తడి దుడ్డుకర్రతో కొడుతూ ఇంటిలో వెదికి చివరకు పెరటిలోకి వచ్చాడు తనతోపాటు సైనికులు రాగా.

పెట్టినవాడికి తెలియనిదేమున్నది. అక్కడా పాలరాతి పలకలపై కొడుతుంటే ఒకచోట బోలుశబ్దం వినవచ్చింది. అతడు సైగ చేయగానే సైనికులు తమ కత్తులతో ఆ పాలరాతి పలకను పైకెత్తినారు. ఇంకేముంది– సైనికులరిచారు– “దొరికాయి నగలు”.

వాటిని అక్కడ చూస్తూనే నిరపరాధి అయిన అబు షామత్ కళ్లు తిరిగి నేలకూలినాడు.

అహమదు ఇస్సారికు వెంటనే వలీ, కాదీలను పిలిపించి వారితో సాక్షి సంతకాలు చేయించి, నేలపై పడిఉన్న అబు షామత్‌ను నిర్బంధంలో ఉంచినాడు.

తన తల తెగనందుకు సంతోషించిన వలీ ఖాలిదు ఆ వార్త ఖలీఫాకు జేరవేసినాడు. ఓ గంటసేపు తర్జనభర్జనలు పడిన ఖలీఫా అన్నాడు– “దోషిని ఉరి తీయండి!”

బాగ్దాద్ వీధులలో ఆ వార్త చాటింపు వేయబడింది. ఇప్పుడు అబు షామత్ సంపదలన్నీ ప్రభుత్వపరమైనాయి, అతడి ఇద్దరు భార్యలతో సహా.

ఆ ఇద్దరు యువతులను బానిసల సంతకు పంపగా ముంతాఫికు తండ్రి వలీ ఖాలిదు యాస్మిన్‌ను, రక్షకభటుల అధికారి జుబేదాను కొనుక్కుని ఆ పైకం ప్రభుత్వ ఖజానాకు అప్పగించారు.

రక్షకభటుల అధికారికి అంతకుముందు అబు షామత్ అనేకసార్లు సాయం చేసాడు. అతడిపై ఉన్న కృతజ్ఞతతో జుబేదాను తన రక్షణలో ఉంచినాడు. ఎందుకో అతడికి అబు షామత్ దొంగతనం చేసాడని నమ్మకం కుదరలేదు. అతడి అనుమానం అహమదు ఇస్సారికు–పూర్వ గజదొంగ, ప్రస్తుతం అధికారిపైనే ఉన్నది. అందుకని ఆ జమేదారు వెంటనే జైలు అధికారి వద్దకు వెళ్ళి ఉరిశిక్ష విధించబడిన ఖైదీలలో అబు షామత్‌లా ఒడ్డుపొడుగు ఉన్నవాడికి ముసుగువేసి తనతోపాటు తీసుకువచ్చాడు. అబు షామత్‌కు ఆడవేషం వేసి తన రహస్య గదిలో దాచిపెట్టాడు.

బాగ్దాద్‌లో ఆ ఖైదీని బహిరంగంగా ఉరిదీసాక అతడు తన ఇంటికివెళ్ళి అబు షామత్‌ను అడిగాడు– “ఖలీఫా వస్తువులను ముట్టుకుని ప్రాణం మీదకు తెచ్చుకున్నావే!”

అబు షామత్ అన్నాడు– “నాకే పాపం తెలీదు. నాపేరు మహాత్మ్యమేమో అన్నీ కష్టాలు నాకే వస్తున్నాయి” అన్నాడు కన్నీరు కారుస్తూ.

కనీసం జుబేదాతో మాట్లాడటానికి సమయం లేదు. ఇద్దరూ మారు వేషాలలో నగరం దాటినారు. అలెగ్జాండ్రియాకు వెళ్లే నౌక నెక్కించి వేయి దీనారాలిచ్చి అబు షామత్‌కు వీడ్కోలు చెప్పి ఇంటికెళ్లినాడు దయామయుడైన ఆ జమేదారు.

ఉరికంబానికి వేలాడుతున్న వాడిని చూడాలని ఖలీఫా ఉబలాటపడడంతో, జాఫర్, ఖలీఫాలు మారువేషాలలో అక్కడకు చేరుకునేసరికి చీకటిపడింది.

ఖలీఫా అన్నాడు– “ఇతడు కాస్త పొడుగ్గా ఉన్నాడే!” అన్నాడు ఖలీఫా అనుమాన పడుతూ.

“ఉరిదీసినాక సాగుతాయి దేహాలు” అన్నాడు వజీరు.

“ఇతడి బుగ్గల మీద పుట్టుమచ్చలు లేవు” అన్నాడు ఖలీఫా.

“మరణం తెస్తుంది అనేక మార్పులు శరీరంపై” అన్నాడు వజీరు.

ఖలీఫా అన్నాడు– “ఈ శవం పాదాలపై ఆలీ అనుయాయులైన సాధువుల పేర్లు పచ్చబొట్టు పొడిపించబడి ఉన్నాయి. అబు షామత్ సున్నీ కదా!”

వజీరు అన్నాడు– “కాళ్లలో రక్తం చేరుతుంది ఉరితీసినప్పుడు. అయినా అల్లాకు తెలుసు ఆ రహస్యం”

అనుమానం ఇంకా పీడిస్తూ ఉండగానే ఇరువురూ రాజభవనానికి వెళ్లారు. ఖలీఫాకు పోయిన నాలుగు వస్తువుల్లో మూడే ముట్టినాయి. బంగరు లాంతరు జాడలేదు. తరువాత రాజకీయ పనుల ఒత్తిడిలో ఖలీఫా కాలం గడచినకొద్దీ అబు షామత్‌ను మరచిపోయాడు.

అక్కడ వలీ ఖాలిదు ఇంటిలో యాస్మిన్‌ను చూడగానే ముంతాఫికు సంతోష పడినాడు. ఆత్రంగా వెళ్లి కౌగిలించుకోబోతే యాస్మిన్ అతడిని నెట్టి అన్నది తన పటకాకున్న బాకును బయటకు తీసి చూపిస్తూ– "నన్ను ముట్టుకున్నావా నిన్ను చంపి నేను చస్తాను"

అసలే పిరికిపంద వాడు, గజగజ వణుకుతూ వెళ్లి తన తల్లి వెనక దాక్కున్నాడు– "ఈ రాక్షసి నాకొద్దు. ఇది చంపేస్తుంది. నాకింకెవర్నైనా తీసుకురండి" అని కొత్త రాగమాలాపన మొదలెట్టాడు.

ముంతాఫికు తల్లి కూడా భయపడింది. అయినా గట్టిగా అరిచింది కాస్త దూరంగా నిలబడి– "ఏమనుకుంటున్నావే, నా కొడుకు పక్కన హాయిగా పడుకుని జీవితం వెళ్లబుచ్చమంటే కత్తి దూస్తున్నావు. ఇకనుంచి నీవు నా సేవకులతో కలిసి బతుకు. పో!"

ముంతాఫికు కూడా తల్లిచాటునే నక్కుతూ పారిపోయాడు. యాస్మిన్‌ను మిగతా పరిచారికలు ఎంతో గౌరవంగా చూసుకున్నారు. ఆమెను పని చేయనిచ్చే వారు కాదు. ఆ తరువాత కొన్ని నెలలకామె పండంటి పిల్లాడికి జన్మనిచ్చింది. అచ్చంగా తండ్రిలా ఉన్న ఆ బాలుడికి అస్లాన్ అని పేరు పెట్టారు. ఆ పిల్లాడిని చూసినాక వలీ ఖాలిదుకు ఎంతో ప్రేమ కలిగింది. రెండేళ్ల వయసులో ఆ పిల్లవాడు వలీ ఖాలిదును చూసి నవ్వుతుంటే ముగ్ధుడై అతడు తీరిక సమయాలలో ఆ పిల్లాడితో కాలం గడపసాగినాడు.

అప్పటి నుంచి అబు షామత్ యాస్మిన్‌ల కుమారుడైన అస్లాన్‌కు వలీ ఖాలిదు పెంపుడు తండ్రి అయినాడు.

ఓరోజున ముంతాఫికు తన తల్లితో కలిసి వెళ్తున్న బండికి ప్రమాదం జరిగి కొడుకు మృత్యువాత పడినాడు. తల్లికి కాలు విరిగి మంచాన పడింది.

తన కొడుకులా చూసుకుంటూ అస్లాన్‌కు యుద్ధవిద్యలు, రాతకోతలు, చదువు, గుర్రపు స్వారి దగ్గరుండి నేర్పించాడు వలీ ఖాలిదు. పధ్నాలుగేళ్ల వయసుకే అస్లాన్ పలు విద్యలలో ప్రావీణ్యం సంపాదించాడు.

ఓరోజున అస్లాన్ గుర్రముపై స్వారీ చేస్తూ వస్తుండగా అహమదు ఇస్సారికు తారసపడినాడు. ఇద్దరూ ఇబ్రహీం మధుశాలకు వెళ్లగా అహమదు తనకిష్టమైన మధువు తాగి వాగడం మొదలెట్టినాడు. జేబులోంచి బంగరు లాంతరు తీసి దానివేపు తన్మయంగా చూస్తుండగా అస్లాన్ దానిని తనకిమ్మని అడిగాడు చూస్తానని. కొత్వాలుగా ఉన్న అహమదు ఇస్సారికు అన్నాడు– “ఇంకేదైనా కోరుకో ఇస్తాను ఇది తప్ప. దీని వెలుగు నీడలో ఎవరి ప్రాణం పోయిందో తెలుసా? నీకు తెలియదులే! పధ్నాలుగేళ్ల క్రితం ‘అబు షామత్’ అని ఈజిప్టువాడు ఖలీఫా భవనంలో అంతరంగికుడిగా ఉన్నవాడు, ఏముంది, ఉరిదీయబడినాడు. వలీ ఖాలిదు నన్ను ఇంతవాడిని చేసాడు గనుక అతడి కొడుకువు గాబట్టి నీకీ విషయం చెబుతున్నాను”

అస్లాన్ ఇంటికి వచ్చాక ఈ విషయం తన తల్లి యాస్మిన్‌తో చెప్పాడు. ఆమె ఉలిక్కిపడింది. ముంతాఘికు, అతడి తల్లి పరోక్షంగా అబు షామత్ మరణానికి కారణమైనారు.

అస్లాన్ అంటున్నాడు– “అహమదు ఇస్సారికు ఆ బంగరు లాంతరును తన అంగిలోనే దాచుకుంటాడు. ఎవ్వరినీ కనీసం ముట్టుకోనివ్వడు”

ఆ మాట వినగానే యాస్మిన్ కెవ్వున కేకపెట్టి స్పృహ తప్పింది.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✻ 269వ రాత్రి కథ ✻

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

తల్లి ముఖంపై చల్లటి నీళ్లు కొట్టి ఆమె మెలకువకు రాగానే అన్నాడు– “ఏమిటమ్మా? ఎందుకంత పెద్ద కేకపెట్టావు? నేను భయపడ్డాను నీకు ఏ అపాయం సంభవించిందోనని”

యాస్మిన్ అన్నది– “కుమారా, నీ తండ్రి వలీ ఖాలిదు కాదు. ఎవరైతే అహమదు ఇస్సారికు వంచన వల్ల దొంగగా ముద్ర వేయబడి ఉరిదీయబడినాడో ఆ అబు షామత్ నీ తండ్రి” అని ఆమె ఆ పధ్నాలుగేళ్ల క్రితం జరిగినదంతా వివరంగా చెప్పింది. “నీతండ్రి అంటే ఎంతో ఇష్టపడే జమేదారుకు ఈ సంగతి తెలిస్తే అతడు సాయపడతాడు మనకు. అదీకాక నీతండ్రి మరణానికి కారణమైనవాడిపై పగ తీర్చుకోవాలి నీవు” అన్నదామె.

జమేదారు అన్నాడు– “నాకప్పుడే అనుమానం వచ్చింది అహమదు మీద. సరే దైవం ఖచ్చితంగా మనకేదో అవకాశం కల్పిస్తాడు ప్రతీకారం తీర్చుకునేందుకు”

దైవనిర్ణయం సరైన సమయానికి జరిగింది. ఆరోజున ఖలీఫా తన కత్యంత ఇష్టమైన గుర్రాన్నెక్కి ఛౌగన్ ఆట–గుర్రాలపై స్వారీ చేస్తూ బంతిని కొట్టే ఆట ఆడుతున్నాడు

ఆట ఆడుతున్న ఉత్సాహంలో ఆటాడుతున్న ఓ ఆటగాడు బలంగా బంతిని కొట్టేసరికి ఆ బంతి వచ్చి ఖలీఫా కంటికి తగలబోతున్న సమయంలో ఆ ఆటగాళ్లలో ఒకడైన అస్లాన్ ఆ బంతిని కొట్టి దారిమళ్లించేసరికి అది నేరుగా వెళ్లి బంతి కొట్టినవాడి నడుం విరగగొట్టింది. ఖలీఫాకు పెద్ద గండం తప్పింది.

ఆట ఆపించి ఖలీఫా అన్నాడు– “బాగ్దాద్ వలీ ఖలీదు కుమారుడా గొప్పగా ఆడావు. నీకు బహుమతి ఇవ్వదలుచుకున్నాను”

ప్రభువు విశ్రాంతి మందిరంలో వజీర్లు, అమీర్లు, కొత్వాలు, జమేదారు అందరూ నిలబడి ఉన్నారు. అస్లాన్ వెళ్లి ఖలీఫా చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడి అన్నాడు– “న్యాయమూర్తీ! నా తండ్రి తన సమాధి నుంచి అరుస్తున్నాడు పగ తీర్చుకొమ్మని”

ఖలీఫా అన్నాడు– “వలీ ఖాలిదు బతికే ఉన్నాడు కదా! ఏమిటీ వింత కోరిక?”

అస్లాన్ జవాబిచ్చాడు– “వలీ ఖాలిదు నా పెంపుడు తండ్రి. నా తండ్రి తమరి వద్ద పనిచేసిన అబు షామత్. నా తండ్రిపై నేరం మోపి ఉరిదీయించిన వాడింకా బతికి మీపక్కనే ఉన్నాడు. అతడు అహమదు ఇస్సారికు ఒకప్పటి గజదొంగ, ఇప్పుడు కొత్వాల్. అతడి జేబులు వెదికించండి. ఋజువు దొరుకుతుంది.

ఖలీఫా ఆశ్చర్యంగా చూస్తూ వెంటనే అనుమతి ఇచ్చాడు. మస్రూర్, జమేదార్లు అహమద్ ఇస్సారికును తనిఖీ చేసేసరికి అతడి అంగీలో దొరికింది అద్భుతమైన చిన్ని బంగరు లాంతరు. అహమదు ఇస్సారికు కళ్లల్లో భయం కదలాడిందప్పుడు.

“ఎలా వచ్చింది ఈ లాంతరు నీ దగ్గరకు?” అడిగాడు ఖలీఫా.

“సంతలో కొన్నాను ప్రభూ!” అన్నాడు అహమదు.

ఖలీఫా అన్నాడు– "గజదొంగవైన నిన్ను కొత్వాలును చేసాను. నీవిట్లా నమ్మకద్రోహం చేస్తావా? వీడిని నిజం చెప్పేవరకు చితకబాదండి". జమేదారు అతడిని బంధించాడు.

అస్లాన్ ఖలీఫాకు ఆనాటి కథమొత్తం చెప్పి– "కరుణామయా! నా తండ్రిని ఇప్పించండి"

ఖలీఫా విస్మయంగా చూసాడు– "నా వలన నీకు అన్యాయం జరిగింది. ఎక్కడి నుంచి తేను నీ తండ్రిని? అతడు బతికి ఉంటే నేనతడిని అప్పగించేవాడిని వెంటనే!"

జమేదారు అన్నాడు– "నాకు అభయమిస్తే నేనో నిజం చెబుతాను ప్రభూ! విశ్వాసుల అధినేతా!"

ఖలీఫా అభయమిచ్చాక అతడు అబు షామత్ అలెగ్జాండ్రియాలో ఉన్న విషయాన్ని చెప్పాడు.

ఖలీఫా అన్నాడు– "నీ వలన దారితప్పిన న్యాయం మరల సరైన దారిలో పడుతున్నది. వెంటనే అబు షామత్‌ను అలెగ్జాండ్రియా నుండి తీసుకురావాలి"

ఖలీఫా ఇచ్చిన పదివేల దీనారాలు తీసుకుని అబు షామత్ మిత్రుడైన జమేదారు బయల్దేరినాడు.

అక్కడ అబు షామత్ అలెగ్జాండ్రియాలో అమ్మకానికి ఉన్న దుకాణమొకటి కొన్నాడు. నావికులకు, నావలకు పనికివచ్చే అనేక వస్తువులు, పురాతన వస్తువులు ఆ దుకాణంలో ఉన్నాయి. పశ్చిమ దేశాల నుంచి వచ్చేవాళ్లు వాటికోసం భార్యబిడ్డలనైనా అమ్ముతారని అక్కడ వర్తకులనుకుంటారు. ఒక దీరాముకు కొని పది దీనారాలకమ్ము మాయాబజారు అది. ఆ తుక్కునంతా అమ్ముతూ ఉండగా ఒకరోజున అతడికి ఓ మూలన ఆరు ముఖాలున్న బంగారు తాయెత్తు కనబడింది. బంగరు గొలుసుకు అతకబడి ఉన్న ఆ తాయెత్తుపై ఏవో విదేశి భాషలో వ్రాసిన అక్షరాలు, జంతు, కీటక, పక్షుల బొమ్మలున్నాయి.

ఈ పధ్నాలుగేళ్లలో అబు షామత్ బాగానే స్థితిమంతుడైనాడు. ఒకరోజున అతడికి తాయెత్తు గుర్తుకు రాగా, దానిని తీసి పరిశీలిస్తున్నపుడు అటుగా వచ్చిన నావికుడొకడు దానికి ఎనిమిదివేల దీనారాలనిస్తానన్నాడు.

అబు షామత్ అన్నాడు– "నేను లక్ష దీనారాలనిచ్చి కొన్నాను. అయినా నేను నీకు అమ్మను"

"లక్ష దీనారాలనివ్వడానికి అభ్యంతరం లేదు. కాని ధనం నా నౌకలో ఉన్నది. తమరు వస్తే పైకమిచ్చి పంపుతాను" అన్నాడు నావికుడు.

దుకాణం మూసి అబు షామత్ అతడితో నౌక నెక్కినాడు. గంట గడిచినా రాకపోయేసరికి, వేచి ఉన్న అబు షామత్‌కు నిద్రపట్టింది. ఇంతలో నౌక ముందుకు కదిలి చాలాదూరం వెళ్లిపోగా మెలకువ వచ్చిన అబు షామత్ లబోదిబోమన్నాడు. అతడి కర్థమయ్యింది తానిప్పుడు నావలో బందీనని. అక్కడ తనకు సాయం చేసేవారెవరు?

ఈలోగా నావికుడు వచ్చి అన్నాడు– "నీవు కైరో వ్యాపారి షామ్స్ అల్‌దిన్ కుమారుడివైన అబు షామత్‌వే కదా! బాగ్దాద్ నగరంలో ఖలీఫా మందిరంలో పనిచేసావు. మనం జెనొవాలో ఆగినాక నిన్నేమి చెయ్యాలో ఆలోచించుదాము".

ఏమి చెయ్యడానికి ఉంటుంది బందీని? ఓడ జెనొవా రేవులో ఆగినపుడు ఓ నడివయస్కురాలైన యువతి ఇద్దరు సాయుధ సేవకులతో వచ్చి అతడిని ఓ పవిత్ర భవనంలోకి తీసుకువెళ్లింది– "నీవు ప్రతిరోజూ ఉదయమే లేచి అడవికి వెళ్లి కట్టెలు కొట్టి తేవాలి. తరువాత ఈ భవనమంతా ఊడ్చి కడిగి శుభ్రం చేసి, మొక్కజొన్నలు దంచి పిండిచేసి రొట్టెలు కాల్చి దానిలోకి కందిపప్పు కూర వండి మూడు వందల డెబ్బైమంది సాధువులకు వడ్డించాలి. తరువాత వాటిని కడిగి, ఈ తోటలోని మొక్కలకు నీళ్లుపోసి, సాయంకాలం ఈ భవనం వెలుపల నిలబడి దారినపోయే వాళ్లను లోనికి ఆహ్వానించాలి. వాళ్లు రానంటే ఈ దుడ్డుకర్రతో చితగ్గొట్టు"

అబు షామత్‌కు అర్థం కాలేదు ఆమె హాస్యానికంటున్నదా లేక నిజంగా అంత పని ఉంటుందా! మానవమాత్రుడెవడైనా చేయగలిగిన పనేనా అది!

అతడలా ఆలోచిస్తూ ఉండగానే అద్భుతంగా పాటపాడుతూ మేలిముసుగులో ఓ అందాల బాలిక అటుగా వచ్చింది. అబు షామత్ తన అంగీలో ఉన్న తాయెత్తును తడుముతూ ఉండగా.

ఆమె అన్నది బుల్‌బుల్ పిట్ట స్వరంతో– "నా కలల ఫలమా! నా మనో నాయకా! మొత్తానికి వచ్చావిక్కడకు" అన్నదామె.

అబు షామత్ అనుకున్నాడు– "ఇది ఖచ్చితంగా స్వప్నమే! నేను అలెగ్జాండ్రియాలో నా దుకాణంలో నిద్రపోతున్నాను"

ఆ బాలిక అన్నది– "నాపేరు హుస్న మరియం. ఈ నగరపు ప్రభువు కుమార్తెను. నా తండ్రి నౌకల అధికారి. నేను పంపగా నిన్నిక్కడికి తీసుకువచ్చినాడు. నీ అంగీలో ఉన్న తాయెత్తు నన్ను నీ వశురాలిని చేసింది".

అబు షామత్ అన్నాడు– "యువరాణీ! ఇదేమీ నమ్మశక్యంగా లేదు. నన్ను మన్నించి నిజం చెప్పగలరు"

హుస్న మరియం అన్నది నవ్వుతూ– "ఆ తాయెత్తు గొప్పదనం నీకు తెలుస్తుంది ముందు ముందు. మనం వివాహం చేసుకుందాం ఇప్పుడే, ఇక్కడే! ఆ తరువాత నీవనుకున్నది చేయవచ్చు"

అబు షామత్ అన్నాడు– "అలెగ్జాండ్రియాకు వెళ్లాలనుకుంటున్నాను"

వివాహానంతరం ఆమె ఆ తాయెత్తును తీసుకుని దాని ఆరు ముఖాలలో మంత్ర తివాచి బొమ్మ ఉన్న దానిని ఆకాశం వేపు తిప్పి ఏవో మంత్రాలు చదివింది. అప్పుడు వారి ముందు ప్రత్యక్షమయ్యింది మంత్ర తివాచి.

దానిపైన ఇద్దరూ కూర్చున్నాక ఆమె అన్నది– "ఓ సులేమాన్ ముద్రికా! మమ్మల్ని ఈ తివాచిపైన అలెగ్జాండ్రియా తీసుకువెళ్లు!" మరుక్షణంలో అది ఆకాశంలోకి లేచి ఎటువంటి కుదుపులూ లేకుండా అలెగ్జాండ్రియాలోని అబు షామత్ దుకాణానికి చేర్చింది. వారికోసం ఎదురుచూస్తూ బాగ్దాద్ నుంచి వచ్చిన జమేదారు కనిపించాడు. అబు షామత్ అతడిని కౌగిలించుకుని క్షేమ సమాచారాలు కనుక్కున్నాడు. పధ్నాలుగేళ్లు జుబేదా, యాస్మిన్‌లను వదిలివచ్చి తాను. ఇప్పుడు తనకు పధ్నాలుగేళ్ల కొడుకున్నాడు. తలుచుకుంటుంటే అతడి కళ్లవెంట కన్నీళ్లు జలజల రాలాయి.

ముగ్గురూ కలిసి మంత్ర తివాచీ మీద కూర్చున్నారు. హుస్న మరియం అన్నది– "ఓ సులేమాన్ ముద్రికా, మమ్మల్ని కైరో చేర్చు" అన్నది, అబు షామత్ తన తల్లిదండ్రులను కలవాలని అనగా.

అక్కడ అబు షామత్‌ను చూడగానే అతడి తల్లిదండ్రులు ఆనందపరవశు లైనారు. ఎప్పుడో చనిపోయాడనుకున్న కుమారుడు కళ్లకెదురుగా కనబడేసరికి వారి సంతోషం పరవళ్లు దొక్కింది.

మూడురోజులు విశ్రాంతి తీసుకున్నాక అబు షామత్, జమేదారు, అబు షామత్ తల్లిదండ్రులు, హుస్న మరియం యువరాణి అయిదుగురూ మంత్ర తివాచిపై బాగ్దాద్ చేరుకుని యాస్మిన్‌ను విడుదల చేయించి జమేదారు ఇంటిలో ఉన్న జుబేదా దగ్గరకు చేర్చారు. జుబేదా, యాస్మిన్, హుస్న మరియంలు ముగ్గురు మూడు అద్భుత తారల్లా మెరిసిపోయారు. అబు షామత్ కష్టాలు తొలిగినాయి.

ఖలీఫా దర్శనానికి వెళ్లి అబు షామత్ ప్రభువు చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడినాడు. ఖలీఫా అతడిని అంతరంగిక మిత్రుడిగా ఆదరించి అనేక బహుమతులనిచ్చాడు.

గజదొంగ అహమద్ ఇస్సారికు కళ్లు పొడిపించి అంధుడిని చేసి వదిలేయగా అతడు దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ కన్నుమూసాడు. అబు షామత్ తాను ఈ స్థితిలో ఉండటానికి కారణమైన మహమదు తునాయిని క్షమించగా అతడిని అహమదు ఇస్సారికు స్థానంలో కొత్వాలుగా నియమించినాడు ఖలీఫా.

ఆ తరువాత తన ముగ్గురు భార్యలతో హాయిగా జీవించాడు అబు షామత్.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 270వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

# VI. జ్ఞాని, విద్యావంతురాలు షఫక్ కథ

ఆమె ఎంతో తెలివిగలది. కరుణ ఆమె సొత్తు. అందచందాలు ఆమె ఆభరణాలు. విద్యా వినయాలు ఆమె వస్త్ర విశేషాలు. ఆమె పేరు షఫక్.

బాగ్దాద్‌లోని ఓ భాగ్యవంతుడైన వ్యాపారికి లేకలేక కలిగిన పుత్రుడు అబు అల్–హసన్. అల్లారుముద్దుగా పెరిగిన అతడికి పవిత్ర గ్రంథ పఠనముతో పాటు అనేక విద్యలు నేర్పించారు సమర్థులైన గురువులనెన్నిక చేసి. అతడెంత సుందరుడంటే–

*వసంతకాలం నిష్క్రమించినా*
*గులాబి తోటలో కానవస్తున్నాయి*
*అక్కడక్కడా అందమైన గులాబి మొగ్గలు*

*వాటికి పనిలేదు ఋతుచక్రంతో*
*అరుదుగా కనిపించే ఆ కాలంలో*
*అతడి అందాలను పాడెనా బుల్‌బుల్‌పిట్టలు*

ఒకరోజున వ్యాపారి తన కుమారుడైన హసన్‌ను పిలిచి అన్నాడు– "నాయనా, నాకు వయసు మీదపడింది. దేవుడి పిలుపు కోసం ఎదురుచూస్తున్నాను. నేను సంపాదించిన సంపదలు తరతరాలకు సరిపోతాయి. దైవానికి విశ్వాసుడివై మంచి మార్గాన నడుస్తూ, జీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపు".

ఆ తరవాత కొద్దిరోజులకు అతడు కన్నుమూసినాడు. అబు అల్–హసన్ చెడు సాంగత్యాలతో చేరి మధు మాంస మగువలతో భౌతికానందాలననుభవిస్తూ తండ్రి ఇచ్చిన సంపదలనన్నిటినీ ఖర్చుపెట్టగా అతడి వద్ద మిగిలింది ఓ బానిస యువతి మాత్రమే. ఆమె పేరు షఫక్.

అలిఫ్ అక్షరంలా నిటారైనది. ఎంతో నాజూకుగా లావణ్యాలను విరబోస్తూ ఎండపడినపుడు సన్నని నీడలా కనిపించేది, చిరునవ్వులతో వెన్నెలలు విరిసేది, ఆమె నోటిలోని ముత్యాల పలువరుసను దాచడానికి వేసిన కెంపు ముద్రికలలా ఆమె అధరాలు, రెండు గుండ్రటి కాబూలు దానిమ్మలలా ఆమె వక్షోజాలు, వాటి మధ్య సన్నని లోయ, తీర్చిదిద్దినట్లుండి చెంచాడు ఆలివ్ నూనె పట్టే నాభి, ఘన జఘన, నితంబములు ఆమెకు అపురూప సంపదలు.

*సూర్య చంద్ర గులాబి వర్ణాలు*
*అన్నీ ఆమెకే ఎవరిచ్చారో ఏమో*
*గుండెచప్పుడు చూసేవారికి ఎక్కువ*
*తక్కువగును ఆమె రాకపోకలతో*
*జీవనది ప్రవహిస్తుంది ఈడెను తోటలో*
*మరొకటి ఆమె దేహంలో*
*చంద్రిక దాగున్నది మబ్బుల చాటున*
*మరో చంద్రిక ఆమె మేలి ముసుగులో*
*ఆమె దేహమొక రంగుల పాట*
*గులాబిపూలు రేగుపళ్లున్న తోట*
*చందనపు చెక్కను చక్కగా చెక్కి*
*ఆమె రూపుగా మలిచినదెవరో!*

అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.

## * 271వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

తన చేతులతో తాను తెచ్చుకున్న దారిద్ర్యాన్ని తలుచుకుంటూ అబు అల్-హసన్ మూడు పగళ్లు మూడు రాత్రులు నిద్రాహారాలు లేకుండా కాలం గడిపాడు. అతడి దీన స్థితిని చూసి షఫక్ తన వద్ద ఉన్న మంచి నగలను, దుస్తులను ధరించి హసన్‌తో అన్నది- "దేవుడు నీకు మంచి చేస్తాడు. నీవు చేయాల్సిందల్లా నన్ను ఖలీఫా హరూన్ అల్ రషీద్ వద్దకు తీసుకువెళ్లి అమ్మకానికి పెట్టు. వెల అడిగితే పదివేల దీనారాలని చెప్పు.

ఇంట్లో దివ్య ఔషధ మొక్క ఉన్నా మనం పట్టించుకోనట్లు ఆమెనేనాడూ సరిగా గమనించనివాడు, ఆమె సలహాను వినీ విననట్లు విని గత్యంతరం లేక ఆమెను ఖలీఫా వద్దకు తీసుకువెళ్లి ఆమె విలువ పదివేల దీనారాలుగా ప్రకటించాడు.

ఖలీఫా చేతుల మధ్యనున్న నేలను ముద్దాడి ఆమె అన్నది- "దైవ విశ్వాసుల అధినేతా, న్యాయమూర్తీ, దిక్చక్రాన్ని శాసిస్తున్న దివ్య ప్రభూ, నేను పవిత్ర గ్రంథంలోని అధ్యాయాలు, పేరాలు, పేజీలు, వాక్యాలు, అక్షరాలు, అచ్చులు, హల్లులు, పదాలు ఎన్ని ఎక్కడ ఉన్నాయో చెప్పగలను. ఇవికాక కవిత్వం, న్యాయ సూత్రాలు, సంగీతం, ఖగోళశాస్త్రం, గణితం, వీటన్నిటిని నేర్చుకున్నాను. పవిత్ర గ్రంథంలో ఏవే భాగాలు మక్కాలో వ్రాయబడినవో, ఏవి మదీనాలో చెప్పబడినవో వాటిని చెప్పగలను. ఇవికాక తర్క వేదాంత, వాస్తు, భాషా, వైద్యశాస్త్రాలు కొంతవరకు చదువుకున్నాను. నేను సర్వజ్ఞురాలిని కాదు కాని ఇంకా నేర్చుకోవాలన్న తపన నాకున్నది. పదాలకు వాక్యాలకు సంగీతాన్ని జతచేయగలను; నేను అద్భుతంగా పాడగలను, నెమలిలా నాట్యం చేయగలను. వీణ, వేణువు లాంటి తంత్రీ వాద్యాలపై యాభై రకాల రాగాలు పలికించగలను. నా నృత్యం జగన్మోహనం, నా కంటి చూపు ప్రాణాలనిస్తుంది, తీస్తుంది. కేవలం తమ సన్నిధిలోనే వీటిని చెబుతున్నాను. నా యజమానికి ఈ విషయాలు ఈనాటికీ తెలియవు".

ఖలీఫా అన్నాడు- "నా రాజ్యంలో వివిధ కళలలో ఆరితేరిన నిష్ణాతులున్నారు. వారు నిన్ను పరీక్ష చేస్తారు. ఆమె గెలిచిందా ఓ అబుహసన్ నీకు పదివేల దీనారాలు

దక్కుతాయి. ఆమె నా పరమవుతుంది. ఓడిపోతే నీవామెను తీసుకుని వెళ్లిపోదువు గాని”.

ఖలీఫా పంపిన సందేశం చూడగానే సాధువులకే గురువు మహా పండితుడు ఇబ్రహీం ఇబిన్ సియ్యర్, అతడితోపాటు పేరుగాంచిన కవులు, వ్యాకరణ వేత్తలు, సిద్ధాంతకర్తలు, జ్యోతిషులు, న్యాయమూర్తులు వచ్చి ఖలీఫా స్వర్ణ సింహాసనం దిగువన ఆసీనులైనారు. వారి ఎదురుగా మెరుపుతీగ మేలి ముసుగు మబ్బుల మాటున–

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# * 272వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఆమె కానవచ్చింది సౌదామినిలా. సభ అంతా నిశ్శబ్దం. నేలపై సూది పడితే వినవచ్చేట్లున్నది.

పండితులలోనూ కాస్త కలకలం. గుండెదడ దానిని నెమ్మది చేసుకుంటూ ఆ కాలంలో ప్రసిద్ధికెక్కిన ధర్మశాస్త్ర నిపుణుడు – ఈ యువతి తన ప్రశ్నలకు జవాబివ్వలేదన్న ధైర్యంతో అడిగాడు– “మన మతం గురించి నీకు తెలిసిన విషయాలు సభకు తెలియజేయగలవు”.

ఆమె అన్నది వినయంగా– “అల్లా నా దైవం. మహమ్మదు ఆ దేవుని ప్రవక్త (అతడిపై శాంతి ఎల్లెడల కురియును గాక). పవిత్ర గ్రంథము ఖురాను నాకు మార్గదర్శకము; మక్కాలో అబ్రహాం నిర్మించిన కాబా నాకు దిక్కు; నా జీవన విధానము ప్రవక్త చూపిన దారి. ‘సున్నా’ ఆచారాలు, హడిత్; విశ్వాసులందరు నా సోదరులు.

మతపెద్ద అడిగాడు– “దేవుడున్నాడని నీకెలా తెలుసు?”

“హేతువు చేత”

“ఏమిటా హేతువు?”

“హేతువు రెండు విధాలు– జన్మతః వచ్చిన జ్ఞానము. రెండవది అభ్యాసముతో వచ్చేది”.

"హేతువు స్థానమేది?"

"హృదయం. అక్కడ ఉత్తేజము చెందిన ఉద్వేగాలు మేధను చేరుతాయి"

"ప్రవక్త గురించి నీకెలా తెలిసింది?

"పవిత్ర పుస్తక పఠనం వలన. దానిలో పేర్కొనబడిన వాక్యముల వలన, అతడి దివ్య సందేశము వలన"

"మన మత విధులేమిటి?"

"అవి అయిదు– 1) అల్లాయే దేవుడు, మహమ్మదు అతడి ప్రవక్త, 2) ప్రార్థన, 3) దానధర్మములు, 4) రమదాన్ నెలలో ఉపవాసం చేయడం, 5) మక్కాకు తీర్థయాత్ర".

"దైవభక్తిని సూచించేవేమిటి?"

"అవి ఆరు– 1) ప్రార్థన, 2) దానధర్మములు, 3) ఉపవాసము, 4) తీర్థయాత్ర, 5) నిషేధ వస్తువులకు వ్యతిరేకత, 6) పవిత్ర యుద్ధంలో పాల్గొనడం"

"ప్రార్థన ఉద్దేశమేమిటి?"

"శీలతను విశ్వాసమును దేవుని కెరుకపరచుట, అతడి ఘనతను కీర్తించుట, ఆత్మను భగవత్ ప్రసాద ప్రశాంత స్థలములలోకి నడిపించుట".

"ప్రార్థన చేసేపుడు పాటించవలసిన వేమిటి?

"పరిశుద్ధత. శరీర భాగములను మంచినీటితో శుభ్రపరచుట, మరకలు దుమ్ములేని వస్త్రాలను ధరించుట, శుభ్రముగా ఉన్న ప్రదేశమునెన్నుకొనుట, నాభికి మోకాళ్లకు మధ్య ఉన్న దేహభాగ సంరక్షణ, మంచి ఉద్దేశము. పవిత్ర మక్కాలోని కాబా వేపు తిరిగి ప్రార్థన చేయుట".

"ప్రార్థనల విలువ ఏమిటి?"

"విశ్వాసానికి పునాది ప్రార్థన"

"ప్రార్థనల ఫలము ఏమిటి?"

"నిజమైన ప్రార్థనా ఫలము భౌతిక విలువ కలిగినది కాదు. జీవికి ప్రభువుకు మధ్య ఉన్న ఆత్మబంధమది. ప్రార్థన వలన పది లాభాలున్నవి– 1) హృదయాన్ని

కాంతివంతం చేస్తుంది ప్రార్థన, 2) ముఖంలో జ్ఞానపు వెలుగు గోచరిస్తుంది, 3) కరుణగల వారిని సంతోషపెడ్తుంది, 4) సైతానుకు కోపాన్ని తెప్పిస్తుంది. 5) జాలిని ఆకర్షిస్తుంది, 6) చెడును తొలగదీస్తుంది, 7) రోగాలను దరిచేరనీయదు, 8) శత్రువుల నుంచి రక్షణ కలగజేస్తుంది. 9) ఊగిసలాడే ఆత్మను బలోపేతం చేస్తుంది, 10) యజమాని వద్దకు బానిసను చేరుస్తుంది"

"ప్రార్థనా తాళానికి బీగము ఏమిటి? ఆ తాళం చెవికి ఏ తాళం చెవి ఉన్నది" అడిగాడు మత గురువు.

ఆమె జవాబిచ్చింది- "ప్రార్థనకు తాళంచెవి పరిశుభ్రత. పరిశుభ్రతకు తాళంచెవి- దయాశీలి, కరుణామయుడైన అల్లా స్మరణ"

"పరిశుభ్రత చేసే పద్ధతులేమిటి?"

"ఇమామ్ మహమ్మదు ఇబిన్ ఇద్రిస్ అల్-షఫి ప్రకారం ఇది ఆరు విధాలు- 1) సృష్టికర్తకు అంగీకారమైన పద్ధతిలో శుభ్రత పాటించడం; మొదట ముఖాన్ని కడగాలి, చేతులను మోచేతుల వరకు, శిరస్సులో భాగాల్ని, పాదాలను, కాలిగోళ్ల నుంచి చీలమండల వరకు కడిగి, క్రమపద్ధతి తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అవి పన్నెండు-1) ముందు అరచేతులు కడిగి ఆ తరువాత హస్తమును నీళ్లలో ఉంచాలి. 2) నోరు కడిగి పుక్కిలించాలి, 3) ముక్కు రంధ్రాలు శుభ్రపరచి, 4) తల కడిగి, 5) చెవులలోన, బయట శుభ్రం చేసి, 6) గడ్డంలోనికి వేళ్లు పోనిచ్చి కడిగి, 7) కాలివేళ్లు, చేతివేళ్లు శబ్దం వచ్చేవరకు వంచి, 8) ముందు కుడికాలు తరువాత ఎడమకాలు కడిగి, 9) ఇలా ప్రతిదీ మూడుసార్లు చేసి, 10) ప్రతిసారి దైవానికి విధేయత తెల్పుతూ, 11) కడగడం పూర్తిచేసి, 12) ఈ స్తోత్రం చదవాలి- దైవమా, నన్ను పరిశుద్ధుడిగా, పశ్చాత్తాపము నొందిన వాడిగా, విశ్వాసిగా చేసినందుకు కృతజ్ఞతలు, నీవు తప్ప వేరే దైవము నంగీకరించను. నీవే నాకు ఆశ్రయము. నీవలననే నాకు పాప విముక్తి కలుగును. ఆమెన్!

ప్రవక్త (అతనిపై ప్రార్థన, ఆశీస్సులు కురియుగాక) నిర్దేశించినాడు- ఎవరైతే ఇలా ప్రార్థన చేస్తారో వారికి ఈడెనుతోట ఎనిమిది ద్వారములు తెరవబడి ఉంటాయి. అతడికిష్టము వచ్చినపుడు దానిలోకి ప్రవేశించుటకు అనుమతి ఇవ్వబడుతుంది".

"మానవుడు పరిశుభ్రం చేసుకుంటున్నపుడు దేవదూతలు, సైతాను దూతలు ఏమి చేస్తుంటారు?"

"ఆ సమయంలో దూవదూతలు మనిషికి కుడివేపున, సైతాను దూతలు ఎడమవేపున ఉంటారు. ఎప్పుడైతే 'అల్లా పేరుమీద' అని విశ్వాసి పరిశుభ్రతా నియమాలను పాటిస్తాడో సైతాను దూతలు దూరంగా జరగగా, దేవదూతలు విశ్వాసి తలపైన నాలుగు మూలల ఎగుర్తూ కాంతి చదరాన్ని ఏర్పరుస్తారు. వారు దేవుని స్తుతిస్తూ, ఆ మనిషి పాప విముక్తిని కోరుతారు. పరిశుభ్రతా సమయంలో అల్లాను స్తుతించని వాడిచుట్టూ సాతాను దూతలు మూగి మనిషి ఆత్మను మలిన పరచి, సందేహాలను రేకెత్తిస్తూ, ఆత్మ ఉత్తేజాన్ని తగ్గిస్తారు" అన్నది షఫక్.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## * 273వ రాత్రి కథ *

*షహర్జాది కథ చెప్పసాగింది-*

"తల నుంచి పాదాల వరకు అన్ని భాగాలనూ పరిశుభ్రంగా కడగాలి. రోమాలున్న భాగాలను, జననాంగాలను పరిశుభ్రం చేసినాక, పాదాలను ఆఖరున కడగాలి".

"బాగా చెప్పావు. తయమ్మము పద్ధతినెప్పుడు ఆచరించాలి?"

"తయమ్మము అనేది ఇసుక, ధూళితో పరిశుభ్రం చేయడం. ఇది కేవలం ఏడు ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే చేయాలి. 1) నీళ్లు లేనపుడు, 2) నీళ్లు అయిపోతాయని భావించినపుడు, 3) తాగడానికి నీళ్లు సరిపడా లేనప్పుడు, 4) నీటిని తెచ్చేప్పుడు నేలకు చింది వృథమయ్యే అవకాశమున్నపుడు, 5) నీళ్లు వాడటం వలన వ్యాధులు వచ్చే పరిస్థితి ఉన్నపుడు, 6) ఎముకలు విరిగి లేవలేని స్థితిలో మంచాన పడి ఉన్నపుడు, 7) గాయాలను ముట్టుకోకూడనప్పుడు.

ఆ సమయంలో- 1) పూర్తి విశ్వాసముతో, 2) చేతిలో ఇసుక, ధూళి తీసుకుని, 3) ముఖానికి, చేతులు, మోచేతులకు రాసి, 4) అరచేతులు శుభ్రపరచు కోవలెను.

దేవుని స్తుతిస్తూ కుడి భాగాలను ముందు తరువాత ఎడమ భాగాలను ఇదివరకు నేను చెప్పిన క్రమంలో పరిశుద్ధపరచుకోవాలి".

"ప్రార్థనా విధానమేమిటి?"

"ప్రార్థన అనే భవనము నాలుగు స్తంభాలపైన స్థిరంగా ఉంటుంది. తకబీర్ పద్ధతిలో– అల్లా అత్యున్నతుడు; అని ప్రార్థిస్తూ పవిత్ర గ్రంథము ఖురానులోని తొలి అధ్యాయాన్ని పఠించడం ముఖాన్ని నేలకు తాకించి, పైకి లేవడం; విశ్వాసాన్ని పునరుద్ఘాటించడం; అరిపాదాలపై కూర్చోవడం; ప్రవక్త కొరకు ప్రార్థించడం (అల్లా ఆశీర్వాదము, ప్రార్థనాశాంతి అతడిపై వర్షించును గాక) – అని నిర్మలమైన మనసుతో ధ్యానించడం".

రెండు చేతులు పైకెత్తి అరచేతులు మక్కావేపు ఉండేట్లుంచి, ఫతిహా రెండోసారి చదివి, మరో అధ్యాయము కూడా పఠించి, ప్రవక్తకు శుభం కలిగే ప్రార్థన చేసి ముగించాలి".

"చక్కటి వివరణాత్మక సమాధానం. దానధర్మాలెలా చెయ్యాలి" అడిగాడు ఆ మత పండితుడు.

"అవి పదునాలుగు విధాలు– బంగారం, వెండి, ఒంటెలు, గోవులు, గొర్రెలు, మొక్కజొన్న, బార్లి, రాగులు, జొన్నలు, చిక్కుళ్లు, సోయాచిక్కుళ్లు, బియ్యము, ఎండుద్రాక్షలు, ఖర్జూరాలు.

తన దగ్గర ఇరవై మక్కా స్వర్ణ దీనారాల కన్నా తక్కువ ఉంటే పన్ను మినహాయించబడుతుంది. దాని పైన ఆదాయానికి మూడు శాతం పన్ను. వెండికైనా అంతే. అయిదు ఒంటెలుంటే ఒక గొర్రెను, ఇరవై అయిదు ఒంటెలుంటే ఒక ఒంటెను, నలభై గొర్రెలకొక గొర్రె; నలభై పశువులకొక పశువు; మిగతా వాటికి కూడా అదే దామాషాలో పన్ను చెల్లించాలి"

"ఉపవాసమంటే ఏమిటి?"

"తినడం, తాగడం, శృంగారం నిషిద్ధం. ఉదయం నుంచి సూర్యాస్తమయం వరకు రమాదాన్ మాసంలో – అదేవిధంగా పనికిమాలిన విషయాలపై చర్చించ రాదు. పవిత్ర గ్రంథ పఠనం ఎంతో మేలైనది".

"ఉపవాసమును భంగపరచని వేవి?"

"పైకి ఉపవాసమును భంగపరచినట్లు అనిపించినా వీటిని అనుమతించ వచ్చు– ద్రవ ఔషధాలు, నెప్పితగ్గే మలాములు, కళ్లకు కాటుక, దారిపైన దుమ్ము,

ఉమ్మి మింగడం, అనుకోకుండా ఇంద్రియ స్ఖలనం, ముస్లిం మతస్థురాలు కాని స్త్రీని చూడడం, రక్తాన్ని తీసే వైద్య విధానాలు – ఇటువంటివి".

"సన్యసించడమనేదేమిటి?"

"మసీదులోనే నివాసముండడం; అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రాకపోవడం, స్త్రీలకు దూరంగా ఉండడం, మౌనదీక్ష – ఇవి సూచించబడినాయి కాని తప్పక అమలుజేయాల్సినవి కావు".

"తీర్థయాత్ర గురించి వివరించు?"

"ప్రతి ముస్లిము మతస్థుడు జీవితంలో ఒక్కసారైనా విధిగా మక్కాను దర్శించాలి. మతభావన అర్థమయ్యే వయసులో వెళ్లాలి. తీర్థయాత్రికుడి దుస్తులు ధరించాలి. స్త్రీలతో సంబంధాలుండరాదు, శిరోజాలు, వెంద్రుకలు తీసివేయాలి; గోళ్లు కత్తిరించుకోవాలి, ముఖంపై, తలపై ఆచ్ఛాదన ఉండాలి".

"పవిత్ర యుద్ధాల గురించి చెప్పు?"

"ఇస్లాము ప్రమాదంలో ఉన్నపుడు అవిశ్వాసులపై చేసే సమరమే పవిత్ర యుద్ధము. అది ఆత్మరక్షణే కాని, ఆక్రమణ కాదు. ఒకసారి విశ్వాసి ఆయుధాలు చేబడితే వెనుదిరిగే పనిలేదు".

"అమ్మకాలు, కొనుగోళ్ల గురించి వివరించు!"

"నమ్మకం, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా ఇరుపక్షాల అంగీకారంతో అమ్మకాలు కొనుగోళ్లు చేయాలి".

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 274వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

"అమ్మకాలు–కొనుగోళ్లలో కొన్ని పద్ధతులను సున్నా అనుమతినిచ్చింది. కొన్నిటికి ఇవ్వలేదు. ఎండు ఖర్జూరాలు–తాజా ఖర్జూరాలు, ఎండు అత్తిపళ్లు–తాజా అత్తిపళ్లు, ఉప్పువేసిన ఎండుమాంసము–తాజా మాంసము, ఉప్పువేసి నిల్వ ఉంచిన వెన్న–తాజా వెన్న పరస్పర మార్పిడికి యోగ్యమైనవి కావు. అలాగే ఏ

నిల్వ పదార్థమూ, తాజా పదార్థమునకు ఒకటే విలువ కట్టరాదు" అని షఫక్ జవాబివ్వగానే పండితుడనుకున్నాడు– "ఈమెకు నాతో సరితూగే జ్ఞానమున్నది. పాండిత్యంతో గెలవలేనిప్పుడు తర్కంతో నెగ్గుకు రావాలి" అనుకుని– "పరిశుభ్రత కసలు అర్థమేమిటి" అని అడిగాడు.

"అంతర్ బాహ్య మలముల శుద్ధి" అని జవాబిచ్చిందామె.

"ఉపవాసానికి అర్థం?"

"నిషేధ వస్తువులకు దూరంగా ఉండడం"

"దానము?"

"నిన్ను నీవు ధనికుడిగా చేసుకోవడం"

"తీర్థయాత్ర?"

"ముక్తి మార్గము"

"పవిత్ర యుద్ధం?"

"ఆత్మరక్షణ"

పండితుడన్నాడు– "అద్భుతం. చిన్నవయసులోనే అపార పాండిత్యాన్ని గణించి ఓ వ్యాపారి ఇంటిలో బానిసగా బతుకుతున్నదీమె. ఈమె జ్ఞాన సంపద అనన్య సామాన్యం".

షఫక్ చిరునవ్వు నవ్వి అన్నది– "ఇది పరీక్ష పరిధులు దాటి పోటీ అయినది. మరి నేను తమరిని కొన్ని ప్రశ్నలడగవచ్చునా?"

పండితుడన్నాడు– "తప్పక"

షఫక్ అడిగింది పండితుడిని– "ఇస్లాం మత పునాధులేమిటి?"

"సహేతుకమైన విశ్వాసము, సరైన నడవడిక, న్యాయ ధర్మ పాలన, వాగ్దానాలు నెరవేర్చడం" అన్నాడు పండితుడు.

"తమరు నేనడగబోయే ప్రశ్నకు సమాధానమివ్వలేకపోతే తమకు గౌరవాన్నిచ్చే పండితోచితమైన ఉడుపు నాకు ఇవ్వవలసి ఉంటుంది. ప్రశ్న అడగమంటే అడుగుతాను. లేకుంటే ఇక్కడితో విరమిద్దాము".

అతడన్నాడు గర్వంగా– "ఓ బానిస యువతీ! అడుగు. నేను పోటీకి సిద్ధమే!"

ఆమె అతడి అహంభావాన్ని చూసి లోలోన ఆశ్చర్యపడింది– "వీళ్లు మారరు. సమభావము రాదు వీళ్లకు" అనుకుని "ఇస్లాము శాఖలేమిటి?" అని అడిగింది.

పండితుడు కళవళపడిపోయాడు– కొంతసేపు ఆలోచించి అన్నాడు– "నీవు సరైన సమాధానం చెబితే ఈ గౌరవ చిహ్నమైన అంగీ నీకు లభిస్తుంది".

షఫక్ గౌరవపూర్వకంగా, శిరసు వంచి నమస్కరించి అన్నది– "ఇస్లాము మత వృక్ష శాఖలిరవై– 1) పవిత్ర గ్రంథపు ప్రతివాక్యము త్రికరణ శుద్ధిగా పాటించుట, 2) ప్రవక్త బోధనలను, ఆచారములను అనుకరించుట, 3) అన్యాయపు పనులు చేయకుండుట, 4) అనుమతించిన ఆహారమునే తీసుకొనుట, 5) నిషేధ ఆహారమును ముట్టుకోకుండుట, 6) దారితప్పిన వారిని శిక్షించుట, 7) పశ్చాత్తాపము, 8) మతము గురించి క్షుణ్ణంగా తెలుసుకొనుట, శోధన, 9) శత్రువులకు మేలు చేయుట, 10) నిరాడంబరత, 11) అల్లా విధేయుల నాదరించుట, 12) మార్పును కొత్తదనాన్ని తిరస్కరించుట – సమాజానికి చెరపు చేసే వాటిని, 13) కష్టకాలంలో ధైర్యంగా ఉండడం, 14) క్షమ, 15) దురదృష్ట కాలంలో సహనం, 16) అల్లా గురించిన జ్ఞానము, 17) ప్రవక్త గురించి జ్ఞానము (అతనిపై శాంతి ఆశీస్సులు వర్షించునుగాక), 18) సైతాను మాయలకు లొంగకుండుట, 19) బుద్ధి దారిమళ్లకుండా జాగ్రత్త పడుట, 20) అల్లాకు పూర్తి విధేయతతో ప్రవర్తించుట".

ఖలీఫా ఆశ్చర్యపోయాడు ఆమెకున్న జ్ఞానానికి పోటీతత్వానికి.

షఫక్ అన్నది– "పోటీ అన్నది కేవలం జ్ఞాన సముపార్జనకే. సరైన వాదనలో ఎవరూ ఓడిపోరు. ఒకరి నుంచి ఎంతోకొంత నేర్చుకుంటారు" అన్నదామె వినయంగా.

ఖలీఫా అప్పటికప్పుడు ఆమెకు పండితోచితమైన దుస్తులను తెప్పించి ఆమెతో వాదించిన పండితుడితోనే గౌరవింపజేసాడు.

పండితుడు ఆశ్చర్యపోయాడు– "ఓటమిలో గెలుపును, గెలుపులో ఓటమిని చూడమని చెబుతున్నది ఈమె" అనుకుంటూ తన ఓటమిని అంగీకరించాడతడు.

ఆచార వ్యవహారాలలో జ్ఞాని అయిన మరో విద్వాంసుడు ప్రశ్నించడం మొదలెట్టాడు– "ఆహార నియమాలను చెప్పగలవా నీవు?"

"ఆహారము భుజించే ముందు చేతులు పరిశుభ్రంగా కడుగుతూ అల్లా నామస్మరణ చేయాలి. ఎడమవేపుకు వంగినటుల కూర్చుని బొటనవేలు, తర్జని, మధ్య వేలితో మాత్రమే ఆహారాన్ని నోటికి అందించాలి. చిన్ని చిన్ని కబళములుగ తిని బాగా నమిలి మింగాలి. పక్కవారు భుజిస్తున్నపుడు వారివేపు చూడడం వలన వాళ్లకు ఇబ్బందిగా ఉండి వారి ఆకలి దెబ్బతింటుంది. అలా చూడకుండా జాగ్రత్త పడాలి".

అతడడిగాడు– "కొంత అంటే ఎంత, దానిలో సగమెంత, దానికన్నా తక్కువెంత?"

షఫక్ సమాధానమిచ్చింది– "కొంత అంటే విశ్వాసి. అతడు దేవుడి దృష్టిలో కొంతైనా విలువ గలిగినవాడు. ఆత్మవంచనాపరుడు కొంతలో సగం. తనను తాను మోసం చేసుకుని సైతానుకు లక్ష్యమవుతాడు. కొంతకన్నా తక్కువ అవిశ్వాసి. అతడు కరుణకు అనర్హుడు".

"విశ్వాసమనేది ఎక్కడ జనిస్తుంది?"

"విశ్వాసం నాలుగు స్థలాల్లో నివాసముంటుంది. హృదయం, మెదడు, నాలుక, శరీర అంగములు. హృదయపు బలం ఆనందంలోను; మెదడు శక్తి సత్య జ్ఞానంలోను, నాలుక ప్రజ్ఞ నిక్కచ్చితనం వలన, ఇతర దేహభాగాలు దైవానికి విధేయత చూపడంలోనూ ఉండి విశ్వాసాన్ని ప్రదర్శిస్తాయి"

"ఎన్ని రకాల హృదయాలుంటాయి?"

"హృదయాలు అనేక రకాలు. విశ్వాసి హృదయం స్వచ్ఛమైనది, ఆరోగ్యకరమైనది. అవిశ్వాసిది దానికి విరుద్ధం" అన్నది షఫక్.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 276వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

షఫక్ అనబడిన బానిస యువతి చెప్పసాగింది– "భౌతిక ప్రపంచానికి అతుక్కున్న హృదయం, ఆత్మానందపు హృదయం, ఉద్వేగాలను జయించినది,

ద్వేషంలో ఉన్నది, బలహీనమై నీరసపడినది, ప్రేమతో జ్వలించేది, గర్వంతో నిండినది, మహోన్నతుడైన ప్రవక్త సహచరుల హృదయాలు, ప్రవక్త హృదయం, ఎన్నిక చేయబడిన వారి హృదయం – ఇలా వేర్వేరు కాదా!"

విద్వాంసుడు ఒప్పుకున్నాడు. పోటీ మరల మొదలైంది. ఇప్పుడు షఫక్ వంతు. ఆమె అడిగింది– "అన్ని విద్యుక్త ధర్మాలకన్నా మొట్టమొదట ఆచరించాల్సిన ధర్మమేది?"

విద్వాంసుడు తనకు తెలియదని తలవంచుకున్నాడు. ఆమె సమాధానం చెప్పింది– పరిశుద్ధత అన్నిటికన్నా మేలైన ధర్మము. ప్రతిపనికి ముందు పరిశుభ్రతను పాటిస్తాము మనోవాచాకర్మణా. ప్రవక్త మాటలను, పవిత్ర గ్రంథములోని ప్రతి వాక్యమును పరిశుద్ధ భావములతో నిర్వహించుటయే అన్నిటికన్న మేలైన ధర్మము".

అప్పుడు అక్కడ ఉన్న విద్వాంసులలో ఖురాను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు. గౌరవనీయుడైన పండితుడడిగాడు– "అమ్మాయీ, నీకు పవిత్ర గ్రంథము గురించి తెలుసునన్నావు కదా, వివరించు!"

షఫక్ అన్నది– "పవిత్ర గ్రంథంలో అధ్యాయాలు 114; మక్కాలో చెప్పబడినవి 70, 44 మదీనాలో; అవి 621 భాగములుగా చేయబడినవి. 6236 వాక్యాలు; 79439 పదాలు, 323670 అక్షరాలు. 25 మంది ప్రవక్తల పేర్లు చెప్పబడినాయి– ఆదాము, నోవా, ఇస్మాయెలు, ఇసాకు, సాలిహ్, హుద్, షుయబ్, దావీదు, సోలొమాను, ధుల్‌కఫల్, ఇద్రిస్, ఎలియా, యాహ్యా, జకరియా, జాబ్, మూసా, ఆరన్, జీసస్, మహమ్మదు (అందరిపై ప్రార్థన, ఆశీస్సులు కురియును గాక).

పవిత్ర గ్రంథంలో వర్ణించబడిన తొమ్మిది మృగాలు లేక రెక్కల జంతువులు– దోమ, తేనెటీగ, ఈగ, హూపో, కాకి, మిడత, చీమ, బుల్‌బుల్, జీసస్ పక్షి అని పేరుగల గబ్బిలం".

పండితుడడిగాడు– "ఏ వాక్యాలు చెబుతాయి ప్రవక్త అవిశ్వాసులపై తీర్పు చెప్పడానిని?"

"యూదులంటారు క్రైస్తవులది తప్పని; క్రైస్తవులంటారు యూదులది తప్పని. ఇద్దరూ చెప్పేది సరైనదే ఈ విషయంలో"

"అమ్మాయీ, ఖురాను భువిపైకి ఎలా వచ్చింది? స్వర్గలోకాన ఫలకాలపై లిఖించబడినవి ఇప్పటి రూపునెలా సంతరించుకున్నది? ఎప్పుడు, ఎలా వచ్చిందో చెప్పగలవా?"

"విశ్వ నిర్మాత ఆజ్ఞతో జిబ్రిల్ దేవదూత మహమ్మదు ప్రవక్తకు ఒక్కోసారి కొద్దికొద్దిగా ఇచ్చినాడు. మొత్తం పూర్తవడానికి ఇరవై ఏళ్ల కాలం పట్టింది".

"ఆ భాగాలనన్నిటిని, జాగ్రత్తగా భద్రపరచిన ప్రవక్త సహచరులెవరు?"

"నలుగురు. ఉబయి ఇబిన్ కాబు; జెయిదు ఇబిను థాబితు; అబు ఉబెయిద ఇబిను అల్; జర్ర ఉధమను ఇబిన్ అఫను".

"ఖురాను పఠనా విధానాన్ని నిర్దేశించిందెవరు?"

"నలుగురు- అబ్దుల్లా ఇబిన్ మసూదు, ఉబయి ఇబిను కాబ్, మాధ్ ఇబిన్ జబాల్, సలీమ్ ఇబిన్ అబ్దుల్లా"

"ఏ సమయంలో దివినుంచి దిగివచ్చిందీ వాక్యం- 'విశ్వాసులారా, భౌతికానందాలను అనుభవించండి సంపూర్ణంగా భూమి మీద".

"విశ్వాసులు అన్నిటిని వర్జించి, వెండ్రుకల చొక్కాలు తొడుగుతూ ఉన్నపుడు" అన్నది షఫక్.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 277-278వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

పండితుడన్నాడు- "అద్భుతం. ఈమె పరీక్షలో నెగ్గినది".

షఫక్ అన్నది- "ఇప్పుడు తమరిని నేనొక ప్రశ్న అడుగవచ్చునా?"

ఖలీఫా సమ్మతి తెలపగా ఆమె అడిగింది- "పండితవర్యా! ఖురాన్‌లో ఏ భాగమందు కాఫ్ అక్షరం ఇరవైమూడు సార్లు, దేనిలో మిమ్ అక్షరం పదహారు సార్లు, దేనిలో అయిన్ నలభైసార్లు వస్తుంది"

అంతటి పండితుడు నోరెళ్లబెట్టి తల వంచుకున్నాడు. షషక్ తానే సమాధానం చెప్పింది అందరూ ఆశ్చర్యపడుతుండగా.

ఈసారి వైద్య శిఖామణి వంతు వచ్చింది– "అమ్మాయీ, ఆత్మ గురించి విశేషాలు, జ్ఞాన బోధనలు బాగా వివరించావు. సరే, మానవ దేహం గురించి నీకేమి తెలుసును?"

ఆమె జవాబిచ్చింది– "ఆదాము అనేమాట అదిము అనే అరబిక్ పదం నుంచి వచ్చింది. అదిము అంటే అవనిపై పొర. అవని ధూళి. అతడు దుమ్ము నుంచి చేయబడినాడు. అతడి శిరోభాగమును తూర్పు మట్టినుంచి, ఛాతీ 'కాబా' నేలనుంచి, పాదాలు పశ్చిమ భూమినుంచి చేసినాడు. ఏడు లోపలికిపోవు మార్గములు, రెండు బయటకు పోవు దారులు – రెండు కళ్లు, రెండు చెవులు, రెండు నాసికా రంధ్రాలు, నోరు – ఇవి లోనికి దారులు; బయటకు పోయేవి– కింద– ఒకటి పైన, మరొకటి దాని దిగువన.

నీరు, మట్టి, అగ్ని, వాయు మూలకాలతో ఆదామును సృష్టించగా– పైత్య గుణమున్నవారు అగ్నితత్వం; వణికే తత్త్వము – భూమిది; తడిగా ఉండేది జలతత్త్వము; అలల బుద్ధి వాయుతత్వం.

ఆ తరువాత అల్లా నిర్మాణం చేసినాడు మానవ దేహాన్ని – 360 నాళాలు; 240 ఎముకలు; మూడు సహజాతాలు – జీవిక, ప్రత్యుత్పత్తి, ఆకలి; శరీరంలో గుండె, ప్లీహము, కాలేయము, శ్వాసకోశాలు, ఆరు పేగులు, రెండు మూత్రపిండాలు, మెదడు, రెండు బీజాలు, ఒక మేహనము, చర్మము నమర్చినాడు. దానికి అయిదు జ్ఞానేంద్రియాలు, ఏడు ప్రాణాలనిచ్చినాడు. గుండెను ఎడమ వేపున, పొట్టను దానికి దిగువన, గుండెకు విసనకర్రలా ఊపిరితిత్తులను ఇరువేపుల ఉంచి పక్కటెముకల పెట్టెలో పెట్టినాడు. కపాలంలో 48 ఎముకలు, ఛాతీలో 24 ఎముకలు మగవానికి; 25 స్త్రీకి – ఆ అదనపు ఎముక తన పిల్లాడినెత్తుకున్నప్పుడు ఆలంబనగా పనికి వచ్చేట్లు చేసినాడు" అన్నదామె.

"వ్యాధి లక్షణాలేమిటి?"

"బాహ్యంగా కనిపించేవి, లోన ఉండేవి. అనుభవజ్ఞుడైన వైద్యుడు రోగి చేతిని స్పర్శించి– వేడి, తడి, గట్టిదనము, శీతలత్వాన్ని బట్టి రోగ నిదానము చేస్తాడు. కనులు పసుపుగా కనబడడం కాలేయ వ్యాధిని, నడుము వంగిన వారిలో శ్వాసకోశ రుగ్మత, వాంతి, నెప్పి, వాపు, విసర్జితాలు, మూత్రంలో వివిధ వ్యాధుల నిర్ధారణ చేయగలుగుతాడు".

"శిరో వేదనకు కారణాలు చెప్పగలవా?"

"ఆహారం – ఇంతకుముందు తిన్నది అరగక మునుపే మరల తినడం. అమితంగా తినడం అన్ని వ్యాధులకు కారణం. ఎక్కువ కాలం బతకాలనుకుంటే మిత భోజనం, ఉదయాననే లేవడం, రాత్రిళ్లు సరైన సమయానికి నిద్రపోవడం, స్త్రీ సాంగత్య పరిమితి, రక్త స్రావము నెక్కువమారులు చేయకపోవడం.

"పొట్టలో ఒకభాగం ఆహారం, ఒక భాగం నీరు, ఒక భాగం ఖాళీగా ఉండేట్లు తినవలెను. ఖాళీ మూడోవంతు ప్రాణానికి స్థానమవుతుంది. పద్దెనిమిది మూరలున్న పేవుకు ఇదే వర్తిస్తుంది".

"పచ్చకామెర్ల లక్షణాలేవిటి?"

"జ్వరం, నోటిలో చేదు, పసుపుగా కనులు, వళ్లు తిరగడం, వాంతులు, వేగవంతమైన నాడి, స్త్రీలపై ఇష్టం తగ్గడం. అటువంటప్పుడు అతడికి కడుపులో పుళ్లు, ఊపిరికుట్టు వ్యాధి, జలోదరం, వాపులు, విచారం, ఇవన్నీ కుష్టువ్యాధికో, పుట్టకురుపు వ్యాధికో దారితీస్తాయి".

"వైద్యంలో భాగాలెన్ని?"

"వ్యాధి, నివారణ"

"ఏది మంచి నీరు?"

"మట్టిపాత్రలోని నీరు, కాసిని సుగంధ మూలికలను వేసినది; భోజనం చేసినాకనే నీరు తాగాలి. ప్రవక్త చెప్పినాడు– 'వ్యాధులకు ఊయల జీర్ణాశయం, వ్యాధులకు కారణం మలబద్దకం. పరిశుభ్రత అన్ని వ్యాధులకు నివారణ"

"ఏవి మంచి మాంసాలు?"

"ఇంటిలో మహిళ వండేవి. థారిద్ అనే పేరున్న మాంసము, రొట్టె–పులుసు; ప్రవక్త అన్నాడు– 'ధారిదు గొప్ప వంటకము, ఆయేషా గొప్ప స్త్రీ"

"ఫలాలపై నీ అభిప్రాయం"

"ఫలాలు, మాంసం పుష్టికరమైన ఆహారాలు. అయితే ఋతువు దాటినాక ఫలాలను తినరాదు".

"ద్రాక్షరసము, మధువు గురించి వివరించు?"

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 279-280వ రాత్రి కథ ✳

**షహర్జాది కథ చెప్పసాగింది-**

మధువు గురించి చెప్పమన్నాడు వైద్య శిఖామణి.

షఫక్ అన్నది- "పవిత్ర గ్రంథంలో ఖచ్చితంగా పేర్కొనబడింది మధువు గురించి. దానికి కొన్ని మంచి గుణాలున్నా అది మనిషికున్న హేతువును, ఆలోచనా శక్తిని ధ్వంసం చేస్తుంది, దోషములను హెచ్చు చేస్తుంది. మధుపానము, జూదము నిషేధించబడినాయి".

"రక్తస్రావము గురించి నీ అభిప్రాయమేమిటి?"

"ఎక్కువ రక్తమున్నవారిలో మేఘాలు లేని రోజున గాలి, వాన లేనప్పుడు రక్తస్రావము చేయవచ్చు. శుక్రవారమయితే నెలలో అది పదిహేడవ తేదీన వస్తే అది శుభము నిస్తుంది. శిరోభారాన్ని కళ్ల బరువును తగ్గిస్తుంది. ఎక్కువ వేడిగాను, ఎక్కువ చల్లగాను ఉన్నపుడు రక్తమును తీయరాదు. ఉప్పువేసిన పదార్థాలు, పుల్లటివి తిన్నపుడు బుధవారం, శనివారం రక్తాన్ని తీయుట నిషేధించబడినది".

వైద్యుడడిగాడు- "సంభోగ క్రియ గురించి చెప్పగలవా?"

షఫక్ తలవంచుకున్నది. ఖలీఫా అనుకున్నాడు- ఈమె ఈ ప్రశ్నకు బదులివ్వలేదని. ఆమె అన్నది- "ప్రభూ, నాకు సమాధానం తెలుసు. అది నా నాలుక కొసన ఆడుచున్నది. కాని తమపై గౌరవంతో మాట్లాడకున్నాను".

ఖలీఫా అన్నాడు- "ఇది జ్ఞానపరీక్ష. నా అనుమతి నీకున్నది".

ఆమె చెప్పసాగింది- "సంభోగం అనేది సమభోగం. మగవాడిని స్త్రీని ఐక్యం చేసే అద్భుత క్రియ. శరీరాన్ని తేలికపరచి, దుఃఖాన్ని దూరం చేసి, ఆత్మకు ఆనందాన్ని, ఉద్వేగాన్ని సానబట్టి, ప్రేమను ఆకర్షించి, హృదయమును స్వస్థపరచి, విరహమును శాంతపరచి, సుఖనిద్రనిస్తుంది.

మగవాడు యుక్తవయసు కన్యలతో రతికేళి జరిపినప్పుడు అనేక లాభాలు పొందుతాడు. వృద్ధ మహిళతో పొందు అనర్థ హేతువు. కళ్లు, మూత్రపిండాలు దెబ్బతిని నడుము నెప్పి, తొడల నెప్పి కలిగిస్తుంది. శృంగార భాష తెలిసిన

యువతితో సంభోగము సంతోషాన్నిస్తుంది. కనులు, చేతులు, పాదముల కదలికలతో ఆమె తన గులాబి తోట సంరక్షణను చక్కగా తెలియజేస్తుంది.

సంభోగానంతర స్వేదం యువతికి చల్లదనాన్నివ్వగా, మగవాడి వీర్యము క్లిష్టదారులలో ప్రయాణిస్తుంది. మగవాడి 360 నాళాలలో తయారు చేయబడిన వీర్యము ఎడమ బీజములో చిక్కబడి తెల్లటి ద్రవమై తాటికల్లు పరిమళంతో ఉంటుంది.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## * 281-282వ రాత్రి కథ *

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

భిషక్కు అడిగాడు- “బాగా చెప్పావు. ఏది ఖైదులో ఉండి బయటకు వచ్చి గాలి పీల్చి మరణిస్తుంది? ఏవి ఆరోగ్యానికి మంచి ఫలాలు?”

షఫక్ అన్నది- “చేప - నీరు అనే ఖైదులో ఉండి బయట పడేయగా చనిపోతుంది.

నిమ్మ, నారింజలు, దానిమ్మలు ఆరోగ్యానిచ్చే పళ్లు”.

వైద్యుడి ప్రశ్నలు పూర్తయినాయి. ఇప్పుడు ఆమె వంతు. ఆమె అడిగింది- “ఆచార్యా! భూమిలా గుండ్రంగా ఉండి, కంటిలో నివాస ముంటుంది, కంటిగుండా పోతుంది. ఒక్కోసారి విడిపోతుంది, జననాంగము లేకుండానే సమభోగిస్తుంది. రాత్రి వేరౌతుంది, పగలు కావలించుకుంటుంది, అంచుల మీద ఎక్కువగా ఉండేది, ఏమిటది?”

సభికులందరూ ఆశ్చర్యపోయి ఏమిటా అని ఆలోచించసాగినారు ఖలీఫా, వైద్యుడితో సహా.

షఫక్ నవ్వింది- “చొక్కా బొత్తము (గుండీ), చొక్కా బొత్తము రంధ్రము”.

అందరూ గలగల నవ్వారు ఆ సమాధానం విని హర్షాతిరేకంతో.

ఈసారి ఖగోళ విద్వాంసుడి వంతు. అతడడిగాడు- “సూర్యుడెక్కడ ఉదయిస్తాడు, ఎక్కడస్తమిస్తాడు?”

ఆమె జవాబిచ్చింది– "తూర్పు నదులలో ఉదయించి పశ్చిమ నదులలో అస్తమిస్తాడు. మొత్తం నదులు 144. పగటి రాజు సూర్యుడు. రాత్రి రాణి చంద్రిక. దైవము తెలిపాడు– 'సూర్యుడికి జీవాన్ని, చంద్రుడికి ప్రకాశాన్ని ఇచ్చి ప్రజలు కాలగణన చేసేటందుకు వాటికి నిర్దిష్ట స్థానాలను, నడకలు ఏర్పరచబడినాయి. పగలు, రాత్రి, చీకటి వెలుగులు ఒకదానికొకటి అదనము కాని ఎప్పుడూ కలిసిపోవు".

"నక్షత్రాల గుణదోషాలేమిటి?"

"ఈ ఒక్క ప్రశ్న ఒకరోజు సమాధానికి అర్థమవుతుంది. సూర్యచంద్రులే కాక, బుధ, శుక్ర, కుజ, గురు, శని గ్రహాలున్నాయి. చల్లని వెన్నెలలు కురిపించే చంద్రిక ఇల్లు కర్కాటక రాశి, వృషభ రాశి భూమికి దగ్గరగా ఉన్నపుడు (Apogee); Descendant వృశ్చికరాశి దాని వ్యతిరిక్త స్థానం; భూమికి దగ్గరగా (Perigree) ఉన్నపుడు మకరరాశి;

శని గ్రహము (Saturn) శీతల, పొడి గ్రహము చెడుచూపు దానిది – మకర, కుంభరాశులు దాని ఇళ్లు, తులారాశి ఎగువ; మేషరాశి దిగువ; మకర, సింహ రాశులు వ్యతిరిక్త స్థానాలు.

గురు గ్రహము (Jupiter) - వేడి–తడి–మంచిది; గృహము మీనరాశి; ఎగువ కర్కాటకము; మిథునం–సింహరాశులు దిగువ; వ్యతిరిక్త స్థానం మకరరాశి.

శుక్ర గ్రహము (Venus) - మంచిది. ఇల్లు వృషభరాశి; ఎగువ మీనం; దిగువ మేషం–వృశ్చికం; తుల – వ్యతిరిక్త స్థానం;

బుధ గ్రహము (Mercury) - మంచీ–చెడు మిశ్రమం; ఇల్లు–మిథునం; ఎగవ–కన్య; దిగువ–వృషభం; వ్యతిరిక్త స్థానం – మీనరాశి.

కుజ గ్రహము (Mars) - కోప గ్రహము, వేడి–తడి; ఇల్లు–మేషం; ఎగువ– మకరం; దిగువ–తులారాశి; వ్యతిరిక్త స్థానం–కర్కాటకం".

ఆమె జ్ఞానానికి ఆశ్చర్యపోయిన ఖగోళ శాస్త్రజ్ఞుడు మరో గట్టి ప్రశ్న అడిగాడు– "ఈ నెలలో వర్షం కురుస్తుందా?"

ఆమె చాలాసేపు మౌనంగా ఉండడంతో అందరూ అనుకున్నారు ఆమె చెప్పలేకపోతున్నదని. ఆమె అన్నది– "ఖలీఫా ప్రత్యేక అనుమతితోనే నేను దీనికి జవాబిస్తాను".

ఖలీఫా అనుమతి ఇచ్చాడు.

ఆమె అన్నది– "ప్రభువు తమ ఖడ్గాన్నిస్తే ఈ అవిశ్వాసి తల నరికి వర్షం ఏ దిక్కున పడుతుందో చెబుతాను".

అందరూ నవ్వారు.

ఆమె అన్నది– "అయిదు విషయాలు ఆ దైవానికే తెలుసు. 1) ప్రాణం పోకడ, 2) వాన రాకడ, 3) తల్లి కడుపులోని శిశువు ఆడా–మగా అనేది, 4) రేపేమి జరగబోతోందో, 5) మరణ ప్రదేశం"

ఖగోళ శాస్త్రజ్ఞుడు నవ్వి అన్నాడు– "ఇది జ్ఞాన పరీక్ష. తారల ప్రభావం రోజులపై ఎలా ఉంటుందో చెప్పగలవా?"

ఆమె జవాబిచ్చింది– "ఆదివారం సూర్యుడిది. సంవత్సరం ఆదివారంతో మొదలైతే ఆ ఏడాది నియంతల పాలన, సుల్తానులు, రాజులు, స్థానిక అధికారులు ప్రజలను బాధిస్తారు. రాజ్యమంతటా కరువు కాటకాలు వస్తాయి. ధాన్యాలు, చిక్కుళ్లు దొరకవు. తీగెలెండిపోతాయి. యుద్ధాలు నిరంతరంగా జరుగుతాయి.

సోమవారంతో ఏడాది మొదలైతే అది చంద్రవారం కనుక – శుభప్రదం. సమృద్ధిగా వానలు కురిసి ద్రాక్ష, మొక్కజొన్నలకు కరువుండదు. అయితే మహమ్మారి, చీడపీడలధికం. పత్తిపంట పెరగదు. అవిసె కూడా దెబ్బతింటుంది.

మంగళవారంతో సంవత్సరం మొదలైతే అది అంగారకుడి ప్రభావంతో దేశంలోని గొప్పవాళ్లు, శక్తివంతుల మరణం సంభవిస్తుంది. ధరలు పెరుగుతాయి; వానలు తక్కువ; చేపలు సరిగా లభ్యం కావు. తేనె ఖరీదవుతుంది. చిక్కుళ్లు కారుచవుక. అవిసె వెల పెరుగుతుంది, బార్లీ బాగా పండుతుంది. యుద్ధాలతో రక్తం ఏరులై పారుతుంది. గాడిదలు రోగాల పాలవుతాయి.

బుధవారంతో ఏడాది మొదలైనపుడు– సముద్ర యుద్ధాలు, తుఫానులు, పిడుగుల వానలు ఎక్కువవుతాయి. ధాన్యాలు ఖరీదవుతాయి, కారట్లు ముల్లంగి గిరాకి పెరుగుతుంది. పిల్లల వ్యాధులెక్కువవుతాయి.

గురువారం నాడు సంవత్సరం మొదలైతే ప్రజలమధ్య మైత్రి, న్యాయపాలన, సాధారణ మానవులకు క్షేమం లభిస్తుంది. వానలు సకాలంలో కురిసి ధాన్యాలు, పళ్లు, అవిసె, పత్తి, తేనె, ద్రాక్షలు, చేపలు పుష్కలంగా లభిస్తాయి.

శుక్రవారం నాడు ఏడాది మొదలైతే- మంచి పొగమంచు, అందమైన వసంతం ఉండి ఎక్కువమంది పిల్లలు జన్మిస్తారు. దోస, పుచ్చకాయ, గుమ్మడి, టొమాటొలధిక దిగుబడినిస్తాయి.

శనివారం నాడు సంవత్సరం మొదలైతే దేవ భూలోకాలు దురాశతో నిండి కరువు కాటకాలు, యుద్ధాలు, వ్యాధులు వచ్చి ఈజిప్టు-సిరియా ప్రజలు అణచివేతలకు గురై ఆక్రందనలు చేస్తారు".

"చాలా బాగా చెప్పావు. సరే, గ్రహాలు అంతరిక్షంలో ఎక్కడ వేలాడు తున్నాయి?"

ఆమె అన్నది- "ఏడవ స్వరంలో శని, ఆరవ స్వర్గంలో గురు, అయిదవ స్వర్గంలో కుజ, నాల్గవ స్వర్గంలో సూర్యుడు, మూడవ స్వర్గంలో శుక్ర, రెండవ స్వర్గంలో బుధ, మొదటి స్వర్గంలో చంద్రిక స్థానాల నేర్పరచినాడు దైవం".

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 283-284వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ఖగోళ శాస్త్రజ్ఞుడు ఆశ్చర్యపోయినాడు. షఫక్ అన్నది- "విద్వాంసుడా! ఇప్పుడు నావంతు. మూడు రకాల తారలేవి?"

అతడు చాలాసేపు ఆలోచించి సమాధానం చెప్పలేక తలదించుకున్నాడు. షఫక్ తానే సమాధానమిచ్చింది- "తారలు మూడు రకాలు. కొన్ని స్థిర నక్షత్రాలు. ఉన్నచోటనే ఉండి కాంతిని భూమిపై స్థిరంగా కేంద్రీకరిస్తాయి; కొన్ని కనపడకుండా సముద్రంపై కాంతులనిస్తాయి; కొన్ని దైవపు వేళ్ల మధ్య కదులుతూ తోకచుక్కలై, ఉల్కలై తప్పుచేసిన భూత పిశాచాది వర్గాలను శిక్షిస్తాయి".

ఈసారి వేదాంతి ప్రశ్నలు వేయ ముందుకు వచ్చాడు.

"అవిశ్వాసమంటే ఏమిటి? అది పుట్టుకతో వస్తుందా?"

ఆమె జవాబిచ్చింది- "అవిశ్వాసమనేది, ఆదాము సంతతిలో రక్తనాళాల్లో రక్తం ప్రవహించినట్లు ప్రవహిస్తుంది. అందుకే వాళ్లు భూమిని, భూమి ఇచ్చే

ఫలాలను, కాలపు శక్తిని నిర్లక్ష్యం చేస్తారు. కాలానికి, భూ ప్రపంచానికి విరుద్ధమైన పనులు చేయడం అత్యంత శిక్షార్హమైన నేరం. ఎందుకంటే కాలమే దేవుడు. ప్రపంచాన్ని సృష్టించింది దేవుడు”

“అల్లా సృజించిన అయిదు జీవులేమిటో తెలుసా? అవి ముందు తిని తర్వాతనే మూత్ర అశుద్ధములను విసర్జించునవి?”

ఆ యువతి జవాబిచ్చింది– “ఆదాము, సిమియను, సాలిహ్ ఒంటె, ఇస్మాయెల్ గొర్రె, గుహలో అబుబకర్ చూసిన పక్షి – ఆ అయిదుగురు”.

“స్వర్గంలో ఉండే అయిదు జీవులేమిటి– మానవుడు, జిన్ను భూతాలు, దేవదూతలు కాక!”

“జాకబ్ తోడేలు, నిద్రపోతున్న ఏడుగురి కుక్క, ఎస్ద్రాసు గాడిద, సాలిహ్ ఒంటె, ధుల్కల్–కంచరగాడిద ప్రవక్త వాహనం”.

“భూమి మీద స్వర్గంలోను లేనప్పుడు దైవప్రార్థన చేసిన వ్యక్తి ఎవరు?”

“సులేమాన్ – ఎగిరే తివాచీ మీద ఉన్నపుడు”

“ఒక వ్యక్తి బానిసను ఉదయం చూసినపుడు తప్పుగా, మధ్యాహ్నం ఒప్పుగా, ఆ తరువాత తప్పుగా సూర్యాస్తమయంలో ఒప్పుగా, రాత్రి తప్పుగా, మరల ఉదయాన ఒప్పుగా – ఉండే పరిస్థితి ఎప్పుడు వస్తుంది?”

“తనది కాని బానిసను ఉదయాన కోరికతో చూస్తే తప్పు; మధ్యాహ్నం కొనేప్పుడు చూడడం ఒప్పు, ఆ తరువాత ఆమెకు స్వేచ్ఛనిచ్చినపుడు చూస్తే అది తప్పు, సూర్యాస్తమయ సమయంలో వివాహమాడినాక చూస్తే అది ఒప్పు; రాత్రి విడాకులిచ్చినాక చూస్తే అది తప్పు, ఉదయాన మరల వివాహం చేసుకుని చూస్తే అది ఒప్పు”.

“ఏ సమాధి తనలోని దేహంతో సహా కదిలింది?”

“జోనాను మింగిన తిమింగలం”

“ఏ లోయపై సూర్యుడొకే ఒక్కసారి కాంతులీనగా, మరల పునరుజ్జీవనం వరకు అక్కడ ఎండ పడదు?”

“ఎర్ర సముద్రపు నీళ్లలో మూసా ఏర్పరచిన దారి”

“భూమిపై తొలి ‘స్కర్ట్’ అంగీ ఏది?”

“ఇస్మాయెల్ తల్లి హగార్ ధరించిన అంగీ, ఆమె సారా కన్న ముందు నేలను తుడిచింది”

“ఏది గాలి పీల్చుకుంటుంది కాని ప్రాణము లేనిది?”

“ఉదయం- పవిత్ర గ్రంథములో వ్రాయబడినది”.

“ఈ సమస్యను పరిష్కరించు- పావురాల గుంపు చెట్టుపై వాలింది. పైకొమ్మలపై కొన్ని, కింది కొమ్మలపై కొన్ని వాలాయి. పైనున్న పావురం అంది- మీలో ఒకరు పైకివస్తే మీకు రెండింతలు, మాలో ఒక్కరు కిందకు వస్తే సమానము అవుతాము - మొత్తం ఎన్ని పావురాలు?”

“పైన ఏడు, కింద అయిదు - మొత్తం పన్నెండు” అన్నదామె.

వేదాంతి తన ఓటమినంగీకరించాక ఆ కాలంలో ప్రసిద్ధికెక్కిన జ్ఞాని ఇబ్రహిం ఇబిన్ సియ్యర్ ప్రశ్నలడగడానికి ముందుకు వచ్చాడు. అందరూ ఉత్కంఠతతో వింటున్నారు. అతడా మహాజ్ఞాని. ఈమె చిన్నపిల్ల.

అతడు అడిగాడు- “ఆదాము సృష్టికన్నా ముందు దైవం చేసినవేమిటి?”

“నీరు, నేల, వెలుగు, చీకటి, అగ్ని”.

“సృష్టిలో సృజన అంతా దైవేచ్ఛతో జరిగింది. కాని, దేవుడే స్వయంగా తన చేతుల్తో చేసినవేమిటి?”

“దైవ సింహాసనము, స్వర్గలోకపు వృక్షాలు, ఈడెను తోట, ఆదాము”.

“ఇస్లాములో నీకు తండ్రి ఎవరు? ఆయనకు తండ్రి ఎవరు?”

“నా తండ్రి ప్రవక్త (ప్రార్థనలు, ఆశీస్సులు నిరంతరం అతడిపై కురియును గాక). నా తండ్రికి తండ్రి దేవుని స్నేహితుడైన అబ్రహాము”.

“ఇస్లాము విశ్వాస భావనలో ఉండేదేమిటి?”

“విశ్వాస ప్రకటన - అల్లాయే దేవుడు. మహమ్మదు ఆతడి ప్రవక్త”

“ఏది కొయ్యతో మొదలై జీవంతో ముగుస్తుంది?”

"మూసా ప్రవక్త చేతికర్ర – అవసరాన్ని బట్టి రూపాలు మారుస్తుంది. పళ్లచెట్టుగా, నీడనిచ్చే చెట్టుగా, రాత్రిపూట మందలను కాచే పెద్దకుక్కగా – మారుతుందా కొయ్యకర్ర".

"తల్లి లేకుండా పుట్టినదెవరు? తండ్రి లేకుండా పుట్టినదెవరు?"

"ఆదాము, ఈశా"

"రకరకాల అగ్నుల గురించి వివరించు"

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 285-286వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

షఫక్ సమాధానమిచ్చింది– "భూమిపై అగ్ని తింటుంది కాని తాగదు, నరకాగ్ని తింటుంది, తాగుతుంది; సూర్యుడి అగ్ని తాగుతుంది కాని తినదు; చంద్రుడి అగ్ని తినదు తాగదు".

"నేను తాగితే నా పెదాలు గలగలా కదుల్తాయి. నేను నడుస్తాను, నిశ్శబ్దంగా మాట్లాడతాను, నాకే కానుకలూ ఇవ్వరు, నేను చనిపోతే ఎవరూ పట్టించుకోరు, నేనెవరిని?"

"కలం"

"నేను పక్షిని కాని, నాకు మాంసం, రక్తం, ఈకలు లేవు. నన్ను ఉడకబెట్టి, కాల్చి, లేక ఉన్నదున్నట్లు తినవచ్చు. నేను చావలేదు, బతకాలేదు, నా రంగు వెండి బంగారం – నేనెవరిని?"

"అందరికీ తెలిసిన 'గుడ్డు"

మూసా ప్రవక్తతో అల్లా చెప్పిన పదాలెన్ని?"

"పదిహేను వందల పదిహేను"

"సృష్టికి మూలమేది?"

"దైవం ఆదామును మట్టినుంచి, మట్టిని నురగ నుంచి, నురగను సముద్రము నుంచి, సముద్రాన్ని చీకటి నుంచి, చీకటిని వెలుగు నుంచి, వెలుగును చేప నుంచి, చేపను కెంపు నుంచి, కెంపును శిల నుంచి, శిలను జలము నుంచి, జలమును – ఇచ్చట జలముండు గాక! అన్నాడు జలము జన్మించింది".

"నాకు నోరులేదు, పొట్టలేదు. అయినా తింటాను, చెట్లు జంతువులు అన్నిటిని ఆరగిస్తాను, కాని నీళ్లు తాగితే చచ్చిపోతాను, నేనెవరిని?"

"అగ్ని"

"ఇద్దరు స్నేహితులున్నారు పక్కపక్కనే ఉంటారు కాని పలకరించుకోరు. తెల్లవారే విడిపోతారు. ఎవరు వారు?"

"ద్వారపు తలుపులు"

"నాకు పెద్ద తోక, నాకు కన్నుంది కాని చూడలేను, నేను బట్టలు తయారు చేస్తాను కాని వేసుకోను".

"సూది"

"సిరాత్ వంతెన పొడుగు వెడల్పులెంత?"

"పునరుజ్జీవనం తరువాత మనుషులంతా నడవాల్సిన వంతెన మూడువేల సంవత్సరాల పొడవు; ఎక్కడానికి వెయ్యేళ్లు, నడవడానికి వెయ్యేళ్లు, దిగడానికి వెయ్యేళ్లు పడుతుంది. అది కత్తికంటె పదును, వెంట్రుక కన్నా సన్నం. ఆ సిరాత్ వంతెన"

"ఎన్నిసార్లు ప్రవక్త విశ్వాసి కోసం స్వయంగా సమర్థించాడు?"

"మూడుసార్లు"

"ఇస్లాము మతాన్ని తొలుదొల్త స్వీకరించిందెవరు?"

"అబు బకర్"

"అబు బకర్‌కన్నా ఆలి ముందు ముస్లిము అని నీవు నమ్మవా?"

"ఆలి విగ్రహారాధకుడు కాదు. అతడికి ఏడేళ్ల వయసులోనే మహమ్మదు అతడిలో జ్ఞానకాంతిని వెలిగించినాడు"

"ఆలి, అబ్బాస్‌లలో ఎవరు గొప్పవారు?"

షఫక్‌కు అర్థమయ్యింది– పండితుడు తనను ఇరుకులోకి నెడుతున్నాడని. ఆలి గొప్పవాడంటే అబ్బాస్ వంశస్థుడైన ఖలీఫాకు కోపం వస్తుంది. అబ్బాస్ గొప్పవాడంటే ఆలిని తక్కువచేయడం అనుకుని "ఇద్దరూ సంపూర్ణ విశ్వాసులు" అన్నదామె.

"సన్నగా అందంగా, తియ్యగా, బల్లెంలా ఉండినా, పదునులేనిది, రమాదాన్ రోజున అందరికీ నచ్చేదేది?"

"చెరకు"

"ఇప్పుడు ప్రశ్నలడుగుతాను - త్వరగా సంక్షిప్తంగా జవాబులుండాలి"

| | |
|---|---|
| తేనెకన్నా తియ్యనిది | - పిల్లల ప్రేమ |
| కత్తికన్నా పదునైనది | - నాలుక |
| విషం కన్నా వేగమైనది | - చెడు చూపు |
| క్షణకాలపు ఆనందమేది | - ప్రేమ సుఖం |
| మూడురోజుల అదృష్టం | - స్త్రీ బయట ఉండే రోజులు మూడు |
| సంతోషకరమైన రోజు | - చవుక బేరం |
| వారపు ఆనందం | - వివాహపు ఏడురోజులు |
| ఎవరైనా చెల్లించాల్సిన ఋణం | - మరణం |
| సమాధికి వెంటవచ్చే దుఃఖం | - పిల్లల క్రూరత్వం |
| హృదయానందం | - భార్య విధేయత |
| ఆత్మ దుఃఖం | - దుష్టుడైన సేవకుడు |
| జీవితపు ఒంటరితనం | - దారిద్ర్యం |
| వైద్యం లేని వ్యాధి | - చెడు ప్రవర్తన |
| చెరపలేని అవమానం | - కుమార్తె వలన పరువు పోవడం |
| ఏడు మృగాలు కలిసిన జంతువు | - మిడత |

(మిడతకు గుర్రం ముఖం, ఎద్దు మెడ, గద్ద రెక్కలు, ఒంటె కాళ్లు, పాము తోక, తేలు పొట్ట, గజెల్లి జింక కొమ్ములుంటాయి.)

అంతటి పేరున్న పండితుడు ఆమెను ఆశీర్వదించాడు. ఆమె అన్నది- "ఇది కేవలం పోటీయే! మీరందరూ నాకు గురు సమానులు" అని తనను పరీక్షించిన వారికి తలవంచి నమస్కరించింది.

ఖలీఫా ఆనందపడినాడు- "నీకు సంగీత సాహిత్యాలలో ప్రవేశమున్నదా" అని అడిగాడు.

ఆమె తల వూపింది వచ్చునని.

ప్రభువు అనుమతితో వీణ వంటి తంత్రీ వాద్యము ఎర్రటి శాటిన్, కాషాయపు వస్త్రాలలో భద్రపరచబడి స్వర్ణపు కొక్కెము పట్టుకోవడానికి వీలుగా ఉన్న సితారను తెచ్చి ఆమె ముందుంచినారు.

***"నేనొక ఆకుపచ్చ శాఖను***
***పక్షులు నాకు నేర్పాయి పాటను***
***వాయువీచికలు సవరించె శ్రుతులను***
***పూల పరిమళాలు పెంపు చేసె లయను***
***పక్షులు నాకు నేర్పాయి వనపు పాటను***
***నేనొక ఆకుపచ్చ శాఖను"***

ఆమె ఆ చరణాలను పన్నెండు రాగాలలో పాడగా అందరూ తన్మయులైనారు. కరతాళ ధ్వనులతో సభ మారుమోగింది.

ఖలీఫా లేచి నిలబడి అన్నాడు– "నీ వినయం, పెద్దల యెడ నీ ప్రవర్తన, నీ అపూర్వ జ్ఞానం, నీ దైవభక్తి, ఇవన్నీ నన్ను ఆశ్చర్యం, ఆనందంతో నింపివేసాయి.

ఇవి నీకు ఇస్తామన్న పదివేల దీనారాలు. నీవు మా అంతఃపురంలో సకల వైభోగాలతో ఉండవచ్చు. లేదా, ఈ యువకుడితో వెళ్లిపోవచ్చు. నీవిప్పుడు బానిసవు కావు స్వేచ్ఛామూర్తివి. ఈ పదివేల దీనారాలు ఖలీఫానైన నేను నీకిచ్చు కానుక".

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## ✻ 287వ రాత్రి కథ ✻

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

ప్రభువు చేతుల మధ్య ఉన్న నేలను ముద్దాడి షఫక్ అన్నది– "ప్రభూ! తమరి చల్లని పాలన శాశ్వతమగును గాక! ఆ కరుణామయుడు తమరిపై ఎల్లలు లేని ఆశీస్సులు కురిపించును గాక! తమరు అనుమతిస్తే నేను ఈ యువకుడి వెంట వెళ్లిపోతాను".

ఖలీఫా అన్నాడు– "అమ్మాయీ, నీపై నాకెందుకో పుత్రికావాత్సల్య మేర్పడింది. ఇవిగో మరో అయిదువేల దీనారాలనిస్తున్నాను. నీకు శుభమగును గాక!"

"ఖలీఫా కరుణతో అబు అల్–హసన్‌కు రాజోద్యోగం లభించింది. అబు అల్–హసన్ – షఫక్‌ల వివాహం వైభవంగా జరిగింది. ఆ దంపతులకు ఖలీఫాతో విందునారగించే అదృష్టం, ఆదరణ లభించాయి. అందరూ అబ్బాస్ వంశాన్ని, ఖలీఫా హరున్ అల్ రషీద్ దాతృత్వాన్ని వేనోళ్ల పొగిడారు.

షహర్జాది అన్నది– "ప్రభూ ఇప్పుడు నేను చెప్పబోయేది కవి అబు నువాస్ సాహస కృత్యాల కథ. బహు మనోరంజకంగా ఉంటుంది".

"ఏమిటా కథ చెప్పు సోదరీ!" అన్నది దున్యాజాది.

షారియార్ ప్రభువు సావధానచిత్తుడై వింటున్నాడు.

# VII. కవి అబు నువాస్ సాహసగాథ

ఆ రోజున ఖలీఫా హరూన్ అల్ రషీదుకు ఎందుకో మనసులో అలజడిగా ఉండి రాజభవనం దాటి ఉద్యానవనంలో పచార్లు చేస్తూ తోటలోని చిన్న విశ్రాంతి మందిరం తలుపు తీసి ఉండడాన్ని గమనించి అక్కడ కాపలా ఉన్న భటుడు నిద్రపోతుండగా అతడిని దాటి లోపలికి వెళ్లాడు. ఆ గదిలోపల ఓ మంచము దాని పక్కనే బల్లపైన ద్రాక్షసారా పాత్ర, గ్లాసు ఉన్నాయి.

ఆ పక్కనే ఓ అందాల బానిస స్త్రీ గాఢనిద్రలో ఉన్నది. ఆమె శరీరంపై పలుచటి వస్త్రం, ఆమెపై అర్థభాగాన్ని కప్పుతున్న పొడుగాటి కురులు ఆమె ముగ్ధ మనోహరంగా కానవచ్చింది. ఖలీఫాకు అర్థం కాలేదు ఎవరు తన అనుమతి లేకుండా తన తోటలోని విశ్రాంతి మందిరాన్ని విలాసమందిరంగా వాడుతున్నారో.

శాంతచిత్తుడైన అతడు చప్పుడు చేయకుండా పాత్రలోని మధువును గ్లాసులో పోసుకుని తాగి సంతృప్తుడై గులాబీలు పూచినట్లున్న ఆమె చెక్కిళ్లపై మరింత సుందరంగా కానవస్తున్న పుట్టుమచ్చపై చిన్న ముద్దునిచ్చాడు.

ఆ స్పర్శా మాత్రానికే ఆమె ఉలికిపడి లేచి ఖలీఫాను గుర్తుపట్టి లేచి తన దేహాన్ని వస్త్రాలతో కప్పుకున్నది. ఖలీఫా అన్నాడు– "యువతీ, కంగారుపడకు.

నీకు సంగీత సాహిత్యాలతో ప్రవేశమున్నట్లయితే ఆ వీణాతంత్రులను కదిలించి, పాట పాడి మమ్మల్ని ఆనందింపజేయగలవు”.

ఆమె వీణనందుకని 24 రాగాల నాలపించగా ఖలీఫా సంతోషపడి ఆమె గురించి వివరించమన్నాడు. ఆమె విచారంగా పలికింది– “ప్రభూ! నేను విధి కొడుతున్న దెబ్బలకు వివశురాలినైనాను. తమ కుమారుడు అల్–అమీన్ నన్ను పదివేల దీనారాలకు కొని తమకు బహుమతిగా ఇవ్వాలనుకున్నపుడు మహారాణి జుబేదా నన్ను ఈ భవనంలో నిర్బంధించి నపుంసక బానిస కాపలాలో ఉంచి, పదివేల దీనారాలను తమ కుమారుడికిచ్చి పంపివేసింది. గత రెండురోజులుగా నేనీ మందిరంలో బందీనై ఉన్నాను”.

ఖలీఫా ఆమెకు న్యాయం చేస్తానని పలికి బయట గుర్రుపెట్టి నిద్రపోతున్న బానిసను లేపి వెళ్లి అబునువాస్ కవిని తీసుకురమ్మని పంపినాడు.

అబునువాస్ ఆ సమయంలో చెడ్డ పేరున్న మధుశాలలో కాలక్షేపం చేస్తుండగా చూసిన బానిస, ఖలీఫా వెంటనే రమ్మన్నాడన్న వార్త నందించాడు.

అబునువాస్ అన్నాడు– “ఇక్కడ నాకో అందమైన యువకుడు కనిపించాడు. అతడితో వేయి దీరాములకు ఒప్పందం కుదుర్చుకున్నాను”.

బానిస అన్నాడు– “నీవనేది నిజమైతే అతడిని చూపించు. లేకుంటే, ఖలీఫా వద్దకు వెళ్లి నీవు ఆజ్ఞ ధిక్కరించావన్నది చెబుతాను”

ఇంతలో ఓ అందమైన యువకుడు మధుపాత్రతో ప్రత్యక్షమైనాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 288వ రాత్రి కథ ✳

***షహర్జాది కథ చెప్పసాగింది–***

ఆ యువకుడు చాలా అందగాడు. దానికి తోడు పైన తెలుపు, ఎరుపు, నలుపు రంగుల దుస్తులు ఒకదానిపై ఒకటి వేసుకున్నాడు.

***పూలకొమ్మ అందంగా ఊగుతున్నది***
***కొమ్మ అందంగా ఉన్నదా, వాలిన పక్షులందమైనవా***
***పూలు, కొమ్మ, పక్షులకన్నా వాటి పాటలింకా మధురమైనవి.***

అవునన్నాడు ఆ నల్లబానిస– "నీ దగ్గర డబ్బులేనప్పుడు నీవేం చేస్తావు? వెయ్యి దీరాములిచ్చే దాత ఎవరు?"

మధువందిస్తున్న ఆ యువకుడిని చూడగానే కవి అబు నువాస్ కవిత్వ జలధార ఉప్పొంగింది.

***"పాలతెలుపు వస్త్రము పాము కుబుసము***
***నీలికనుల వదనము నీటైన వేషము***
***మరుమల్లెలు మొల్లలు మంచు తెలుపు***
***పట్టు మెత్తని చేతిని పట్టుకొని చూడుము"***

ఆ పాటవిన్న యువకుడు తన తెల్లటి అంగీని తీసి పక్కనే పడవేసాడు. ఎరుపు అంగీ గొప్పగా మెరుస్తున్నది–

***"ఎర్ర ఎర్ర పూలు ఎన్నిరూపాలు***
***ఎదను పగలగొట్టు ఎన్నో విధాలు***
***చూడు హృదయరక్తము చెక్కిళ్లపైన***
***సాయంసంధ్య కాంతి శోభించినట్లు"***

ఈసారి ఆ యువకుడు ఎర్ర అంగీ తీసివేసి, నీలి దుస్తులలో నిలబడినాడు–

***"నింగి నీలము రాత్రి నలుపు కలిసిపోయి***
***చందమామ రాగానే చలువ పందిరివేసి***
***నేలనంతను నీలి జలధిగ జేయ***
***మబ్బుతెర లింకొద్దు మాదు హితుడ"***

పాటలలోని భావము, ఆ యువకుడి అందము చూసిన నల్లబానిస అబు నువాస్‌ను అభినందించి, తన దారిన తాను ఖలీఫా వద్దకు వెళ్లి అబునువాస్ ఉన్న పరిస్థితి వివరించాడు.

ఖలీఫా నవ్వుకుని వేయి దీరాములిచ్చి బానిసను మరల అబు నువాస్ ఉన్న చోటుకు పంపినాడు. యువకుడి కివ్వాల్సిన పైకాన్నిచ్చి అబునువాస్, మద్యం మత్తులో తూలుకుంటూ బానిస ననుసరించి ఖలీఫా వద్దకు చేరుకున్నాడు.

ఖలీఫా అతడిని మందలించి, తనతోపాటు అబునువాస్‌ను ఆ యువతి ఉన్న మందిరానికి తీసుకువెళ్లాడు. అక్కడ నీలిదుస్తులలో ఉన్న యువతిని చూసి కవి అన్నాడు–

*"ఓ నీలితెరా నీకు అభివాదములు*
*అయినా మల్లెపూవునెందుకు మరుగుపరచేవు?*
*నీమీద నాకు కోపము నిండా పెరిగేను*
*అయినా నేను చూడలేనా నా మనోనేత్రాన!"*

అంటూ అబునువాస్ మధుపాత్ర కోసం వెదుకుతుంటే, ఆమె ఖలీఫాకు అందించింది నిండుగా మధుపాత్రికను. ఖలీఫా నెమ్మదిగా మధువును సేవిస్తుంటే అబు నువాస్ మధుపాత్రను తీసుకుని మొత్తం ఒక్కగుక్కలో తాగేసాడు. ఖలీఫా ఆగ్రహంతో కత్తిదూసి అబునువాస్ మెడమీద నరకబోయినట్లు నటించగా అతడు ప్రాణభయంతో పారిపోతూ ప్రభూ రక్షించు, రక్షించు అని కేకలు పెట్టసాగినాడు. ఖలీఫా అతడి వెంటబడి ఓ మూల కూర్చుని వణుకుతున్న కవిని బెదిరించి మరల ఆ యువతి దగ్గరకు లాక్కువచ్చాడు. అబు నువాస్ అన్నాడు-

*"ఒకవేపు మెరుపుతీగ మరోవేపు మరణభయము*
*తాగిన మధువెటుపోయెనో తెలియదు చూడుము*
*ఓ నీలి దుస్తుల నెరజాణా నిలువరించు ప్రభువును*
*మధువు నిషా తగ్గకమునుపే మరల మధుపాత్ర నిమ్ము!"*

ఖలీఫా అన్నాడు నవ్వుతూ- "నీ వెధవ పనికి సరైన హోదా ఇవ్వాల్సిందే! బాగ్దాద్ నగరంలోని తార్పుడుగాళ్లందరికీ నాయకుడిగా నియమిస్తున్నా నిన్ను".

క్షణం ఆలోచించకుండా అబునువాస్ అన్నాడు- "తమరికెటువంటి తరుణి కావాలో తెలపండి ప్రభూ! ఈ తార్పుడుగాడు వెంటనే తెచ్చిపెడతాడు''

ఖలీఫా వెంటనే బానిసను పిల్చి తన అంగరక్షకుడు మస్రూర్‌ను తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 289-290వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

మస్రూర్ రాగానే ఖలీఫా ఆజ్ఞాపించాడు- "ఈ మూర్ఖుడి బట్టలు విప్పి కొరత వేయించు. తాగిన మత్తులో అన్నీ తప్పుడు పనులు, తప్పుడు మాటలు

మాట్లాడుతున్నాడు. గాడిద మీద కూర్చోబెట్టి మెడలో పలకమీద– 'బాగ్దాద్ నగరపు తార్పుడుగాళ్ల నాయకుడు' అని వ్రాసి రాచమందిరాల్లో తిప్పి ఆ తరువాత కొరతవేసి, తల నరుకు. నా ఆజ్ఞనే ధిక్కరిస్తున్నాడు. రమ్మంటే ఎవరో యువకుడు కనిపించాడు వాడికి వెయ్యి దీరాములంటూ వేషాలు వేసాడు".

పాపం, కవికి దురదృష్టం మీద పడింది. అతడిని నగ్నంగా గాడిదపై కూర్చోబెట్టి మెడలో పలక, దానిపై 'బాగ్దాద్ నగర తార్పుడుగాళ్ల నాయకుడు' అన్న మాటలు, 365 రాజభవనాలు తిప్పుతుంటే అతడంటే గౌరవం జాలి ఉన్నవాళ్లు నగలు నాణెములు విసుర్తున్నారు. కొందరు అతడికి ధైర్యంగా చెప్పారు. ఈలోగా అది ఊరేగింపులా తయారై వజీరు జాఫర్ అల్–బర్మాకి ఇంటిముందుకు వచ్చింది. జాఫర్‌కు, మస్రూర్‌కు అబునువాస్ అంటే ఇష్టం. ఎన్నోసార్లు అందరూ ఖలీఫాతో నగర సంచారము చేసినవాళ్లే. ఖలీఫా కోపం తగ్గేవరకు అతడినెలాగోలా రక్షించాలనుకున్నారు.

వజీరు అడిగాడు– "ఏమయ్యింది అబునువాస్? ఏం నేరం చేసావు?"

అబునువాస్ అన్నాడు– "కొన్ని కవితలు చదివాను. అందుకే ప్రభువు నాకీ సన్మానం చేసాడు. తన స్వంత దుస్తుల్ని నాకు తొడిగి గౌరవించాడు".

ఖలీఫాకు అబునువాస్‌ను చంపాలన్న ఉద్దేశం లేదు. తెరవెనుక ఉండి అంతా చూస్తూనే ఉన్నాడు.

వజీరు అన్నాడు– "నీ వంటిమీద బట్టలే లేవుగా!"

అబునువాస్ అన్నాడు– "పుట్టినపుడు లేనివాటికోసం పోయేటప్పుడు ఎందుకు తాపత్రయం"

అతడి మాటలలోని అంతరార్థం గ్రహించి ఖలీఫా అతడిని క్షమించి, కవికి ఉచితమైన దుస్తులు, కానుకలిచ్చి గౌరవించినాడు.

***షహర్జాది కథ ముగించగా షారియార్ అన్నాడు- "నాకు ప్రయాణ కథలు వినాలన్న కోరిక ఉన్నది. నేను నా సోదరుడు ఎన్నో దేశాలు తిరిగాము మా చిన్నప్పుడు".***

***షహర్జాది అన్నది- "ప్రభూ ఇప్పుడు నేను చెప్పబోయేవి సింద్‌బాదు అనే నావికుడి సాహస యాత్రలు. సావధానులై వినండి. అటువంటి అద్భుత యాత్రలు ఎవరూ చేయలేరు. అవి న భూతో న భవిష్యతి"***

# VIII. సింద్‌బాద్ కథ

హరూన్ అల్-రషీదు బాగ్దాద్ ఖలీఫాగా ఉన్న రోజుల్లో సిందుబాదు అనే హమాలీ నిరుపేద జీవనం కోసం బరువులు మోయగా వచ్చే కూలీ డబ్బుతో కాలం గడుపుతూ ఉండేవాడు.

ఒకరోజు పెద్ద బరువున్న మూట మోసుకువస్తూ వళ్లంతా చెమటలు పట్టగా కాస్త విశ్రాంతి తీసుకుందామని రాజభవనంలా కనిపిస్తున్న ఇంటి అరుగు మీద సామాను దించి 'హమ్మయ్య' అని నిట్టూర్చినాడు. అక్కడ అంతా గులాబి నీళ్ల పరిమళాలు. చెట్లనుండి వీస్తున్న చల్లని గాలులకు సింద్‌బాదు హమాలి బడలిక తగ్గిపోయి కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ ఇంటి లోపలి నుంచి మధురమైన వేణు వీణా నాదాలు, అద్భుత గానాలు వినవచ్చాయి. ఆ ఇంటి ఆవరణలోని తోటలోని చెట్లపై ఉన్న పావురాల కువకువలు, బుల్‌బుల్, కోయిల కుహుకుహులు, పెంపుడు పక్షుల దైవప్రార్థనలు మరింత ఆహ్లాదాన్నివ్వగా ఆ హమాలి అరుగుపై అలా కూర్చుండిపోయాడు. ఇంతలో గాలికి తలుపు తెరుచుకోగా లోపల అందాలు విరజిమ్ముతున్న పూలమొక్కలు, ఫల వృక్షాల మధ్య అనేకమంది అతిథులు, వారికి కావాల్సినవి అందిస్తూ సేవకులు, అక్కడంతా సందడి సందడిగా కానవచ్చింది.

దానికి తోడు పసందైన వంటకాల ఘుమఘుమలు తాజా మధువు పరిమళాలు అతడి నాసికా పుటాలకు తగిలి మనసు చలించగా, కడుపులో ఆకలి మంటలు జ్వలించగా తన దుస్థితి తలుచుకుని అతడు– "సృష్టికర్తా! ప్రణామాలు! మహా మహిమాన్వితుడివి, కాని ఈ వల పక్షమేల! నా యజమానివి నిన్ను అడగలేక అడుగుతున్నాను. నీవు సృజించిన వారమే కదా మేమంతా! నేను కారణమడగడం లేదు మాలో ఉన్నత అధమ స్థాయిల గురించి.

నాకు, ఈ అద్భుత గృహానికి మధ్య గోడ ఉన్నది. నాకు ఈ ఇంటి యజమానికి మధ్య అంతస్తుల తేడా ఉన్నది. ఎందుకీ పక్షపాతం. నేను చేసిన పాపమేమిటి, అతడు చేసిన పుణ్యమేమిటి?

*నేను చూసాను దినదినము ధనవంతుల*
*సంపదలు మరింత ఎక్కువవడాన్ని*
*నేను చూసాను చిన్న వయసులోనే*
*నా నడుము వంగి పోవడానిని*

*నేను చూసాను నిరుపేదలు నిద్రపోవడం*
*రోజల్లా శ్రమించి రాజభవనపు నీడలో*
*నేను చూసాను ఎందరో దేవుని*
*ప్రార్థించడం తమకు సంపదలిమ్మని*

*నాకేమీ అటువంటి ఆశలులేవు*
*కాని నా మనసు మొండిది కదా*
*దేహానికి తెలుసు ఏది వాస్తవమో*
*కలలుగనే మనసుకు కనబడేది మాయ"*

హమాలి సింద్‌బాదు ఆర్ద్రంగా పాడిన పాటకు అక్కడ కాసేపు నిశ్శబ్ద మేర్పడింది. చక్కని గొంతు పైపెచ్చు అతడు దైవాన్ని ప్రార్థిస్తున్నాడు ఓ రకమైన నిందాస్తుతితో–

అప్పుడే తలుపు తెరచుకొని ఓ సేవకుడు వచ్చి హమాలి సింద్‌బాదును అడిగాడు– "నీవేనా పాట పాడినది! నా యజమాని నిన్ను తీసుకురమ్మన్నాడు"

హమాలి సింద్‌బాదు భయపడి ఏవో కారణాలు చెప్పి తప్పించుకోజూసాడు. కాని కుదరలేదు. సామానును అక్కడ ఉన్న ఇంటి కాపలావాడికి అప్పజెప్పి లోనికి తీసుకువెళ్లాడు సింద్‌బాదును ఆ సేవకుడు.

అద్భుతమైన గృహం. ఉన్నత వంశస్థులైన అతిథులు ముచ్చట్లు చెప్పుకుంటూ విందులారగిస్తున్నారు. అనేక రకాల పూలు, సుగంధ పరిమళాలు, భక్ష్యాలు, పిండివంటలు, రొట్టెలు, తీపి పదార్థాలు, రకరకాల మాంసాల కూరలు, పళ్లరసాలు, మధువులు నోరూరించేలా అమర్చబడి ఉన్నాయి.

అందమైన బానిసలు వాటిని అతిథులకు అందిస్తూ ఉండగా గాయకులు వీణలు మీటుతూ పాటలు పాడుతున్నారు. ఆ అతిథుల మధ్యలో పొడుగ్గా, ప్రత్యేకంగా కనిపిస్తున్న గౌరవనీయుడైన వృద్ధుడు తెల్లటి పొడుగాటి గడ్డంతో అందమైన వదనంతో ప్రశాంత దృక్కులతో ఠీవిగా కానవచ్చాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 269వ రాత్రి కథ *

## షహర్జాదీ కథ చెప్పసాగింది-

హమాలి సింద్‌బాదు అనుకున్నాడు– “ఇది ఖచ్చితంగా, జిన్నీదో, రాజుదో ఈ భవనం” అనుకుని అక్కడున్నవారికి దైవం పేరుమీద పలకరిస్తూ ఓ పక్కన మౌనంగా నిలబడినాడు.

ఆ గౌరవనీయుడైన వృద్ధుడు అతడిని తన పక్కన కూర్చోబెట్టుకుని క్షేమ సమాచారములడిగి అతడి స్వాదు పదార్థములను వడ్డించి సింద్‌బాదు సంతృప్తుడైనాక, అడిగాడు– “స్వాగతం, అతిథీ! మాలో ఒకడిగా నీవు ఏ బెరుకూ లేకుండా ఉండవచ్చు. నీ పేరేమిటి?”

అతడన్నాడు– “అయ్యా, నాపేరు సింద్‌బాదు, హమాలి పనిచేస్తూ పొట్ట గడుపుకుంటున్నాను”

ఆ వృద్ధుడి ముఖం విప్పారింది. అతడు నవ్వుతూ అన్నాడు– “నీపేరు నాపేరు ఒక్కటే. నేను సింద్‌బాదును, నావికుడిగా అనేక దేశాలు తిరిగాను. దయ ఉంచి ఇందాక నీవు పాడిన పాట మరల పాడగలవా!”

హమాలి అన్నాడు– “నన్ను క్షమించాలి, నెత్తిమీద బరువు మోసీమోసీ ఎండలో తల వేడెక్కి, కడుపులో ఆకలి మండగా ఏదో అలా పాడాను. నన్ను క్షమించండి!”

నావికుడు సింద్‌బాద్ మరింత ఒత్తిడి చేయగా హమాలి సింద్‌బాదు మరల పాడినాడు. అత్యంత శ్రావ్యంగా, ఆర్తితో పాడుతున్న అతడిని అందరూ మెచ్చుకున్నారు.

నావికుడు సింద్‌బాదు అన్నాడు– “విధి మనలను ఎందుకు ఎప్పుడు ఎలా కలుపుతుందో ఎవరికీ తెలీదు. నేను నా ప్రయాణాలలో ఎటువంటి విపత్తుల నెదుర్కొన్నానో, ఎన్నిసార్లు మృత్యుగృహం గుమ్మం వరకు వెళ్లి వెనక్కి వచ్చానో, ఎన్నిసార్లు ఇదే ఆఖరి క్షణమనుకుని మరల బతికి బయటపడ్డానో – ఇవన్నీ విధి నాపై పెట్టిన పరీక్షలుగా భావించి ఈ వృద్ధాప్యంలో కాస్త విశ్రాంతిగా కాలం గడుపుతున్నాను”.

సింద్‌బాద్ సముద్రయాత్రా విశేషాలను చెప్పమని అక్కడున్న అతిథు లందరూ ప్రార్థించారతడిని.

## సింద్‌బాద్ మొదటి సాహసయాత్ర

అతిథులారా, నాపేరుగల శ్రామిక హమాలి మిత్రమా, నా తండ్రి ఓ గొప్ప వ్యాపారి. అతడి మరణానంతరం నాకు చాలా ధనం, భూములు, గ్రామాలు వారసత్వంగా సంక్రమించాయి. యువకుడిలో ఉండే ఉద్రేకం, చెడు సాంగత్యాలు, విలాసాలు నన్ను కొద్దికాలంలోనే నిరుపేద స్థాయికి దించాయి. నాకు గుర్తువచ్చాయి నా తండ్రి ఎప్పుడు అంటూ ఉండే మాటలు- 'సులేమాన్ ఇబిన్ దావీదు' చెప్పినవి- 'పుట్టిన రోజుకన్నా గిట్టినరోజు, చచ్చిన సింహంకన్నా బతికున్న కుక్క, దారిద్ర్యం కన్నా సమాధి మేలు' అన్న గొప్పవాక్యాలు.

నా కళ్లు తెరుచుకున్నాయి. మిగిలిన వస్తువులు, స్థిరాస్తులు అమ్మగా మూడువేల దీనారాలు పోగైనాయి.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 292వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు తన సాహసయాత్ర- "మూడువేల దీనారాలు. ఏం చేయవచ్చు వీటితో... ఏ పని చేస్తే నాకు గెలుపు తథ్యం! మరల పోగొట్టుకున్న భోగభాగ్యాలను ఎలా తిరిగి పొందగలుగుతాను?"

గెలుపంటే ఏమిటి?
నీ అలుపుకు పుట్టిన మరణం లేని కుమార్తె కాదా!
శీతల ఆకుపచ్చ మార్మిక సముద్రంలోకి
లోలోతుల్లోకి, పొరల తరువాత పొరలను
చీల్చుకుంటూ నిగూఢ నిధులకై అన్వేషణ కాదా
ఎక్కడుందో ఆ గులాబిరంగు, తెల్లని తెలుపు
కాస్త మసక నలుపు ఛాయలున్న మేలి ముత్యం?
గెలుపంటే ఆణిముత్యాన్ని పొందడమేనా?

మూడువేల దీనారాలతో రకరకాల సామాన్లు కొని అప్పుడే బాగ్దాద్ నుంచి బయల్దేరుతున్న నౌకనెక్కాను. బాగ్దాద్ నుంచి ముత్యాలనగరం బస్రాకు, అక్కడ నుంచి అనంత సముద్రంలోకి. రాత్రుళ్లు, పగళ్లు గడుస్తూనే ఉన్నాయి సముద్రపు అలల్లా... అక్కడక్కడా ద్వీపాలున్న చోట ఆగి మా సరుకుల్ని అమ్మడం మరల ప్రయాణం.

కొన్ని వారాలు గడిచాయి. ఈసారి దూరంగా మరో అద్భుతమైన ఆకుపచ్చని దీవి ఈడెనుతోట లాంటిది కనిపించింది. నౌక ఆగినాక అందరం వంట సామాగ్రి, ఆహారం తీసుకుని ఆ దీవిపై అడుగుపెట్టాము. నేనుకూడా ఆ విచిత్ర వనంలోని మొక్కలు, పూలు ఫలాలు చూస్తూ కాస్త ముందుకు నడిచాను. కొందరు నిప్పు రాజేసి వంటలు మొదలెట్టారు.

ఇంతలో ఆ దీవి కదిలినట్లయ్యింది. ఓక్షణం అందరం భూకంపం వచ్చినట్లు భావించాము. రెండోసారి పెద్ద కుదుపుతో కదిలింది దీవి. నౌక అధికారి కేక వినబడింది– “త్వరగా వచ్చేయండి మిత్రులారా, ఇది దీవి కాదు. మహా తిమింగలం. మీరు వెలిగించిన పొయ్యిమంట వేడికి అది కదుల్తున్నది. ఎన్నాళ్ల నుంచి నిద్రపోతున్నదో దానిపై దీవి ఏర్పడింది. త్వరగా వచ్చేసి ఓడ ఎక్కండి. మీకనువుగా మరిన్ని తాళ్ల నిచ్చెనలు వేస్తున్నాను. త్వరగా వచ్చి ప్రాణాలు రక్షించుకోండి!” అని అరుస్తూనే ఉన్నాడు. అందరం ఓడవేపు పరిగెత్తాం. కొందరు నౌకలోకి వెళ్లగలిగారు. నేను ఆఖరున ఉన్నాను. పదడుగులు వేస్తే నిచ్చెన అందుతుంది. పరిగెడ్తూనే ఉన్నాను. ఈలోగా తిమింగలం మరో రెండుసార్లు కదిలి వేగంగా సముద్రంలోకి మునిగిపోయింది, చెట్లూ చేమలూ అన్నిటితో సహా. దాని వేగానికి వచ్చిన అలలు నౌకను నానుంచి దూరంగా నెట్టివేసాయి. నాకు తెలిసిందల్లా నేనొక తేలుతున్న చెట్టు దుంగను కావలించుకుని పట్టుకోవడం, నౌక క్రమేపీ కనుమరగవడం.

ఓపిక ఉన్నంతసేపు ఆ చెట్టును పట్టుకుని ఈదుతూనే ఉన్నాను. అదృష్టం బాగున్నదేమో పెద్ద అలలు నన్ను ఏదో ద్వీపపు తీరానికి చేర్చినాయి. అలసిపోయిన నేను తీరాన ఇసుకతిన్నెపై పడి గాఢనిద్రలో మునిగిపోయాను.

దాదాపు ఓరోజల్లా నిద్రపోయిన నేను కాళ్లీడ్చుకుంటూ, దగ్గర్లో ఉన్న చెట్ల పళ్లు తిని సెలయేటి నీళ్లు తాగి, పుళ్లుపడ్డ పాదాలకు పసరు రాసి, చెట్ల

ఆకులు చుట్టి, దైవాన్ని స్మరిస్తూ కొద్దిరోజులు కాలం గడిపాను. క్రమేపీ నాకు నడిచే శక్తి వచ్చింది.

ఒకరోజున తీరాన నడుస్తూ ఉంటే దూరంగా ఓ ఆడగుర్రం కనిపించింది. దానిని పట్టుకుని మచ్చిక చేస్తే నడకబాధ తగ్గుతుందని చెట్ల తీగలతో తాడులా తయారుచేసి దానికి కనబడకుండా వెళ్లి సరైన సమయం కోసం చూస్తున్నాను. అకస్మాత్తుగా గుర్రానికి నాకు మధ్య ఓ మనిషి చెట్టుమీద నుంచి దూకి తన చేతిలోని ఈటెను నాకు గురిపెట్టి – “ఎవరు నీవు, ఇక్కడికెలా వచ్చావు?” అని అడిగాడు.

ఒక్కక్షణం గుండె ఆగినంత పనయ్యింది నాకు. “అయ్యా, నేను ఓడ ప్రయాణంలో ప్రమాదానికి గురై చావుతప్పి ఆ దైవం కృప వలన ఈ దీవికి చేరుకున్నాను. నాపై దయ చూపండి” అని వేడుకున్నాను.

అతడు నా చేయి పట్టుకుని, భయం లేదని ఊరడించి, దగ్గరలో ఉన్న గుహ వద్దకు తీసుకువెళ్లాడు. ఆ గుహ భూగర్భంలోని భవనం వద్దకు దారితీసింది. అక్కడ నాకు ఆహారం, దుస్తులు ఇచ్చి ఆదరించాడతడు. ఆ తరువాత అతడెందుకు అక్కడ ఉన్నాడో తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువ కాగా వినయంగా అడిగాను– “తమరెవరు, ఈ భవనం ఎవరు నిర్మించారు?” అని.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 293వ రాత్రి కథ *

***షహర్జాది కథ చెప్పసాగింది-***

నేను ఒక్కడినే కాదు, ఇంకా ఈ ద్వీపంలో నాలాంటి వాళ్లు చాలామందిమి ఉన్నాము. మిహ్రజాన్ ప్రభువు గుర్రాలను సంరక్షిస్తూ ప్రతినెల నెలపొడుపు రోజున మేము మగ గుర్రపు వాసన తెలియని కన్యాగుర్రాన్ని ఎదకు అనుకూలంగా ఉన్నదానిని తెచ్చి గుహలో సంరక్షించి తీరాన ఉన్న గుంజకు కట్టేసి కాపలాగా ఉంటాము. ఆడగుర్రపు వాసన గాలి అలలలో సముద్రంలోకి పోగా ఆకర్షింపబడిన సముద్ర గుర్రం తరంగాలపై వేగంగా వచ్చి ఆడగుర్రంతో కలిసి, సంభోగానంతరం దానిని తీసుకుపోవడానికి ప్రయత్నిస్తుంది. మేము అప్పుడు గుంపుగా వెళ్లి, కేకలు

పెడుతూ దాన్ని భయపెడితే అది సముద్రంలోకి పారిపోతుంది. ఆ రకంగా గర్భవతి అయిన ఆడగుర్రం జన్మనిచ్చే గుర్రపు పిల్ల ఓ మహారాజు కోశాగారపు ధనమంత విలువ చేస్తుంది. ఈరోజు ఆ మగగుర్రం వచ్చేరోజు. దైవకృప వలన నీవు నాకంట పడినావు. లేకుంటే ఈ ద్వీపంలోనే నీకు మరణం దక్కేది"

ఇంతలో సముద్రంలో కలకలం రాగా మేం బయటకు వచ్చాము. మేము చూస్తుండగానే సముద్రపు గుర్రం వచ్చి ఆడగుర్రాన్నెక్కి ఆ కార్యక్రమానంతరం గుంజను పెకలించడానికి ప్రయత్నిస్తున్నపుడు, నన్ను కాపాడిన అతడు కేకలు పెట్టగా దగ్గరలో దాక్కున్న అతడి స్నేహితులు వచ్చారు పెద్దగా అరుచుకుంటూ. నేనూ వాళ్లతో కలిసాను. అందరి అరుపులకు సముద్ర గుర్రం భయపడి సముద్రంలోకి పారిపోయి అదృశ్యమయ్యింది.

వచ్చిన వాళ్లందరూ నా కథ తెలుసుకుని చావుతప్పి బయటపడినందుకు నన్ను అభినందించి నన్ను ఆ గుర్రంతోపాటు మిహ్రజాన్ ప్రభువు వద్దకు తీసుకు వెళ్లారు.

ప్రభువు నన్ను అనేక రకాల పరీక్షించి రేవులు, పడవల అధికారిగా నియమించాడు. ప్రతిరోజూ ప్రభువును కలిసి నా సంభాషణలు, చమత్కారాలు, సంగీత సాహిత్యాలతో అతడిని ఉల్లాసపరిచేవాడిని. ఆ విధంగా నేను ప్రభువు అంతరంగికులలో ఒకడినైనాను.

అలా అని నేను నా స్వంత దేశాన్ని మరవలేదు. రేవు పట్టణానికి వచ్చిన ప్రతి నావికుడిని బాగ్దాద్ గురించి అడిగేవాడిని. వారెవరూ తమకు తెలియదని చెప్పడంతో నేను నిరుత్సాహపడినాను. ఒకరోజున నాకు హిందూ దేశము నుంచి వచ్చిన నావికులు కలిసారు. వారి దేశం అనేక కులాల జనులతో నిండి ఉన్నా బ్రాహ్మణ, క్షత్రియులు ముఖ్యులని చెప్పారు వాళ్లు. బ్రాహ్మణులు ధర్మపరులు, సద్వర్తనులని, క్షత్రియులు వీరులు, మధుపానము ముట్టరు కాని రాజసముగా జీవిస్తారని, ఆ దేశంలో 72 కులాలున్నాయని, ఎవరి వృత్తిధర్మాలు వారు నిర్వహిస్తారని వాళ్లు వివరించారు.

ఇంకో రోజున నేను మా పక్క దీవి కాబిల్‌కు వెళ్లాను. వాళ్లు అర్ధరాత్రి ఢంకాలు, ఇతర వాద్యాలు మోగిస్తూ చప్పుళ్లు చేస్తారు. మనుషులు చాలా మంచివారు, తర్కబుద్ధి కలవారు.

ఇంకో దీవి దగ్గర ఉన్న సముద్రంలో వంద క్యూబిట్ల పొడవున్న చేపను, గుడ్లగూబ ముఖమున్న చిన్న చేపలను చూసాను. ఇలా సంవత్సరాలు గడిచాయి. నేను న్యాయపరమైన వ్యాపారాలు నిర్వహిస్తూ బాగా ధనవంతుడినయ్యాను.

ఒకరోజున పెద్ద నౌక ఒకటి మా రేవు పట్టణానికి వచ్చినపుడు తనిఖీకి వెళ్లి నౌక అధికారితో మాట్లాడుతున్నపుడు అతడినెక్కడో చూసినట్లనిపించి అడిగాను, "నీకు బాగ్దాద్ కాని, బస్రా రేవు కాని తెలుసా?"

అతడన్నాడు– "మూడేళ్ల క్రితం మేము బస్రా నుంచి బయల్దేరాము. ఇప్పుడు తిరిగి వెళ్తున్నాము".

నేనన్నాను– "మీ నౌకలో సింద్‌బాద్ అనే వ్యాపారి ప్రయాణించాడా? అతడెక్కడున్నాడు?"

అతడన్నాడు– "అయ్యా, అతడు దారిలో సముద్రం పాలయ్యాడు. అదిగో అతడికి సంబంధించిన వస్తువులలో మిగిలినవి. అన్నీ దాదాపు అమ్ముడయ్యాయి. ఇరవై వేల దీనారాలు అతడి కుటుంబ సభ్యులకు అందజేద్దామని మేము నిర్ణయించుకున్నాము".

నా ఆనందానికి అంతే లేదు. అప్పుడు అతడికి జరిగిన సంగతంతా వివరించాను. అతడన్నాడు– "ఇరవై వేల దీనారాలంటే ఎవరైనా నేనే సింద్‌బాద్‌నని ముందుకు వస్తారు. ఋజువుంటే చెప్పగలరు".

అప్పుడు నేను అతడికి ఆకుపచ్చటి ద్వీపం గురించి చెబుతూ నా వస్తువులలో నాపేరున్న రసీదు కాగితాలు, ఆ సామానులోని వెండిపెట్టెలో ఉన్న సంగతి చెప్పగా అతడు సింద్‌బాద్ పేరుమీద ఉన్న చెక్కపెట్టెలలో ఒకదానిలో ఉన్న చిన్న వెండిపెట్టెను తెప్పించి నా కళ్లముందు సీలు తొలిగించి చూడగా రశీదులు, బాగ్దాద్, బస్రా ముద్రలు ఉన్నవి కనిపించాయి. అతడు నావికులందరి ముందర నాకు ఇరవై వేల దీనారాలు, మిగిలిన సరుకును అందజేసాడు.

నేను ఈ విషయాన్ని మిహ్రజాన్ ప్రభువుకు చెప్పి నా దేశం వెళ్లడానికి అనుమతి కోరాను.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 294వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

మిహ్రజాన్ ప్రభువు మొదట సంకోచించినా నాయందు గల ప్రేమతో అనేక కానుకలనిచ్చి మరల అప్పుడప్పుడూ రావాల్సిందిగా కోరినాడు.

ప్రభువుకు, నన్ను దీవిలో రక్షించిన మిత్రునికి, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపి నేను శాంతినగరమైన బాగ్దాద్‌కు ఆ నౌకలో చేరుకున్నాను. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి' అని హిందువులంటారు కదా!

నన్ను చూసి నా బంధుమిత్రులెంతో సంతోషాన్ని పొందినారు. నా దగ్గరున్న ధనముతో ఎందరో బానిసలను, ఇళ్లను, పొలాలను కొని నా తండ్రి ఇచ్చిన సంపదలకు అనేకరెట్లు ధనవంతుడినై హాయిగా కాలం గడపసాగాను.

ఓ హమాలీ సింద్‌బాద్, నీవీ రోజు నుంచి మా మిత్రుడివి. రేపు సాయంకాలం విందుకు తప్పక రాగలవు. రేపు నా రెండవ యాత్ర గురించి చెబుతాను" అని పలికి నావికుడు సింద్‌బాదు హమాలి సింద్‌బాదుకు వంద బంగారు నాణెములు కానుకగా ఇచ్చి పంపినాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 295వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

అతిధులందరూ వచ్చి ఆహార పానీయాలు స్వీకరించాక కాసేపు గాయకులు పాటలు పాడి అందరినీ ఆహ్లాదపరిచారు. సింద్‌బాద్ నావికుడి కోరికపై సింద్‌బాద్ హమాలి తన ప్రాంతపు జానపద గీతాల్ని అద్భుతంగా గానం చేసాడు.

## సింద్‌బాద్ రెండవ సాహసయాత్ర

కొద్దిరోజుల విలాస జీవితంతో మొహం మొత్తినట్లై నేను మరల వ్యాపారానికై దూరదేశాలు పోవ నిశ్చయించుకున్నాను. అనేక సరుకులు కొని బేళ్లుగా అమర్చి కొత్త నౌక, అనుభవమున్న నావికులు ఉన్న వ్యాపార నౌకలో ఉంచగా వాతావరణము అనుకూలముగా ఉన్న సమయాన నౌక నీలిసముద్రంలో ప్రవేశించింది.

కొద్దిరోజులకు మేమొక అందాల నిర్జన ద్వీపాన్ని చేరుకున్నాము. నౌకాధికారి అనుమతితో ఆ దీవిలో అడుగుపెట్టాము. సరుకులు, నౌక వాసనను మరపించే తాజా చల్లనిగాలి, పూల పరిమళాలు, పక్షుల కిలకిలా రావాలు, సెలయేటి గలగలలు, తియ్యని ఫలాల ఘుమఘుమల నానందిస్తూ కాసేపు ఆ దీవి తీరాన తిరుగుతూ ఆకలివేయగా నాతో తెచ్చుకున్న ఆహారాన్ని తిని, మధురమైన సెలయేటి నీరు తాగి, కునుకు రాగా ఓ చక్కని చెట్టునీడన కాసేపు విశ్రమించాను.

ఎంతసేపు నిద్రపోయానో తెలీదు కాని మెలకువ వచ్చేసరికి నా చుట్టుపక్కల సహ ప్రయాణీకులెవరూ లేరు. నౌకలో గంట మోగగానే ఎవరి తొందరలో వారు వెళ్లిపోయారు నన్ను నా మానాన వదిలేసి. దూరంగా నౌక తెరచాప కానవచ్చింది నన్ను వెక్కిరిస్తూ.

నాకు ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించినట్లై కళ్లు తిరిగి కూలబడ్డాను. "ఒకసారి బతికావు బుద్ధి రాలేదు. మరల సముద్ర ప్రయాణమని బయల్దేరావు. సురక్షితంగా నౌకలో ఉండక తీరానికి వచ్చి సుష్టుగా తిని గుర్రుపెట్టి నిద్రపోయావు" అని నన్ను నేను నిందించుకుంటూ "రెండోసారి పడిన గాజుపాత్ర ఖచ్చితంగా పగుల్తుంది" అనుకుని దుఃఖిస్తూ అటు ఇటూ తిరగసాగాను.

కాసేపటికి కాస్త మనసు శాంతించగా దగ్గరలో ఉన్న చెట్టెక్కి నలుదిక్కులా పరికించాను. దూరంగా తెల్లటి పాలమెరుపున్న ఎత్తైన కట్టడమొకటి గుడ్డు ఆకారంలో ఉన్నది కనిపించింది. చెట్టు దిగి వచ్చి నెమ్మదిగా అక్కడకు వెళ్లాను. చుట్టూ తిరిగి చూసినా దానిలోపలికి వెళ్లే ద్వారము కనిపించలేదు. పైకెక్కుదామని ప్రయత్నిస్తే పట్టు చిక్కక జారిపోయాను. దాని చుట్టూ తిరిగి ఇసుకలో అడుగులు లెక్కపెడ్తే అది 150 అడుగుల లెక్క గుండ్రంగా తేలింది.

దానిలోకి ఎలా వెళ్లాలా అని ఆలోచిస్తుండగానే క్రమేపీ అక్కడ చీకటి కమ్ముకోసాగింది సూర్యుడికెవరో అడ్డం వచ్చినట్లు. నేను తల పైకెత్తి చూసాను. నేనెప్పుడూ కనీ వినని, కలలో కూడా చూడని పెద్ద పక్షి క్రమేపీ నేనున్న చోటుకు వలయాలుగా ఎగురుకుంటూ దిగివచ్చి ఆ తెల్లటి దానిమీద కూర్చుని రెక్కలను మూసింది. నాకు నావికులు చెప్పిన 'రుక్' పక్షి గుర్తుకువచ్చింది. ఆ గండభేరుండ 'రుక్' పక్షి ఇదే కావచ్చు. భయం నా నరనరాలలో వ్యాపించగా గజగజా వణికి పోయాను నేను.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# ✳ 296వ రాత్రి కథ ✳

## షహర్జాదీ కథ చెప్పసాగింది-

ఆ మహా విహంగాన్ని చూసి భయపడిపోయి నేలపై బోర్లా పడుకున్న నేను కాస్త ధైర్యం తెచ్చుకుని అటు తిరిగి చూసాను. పక్షి కాలువద్ద నేనుండగా నాకో విచిత్రమైన ఆలోచన వచ్చింది. నిర్జనమైన ఈ దీవి నుంచి బయట పడాలంటే ఈ పక్షి కాలును పట్టుకుని అది వేరేచోట ఆగినప్పుడు దిగవచ్చు. అదృష్టం బాగుంటే మనుషులున్న చోటుకు చేరుకుంటానేమోననుకుని ఆ పక్షి కాలుకు నన్ను నేను పైవస్త్రంతో గట్టిగా కట్టుకున్నాను.

ఆ మహా ఖేచరానికి నేనొక ఈగలా ఉన్నానేమో అది నన్ను పట్టించుకోలేదు. కాని దాని వేడి క్రమేపీ నన్ను కాల్చసాగింది. కాస్త సముద్రపు చల్లగాలి వీచినప్పుడల్లా నాకు కాస్త ఉపశాంతి. ఉదయాన ఆ పక్షి పెద్ద కేకతో రెక్కలల్లల్లాడ్చి రెండడుగులు ముందుకు వేసి గాలిలోకి ఎగిరింది. అది ఎంత పైకి ఎగిరిందంటే నేననుకున్నాను నింగి గోపురాన్ని తాకుతున్నదని. దిగువన ఆకుపచ్చని దీవులు, నీలి సముద్రంలో చిన్న గింజల్లా కానవచ్చాయి. నాకు భయం వేసింది. అక్కడ నుంచి పడితే నా పరిస్థితేమిటి?

అట్లా అనుకుంటూ ఉండగానే ఆ మహా విహంగం నేలవేపు దూసుకు పోతుంటే ఆ వేగానికి నేను కొట్టుకుపోతాననిపించి ఆ పక్షి కాలిని గట్టిగా పట్టుకున్నాను. అది ఓ కొండ శిఖరంపై వాలగానే హమ్మయ్య అనుకుని కట్టు విప్పదీసి నేలపై దిగాను. దాని కాలిగోరు తగలకుండా తప్పించుకుని కాస్త దూరంగా జరిగానో లేదో ఆ పక్షి అక్కడ నుంచి ఎగిరి లోయలోని నల్లని తాడులాంటి దానిని కాళ్లతో పట్టుకుని నావేపు వస్తుండగా చూసాను ఆ నల్లటి తాడు మహా సర్పమని. నా అదృష్టం బాగుండి తప్పుకున్నాను. లేకుంటే నన్ను ఆ పాము మింగేది. ఆ పామును ఈ పక్షి మింగేది. "బతికానురా దేవుడా!" అనుకున్నాను. ఆ పక్షి ఆగకుండా మరల తాను వచ్చిన దిశలో ఎగిరిపోయి అదృశ్యమైంది. పదునైన రాళ్ల మధ్య నడుస్తూ పాదాలు కోసుకుని రక్తం స్రవిస్తూ బాధపెడ్తుంటే అనుకున్నాను- "హాయిగా ఆ నిర్జన ద్వీపంలో ఉంటే బాగుండేది కాదా, దానికన్నా హాయిగా నౌకలో ఉంటే, అసలు ఈ ప్రయాణమే చేయకుండా ఉంటే బతికినన్నాళ్లూ హాయిగా బతికే వాడిని

గదా” అనుకుంటూ ఉండగా ఎండ తగిలి ఆ రాళ్లమధ్య మెరుపులు వెళ్లి చూద్దును గదా అవి అన్నీ వజ్రాలు. పెద్దవి. పెద్ద కోడిగుడ్ల పరిమాణంలో. ఒక్కొక్కటి పదివేల దీనారాల విలువ కలవి. చిన్నవి పెద్దవి గుట్టలు గుట్టలుగా.

“హా హతవిధీ!” అనుకున్నాను. చుట్టూ అత్యంత విలువైన మణులు. వీటిమధ్య మరణిస్తానేమో! అయితే ఆ మణులను సంరక్షిస్తూ బుసలు కొడుతున్న మహా నాగులు నల్లగా వేగంగా పాకుతూన్న వాటిని చూస్తుంటే ఒడలు జలదరించింది. గుండె గణగణ మోగి ఊపిరాగినట్లపించింది. వాటి బుసబుసలు, ఎర్రటి చీలిన నాలుకలు కదుల్తుంటే మృత్యువు దగ్గరలోనే ఉన్నదనిపించి నాకు వళ్లు జలదరించింది. నాగుపాములు, తాటిచెట్లలా ఉన్న కొండచిలువలు, ఎలుగుబంటి నైనా మింగగల మహా సర్పాలతో నిండి ఉన్నదా సర్పాల లోయ. రుక్ పక్షి రెక్కల చప్పుడు వినగానే, అవి తమతమ బొరియల్లోనో, కొండ నెర్రెల్లోనో దాక్కుంటాయి పగటిపూట. రాత్రి కాగానే బయటకు వచ్చి ఆహారం కోసం అటు యిటూ తిరుగుతుంటాయి.

భయమున్నపుడు ఆకలి దప్పులుండవు. నేను ఏమైతే అదేకానీ, దైవమే నాకు రక్ష అనుకుని మొండివాడిగా మారాను. నా భారమంతా దేవుడిపైన వేసి సురక్షిత స్థానమనుకున్న చోట ఆ రాత్రి కునుకు తీసాను. అదృష్టం బాగుండి ఏ పాము కంటబడకుండా నేను తెల్లవారుజాము సూర్యుడిని చూడగలిగాను.

నెమ్మదిగా లోయలోకి దిగి కొన్ని ప్రశస్త మణులనేరి నా అంగీలో దాచుకున్నాను. బతికి బయటపడితే వాటితో కొన్ని తరాలు నేను నా వారసులు హాయిగా బతకవచ్చు – అనుకుంటూ జాగ్రత్తగా నడుస్తుండగా నా ముందు దభీమన్న చప్పుడుతో పెద్ద మాంసఖండం పడింది. నా గుండె ఒక్కక్షణం ఆగిపోయింది. ఎవరు విసుర్తున్నారీ మాంసపు ముక్కలను అవీ గొర్రె పరిమాణమున్న వాటిని.

అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది. నేనున్నది సర్పాల లోయ. దానిపేరే వజ్రాల లోయ. సాహసికులు అక్కడకు వచ్చి పెద్దపెద్ద మాంసపు ముక్కలను లోయల్లోకి విసుర్తారు. గద్దలు రాబందులు వాటినెత్తుకుపోయి తమ గూళ్లలో ఉంచగా వీళ్లు వెళ్లి గోలగోల చేసి పక్షులను పారద్రోలి ఆ మాంస ఖండాలకు అతుక్కున్న వజ్రాలనేరుకు తెచ్చుకుంటారు. ఇది విన్నపుడు నేను కల్పితగాథ అనుకున్నాను. కాని అది వాస్తవమని తెలిసిందిప్పుడు.

నేను మరిన్ని వజ్రాలను మూటగట్టుకుని ఒక పెద్ద మాంస ఖండాన్ని నా వీపుపై కట్టుకుని రుక్‌లాంటి పక్షి నన్నెత్తుకుపోతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నాను. నిముషాలు గడుస్తున్నాయి. ఓర్పుగా కదలకుండా పడుకున్నాను. నేనిప్పుడు వజ్రాలతో నిండిన మాంసఖండాన్ని. నాపైన మరో మాంసఖండం దానికి అతుక్కున్నవి ఇంకొన్ని వజ్రాలు.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# ✳ 297వ రాత్రి కథ ✳

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

ఇంతలో గాలిలో తేలినట్లయ్యింది. క్రమేపీ లోయ అదృశ్యమై, కొండలు, కొండ శిఖరాలు దాటి మరో కొండపైన ఉన్న పక్షిగూటివేపు నన్నెత్తుకుపోతున్న పక్షి కదిలింది. కొద్దిసేపటికే అది నన్ను నామీద ఉన్న మాంసఖండంతో పాటు తన గూటిలో పడవేసి మాంసాన్ని చీల్చి తన పిల్లల ముక్కులకందిస్తున్నది. ఈసారి రక్తమోడుస్తున్న దాని పదునైన ముక్కు నా వీపును తాకుతున్న సమయంలో పెద్దపెద్ద కేకలు, చప్పుళ్లు, ఢంకా నాదాలు వినిపించగా ఆ పక్షి కాస్త బెదిరి గాలిలోకి ఎగిరింది.

నేను కట్టు విడదీసి గూటిలోంచి బయటకొచ్చాను. గొర్రెమాంసపు రక్తంతో తడిచి నేను భయంకరంగా కానవచ్చానేమో అకస్మాత్తుగా నన్ను చూసిన ఆ వ్యక్తి తన చేతిలోని డప్పును పడేసి గజగజా వణకసాగినాడు. "దైవమా రక్షించు. నన్ను కాపాడు తండ్రీ!" అని మోకాళ్లపై కూర్చుని ప్రార్థించసాగినాడు.

కాసేపటికతడు తేరుకుని ఇది నా చెట్టు. నీవు దొంగలా నా వజ్రాలను కాజేస్తున్నావా? ఇది వ్యాపార నియమాలకు విరుద్ధం కాదా" అన్నాడతడు కాస్త భయం, కాస్త అధికారంతోనూ.

నేనన్నాను– "నా కథవింటే నీవీ వజ్రాలనే మరచిపోతావు. ముందు వెళ్లి నీ మాంసఖండానికున్న వజ్రాలు తెచ్చుకో. దానికి నేను చాలా గుచ్చాను. నీ పంట పండుతుంది". అతడు జాగ్రత్తగా వెళ్లి ఆ గూటిలో మాంసం ముక్కకు అతుక్కున్న వజ్రాలను తెచ్చుకున్నాక కాస్త శాంతించాడు. "ఇన్ని వజ్రాలు దొరకడం నాకిదే మొదటిసారి. నీ కథ చెప్పు!"

నేను జరిగిందంతా వివరించే సరికి అతడి ఆశ్చర్యానికి అంతులేదు. అతడన్నాడు– "నీవు నిజంగా దైవాన్ని నమ్మినవాడివి. అందుకే నీకు దైవం అనేక అవకాశాలనిస్తున్నాడు. నేను నీవు చెప్పే ప్రతి అక్షరం నమ్ముతున్నాను. దానికి ఋజువు నీవు మాంసం ముక్కకు గుచ్చిన ప్రశస్త వజ్రాలు".

నేను అతడికి నేను దాచుకున్న మరికొన్ని వజ్రాలనిచ్చేసరికి అతడు సంతోష పడి నన్ను కౌగలించుకుని– "మనమిద్దరం స్నేహితులం. రా వెళదాం!" అతడు నన్ను తన శిబిరానికి తీసుకువెళ్లి మంచి దుస్తులను, ఆహార పానీయాల నిచ్చినాడు. ఒక రాత్రి పగలు ఒళ్లెరగకుండా నిద్రపోయాను నేను. అతడితో వచ్చినవారు తమకు దొరికిన వజ్రాల గురించి మాట్లాడుకుంటూ దైవానికి కృతజ్ఞతలు తెలుపు తున్నారు. నేను వారిలో చేరి ప్రార్థనలు చేసాను.

అక్కడ నుంచి మేము తీరానికి చేరి నౌకలో మరొక ద్వీపానికి చేరాము. ఆ ద్వీపంలో ఎంత పెద్ద చెట్లున్నాయంటే వాటి నీడలో వందమంది హాయిగా విశ్రమించవచ్చు. వాటి నుంచి తీసిన తెల్లటి ద్రవంతో కర్పూరం తయారుచేస్తారు. ఆ దీవిలోనే నేనొక భయంకరమైన జంతువును చూసాను. అది ఖడ్గమృగం. ఒంటెకన్నా పెద్దగా, దాని కొమ్ము పది క్యూబిట్ల పొడవుండి మొనదేలి ఏనుగు చర్మాన్నైనా చీల్చగలదు. దానిని అక్కడ కర్కద్దాన్ అని పిలుస్తారు. ఆ కొమ్ము మీద మనిషి బొమ్మ చిత్రితమై ఉంటుందని నావికులనుకునేవారు. అది ఏనుగును గాయపరచినపుడు ఏనుగు కొవ్వు ఖడ్గమృగపు కళ్లలో పడగా దానికి కళ్లు కనిపించక నేలపై కూలిపోతుంది. అప్పుడు గండభేరుండ రుక్ పక్షి వచ్చి రెండిటినీ తన కాళ్లతో ఎత్తుకునిపోయి తన గూటిలో పిల్లలకు ఆహారంగా పెడ్తుందిట. అక్కడ అనేక రకాల దున్నపోతులను కూడా చూసాను.

అక్కడ నుంచి మేము దేశ దేశాలు తిరుగుతూ వజ్రాలను మారకం చేసి బంగారం, వెండి కొని చివరకు బస్రా చేరుకున్నాము. నేను నా ధన సంపదలు వజ్రాలతో బాగ్దాద్ చేరుకున్నాను. చానాళ్లు నేను బంధుమిత్రులతో విందు వినోదాలలో కాలం గడిపాను.

మిత్రులారా, రేపు నేను చెప్పబోయేది నా మూడవ సాహస యాత్ర. అందరూ మరలా ఇదే సమయానికి రాగలరు" అన్నాడు సింద్‌బాద్ నావికుడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 298వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

సామాన్యుడు హమాలీ సింద్‌బాద్, ఇతర స్నేహితులు విందులో కాలక్షేపం చేస్తుండగా నావికుడు సింద్‌బాద్ మూడవ సాహసయాత్ర గురించి చెప్పసాగినాడు.

## సింద్‌బాద్ మూడవ సాహస యాత్ర

రెండవ యాత్ర తరువాత కొద్ది నెలలోనే నేను అప్పుడు పడిన కష్టాలను, మృత్యు వాకిట నిలబడి మొత్తుకున్న ఘడియలను మరచిపోయాను. బాగ్దాద్‌లోని విలాస జీవితంపై మోహం మొత్తగా మనసు మరల సముద్ర ప్రయాణం వేపు మొగ్గుచూపగా, ఏదో సాధించాలనే తపన రోజురోజుకు ఎక్కువ కాగా దైవంపై భారం వేసి బాగ్దాద్‌లో సరుకులు కొని విదేశీ వ్యాపారానికి వెళ్తున్న ఇతర వర్తకులతో బస్రాకు చేరుకున్నాను. సరైన సమయాన నౌక బయల్దేరింది. అనేక రేవులలో ఆగుతూ వ్యాపారంలో లాభాలు చవిచూస్తూ మేము చాలాదూరం పోయాము. తెల్లవారుజామున మా నౌకాధిపతి జుట్టు పీక్కుంటూ తల బాదుకుంటూ ఏడుస్తుంటే, ఆ గొడవకు నాకు మెలకువ వచ్చి అతడి దగ్గరకు వెళ్లి కారణమేమిటని అడిగాను.

అతడన్నాడు– "మనం దారితప్పాము. మిత్రులారా! అదిగో ఆ కానవస్తున్న దీవిలో పెద్దపెద్ద కోతులున్నాయి. ఆ వానర ద్వీపంలో అడుగుబెట్టి ప్రాణాలతో తిరిగి వచ్చినవాళ్లు లేరు. అంతేకాక అవి ఒక్కోసారి నావలపై దాడిచేసి దొరికిన వాళ్లను దొరికినట్లు ఎత్తుకుపోతాయి".

అతడట్లా చెబుతూ ఉండగానే వందలాది వికృత జంతువులు నౌకను ముట్టడించాయి. మిడతల దండులా అవి తీరాన వస్తుంటే నల్లటి మబ్బులు సూర్యుడిని కమ్మినట్లు చీకటి కమ్మింది. వాటి కేకలకు, బొబ్బలకు మా ప్రైప్రాణాలు పైనే పోయాయి.

నౌకను చూడగానే అవి సముద్రంలో ఈదుకుంటూ వచ్చి గోలగోలగా అరుస్తూ దొరికిన సామానును నీళ్లలో విసిరికొడుతూ పళ్లికిలించి కోరలను చూపుతూ, నావికుల కళ్లలో కళ్లుపెట్టి చూసి, భయపడినవాళ్లని రక్కుతూ నానా భీభత్సం చేయసాగినాయి. అంతటి అనాకారి జంతువులను నేనెక్కడా చూడలేదు. నల్లటి దట్టమైన వెంద్రుకలు, పసుపుపచ్చ కళ్లు, నల్లటి ముఖాలు, మూడడుగుల

ఎత్తు, వంగి నడుస్తూ గూనితో కదుల్తున్న ఒంటెల్లా అవి పళ్లు పటపటలాడిస్తూ మమ్మల్ని తిడుతున్నట్లు కిచకిచలాడుతూ తెరచాప తాళ్లను వాటి పదునైన దంతాలతో కొరికి, స్తంభాలను విరగగొట్టి, నౌకను తోసుకుంటూ ఓ ద్వీపం వేపు లాక్కుపోయాయి. మా చుట్టూ గుంపుగా నిలబడి మమ్మల్ని ఒక వరుసలో నిలబెట్టి, బెదిరిస్తూ, ద్వీపంలోకి లాక్కుపోయాయి. వాటి అరుపులకు మా గుండెలు గొంతులోకి ఎగబాకినాయి. మమ్మల్ని అలా ఆ ద్వీపంలో ఉంచి అవి నౌకను వేరే ద్వీపానికి తీసుకుపోయాయి.

ప్రాణాలతో బయటపడినందుకు సంతోషిస్తూ మేం ఆ దీవిలోనే నడుచు కుంటూ ఒకచోట మంచి పళ్లున్న చెట్లు, సెలయేరు ఉన్న చోట ఆగి ఆకలి, దాహ బాధలు ఉపశమించగా కాస్త విశ్రాంతి తీసుకుని చుట్టూ చూసాము. దూరంగా ఒక పెద్ద భవనం కానవచ్చింది కాని జన సంచారం లేదు అక్కడ.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## * 299-300వ రాత్రి కథ *

### షహర్జాదీ కథ చెప్పసాగింది-

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు- "ఆ చతురస్ర భవనం, అత్యంత పటిష్ఠమైన దేవదారు తలుపులు ద్వారమున్న ప్రహరీగోడలతో రక్షింపబడి ఉ న్నది. కాని అక్కడ ద్వారపాలకుల జాడ కానరాలేదు. మేము ఆ తలుపులు నెట్టి లోనికి వెళ్లి చూడగా ఆ భవనమంతా ఓ పెద్ద వంటగదిలా కానవచ్చింది. పెద్దపెద్ద గంగాళాలు, వంటపాత్రలు, గరిటెలు, పళ్లేలు, పెద్దపెద్ద గాడిపొయ్యిలు, ఇనుప కొలుములు, అంతా దుర్గంధం. ఆ వాసనకు మా ముక్కుపుటాలదిరి మేము ముక్కులు మూసుకున్నాం. కడుపులో దేవినట్లై వాంతి వచ్చినంత పనైంది. కొంచెం దూరంలో ఎముకల గుట్టలు, కొన్ని ఎండినవి, కొన్ని ఇంకా పచ్చివి మాంసం వేలాడుతున్నవి. మేం వాటికి దూరంగా వెళ్లి కిటికీలలోంచి చల్లటి గాలి వస్తున్న చోటుకు వెళ్లి అప్పటికే అలసటతో నిద్ర ముంచుకురాగా ఒళ్లెరగకుండా నిద్రపోయాము.

పెద్ద ఉరుము ఉరిమినట్లై ఆ మహాశబ్దంతో భవనం కంపించగా ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసేసరికి ఇంకా మసక చీకటిగానే ఉన్నది. ఆ చీకటిని చీల్చుకుంటూ నల్లటి మహాకాయుడొకడు తాటి చెట్టంత ఎత్తున్నవాడు, ఆ వికృత వానర సమూహం

కన్నా వికృతంగా ఉన్నవాడు, వాడి రెండు కళ్లు రెండు మండుతున్న కొలుములు, వాడి ముందు కోరదంతాలు మహా వరాహ దంష్ట్రలు, వాడి నోరు పెద్ద చీకటి గుహలా, లోతైన బావిలా, అతడి బండ పెదాలు కిందికి జారి ఛాతీకి తగుల్తున్నాయి. అతడి చెవులు ఏనుగు చెవుల్లా భుజాల మీదకు వాలి ఉండగా, అతడి చేతిగోళ్లు సింహపు కాలిగోళ్లలా పదునుగా ఏనుగు కుంభస్థలాన్ని చీల్చేంత వాడిగా ఉన్నాయి.

భయంతో గజగజా వణికిపోయాము మేము. మా రక్తం గడ్డకట్టిపోయింది. ఆ మహాకాయుడు గోడపక్కనే ఉన్న పెద్ద బల్లపై కూర్చుని ఓ వరుసలో నిలబడి ఉన్న మమ్మల్ని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసి, నా మెడమీద చర్మాన్ని పట్టుకుని రెండు వేళ్లతో పైకి లేవనెత్తాడు ఖర్జూరపండును పట్టుకున్నట్లు. నా పై ప్రాణాలు పైననే పోయాయి. నేను వాడికి నచ్చలేదేమో నన్ను నేలపైన పడవేసి చివరకు లావుగా బలిష్ఠంగా ఉన్న నావికాధికారిని, పాపం, దురదృష్టవంతుడు, రెండు వేళ్ల మధ్య పట్టుకుని లేవనెత్తి గిలగిలా కొట్టుకుంటున్న అతడి తలను నేలమీద ఉంచి అరిపాదంతో నొక్కిపెట్టి మెడ విరిచి చంపి, పెద్ద ఇనుపచువ్వకు గుచ్చి, పొయ్యి వెలిగించి బాగా కాల్చి కోడిని తిన్నట్లు తిని పక్కనే ఉన్న ద్రాక్షసారాయి రెండు పెద్ద పాత్రల నిండుగా తాగి ఎముకలను గుట్టలోకి విసిరి మూతి తుడుచుకుని బల్లమీద కాళ్లు జాపుకుని దున్నపోతులా గురకపెడ్తూ నిద్రపోయాడు. ఓ రెండు గంటలయ్యేసరికి మెలకువ వచ్చాక వచ్చిన దారినే అడవిలోకి పోయాడు.

భయంతో సగం చచ్చిన మేము ఒక్కసారిగా ఏడుపు లంకించుకుని ఒకరినొకరు ఓదార్చుకుంటూ అనుకున్నాము– “మనం సముద్రంలో మునిగి చనిపోయినా బాగా ఉండేది; ఆ కోతులు మనల్ని చంపినా, హాయిగా ఉండేది. ఈ రాక్షసుడి చేతిలో ఇటువంటి దారుణమైన చావు చచ్చేకంటే, ‘అల్లా’ని ప్రార్థిద్దాం. ఏదో ఒక దారిని చూపించకపోడు దైవం” అందరం దైవ ప్రార్థన చేసాము.

పగలంతా ఆ చుట్టుపక్కల గాలించాము. ఎక్కడా మాకు సురక్షిత ప్రాంతం కానరాలేదు. పాములు, తేళ్లు, క్రూరమృగాల జాడలు, అరుపులు సాయంకాలానికి ఎక్కువయ్యాయి. వేరే దిక్కులేక మరల ఆ భవనంలోపలే ఉండడం ఉత్తమమనుకుని ఓ మూల దాక్కున్నాము.

వాడు రానేవచ్చాడు. శ్వాస ఎగబీల్చి మేమెక్కడ ఉన్నామో పసిగట్టి మా దగ్గరకు వచ్చి గజగజా వణుకుతున్న మాలో ఓ లావుపాటి వర్తకుడిని మెడ పిసికి

చంపి పొయ్యిలో పడవేసి వేయించుకుతిని ద్రాక్ష సారాయి కడుపునిండా తాగి గురకపెట్టి నిద్రపోయాడు.

వీడితో ఇలా చచ్చేకన్నా సముద్రంలో దూకి చావడం మేలనుకున్నాం మేము. అయినా ఆ కటిక చీకటిలో బయటకు పోలేక అక్కడే పడి నిద్రపోయాము. తెల్లవారగానే వాడు మాలో ఒకడిని ఎన్నికచేసి యధా ప్రకారం చంపి, కాల్చి తిని అడవి వేపు పోయాడు.

మేం సముద్ర తీరానికి పారిపోయి, కొండ మీంచి సముద్రంలోకి దూకి చద్దామనుకున్నపుడు మాలో ఒకడన్నాడు. “మనం చచ్చేముందు ఈ రాక్షసుడిని చంపే ప్రయత్నం చేసి చద్దాం. వాడు చస్తే, అందరి పీడ విరగడవుతుంది శాశ్వతంగా!” అలా అనుకుని సముద్ర తీరాన చెక్కలతో ఓ బలిష్ఠమైన బల్లకట్టును తయారుచేసి పారిపోవడానికి సిద్ధంగా ఉంచి దానిపై పళ్ళు, దుంపలు గుట్టగా పోసి, మరల భవనానికి వచ్చి ఓ చోట కూర్చున్నాము.

వాడు రానేవచ్చాడు. మాలో ఒకడి చావు మూడింది. ఆ దురదృష్టవంతుడిని కాల్చుకు తిని, సారాయి తాగి నిద్రపోతున్నాడు ఆ రాక్షసుడు. మేం ఓ రెండు ఇనుప శలాకలను, వేటితోనైతే వాడు మా మిత్రులకు గుచ్చి మంటలలో కాల్చాడో, వాటిని ఎర్రగా కాల్చి రెండు గుంపులుగా జాగ్రత్తగా పట్టుకెళ్లి ఒకేసారి వాడి రెండు కళ్లల్లోకి గుచ్చి దూకి దూరంగా పారిపోయాము. వాడు బాధతో అరుస్తూ, కళ్ల వెంబడే పొగలు, నీళ్లు కారుతుండగా పెద్దపెద్ద కేకలు పెడుతూ, కళ్లు నులుము కుంటూ ఆ శలాకలను గుంజి పారవేసి, చేతుల్తో మాకోసం వెదికి మేం దొరక్కపోయే సరికి పాత్రల్ని చిందర వందర చేసి, చివరకు ఏడుస్తూ, పెడబొబ్బలు పెడుతూ అడవిలోకి పడుతూ లేస్తూ పోయాడు.

అతడు మాకు కనబడనంత దూరం పోగానే బతికి బట్టకట్టిన మేము తీరానికి చేరుకుని సిద్ధంగా ఉంచిన బల్లకట్టెక్కి చేతుల్తో కర్రలతో నెట్టుకుంటూ సముద్రంలోకి దారితీసాము. ఇంతలో ఉరుముల్లా గర్జిస్తూ రెండు భీకరాకారాలు ప్రత్యక్షమయ్యాయి కొండ శిఖరంపై ఒకటి ఆ రాక్షసుడు, రెండవది అతడి భార్య కావచ్చును ఓ రాక్షసి. వాళ్లు భీకరంగా అరుస్తూ అక్కడ ఉన్న కొండరాళ్లను మాపై విసరసాగినారు. వాటిలో రెండు రాళ్లు సరాసరి మా బల్లకట్టుపై పడగా మేం ముగ్గురం తప్ప మిగతా నావికులందరూ సముద్రంలో మునిగి చనిపోయారు.

బతికి ఉన్న మేం ముగ్గురం ఆ బల్లకట్టును నడుపుకుంటూ సురక్షితంగా ముందుకు సాగాము. ఆ మహా రాక్షసులింకా రాళ్లు విసుర్తూనే ఉన్నారు.

రెండు పగళ్లు, రెండు రాత్రులు గడిచాయి. సుదూరంగా మరో దీవి కానవచ్చే సరికి కాస్త ఊరట, కాస్త భయం. నెమ్మదిగా తీరానికి చేరుకుని, ఉన్నవాటిలో కాస్త పెద్ద చెట్టెక్కి శాఖల మధ్య కాస్త వీలు చూసుకుని బడలికతో నిద్రపోయాము. తెల్లవారుతుండగా మెలకువ వచ్చింది. మేమున్న చెట్టును చుట్టుకుని పాకుతూ వస్తున్నదో మహాసర్పం. మండుతున్న కళ్లు, బుసలు కొడుతూ, అది తన రెండుగా చీలిన నాలుకను బయటకు, లోనికి లాగుతూ, పడగవిప్పి కోరలను చూపించేసరికి మా గుండె చప్పుడు లయతప్పింది. ఆ భయంకర కొండచిలువ దానికందుబాటులో ఉన్నవాడిని ఒక్క గుక్కలో మింగివేసి మెలికలు తిరుగుతుంటే ఆ దురదృష్టవంతుడి ఎముకలు పటపట విరగడం మాకు స్పష్టంగా వినవచ్చి మాకు ముచ్చెమటలు పోసాయి.

ఈ సముద్ర ప్రయాణంలో కొండముచ్చుల్ని తప్పించుకున్నాను, మహా కాయుడైన రాక్షసుడికి వేపుడు నంజు కాకుండా బతికాను, చివరకు కొండచిలువ పొట్టలో జీర్ణం కాబోతున్నానన్న ఆలోచన నాకు కన్నీళ్లు తెప్పించింది. “దైవమా! నీదే భారం” అనుకుని కనులు మూసుకుని దేవుని ప్రార్థించాను.

మా ముగ్గురిలో ఒకడిని మింగి ఆ కొండచిలువ పోగానే మేమిద్దరం చెట్టు దిగివచ్చి దీవి అంతా కలయదిరిగి ఆకలేసినపుడు కాసిని పళ్లు తిని, ఏటి నీళ్లు తాగి సాయంకాలానికి కాస్త సురక్షితమనుకున్న పెద్ద చెట్టెక్కి చిటారుకొమ్మల్లో గుబురు ఆకుల మాటున దాక్కున్నాము. నాతో ఉన్న మిత్రుడు గజగజా వణుకుతూ మరింత పైకెగబాకి నాకన్నా పైనున్న శాఖలలో చెట్టుకొమ్మను కావలించుకుని గజగజ వణుకుతున్నాడు.

వాడి దురదృష్టమేమో ఆ కొండచిలువ భయంకరంగా బుసలు కొడుతూ వచ్చి కదుల్తున్న చెట్ల కొమ్మల మధ్య వణుకుతున్న మిత్రుడిని పసికట్టి గుటుక్కున మింగింది. అతడి శరీరం దాని మెలికలలో తిరుగుతూ ఉండగా ఎముకలు విరుగుతున్న చప్పుడు స్పష్టంగా వినవచ్చింది. ఫలహారం ముగించుకుని ఆ మహాసర్పం చెట్టు వదిలి అడవిలోకి అదృశ్యమైంది.

అది వెళ్లిపోయినాక నాకు కాస్త ధైర్యం చిక్కి చెట్టు దిగి సముద్రం వద్దకు వెళ్లాను దూకి చచ్చిపోదామని. మరల ఏదో ఆశ. ధైర్యం కూడగట్టుకుని ఓ ఉపాయ మాలోచించాను. కొండచిలువ బారిన పడకుండా నా చుట్టూ పదునుగా కొనలున్న దుంగలను గట్టిగా కట్టుకుని ఒక కవచంలా ఏర్పరచుకుని నేలమీద పడుకున్నాను. చీకటి పడుతుండగా ఆ మహాసర్పం రానేవచ్చింది. బుసలు కొడుతూ నన్ను మింగడానికి ప్రయత్నించినపుడు ఆ దుంగల కొసలు దాని గొంతును గాయపరచడంతో నన్ను కక్కలేక మింగలేక విసిరికొట్టడానికి ప్రయత్నించినా, నా అదృష్టవశాత్తు ఓ కొయ్యదుంగ కొస పదునుగా ఉండి దాని గొంతును చీల్చివేయగా అది బాధతో బుసలుకొడుతూ తల అటూ యిటూ ఊపుతుంటే దాని ముక్కుల నుంచి వెడలుతున్న పొగల దుర్గంధం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## * 301వ రాత్రి కథ *

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

సింద్‌బాదు నావికుడు చెబుతున్నాడు- ఆ కొండచిలువ ఆగ్రహంతో బుసలు కొడ్తూ అతి ప్రయాసతో కట్టెల కవచంలో రక్షింపబడిన నన్ను ఊసి పడేసి మూలుగుతూ వెళ్లిపోయింది. అది వెళ్లిన గంటకుగాని చచ్చుబడిపోయినట్లున్న నా దేహం మరల నా స్వాధీనంలోకి రాలేదు. నెమ్మదిగా సముద్ర తీరంవేపు వెళ్లేసరికి దూరంగా నౌక ఒకటి కానవచ్చింది.

నేను చెక్కలతో ఓ బల్లకట్టు తయారుచేసి దానిపై కూర్చుని వడివడిగా దానిని నీళ్లలో తోసుకుంటూ ఓ పెద్ద కర్రకు నా అంగీ తగిలించి ఊపుతూ కేకలు పెడ్తూ నౌక వేపు బయల్దేరాను. అదృష్టవశాత్తు ఆ నౌక నేనున్న వేపు రావడంతో ఆ నౌకలోని నావికులు నన్ను రక్షించి లోపలికి లాగారు. ఎన్నిరోజులు నిద్రపోయానో నాకు తెలీదు కాని మెలకువ వచ్చేసరికి నేను పడిన కష్టాలన్నీ జ్ఞాపకాలై నేను మునుపటి సింద్‌బాద్‌నైనాను.

మరో రేవు పట్టణం వస్తుందనగా నావికాధికారి వ్యాపారస్తుల సమావేశం ఏర్పాటు చేసి అన్నాడు- “మిత్రులారా, మనం సముద్రం నుంచి రక్షించిన ఈ వ్యక్తిని చూస్తుంటే నాకు జాలి పుడ్తున్నది. మీకభ్యంతరం లేకపోతే కొన్నేళ్ల క్రితం

మన నౌక నుంచి విడివడిన వ్యాపారస్తుడి సరుకు ఇంకా మన నౌకలో ఉన్నది. ఇతడు ఆ సరుకును అమ్మి సంపాదించిన లాభంలో సగం ఇతడికి, మిగతా సగం ఆ వ్యాపారస్తుడికి ఇద్దాము. ఆ రకంగా మనందరం దైవపు కరుణను పొందవచ్చు".

వాళ్లతో వెళ్లి ఆ సరుకును చూడగానే ఆశ్చర్యంతో మాట రాలేదు. దానిమీద 'సింద్‌బాద్' అని స్పష్టంగా వ్రాసి ఉన్నది. నేనానందపడిపోతూ– "నేనే ఆ సింద్‌బాద్‌ను" అనగానే అందరూ నావేపు చూసారు. నేనన్నాను– "మిత్రమా! వాటిలో ఏమేమి ఉన్నాయో చెబుతాను" అని ఆ సరుకుల వివరాలు, నేను వాటిలో సురక్షితంగా దాచిన రశీదులు, నగదు ఉన్న మూటను గుర్తించగా వాళ్లు ఆ మూటలు విప్పి చూసారు. అన్నీ నేను చెప్పినట్లే ఉండడంతో వాళ్లు ఆశ్చర్యపోయారు.

నేను సర్పాల లోయ చేరుకోవడం, మాంసఖండాలను వంటికి కట్టుకుని లోయనుంచి బయట పడడం నుంచి, మూడవ సాహసయాత్రలో కొండముచ్చుల దాడి, మహాకాయుడైన రాక్షసుడు, కొండచిలువల బారిన పడి రక్షింపబడడం, ఆ తరువాత ఈ ఓడ చేరడం – ఈ విషయాలన్నీ సవిస్తరంగా వివరించాను.

అందరి సమక్షాన నావికాధికారి నా సరకులను నాకప్పగించి వ్యాపార పత్రాలు వ్రాయించినాడు. ఈలోగా సర్పాలలోయలో నాకు పరిచయమైన వ్యాపారి వచ్చి నన్ను గుర్తుపట్టి– "మిత్రమా, బాగున్నావా! ఎంత మారిపోయావు" అని పలకరించాడు.

తరువాత మేము దిగిన రేవు పట్టణాలలో ముఖ్యంగా సింధునదీ ద్వీపాలలో సరుకును లాభాలకమ్మి మరింత ధనము నార్జించాను. శలాహిత దీవి, సింధు ద్వీపాలు దాటి వెళ్తూ సముద్రంలో ఆవులా ఉండే చేపలను, గాడిద ముఖమున్న మత్స్యాలను, పెద్దపెద్ద నత్తగుల్లల నుంచి వెలువడిన పక్షులను, సముద్రంపై ఈదులాడే పక్షులను చూసాను.

ఆ తరువాత కొన్ని దినాలు ప్రయాణించి మేము బస్రా పట్టణాన్ని చేరుకున్నాము. అక్కడి నుంచి బాగ్దాద్ చేరుకుని, ఆందోళన చెందుతున్న నా కుటుంబానికి ఆనందాన్ని కలిగించాను. పేదసాదలకు, అనాథ పిల్లలకు, వితంతువులకు పెద్ద ఎత్తున దాన ధర్మాలు చేసి హాయిగా కాలం గడిపాను.

హమాలీ సింద్‌బాద్, నేను పడిన కష్టాల ప్రతిఫలమే ఈ సంపదలు, భోగభాగ్యాలు. రేపు నాలుగవ సాహసయాత్ర గురించి చెబుతాను. మిత్రులందరికీ ఇదే నా ఆహ్వానం" అన్నాడు నావికుడు సింద్‌బాద్.

"అందరూ రేపు తప్పకుండా రావాలి!"

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

# * 301వ రాత్రి కథ *

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

## సింద్‌బాద్ నాలుగవ సాహస యాత్ర

సాహసయాత్రలలో ఉన్న మజా ఇంటిలో కూర్చుని విందు వినోదాల్లో కాలం గడుపుతుంటే రాదు కదా! ప్రయాణీకుడి మనసు ఎప్పుడూ స్థిర నివాసంపైన ఉండదు. బాగ్దాద్‌లో విలువైన వస్తువులు కొని మరల నౌక నెక్కాను.

ఈసారి వ్యాపారం మరింత లాభకరంగా సాగింది. దీవులు, రేవులు, తీరాల్లో ఆగుతూ, వ్యాపారం చేస్తూ, వస్తువుల క్రయ విక్రయాలతో లాభార్జన చేస్తూ పోతుంటే రోజులు, నెలలు క్షణాల్లా గడచిపోయాయి. అయితే ఒకరోజున అకస్మాత్తుగా ఆకాశాన మబ్బులు కమ్మి కుండపోతగా వాన కురిసి, పెను అలలతో సముద్రం అల్లకల్లోలమై ఓ పెద్ద అల మా నౌకకు తాకగా అది ముక్కలై మేము సముద్రం పాలైనాము. నాకు దొరికిన కొయ్యదుంగను కావలించుకుని నేను శాయశక్తులా ఈదుతూ తీరానికి చేరుకున్నాను. అనేకమంది ప్రయాణీకులు జలసమాధి కాగా మేం కొద్దిమందిమి తీరానికి సురక్షితంగా చేరుకోగలిగాము.

దైవానికి కృతజ్ఞతలు తెలిపి మేము తీరాన నడుస్తుండగా, చీకటిలో దూరంగా కాగడాల వెలుగులో ప్రకాశిస్తున్న భవనమొకటి కానవచ్చింది. ఆ భవనం దగ్గరకు పోగానే నల్లటి బానిసలు, మమ్మల్ని చుట్టుముట్టి ఈటెలతో పొడుస్తూ భవనంలోకి నడిపించి, పశువుల్ని మందవేసి తోలుకు పోతున్నట్లు తీసుకుపోయి ఓ పెద్ద ఆవరణలో ఉంచినారు. అక్కడ ఎదురుగా ఉన్నత సింహాసనంపై వాళ్ల రాజు కూర్చుని మావేపు చూసి సేవకులకు సంజ్ఞ చేసినాడు. వెంటనే వాళ్లు నేనెన్నడూ కనీవిని ఎరగని భక్ష్యాలను మా ముందుంచినారు. నాకు ఆకలి లేదు.

కాని నా సహచరులు వెంటనే ఆ భక్ష్యాలను లొట్టలేస్తూ తిని, పండ్ల రసాలను ఆనందంగా తాగి తూలుతుంటే నగ్న బానిసలు తింటున్నవారి శరీరాలకు సువాసనల లేపనాన్ని వ్రాసి వింజామరలతో వీస్తుంటే, నా కళ్లముందరే వాళ్ల దేహాలు, పొట్టలు పెరిగి గంగాళాల పరిమాణానికి చేరుకున్నాయి.

నాకు భయం వేసింది. ఏదీ తినలేదు, తాగలేదు గనక నేను బక్కగానే ఉండిపోయాను. తరువాత నాకర్థమయ్యింది- ఈ భవనంలోని వాళ్లు నరమాంస భక్షకులని. వీళ్లు తమకు దొరికిన వాళ్లకు మద్య మాంసాలిచ్చి వారి మాంసం మరింత రుచికరంగా ఉండేట్లు చేస్తారని.

వాళ్ల రాజు రోజుకో బందీ మాంసాన్ని ఇష్టంగా తిని మిగిలింది సేవకుల కిస్తాడు. నా మిత్రులు వాళ్లు పెట్టిన తిండి తింటుండగా శరీరాలు లావై మెదడు పనిచేయకుండా పోయింది. పశువుల్లా వాళ్లు మేస్తున్నారు. ఆ రాజు, అతడి ప్రజలు నరమాంసాన్ని పచ్చిగా తింటున్నారు.

భయంతో నేను మరింత బక్కచిక్కాను. జబ్బుపడిన పశువును మనమెలా దూరంగా పడవేస్తామో, వాళ్లు నన్నూ ఓ మూలకు పారవేశారు. వాళ్లొకరోజున విందు వినోదాల్లో మునిగి ఉన్నపుడు నేను తప్పించుకుని ఏపుగా పెరిగిన గడ్డిలో దాక్కుని పాక్కుంటూ ఆ నరమాంస భక్షకుల నుంచి తప్పించుకుని ఆరు రాత్రుళ్లు ఆరు పగళ్లు నడుస్తూనే ఉన్నాను. ఆకలేసినపుడు చెట్లనుంచి రాలిన పళ్లను ఏరుకుని తింటూ దాహమేసినపుడు సెలయేటి నీళ్లు తాగుతూ ఎనిమిదవ రోజుకు అవతలి పక్క సముద్ర తీరానికి చేరుకున్నాను.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 302-303వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు- ఆ దీవికి ఆవలి పక్కన నాలాంటి వాళ్లు కానరావడంతో నాకు కాస్త భయం తగ్గింది. వాళ్లు అక్కడ ఉన్న మిరియాల చెట్ల నుంచి మిరియాలు పోగుచేస్తూ నా భాషలోనే మాట్లాడుతూ ఉండడంతో నేను వారిని పలకరించి నా దుస్థితి గురించి చెప్పాను. వాళ్లు నన్నాదరించి ఆహార

పానీయాల నిచ్చి తమ నౌకలో నన్ను వాళ్ల దేశానికి తీసుకువెళ్లి వారి ప్రభువుకు అప్పజెప్పినారు.

ఆ ద్వీపపు రాజధాని ఎంతో భాగ్యవంతమైనది. విశాలమైన వీధులు, సంతలు, వివిధ వస్తువుల క్రయవిక్రయాలతో ఎల్లప్పుడూ సందడిగా, జన సమ్మర్ధంతో క్రిక్కిరిసి ఉన్నది. నేను గమనించిన విశేషమేమిటంటే వారి దగ్గర అద్భుతమైన గుర్రాలున్నాయి, వేగంగా పోతున్న అశ్వికులున్నారు కాని ఆ గుర్రాలపై జీనులు కాని, వాటికి కళ్లేలు కాని లేవు. వాటి ప్రాముఖ్యత గురించి ప్రభువుకు విన్నవించగానే ఆతడు వాటిని తయారుచేసి చూపించమని కోరినాడు.

నేను ఆ పట్టణంలోని నేర్పరియైన వడ్రంగితో చెక్కతో చక్కని 'జీను' తయారు చేయించి దానిపై నూలు, పట్టు వస్త్రాల మెత్తలనమర్చి, చర్మంతో చేసిన పటకాలను ఏర్పరచాను. లోహకారుడి సాయంతో కళ్లేలను, గుర్రపు నాడాలను తయారు చేయించి వాటిని రాజుగారి కిష్టమైన గుర్రానికమర్చగా ప్రభువు ఆ గుర్రంపై కూర్చుని హాయిగా స్వారీ చేసినాడు. దానితో నాకు ప్రత్యేక పదవి నొసగి గౌరవించినాడు. రాజ్యంలోని ఇతర ప్రముఖులు నాకు అనేక కానుకలనిచ్చి, తమ గుర్రాలకు జీనులు, కళ్లేలను తయారు చేయించుకున్నారు. కొద్దికాలంలోనే నేను ప్రభువుకు ఆత్మీయుడిగా, గొప్ప ధనంతుడిగా గౌరవింపబడ్డాను.

ఒకరోజు ప్రభువు అన్నాడు– "సింద్‌బాద్, నీవు ఈ దేశపు పౌరుడివైనావు. నీవు స్వదేశానికి వెళ్లిపోతావన్న భయం మాలో ఉన్నది. అయినా ఎంతకాలం ఇలా ఒంటరిగా కాలం గడుపుతావు? నీకు ఉన్నత వంశ సంజాతురాలైన యువతితో వివాహం చేస్తాను. మాకు ఆత్మీయుడవై చిరకాలం సుఖంగా జీవించు!"

"తమ ఆజ్ఞ నాకు శిరోధార్యం!" అన్నాను నేను.

ప్రభువు వెంటనే కాదీలను పిలిపించి అత్యంత ధనవంతురాలు, సౌందర్యవతి అయిన కులీన యువతితో నాకు వివాహం చేసినాడు. ప్రభువు నాకో విశాలమైన భవనాన్ని, సంపదలను, సేవకులను కానుకలుగా ఇచ్చినాడు.

నాకు బాగ్దాద్ వెళ్లాలన్న కోరిక ఉన్నా నా భార్య నాపై చూపుతున్న ప్రేమ, అనురాగాలు, ఆ దేశ ప్రభువు ప్రజల ఆదరాభిమానాలు ఆ కోరికను అణచివేసాయి. క్రమేపీ నాకు ఆ ద్వీపంలోని ఆచార వ్యవహారాలు అర్థం కాసాగినాయి.

ఒకరోజున నా పొరుగువాడు, మిత్రుడి భార్య తీవ్ర వ్యాధితో మంచం బట్టి కన్నుమూసింది. నేను అతడిని ఓదార్చడానికి వెళ్లి అన్నాను– "దైవ నిర్ణయాలు మనకర్థం కావు. ఆమె స్వర్గానికి వెళ్లిపోయింది. కొన్నాళ్లకు నీవు ఈ దుఃఖ బాధ నుంచి విముక్తుడివవుతావు. చిరకాలం జీవిస్తావు".

అతడు నావంక ఆశ్చర్యంగా చూసి అన్నాడు– "మిత్రమా, నేనింకా బతికేది ఓ గంట మాత్రమే. నాకు చిరకాలం బతికే అవకాశమే లేదు. నీకు ఈ దేశపు ఆచారాలు పూర్తిగా తెలిసినట్లు లేదు. ఇక్కడ భార్య చనిపోతే భర్తను సజీవంగా ఆమెతోపాటు మృత్యుబావిలోకి నెట్టివేస్తారు" నాకు నోటమాట రాలేదు. గంట గడిచేసరికి బంధుమిత్రులందరూ పోగైనారు. సర్వాలంకార భూషితయైన అతడి భార్య శవాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు. ఆ శవం పక్కన దిగాలుగా నడుస్తున్నాడు నా మిత్రుడు. శవయాత్ర దూరంగా ఉన్న బావివేపు సాగింది. ఆ బావి సముద్ర తీరాన ఉన్న ఓ ఎత్తైన కొండపక్కన ఉన్నది. అందరూ ఆ బావి వద్దకు చేరుకోగానే ఇరవైమంది బలిష్ఠులు ఆ బావిపైనున్న రాతి గుండును పక్కకు లాగినారు. ఖర్జూరపు చెట్టంత లోతున్న ఆ బావిలోకి ఆమె శవపేటికను దించి, ఆ తరువాత నా మిత్రుడికి ఏడు రోజులకు సరిపడా ఏడు రొట్టెలను, మంచినీరున్న కూజాను ఇచ్చి నడుముకు తాడుకట్టి, దుఃఖితుడై, నిర్లిప్తంగా ఉన్న అతడిని బావిలోకి దింపి, తాడు ముడిలాగి, మరల రాతిగుండును బావిపై జరిపి ఆ భార్యాభర్తల గుణగణాలను కీర్తిస్తూ, పాటలు పాడుతూ ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. నాకు గుండె దడదడలాడింది.

కొన్ని నెలలు గడిచాయి. నేను వైవాహిక ఆనందాన్ని అనుభవిస్తూ కాలం సుఖంగా గడుపుతున్నాను. కాని దురదృష్టమేమో ఓ మహమ్మారి ఆ దేశపు ప్రజలకు సోకి చాలామంది ప్రజలను బలి తీసుకున్నది. అదే వ్యాధితో నా భార్య కన్నుమూసింది. ఆ వార్త తెలియగానే నన్ను ఓదార్చడానికి ప్రభువు, ఇతర ఉన్నత కుటుంబీకులు, నా భార్య తరపు బంధుమిత్రులు వచ్చారు. నావేపు జాలిగా చూస్తూ నన్ను అనునయిస్తున్నారు. ప్రభువుతో నేనన్నాను– "నేను పరదేశీని కదా, మీ ఆచార వ్యవహారాలు నాకు వర్తించవనుకుంటా?". అతడన్నాడు– "భార్యతో సహగమనం చేసే గొప్ప అదృష్టం నీకు కలిగింది. మనం ఎప్పటికైనా చనిపోయే వాళ్లమే. కాని నీ సహగమనం నీకు కీర్తిప్రతిష్ఠలనిస్తుంది" అని వెళ్లిపోయాడు రాజు.

నేనెంత మొత్తుకున్నా నా గొడవనెవరూ పట్టించుకోలేదు. నన్ను యధావిధిగా నా భార్య శవంతో పాటు బావిలోకి దించారు. నేను తాడు ముడి విప్పకుండా గుంజుతూనే ఉన్నాను. వాళ్లకు విసుగు పుట్టిందేమో తాడును బావిలోకి వదిలి పైన బండరాతితో మూసివేయగా లోపలంతా కటిక చీకటి, దుర్వాసన. నాకు వాంతి వచ్చినట్లనిపించింది.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

# * 304వ రాత్రి కథ *

**షహర్జాది కథ చెప్పసాగింది-**

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు- "కొద్దిసేపటికి నన్ను నేను సంబాళించుకున్నాను. ఎన్నోసార్లు మృత్యు నోటివరకు వెళ్లివచ్చిన వాడినే కదా! ఏదైనా బయటపడే దారి దొరకకపోతుందా అన్న ఆశ నాలో క్రమేపీ ఎక్కువైంది. శవాలు, అస్థిపంజరాల మీద నడుచుకుంటూ అటూ ఇటూ తారట్లాడాను. సర్పాల లోయలో బతికి, నరమాంస భక్షకుల నుంచి తప్పించుకుని, కొండచిలువ కోరల నుంచి బయటపడి చివరకు ఈ శవాల బావిలో శిధిలమవ్వాలని దైవం నిర్ణయించాడా? నాలో ఏదో ఆశ నాకు ధైర్యాన్నిచ్చింది. నా దగ్గర ఉన్న ఏడు రొట్టెలను కొద్దికొద్దిగా తింటూ, నీటిని పొదుపుగా తాగుతూ బావి లోపల భాగాన్ని నిశితంగా పరీక్షిస్తూ పోయాను. నిజానికి ఆ బావి ఓ కొండగుహలోకి దారితీస్తున్నదేమో... ఈలోగా బావిపై బండరాయి తొలగించబడగా ఓ మగవాడి శవం, అతడితోపాటు బిక్కుబిక్కుమంటూ రోదిస్తున్న ఓ స్త్రీ బావిలోకి దింపబడినారు. బండరాతితో బావి మూయగానే భయంతో ఆ స్త్రీ మరణించిందేమో, నేను వెళ్లి ఆమెను కదిలించే సరికి ఆమెలో ఏ చలనమూ లేదు. ఆ దుర్వాసనకు, చావు భయానికి గుండె ఆగి మరణించి ఉంటుంది. నేను ఆమెతో ఉన్న సంచిలోని ఏడు రొట్టెలు, నీటి కూజాను తీసుకుని నా స్థావరానికి చేరుకున్నాను. ఇలా కొన్నాళ్లు గడిచాయి. ఒకరోజున ఏదో జంతువు కేక, నక్క ఊళలా వినిపించి అటువేపు వెళ్లాను. ఎముకల గుట్టలను తొలగించుకుంటూ గుహలాంటి దానిలో నడుస్తూ ఓ వంద అడుగులు వేసేసరికి దూరంగా బంతి పరిమాణమున్న రంధ్రంలోంచి వెలుగు కానవచ్చింది. నా ఆనందానికి అంతేలేదు.

ఎముకల గుట్టలను దాటుకుంటూ, వాటిని ఓ నిచ్చెనలా అమర్చుకుంటూ ఆ రంధ్రాన్ని ఎముకలతో పెద్దదిగా చేస్తూపోయాను. ఓ మనిషి పట్టేంత రంధ్రం చేసి తల బయటకు పెట్టి చూద్దునుగదా ఆ తెల్లవారుజామున నన్ను చూసి ఓ నక్క భయపడి ఊళవేస్తూ పారిపోయింది. నేను పాక్కుంటూ బయటకు వచ్చి సముద్ర తీరాన్ని చూసి వివశుడినై ఆ దైవానికి కృతజ్ఞతలు తెలుపుతూ అలానే ఉండిపోయాను.

తేరుకున్నాక నాలో కొత్త జవసత్వాలు రాగా కొత్త ఆలోచనలు కొత్త ఆశలు చిగురించాయి. నెమ్మదిగా పాక్కుంటూ ఆ మృత్యుబావిలోకి ప్రవేశించి శవాలపై కప్పిన విలువైన వస్త్రాలను, ఆభరణాలను, విలువైన వస్తువులను, కెంపులు, మరకతాలు, కంకణాలు, కంఠహారాలు, ఉంగరాలు, వెండి బంగారు పాత్రలను మూటకట్టి ఓ కొండగుహలో దాచి ఉంచాను.

అదృష్టవశాత్తు ఓ రోజున అటుగా వెళ్తూ ఓ నౌక కనిపించింది. నన్ను గమనించిన నావికులు నాకోసం చిన్న పడవను పంపగా దానిలో నా వస్తువుల మూటను వేసి ఓడనెక్కాను. నావికాధికారి అన్నాడు– “నేనెన్నో సార్లు ఈ తీరం వెంబడే ప్రయాణించాను. ఏనాడూ నాకు మనిషి జాడ కానరాలేదు. ఎప్పుడూ రాబందులూ, నక్కలు అటుయిటూ తిరుగుతూ కనిపించేవి”.

నేను జరిగిన కథంతా చెప్పగా ఆశ్చర్యచకితుడైన నావికాధికారి నన్ను ఆదరించినాడు. ఆ నౌకలోనే నేను బస్రా రేవుకు చేరుకున్నాను. నన్నెంతగానో ప్రేమించిన నా భార్య జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. బస్రా నుంచి బాగ్దాద్‌లో నా ఇంటికి చేరుకుని, బంధుమిత్రులందరూ సంతోష సంభ్రమాలతో నన్ను ఆహ్వానించగా కొన్నాళ్లు జీవితాన్ని హాయిగా గడిపాను.

దైవానికి కృతజ్ఞతలు తెలిపి, పేదసాదలకు దానధర్మాలు చేసి ఇకచాలు సాహసయాత్రలనుకుని విందు వినోదాలలో కాలక్షేపం చేయసాగాను. అయితే దైవనిర్ణయం వేరుగా ఉన్నట్లున్నది.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 306వ రాత్రి కథ *

షహర్జాదీ కథ చెప్పసాగింది-

మరుసటి రోజున హమాలీ సింద్‌బాదు యధావిధిగా నావికుడు సింద్‌బాద్ భవనానికి చేరుకున్నాడు. అతిధులందరూ విందు వినోదాలలో సంతృప్తులై సింద్‌బాద్ అయిదవ సాహసయాత్రను వినగోరి నిశ్శబ్దంగా కూర్చున్నారు.

## సింద్‌బాద్ అయిదవ సాహస యాత్ర

"కాలికి చక్రాలున్నవాడు కదలకుండా కూర్చోలేడు. సాహస యాత్రల ఒడిదుడుకుల ననుభవించినవాడు సుఖశాంతుల జీవితాన్ని ఆనందించలేడు. నేనూ అంతే!" సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు–

విలువైన సరుకులను బేళ్లుగా చేసి బాగ్దాద్ నుంచి బస్రాకు వెళ్లి వ్యాపార నౌకనొకదానిని కొని నిజాయితీపరులైన వ్యాపారస్తులు ప్రయాణీకులుగా అనుభవజ్ఞుడైన నావికాధికారి నేతృత్వంలో చక్కటి వాతావరణంలో సముద్ర ప్రయాణం ప్రారంభించాము. అనేక రేవులలో ఆగి క్రయ విక్రయాలు చేసి లాభాలు పొంది ఆనందోత్సాహాలతో ఉన్న ప్రయాణీకులు ఓ దీవివద్ద ఆగి లోపలికి వెళ్లారు. వెళ్లినవాళ్లు అక్కడ తెల్లగా కనిపించిన భవనంపై రాళ్లు విసరగా అది పగిలి సొన ప్రవహించింది. ఆ గుడ్డులోని పిల్లపక్షిని బయటకు లాగి చంపి ముక్కలు ముక్కలు చేసి పట్టుకువచ్చి నౌకలో ఉన్న నాకు చూపించారు. నేను వాళ్లకు అది రుక్ పక్షి గుడ్డుగా చెబుతూ ఆ పక్షి వస్తే ఏ అనర్థాలు జరుగుతాయో అని భయపడుతూ నౌకను వెంటనే అక్కడ నుంచి తీసుకుపొమ్మని సరంగును ఆదేశించాను. వ్యాపారులు తాము తెచ్చిన పక్షి మాంసాన్ని కాల్చి తింటున్నారు. నౌక బయల్దేరింది కాని ఆకాశాన పెద్ద మబ్బుల్లా రెండు రుక్ పక్షులు కమ్ముకోవడంతో అంతా చీకటి మయమయ్యింది. క్రమేపీ అవి నౌకపైకి వచ్చాయి. వాటి కాలి గోళ్లలో పెద్దపెద్ద బండరాళ్లు. అవి వాటిని మా నౌకపై జారవిడిచాయి. పెద్దగా భీకరంగా అరుస్తూ, రెక్కలు పటపటలాడిస్తూ. ఒక బండరాయి దాదాపుగా నౌకపై పడే సమయంలో సరంగు చాకచక్యంతో నౌకను పక్కకు తిప్పాడు. నౌకకు దగ్గరలో రాయి పడడంతో అలలు ఉవ్వెత్తున లేచాయి. కాని, రెండవ పక్షి వదిలిన రాయి సరాసరి తెరచాప

స్తంభంపై పడగా నౌక ముక్కలై అందరం నీళ్లపాలైనాము. కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

నేనూ, కొంతమందిమి దొరికిన దుంగల్ని పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాము. ఆ అలల తాకిడికి ఎవరెటుపోయారో, ఎంతమంది మునిగిపోయారో, దేవుడికే తెలుసు. నేను చచ్చీచెడి ఆ దుంగ సాయంతో ఏదో దీవి తీరానికి చేరుకున్నాను.

కాసేపు విశ్రాంతి తీసుకుని దీవిలో అటూ ఇటూ తచ్చాడుతుంటే నాకు దూరంగా పక్షుల కిలకిల రవాలు వినిపించాయి. అటుపోయి చూడగా అత్యంత సుందరమైన పండ్లతోట బంగరు ఫలాలున్న చెట్లతో, వెండిలా మెరుస్తున్న సెలయేళ్లతో, వివిధ వర్ణపు పూలమొక్కలతో కమనీయంగా కానవచ్చింది. నేనా తోటలోకి వెళ్లి కమ్మని పళ్లు తిని, తియ్యటి నీళ్లు తాగి ఆకుపచ్చని తివాచీలా ఉన్న పచ్చికపై, సువానలీనుతున్న పూలమొక్కల మధ్య హాయిగా నిద్రపోయాను.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

# * 307వ రాత్రి కథ *

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

సింద్‌బాద్ చెబుతున్నాడు– ఆ తోటలో హాయిగా నిద్రపోయాను. అర్ధరాత్రి మెలకువ వచ్చింది. ఎందుకో తెలీని భయం నన్నావరించగా ఇక నిద్ర పట్టలేదు. కొద్దిసేపు నిద్రపట్టినా పీడకలలు నన్ను భయభ్రాంతుడిని చేసాయి. తెల్లవారినాక దీవిలో అటు ఇటూ తిరుగుతుండగా ఓ చెరువు కనిపించింది. దాని ఒడ్డున ఓ వృద్ధుడు ఆకులతో కుట్టిన అంగీ తొడుక్కుని కూర్చుని ఉన్నాడు. అతడూ నాలాగే ఓడ ప్రమాదంలో చిక్కుకున్న నావికుడిగా భావించాను నేను.

అతడి వద్దకు వెళ్లి వినయంగా నమస్కరించి అన్నాను– “తమరెవరు, ఓ మహానుభావా! నేను నావికుడిని. ఓడ ధ్వంసమై ఈ దీవిలో చిక్కుకున్నాను”.

అతడు మాట్లాడలేదు. కాని ఏవో సంజ్ఞలు చేసినాడు. “తాను నడవలేని స్థితిలో ఉన్నానని భుజాలపై కెక్కించుకుని కాస్త దూరం తీసుకుపోగలవా” అని అడుగుతున్నాడని అర్థమైంది. అతడిపై జాలితో అతడి ముందు మోకాళ్లపై

కూర్చున్నాను. అతడు వెంటనే నా భుజాలపై కూర్చుని, నా మెడచుట్టూ తొడలను బిగించి నన్ను తన పాదాలతో డొక్కలో పొడిచి లేవమన్నట్లు అరచినాడు. ఒక్కక్షణంలో మారిన అతడి ప్రవర్తనకు ఆశ్చర్యపోయి అతడిని వదిలించుకో బోయాను. నేను విదిలించినకొద్దీ అతడు నా మెడను మరింత గట్టిగా నొక్కి నాకు ఊపిరాడకుండా ఉక్కిరిబిక్కిరి చేయడమేగాక తన చేతి గోళ్లతో రక్కడం మొదలెట్టినాడు. చేసేదేమీలేక ఆ దుర్మార్గుడిని నా భుజాలపై మోస్తూ లేచి నిలబడి వాడు చూపించిన వేపు వెళ్లసాగాను. వాడి కాళ్లు నల్లగా, మొరటుగా, వెంట్రుకలతో నిండి బర్రె కాళ్లంత దృఢంగా ఉన్నాయి. రోమాలతో ఎలుగుబంటి చేతుల్లా ఉన్న చేతుల్తో వాడు నా జుట్టు పట్టుకుని గుర్రపుస్వారీ చేస్తున్నట్లు నాపై స్వారీ చేయసాగినాడు.

వాడిని విడిపించుకోబోతే ఈసారి వాడు తన తొడలతో నా పీకను గట్టిగా నొక్కేసరికి నాకు ఊపిరాడక కళ్లుతిరిగి స్పృహతప్పి నేలపై పడిపోయాను. కాసేపటికి మెలకువ వచ్చి చూసేసరికి నాకర్థమయ్యింది, వాడు కాళ్లు వదులు చేసాడని. నాకు మెలకువ వచ్చిందని తెలియగానే వాడు తన కాళ్లతో నా పొట్టలో తన్ని లేవమని జుట్టు పట్టుకు లాగినాడు. నేను అతికష్టం మీద లేచి నిలబడగా నన్ను పండ్లచెట్ల వద్దకు నడిపించి బాగా పండిన పళ్లు కోసుకుతిని వాడికి నిద్రవచ్చి నప్పుడు కూడా నన్ను వదలకుండా అంటిపెట్టుకుని, వాడి ఘన ద్రవ పదార్థాల విసర్జన నాపై చేస్తూ నన్ను హింసించాడు. అంతటి అవమానం నేనేనాడూ పొందలేదు. నేనెంత ప్రయత్నించినా వాడు తన పట్టు విడవనూ లేదు. నాకని పించింది ఈ చావుకన్నా ఏ కొండచిలువో నన్ను మింగి ఉన్నా, ఏ నరమాంస భక్షకుడో నన్ను చంపుకుతిన్నా బాగుండేదని. చావుకన్నా అవమానం అత్యంత దుర్భరం కదా!

రోజులు, వారాలు గడిచాయి. వీడు అత్యంత కఠినాత్ముడే కాదు, చీమ చిటుక్కుమంటే గాఢనిద్రలోంచి లేచి కూర్చునేవాడు. ఇప్పుడు నా మనసులో ఉన్నదంతా వీడిబారి నుంచి ఎలా బయటపడాలనేదే. ఒకరోజున నేను ఎండిన సొరకాయలను చూసాను. వాటి లోపలి భాగాల్ని తొలిచి అక్కడ విరివిగా లభిస్తున్న ద్రాక్షపళ్లను పిండి రసాన్ని నింపి ఉంచాను. కొద్దిరోజులయ్యేసరికి అవి పులిసి ద్రాక్షసారా తయారయ్యింది. నేను చేస్తున్న ఈ పనిని నా పాలిటి యముడు అతి శ్రద్ధగా నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నాడు. ఆ ఉదయాన నేను కాస్త సారా తాగేసరికి

నాలో కొత్త ఉత్సాహం మొదలై వేగంగా నడవడం, హుషారుగా ఉండడం గమనించిన వాడు తనకూ ఇమ్మని నన్ను తన పాదాలతో నా పొట్టలో పొడవ సాగినాడు. నేను వాడికి సారా నిండిన సొరకాయ బుర్రనివ్వగా వాడు కాస్త రుచి చూసి బాగా నచ్చినట్లున్నది కాబోలు ఆత్రంగా మొత్తం తాగి, మరల ఇంకోటిమ్మని అడిగాడు. రెండుమూడు బుర్రల ద్రాక్షసారా తాగేసరికి వాడి కాళ్లు వదులైనాయి. మత్తెక్కి తూలడం మొదలై నామీద వాలిపోయినాడు. నేను వాడి రెండుకాళ్లూ పట్టుకుని నామీద నుంచి తొలిగించి నేలకు విసిరికొట్టాను. ఆ దెబ్బకు వాడి తల పచ్చడై అక్కడికక్కడే చచ్చాడు వాడు. వాడి పీడ విరగడైంది. వెంటనే వెళ్లి పక్కనే ఉన్న చెరువులో వళ్లంతా శుభ్రం చేసుకుని మూడుసార్లు మునిగితేకాని నా వంటిపై కంపరం పోలేదు.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## * 308వ రాత్రి కథ *

*షహర్జాది కథ చెప్పసాగింది-*

నావికుడు సింద్‌బాద్ చెబుతున్నాడు– ఆ వృద్ధ రాక్షసుడి పీడ వదిలించుకుని తీరం వెంబడే తిరుగుతుండగా, అటుగా వచ్చిన నౌకలో నావికులు తీరానికి వచ్చి నా కథ విని ఆశ్చర్యపడి, నన్నాదరించినారు.

వాళ్లన్నారు– "ఈ వృద్ధుడి గురించి అనేక గాథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. సముద్రపు వృద్ధుడిగా, కిరాతకుడిగా ప్రసిద్ధికెక్కిన వాడితడు. అతడి బారిన పడి బతికి బయటపడింది నీవొక్కడివే!"

ఆ నౌకలో నేను వానరదీవికి చేరుకున్నాను. నాకు మిత్రుడైన వ్యాపారి చెప్పినట్లు నేను సంచిలో గులకరాళ్లను నింపుకుని కొకొవా చెట్ల లోయలోకి వెళ్లాము. అక్కడ చెట్లపై వానరాలున్నాయి. వాటిని చూడగానే నాతోపాటు వచ్చిన వాళ్లు తమ సంచులలోని గులకరాళ్లను ఆ వానరాలపై విసుర్తున్నారు. నేనుకూడా ఓ చోటుకు వెళ్లి వానరాలపై రాళ్లు విసుర్తుంటే అవి చెట్లకున్న కొకొవా కాయలను నాపై విసరసాగినాయి. సాయంకాలానికల్లా నా వద్ద బోల్డెంత కొకొవా పోగుబడింది. వాటిని నౌక వద్దకు తీసుకువెళ్లగా కొందరు వ్యాపారులు వాటిని కొని నాకు వెండి నాణేలనిచ్చినారు. వాటితో నేను ప్రయాణ సుంకము చెల్లించాను.

ఆ విధంగా ప్రతిరోజూ వెళ్లడం కొకొవా పోగు చేసుకుని రావడం, నావద్ద కూడా రెండు బేళ్ల కొకొవా పోగయ్యింది. తరువాత ద్వీపాలలో వాటినమ్మి మిరియాలు, దాల్చినచెక్క కొన్నాను. వాటిని మరో ద్వీపంలో అమ్మి ఎలొ-సుగంధాన్ని కొన్నాను. ఇలా క్రయ విక్రయాలు సాగిస్తూ కాస్త ధనవంతుడినై ఈసారి ముత్యాల రేవులో నౌక ఆగినప్పుడు అక్కడ గజ ఈతగాళ్లను పనిలోకి తీసుకున్నాను. దేవుడు నన్ను కరుణించాడు. నాకు అత్యంత విలువైన ముత్యాలు లభించాయి. అవి తెచ్చిన ఈతగాళ్లు నేనూ సమంగా పంచుకోవడంతో వాళ్లు ఇనుమడించిన ఉత్సాహంతో నాకోసం పనిచేసారు. ప్రతిసారి మాకు మేలిమి ముత్యాలు లభించాయి. నేను పడిన కష్టాలకు దైవం ఇలా నాపై కరుణ చూపుతున్నాడని భావించాను నేను. ప్రశస్తమైన మిరియాలు, సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు నా సంపదలు కాగా బస్రా చేరుకుని, నా సంపదలతో బాగ్దాద్‌లోని నా ఇంటికి చేరుకున్నాను.

యధావిధిగా నా సంపాదనలోని చాలాభాగాన్ని పేదసాదలకు దానధర్మాలు చేసి విశ్రాంతిగా కాలం గడపసాగాను.

మిత్రులారా! రేపు నా ఆరవ సముద్ర యాత్ర చెబుతాను. అందరూ రావల్సిందిగా విజ్ఞప్తి!" అని పలికి నావికుడు సింద్‌బాద్ తన మిత్రుడైన హమాలి సింద్‌బాద్‌కు అనేక కానుకలిచ్చి పంపినాడు.

మరుసటి రోజున అందరూ వచ్చినాక విందు వినోదాల అనంతరం సింద్‌బాద్ తన ఆరవ సాహసయాత్ర గురించి చెబుతున్నాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

## * 309వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

## సింద్‌బాద్ ఆరవ సాహసయాత్ర కథ

సింద్‌బాద్ చెబుతున్నాడు- విందు వినోదాలతో మొహం మొత్తగానే మరల నౌకా ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి బాగ్దాద్ నుంచి బస్రా చేరుకుని మంచి నౌకనెన్నుకున్నాను. నౌక బయల్దేరి నీలి జలాల్లో ప్రయాణిస్తూ, క్రయ విక్రయాలు జరుపగా; కొన్నాళ్లు మా ప్రయాణం సజావుగానే సాగింది.

ఆరోజు తెల్లవారుజామున నౌకాధికారి పెడ్తున్న ఏడ్పులు పెడబొబ్బలకు మెలకువ వచ్చి అందరం అతడి చుట్టూ మూగి అడిగాము ఏమయ్యిందని. అతడన్నాడు– “అర్ధరాత్రి గాలికి నౌక దారితప్పింది. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో తెలీదు” అని అతడంటూ ఉండగానే తాళ ప్రమాణమంత ఎత్తున్న అలలు మా నౌకను పైకి లేవనెత్తి పక్కనే ఉన్న పెద్ద కొండకు విసిరికొట్టాయి. ఆ దెబ్బకు మా నౌక తుత్తునియలై మేం సముద్రంలోకి విసిరివేయబడినాము. ఆ చుట్టుపక్కల ఎక్కడ చూసినా నౌకల శిధిలాలే, అస్థిపంజరాలు, ఎముకలు, సరుకుల మూటలు నాచు పట్టి గుట్టలుగా కానవచ్చాయి. ఒక కొయ్యచెక్క ఆధారంగా నేను మరికొంతమందిమి ఓ దీవి తీరానికి చేరుకున్నాము. ఆ ఇసుకతిన్నెల నిండా ప్రమాదానికి గురైన నావల నుండి కొట్టుకువచ్చిన విలువైన వస్త్రాలు, నగలు, కెంపులు, విలువైన వెండి బంగారు పాత్రలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కనుచూపు మేరలో మాకు మానవమాత్రుడు గాని జంతువులు కాని కానరాలేదు.

తీరానే నడుస్తూ పోగా మాకు ఒకచోట కొండనెర్రెలోంచి తియ్యటి నీటి ప్రవాహం దీవిలోకి ప్రవహించి అది ఓ కొండ గుహలోకి వెళ్లి అదృశ్యమైంది. ఆ ప్రవాహం పక్కనే రంగురంగుల విలువైన రాళ్లు, కెంపులు, మణి, మాణిక్యాలు చాలా పెద్దవి మెరుస్తున్నాయి. ప్రవాహానికిరువైపులా ఎంతో ప్రశస్తమైన అగరు మూలికల చెట్లున్నాయి. అవి చైనీస్, కొమరిన్ కలబందల కన్నా ఎక్కువ నాణ్యతను కలిగి ఉన్నాయి. పక్కనే అంబరు ద్రవం నల్లగా ఉన్నది ఎండవేడికి కరిగి సముద్రంలో కలవగా మైనంలా ఉన్న దానిని చేపలు మింగి వమనం చేసుకోవడంతో అది తీరానికి చేరి అంబర్‌గ్రిస్‌గా మారి కుప్పలు కుప్పలుగా పోగుబడడంతో ఆ సువాన ద్వీపమంతా వ్యాపిస్తున్నది. చేపలు మింగి వమనం చేయని అంబర్ కస్తూరి పరిమళాలను వెదజల్లుతున్నది.

అయినా, ఈ విలువైన వజ్ర వైఢ్యూరాలు, అగరు మూలికలు, వస్త్రాల బేళ్లు, నగలు, కోడిగుడ్డంత ముత్యాలు, అంబర్‌గ్రీసు ఎవరికి ఉపయోగం. ఈ ద్వీపంలో మిగిలిన ఆ అస్థిపంజరాల్లా నేనూ ఒక ఎముకలగుట్టనే కదా. ఈలోగా నాతోపాటు బతికి బయటపడినవాళ్లు విచిత్ర వ్యాధికి గురై ఒక్కొక్కరూ మరణించ సాగినారు. చనిపోయిన వారిని అక్కడ ఉన్న వస్త్రాలతో ఖననం చేసాము. చివరకు నేనొక్కడినే మిగిలాను. నేననుకున్నాను– “నేనే ముందు చనిపోయినట్లయితే నన్నూ

గౌరవప్రదంగా ఖననం చేసేవారు. ఇప్పుడు నన్ను నేనే ఖననపరచుకోవాలేమో!” అనుకున్నాను. నాకోసం ఓ గొయ్యి తవ్వి సిద్ధంగా ఉంచుకుని నా దగ్గర ఉన్న ఆహారాన్ని మరింత పొదుపుగా తింటున్నాను. అప్పుడు నాకో ఆలోచన వచ్చింది. “నెర్రెలోంచి వస్తున్న జలప్రవాహం ఓ కొండగుహలోకి పోతున్నది కదా. అది ద్వీపానికి అటువేపు వెళ్తుందేమో, అదృష్టాన్ని పరీక్షించుకుందామని” అనుకుని అగరు కట్టెలు, విరిగిపడి ఉన్న నావల చెక్కలతో ఓ పటిష్టమైన బల్లకట్టును తయారు చేసాను. వాటిపై అక్కడ పడి ఉన్న విలువైన వస్త్రాలను బేళ్ళుగా అమర్చి, విలువైన నగలు, ముత్యాలు, కెంపులు, వజ్రాలు, మణి మాణిక్యాలను మూటలుగా కట్టి, ఆ బల్లకట్టును ప్రయాణానికి అనువుగా చేసి ప్రయాణానికి సిద్ధమయ్యాను.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

# * 310వ రాత్రి కథ *

*షహర్జాది కథ చెప్పసాగింది-*

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు- ఆ ద్వీపంలో చెల్లాచెదురుగా పడి ఉన్న విలువైన పాత్రలు, వెండి బంగారు ఆభరణాలు, అగరు చెక్కలు, వస్త్రాలు, అంబర్ గ్రీసు, మణులు అన్నీ మూటలుగట్టి బల్లకట్టును ప్రవాహంలోకి దింపి బలిష్ఠమైన కర్రలను తెడ్లుగా వాడుతూ ముందుకు నడిపాను. ఆ ప్రవాహ ఉధృతికి బల్లకట్టు అటూ ఇటూ గుహ గోడలకు కొట్టుకుంటూ వేగంగా పోసాగింది. క్రమేపీ చీకటి ఆవరించడంతో నాకు భయం వేసింది. ఒక్కోసారి దారి విశాలంగా, ఒక్కోచోట ఇరుకుగా, ఒక్కోసారి తలకు పైకప్పు నుంచి పొడుచుకువస్తున్న రాళ్ళు తగిలి బొప్పి కడుతుండగానేను బల్లకట్టుపై బోర్లా పడుకుని దేవుడిపై భారం వేసి పళ్ల బిగువున ప్రయాణం సాగించాను. కొద్దిసేపటికి బల్లకట్టు పైనుంచి కిందకు పడుతున్నట్లనిపించి నేను దానిని గట్టిగా పట్టుకున్నాను. బల్లకట్లు వేగంగా కిందికి దిగి దేనికో కొట్టుకోగా నా తలకు దెబ్బతగిలి కళ్లు బైర్లుకమ్మి స్పృహ తప్పింది.

*నిరాశలోంచే ఆశా దీపపు జాడ దొరుకుతుంది*
*విశ్వాసికి దైవం ఆసరా తప్పక దొరుకుతుంది.*
*సాహసం చేయని బతుకు మొదలుచచ్చిన చెట్టు*
*ఏటికి ఎదురీదితేనే ఏదో ఒక దారి దొరుకుతుంది*

*ఆత్మఘోషను వింటే బాగుపడతావు నీవు*
*విధిరాత బాగుంటే విజయమార్గం దొరుకుతుంది.*

మెలకువ వచ్చేసరికి ఓ పదిజతల కళ్లు నావేపు చూస్తూ కానవచ్చాయి. నేను ఓ పచ్చిక మైదానంపై పడి ఉన్నాను. నా బల్లకట్టు ఓ ఏటి ప్రవాహం పక్కన కట్టబడి సురక్షితంగా ఉన్నది. వాళ్లు రకరకాలుగా నాతో మాట్లాడడానికి ప్రయత్నించారు. వారిలో ఒకడు స్వచ్ఛమైన అరబిక్ భాషలో మాట్లాడడంతో నాకు సంతోషం వేసింది.

అతడితో నేను పడిన కష్టాలన్నీ వివరించగా అతడు మిగతావారికి నా మాటలు అనువాదం చేసి చెప్పాడు. వాళ్లు నన్ను, నా బల్లకట్టును, సరుకులతో సహా ఆ ద్వీపపు రాజువద్దకు తీసుకువెళ్లారు.

ఆ దీవి పేరు శరణద్వీపం (సెరెండిప్). నా సరకులలోని ప్రశస్తమైన వస్త్రాలను, విలువైన మణులు, బంగారు కలశాలను రాజుకు కానుకలుగా ఇవ్వగా ప్రభువు ఎంతో సంతోషించి నాకు నివసించేందుకు రాజభవన ప్రాంగణంలోనే ఒక గృహాన్నిచ్చి ఆదరించినాడు. నన్ను రక్షించిన పదిమందికి నేను విలువైన వస్త్రాలు, నగలు, మణులు బహుకరించి వారిని సంతోషపెట్టాను.

ఆ ద్వీపం 24 పర్సంగుల పొడవు 24 పర్సంగుల వెడల్పు ఉన్నదని, అక్కడ ప్రపంచంలో కన్న ఎత్తైన పర్వతం ఉన్నదని; దానిపైన తొలి మానవుడు ఆదాము కొన్నాళ్లు నివసించాడని చెప్పారు. అక్కడ దొరికే ముత్యాలు, నీలాలు, ప్రపంచ ప్రసిద్ధికెక్కినవి. ఆ దీవిలో ఎక్కడ చూసినా బంగరు రంగు కాయలున్న కొబ్బరి చెట్లే.

*అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.*

## ＊ 311వ రాత్రి కథ ＊

*షహర్జాదీ కథ చెప్పసాగింది-*

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు– ఒకరోజున శరణద్వీపం ప్రభువు నన్ను పిలిచి బాగ్దాద్ ఖలీఫా అయిన హరూన్ అల్ రషీద్ పాలన గురించి, బాగ్దాద్ గురించి విశేషాలు అడిగి తెలుసుకున్నాడు.

ఆరంగుళముల ఎత్తు, అంగుళం మందమున్న కెంపు జాడీలో మేలిమి ముత్యాలు నింపి, దానికి విలువైన వస్త్రములు చుట్టి సిద్ధపరచినారు. ఓ మహాసర్పపు చర్మముతో చేసిన తివాచీ, దాని పొలుసులు స్వర్ణ దీనారమంత మందముగా ఉండి మెరుస్తున్నాయి. దానిపై పడుకున్నవారి రుగ్మత తొలగి ఆరోగ్యం సిద్ధిస్తుంది. రెండు వందలు మేలిమి కర్పూర గోళములు, పన్నెండు క్యూబిట్ల పొడవు, మొదలు వద్ద రెండు క్యూబిట్ల వ్యాసమున్న రెండు మహా ఏనుగు దంతములు; ఓ అందాల బానిస కన్య సర్వాలంకారభూషితయై ఉన్న దానిని – నాకప్పగించినాడు బాగ్దాద్ ఖలీఫాకు కానుకలుగా. వాటితో పాటు బాగ్దాద్ ఖలీఫాతో స్నేహాన్ని వాంచిస్తూ లేఖను వ్రాసి రాజముద్ర వేసి నాచేతికిచ్చినాడు.

నాకు అనేక కానుకలనిచ్చి బస్రాకు వెళ్తున్న నౌకలో నా సరుకులను ఎక్కించి నాకు వీడ్కోలు పలికినాడు. దైవకృపతో నేను ఎటువంటి ఆటంకాలు లేకుండా బస్రా, ఆ తరువాత బాగ్దాద్ చేరుకుని ఖలీఫా దర్శనానికి వెళ్లి శరణద్వీపం ప్రభువిచ్చిన లేఖను, కానుకలను సమర్పించాను.

అవి స్వీకరించిన ఖలీఫా ఆనందపరవశుడై నాకు ప్రత్యేకమైన దుస్తులనిచ్చి, నా సాహసయాత్రలను రాజోద్యోగులచే వ్రాయించి ప్రభుత్వ దస్త్రములలో భద్ర పరచినాడు. నేను ఖలీఫా ఆదరాభిమానాలు పొందినవాడినై నా ఇంటికి వెళ్లి హాయిగా కాలం గడపసాగినాను.

మిత్రులారా, రేపు నేను నా చివరి ప్రయాణం గురించి చెబుతాను. అందరూ రావాల్సిందిగా విజ్ఞప్తి.

## సింద్‌బాద్ ఏడవ సాహస యాత్ర

హమాలి సింద్‌బాద్‌తో పాటు అందరు అతిథులు వచ్చినాక సింద్‌బాద్ నావికుడు ఆఖరి సాహసయాత్రను చెప్పనారంభించాడు.

ఆరు సాహస యాత్రలలో నేను సంపాదించిన ధనంతో నేను బాగ్దాద్‌లో అత్యంత గొప్ప ధనికుడినైనాను. ఖలీఫా కూడా అప్పుడప్పుడు నాకు కబురు పంపి నా సాహస యాత్రలు, విశేషాలు విని ఆనందించేవాడు.

ఒకరోజున ఖలీఫా హరూన్ అల్ రషీద్ నన్ను పిలిచి అన్నాడు– "సింద్‌బాద్! స్నేహభావంతో శరణద్వీపం ప్రభువు నాకు కానుకలు పంపినాడు.

ఆ రాజుకు ప్రత్యుత్తరము, కానుకలు పంపాల్సిన బాధ్యత నాపై ఉన్నది. దీనికి నీవే సమర్ధుడివి".

నేను ఏమీ మాట్లాడలేకపోయాను. అయినా ప్రభువు చేతుల మధ్య నేలను ముద్దాడి అతడి ఆజ్ఞను శిరసావహించాను. ఇక సముద్ర ప్రయాణం వద్దు అని స్థిర నిశ్చయంతో ఉన్న నాకు ఖలీఫా ఆజ్ఞ పాటించక తప్పనిసరైనది. ఖలీఫా పంపిన కానుకలలో అత్యంత విలువైన ఎర్రటి వెల్వెట్ పరుపు, మరో రెండు పరుపులు, కుఫా, అలెగ్జాండ్రియన్ సిల్కుతో చేసిన నూరు వస్త్రాలు, బాగ్దాద్‌లో కుట్టిన యాభై ఉడుపులు, కార్నెలియన్ కూజా, దానిపై సింహాన్ని వేటాడుతున్న విలుకాడి చిత్రం, ప్రశస్త అరబ్ గుర్రాల జంట, ఇంకా అనేక కానుకలను ఇచ్చి, వాటితోపాటు శరణద్వీపపు రాజు క్షేమమును వాంఛిస్తూ స్నేహపూర్వకమైన లేఖను స్వహస్తముతో వ్రాసి రాజముద్ర వేసి నాకు ఇచ్చినాడు.

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 312వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు- ఖలీఫా ఇచ్చిన కానుకలతో పాటు విలువైన వ్యాపార సరుకులతో నేను బస్రాలో నౌకనెక్కాను. రెండు నెలలు గడిచేసరికి మేము సురక్షితంగా శరణద్వీపం చేరుకున్నాము. ఆ ద్వీపపు రాజును సందర్శించి ఖలీఫా ఇచ్చిన లేఖను, కానుకలను అందజేసి, ఆ ప్రభువు సత్కారాలనంది కొద్దిరోజులు అక్కడే ఉండి నా దగ్గర ఉన్న సరుకునమ్మి, మంచి ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు కొని బస్రా వెళ్లే నౌకనెక్కాను. వారం రోజులు ప్రయాణం హాయిగా గడిచింది. సిన్ దీవిని దాటిన వారం రోజులకు మా నౌక భయంకరమైన తుఫానులో చిక్కుకున్నది.

మేము దైవ ప్రార్థనలో మునిగి ఉండగా ఓడ అధికారి దిగాలుపడుతూ వచ్చి మనం ఆపదలో చిక్కుకున్నాము అంటూ తన పెట్టె మూత తెరిచి దానిలోని సంచి తెరిచి, బూడిదలా ఉన్న పొడిని నీళ్లతో తడిపి ముక్కుకు రాసుకున్నాడు. ఓ చిన్న పుస్తకాన్ని తెరిచి కొన్ని స్తోత్రాలు చదివి మావేపు తిరిగి అన్నాడు- "నా అనుమానం నిజమే! ఇప్పుడు మన నౌక రాజుల దేశపు క్షితిజరేఖ వద్దకు

చేరుకున్నది. ఇక్కడే సులేమాన్ ప్రభువు ఖననం చేయబడినాడు. ఈ ప్రదేశంలో సముద్ర రాకాసి జంతువులు, మహా సర్పాలు, భయంకరమైన మత్స్యజాతి తిరుగాడుతుంటాయి. మొత్తం నౌకను ఒక్క గుటకలో మింగగలిగిన తిమింగిలాలు ఇక్కడ చరిస్తుంటాయి. దైవ ప్రార్థన ఒక్కటే మనకు శరణ్యం!”

ఆ మాటలకు మేం కొయ్యబారిపోయాము. అదే సమయంలో మా నౌక ఎవరో పైకెత్తినట్లు గాలిలోకి లేచింది. దానితోపాటు ఓ భీకరమైన అరుపు. మా నౌక అంతెత్తు నుంచి నీళ్లలోకి విసిరివేయబడగా పెద్దపెద్ద అలలు పైకి లేచాయి. మా చుట్టుపక్కల సముద్రం వేడినీళ్లమయమై పొగలు కక్కుతుండగా ఓ రాకాసి జంతువు సముద్రంలోంచి పైకి లేచి పెద్ద పర్వతంలా కానవచ్చింది. దాని వెనక మరో రెండు జంతువులు అవి నోరు తెరిచినపుడు పెద్ద చీకటిగుహల్లా ఉండగా వాటిలో ఆఖరి జంతువు మా ఓడను మూడింట రెండు వంతులు మింగివేసింది. నేను ఏమాత్రం ఆలోచించకుండా సముద్రంలోకి దూకాను. నా కళ్లముందే మా నౌక తెరచాప స్తంభం ఫటఫటా విరిగి నాముందు పడింది, అదే సమయంలో ఆ జంతువు మా నౌకను ఒక్క గుక్కలో మింగివేసి సముద్రంలో మునిగిపోయింది. దానితోపాటు మిగతా రెండు రాకాసి మృగాలూ ఆ విశాల సముద్రంలో అదృశ్యమైనాయి.

నా ముందు పడిన కొయ్యదుంగను పట్టుకుని నేను కొన్ని గంటలు అలలతో పాటు ప్రయాణించి చివరకు ఓ తీరానికి కొట్టుకుపోయాను. ఆ తీరానికి చుట్టుపక్కల అనేక పళ్లచెట్లు, సెలయేటి ప్రవాహాలు ఉన్నాయి. వాటిలో ఓ ఏరు మంచి వేగంగా ప్రవహిస్తుండడం చూసాను.

కాస్త స్వస్థత చిక్కాక ఒక మంచి బల్లకట్టును తయారుచేస్తూ అనుకున్నాను– “దేవుడిపై ఆన ఈసారి బతికి బయటపడితే జన్మలో సముద్ర ప్రయాణం చేయ సాహసించను” అలా ఒట్టు పెట్టుకుని అక్కడ ఉన్న చెట్ల దుంగలతో బల్లకట్టు తయారుచేసాను. ఆ తరువాత తెలిసింది ఆ దుంగలు ప్రశస్తమైన చందన వృక్షాలవని. వాటికి ఆ చెట్లపక్కనే పెరిగిన లతలను తాళ్లుగా పేని బల్లకట్టు తయారుచేసి అనేకమైన పళ్లు ఏరి బల్లకట్టుపై గుట్టపోసి, దానిపై ఎక్కీ ఎక్కగానే అది వేగంగా కదిలింది. ఆ వేగానికి నాకు కళ్లు తిరిగి పళ్లగుట్టపై పిట్టలా పడి సొమ్మసిల్లాను.

నాకు మెలకువ వచ్చేసరికి నాకు జలపాతపు హోరు వినిపించింది. వేడిపొగలు కక్కుతున్న ప్రవాహంలో నురగలతో కూడిన అలలు, నేను బల్లకట్టును గట్టిగా పట్టుకుని కళ్లు మూసుకున్నాను. అది మరుక్షణంలో అంతెత్తు నుంచి కిందబడి రాళ్లపై ముక్కలు ముక్కలు కావాల్సిందే కాని నా బల్లకట్టు అక్కడ అమర్చిన వలలపై పడడంతో నాకు ప్రాణగండం తప్పింది.

నేను నెమ్మదిగా వలల నుంచి విడిపించుకుని ఒడ్డుకు వచ్చాను నా బల్లకట్టును లాక్కుంటూ. చలితో, అలసటతో వణికిపోతూ నన్ను నేను సంబాళించుకుంటున్న సమయంలో నావేపుగా ఓ వృద్ధుడు వచ్చి నాపై వెచ్చటి దుస్తులను కప్పి పలకరించాడు.

**అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.**

## ∗ 313వ రాత్రి కథ ∗

**షహర్జాది కథ చెప్పసాగింది-**

ఆ వృద్ధుడు నా శరీరంపై వెచ్చటి దుప్పటి కప్పి దేహాన్ని మర్దించగా కొద్దిసేపటికి నేను లేచి కూర్చోగలిగాను. అతడు నా కాసరాగా ఉండి నెమ్మదిగా నన్ను నడిపించుకుంటూ ఓ స్నాన గృహానికి తీసుకువెళ్లి, స్నానాలు, ఉపచారాలు అయినాక మంచి దుస్తులు తొడిగి నన్ను తన ఇంటికి తీసుకువెళ్లాడు. మంచి ఆహారము వేడివేడి ద్రవాలు తాగినాక నాలో మునుపటి శక్తి వచ్చింది. మూడు రోజులపాటు ఆ కరుణామయుడు, అతడి సేవకులు నన్ను కంటికి రెప్పలా కాపాడినారు. నా ఆరోగ్యం కుదుటపడినాక ఆ మహానుభావుడి కోరికపై నేను నా కథ అంతా వివరించాను– "అయ్యా, నాపేరు సింద్‌బాద్. ఇది నా ఏడవ సముద్ర యాత్ర. నేను చూసిన విశేషాలు, నేను పడిన కష్టాలు, నా యాత్రానుభవాలు కంటి మూలన సూదితో లిఖిస్తే భవిష్యత్తరాలకు పాఠాలుగా మిగుల్తాయి".

ఆ వృద్ధుడన్నాడు– "అద్భుతం. నీవు మరల నీదేశం చేరదలుచుకుంటే నీ దగ్గర ఉన్న సరుకును ఇక్కడ అమ్మి పైకం సంపాదించుకో!"

నేనన్నాను– "అయ్యా! నౌకా ప్రమాదంలో నా సరకు యావత్తూ పోగొట్టుకున్నాను. నా దగ్గర ఖర్జూరపు గింజ అంత సరుకు కూడా లేదు".

అతడన్నాడు నవ్వుతూ– "నీతోపాటు తెచ్చిన బల్లకట్టుకున్న దుంగలు అత్యంత విలువైనవి. పద సంతకు వెళ్దాం".

మేము సంతకు వెళ్లేసరికే అక్కడ నా బల్లకట్టు విక్రయానికి ఉంచబడినది. వ్యాపారస్తులు దాని చుట్టూ మూగి ప్రశస్తమైన చందన వృక్షపు దుంగల కోసం బేరసారాలు చేస్తున్నారు. వేయి దీనారాలతో మొదలైన పాట పదివేల దీనారాల వద్ద ఆగింది.

ఆ వృద్ధుడు పదివేల వంద దీనారాలకు నా బల్లకట్టును కొనుక్కున్నాడు. మేము ఇంటికి వచ్చాక ఆ వృద్ధుడన్నాడు– "కుమారా! నాకు పుత్ర సంతతి లేదు. కాని, అందమైన కుమార్తె ఉన్నది. నీవు మాతోపాటు ఇక్కడే ఉండిపోతానంటే ఆమెను నీకిచ్చి వివాహం చేసి ఆస్థిపాస్థులను, వ్యాపారాలను నీకప్పగించి నేను విశ్రాంతి తీసుకుంటాను".

నేనన్నాను– "విధి నన్ననేకసార్లు పరీక్షించింది. మృత్యువు కోరల నుంచి బయటపడి నీ దయాదాక్షిణ్యాలతో బదికాను. నీ మాటను మన్నిస్తాను కరుణామయా!"

***అంతవరకు చెప్పి షహర్జాది కథ ఆపింది.***

# * 314వ రాత్రి కథ *

***షహర్జాదీ కథ చెప్పసాగింది-***

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు– నేను అంగీకారం తెలపగానే నా ప్రాణదాత అయిన ఆ వృద్ధుడు కాది, సాక్షుల సమక్షంలో వివాహ పత్రాన్ని వ్రాయించి తన కుమార్తెతో నా వివాహం రంగరంగ వైభోగంగా చేసినాడు. నా భార్య నాకెంతో అనుకూలవతి కాగా మేమిద్దరం ఒకరినొకరు ఎంతో ఇష్టపడినాము.

కొన్నాళ్లకు నా మామగారైన ఆ వృద్ధుడు దైవసన్నిధికి చేరుకోగా ఆ దేశపు వ్యాపారస్తులు ఆ మహామహుడి స్థానంలో నన్ను వ్యాపారస్తుల పెద్దగా ఎన్నుకున్నారు. నా మామగారి సంపదలన్నీ నాకు సంక్రమించినాయి.

ఆ రాజ్యంలోని మగవాళ్లకు వసంతకాలపు ప్రథమ దినం నాడు భుజాలపై రెక్కలు మొలవగా వాళ్లు గాలిలో ఎగుర్తూ వెళ్లి కొండశిఖరాన కాసేపు ఉండి, దైవ

ప్రార్థన చేసి వచ్చేవారు. ఆ రెక్కలు కేవలం ఒక్కరోజు మాత్రమే ఉంటాయి. ఆ విషయం నాకు తెలియకుండా చానాళ్లు దాచిపెట్టారు. బహుశా నాకు ఆ ముందు రాత్రి మత్తు పదార్థమేదో ఇచ్చేవాళ్లేమో నేను ఆ రోజంతా నిద్రపోతూ ఉండేవాణ్ణను కుంటాను. నా మామగారు చనిపోయాక అదృష్టమో, దురదృష్టమో ఆ రహస్యం నాకు తెలిసింది. ఆ రోజున మగవాళ్లందరూ ఉదయమే రెక్కలొచ్చి కొండ శిఖరాని కెగిరిపోగా స్త్రీలు, పిల్లలు, రెక్కలు మొలవని నేను మిగిలిపోయాము.

మరుసటి రోజు నుంచి నాకు చాలా సన్నిహితుడైన మిత్రుడితో ఆ విషయం గురించి పోరగా పోరగా అతడు వచ్చే వసంత ఋతువు మొదటిరోజున తనతో పాటు నన్నూ గాలిలోకి తీసుకువెళ్లేందుకు ఒప్పుకున్నాడు. ఆ విధంగా నేను సింద్‌బాద్‌ను నేలపై, నీటిపై, గాలిలో తిరిగిన వాడినవుతాను కదా!

ఏడాది గడిచింది వేగంగా. వసంత ఋతువు ప్రథమ దినం నాడు నేను నా మిత్రుడి నడుం పట్టుకోగా, అతడు గాలిలోకి ఎగిరాడు. నాకు అక్కడ దేవదూతల దివ్యగానాలు వినిపించాయి. నేనన్నాను– "దైవం కీర్తించబడును గాక. అన్ని జీవులూ అతడి అద్భుతములను స్తుతించెదరు గాక!" ఆ మాటలనగానే ఆకాశంలో నిటారుగా అంతెత్తు ఎగిరిన అతడు తీవ్ర వేగంతో నేలకు పతనమవుతూ నన్ను దుర్భాషలాడుతూ, నన్ను ఓ కొండశిఖరంపై పడవేసి దెయ్యపు చూపుల్తో భయపెట్టి మరల నింగిలోకి వేగంగా ఎగిరిపోయి అదృశ్యమైనాడు.

ఇప్పుడు ఇంటికెలా వెళ్లాలి. ప్రతిసారీ ఏదో ఒక దురదృష్టం అంతకు ముందు నేననుభవించిన వాటికన్నా దారుణమైనది నన్ను వెన్నాడుతూనే ఉన్నది. సుఖంగా ఇంటిలో ఉండక పొరుగువాణ్ణి బతిమలాడిమరీ ఆకాశ గమనం చేసినందుకు నాకీ శాస్తి జరుగుతున్నది. "దైవమా! నాకు రక్ష నీవే. తండ్రీ నన్ను కాపాడు" అనుకుంటూ దైవ ప్రార్థన చేసి కాస్త స్థిమితం చిక్కినాక అక్కడ నుంచి దిగువకు వెళ్లేందుకు సరైన దారికోసం వెదకడం మొదలెట్టాను. ఇంతలో నావేపే ఇద్దరు బాలురు అతిలోక సుందరులు వస్తూ కనిపించారు. వాళ్ల చేతుల్లో బంగారు మంత్రదండములున్నాయి. నేను వారిని సమీపించి– "దివ్య బాలకుల్లారా! మీరెవరు? నేను ఈ కొండశిఖరం నుంచి దిగువకు ఎలా వెళ్లగలను?" అని అడిగాను.

వారు ముగ్ధమనోహరంగా చిరునవ్వులు వెలయిస్తూ ఒక మంత్రదండాన్ని నా ముందు పడవేసి ఇద్దరూ ఎగిరిపోయారు. ఆ మంత్రదండాన్ని చేతబట్టుకుని

నేను అది వంగిన వేపు నడుస్తూ, ఆ దివ్యస్వరూపులకు మనసులో జేజేలు పలుకుతూ ఓ పెద్ద కొండరాయి వద్దకు చేరుకుని ఓ క్షణం ఆగాను.

భయంకరంగా బుసకొడుతూ అక్కడ ఓ మహాసర్పం ఒక మనిషిని దాదాపు మూడువంతులు మింగింది. కేవలం మెడ తల అస్పష్టంగా కానవస్తూ బయట ఉన్నాయి. అతడు నన్ను చూడగానే "రక్షించు, రక్షించు" అని ప్రార్థించాడు. నేను పరిగెత్తుకుంటూ వెళ్లి నా చేతిలోని బంగరు మంత్రదండంతో ఆ మహాసర్పం నెత్తిన గట్టిగా మోదగానే అది గిలగిల కొట్టుకుంటూ చనిపోయింది. నేను వెంటనే ఆ దురదృష్టవంతుడిని బయటకు లాగాను.

అతడెవరో కాదు నా మిత్రుడే! నన్ను కొండశిఖరం మీద పడవేసి వెళ్లినవాడే. ఆ మహాసర్పపు ఊపిరి పొగల మధ్య నేనతడిని గుర్తుపట్టలేదు. నేనన్నాను– "నన్నెందుకిలా ఒంటరిగా వదిలేసి వెళ్లావు?" అతడన్నాడు– "ఆకాశ గమనంలో దైవ పదాన్ని ఉచ్చరిస్తే పతనం చెందుతాం మేము"

నాకేమీ అర్థం కాలేదు. "నన్ను ఇంటికి తీసుకువెళ్లు" అన్నాను నేను. ఇక్కడ జరిగింది ఎవరికీ చెప్పకూడదని నాతో ప్రమాణం చేయించుకుని, నేనతడి నడుము పట్టుకోగా గాలిలో ఎగుర్తూ అతడు నన్ను ఇంటివద్దకు చేర్చి వెళ్లిపోయాడు.

నేను ఇంటికి చేరుకున్నాక నా భార్య అన్నది– "మనం ఈ రాజ్యంలో ఉండవద్దు. ఇక్కడివాళ్లు సైతాను భక్తులు. నా తండ్రి వ్యాపారస్తుల పెద్ద అయినా వారి ఆచారాలను పాటించలేదు. అందుకే ఆతడికి రెక్కలు మొలవవు. నీకా విషయం తెలియకుండా ఆయన చాలా జాగ్రత్త పడినాడు. మనం మన ఆస్థిపాస్తులను సరైన ధరకమ్మి వేరే దేశం వెళ్లిపోదాం".

**తెల్లవారుజాము కావడాన్ని గమనించిన షహర్జాది కథ ఆపింది.**

# * 315వ రాత్రి కథ *

**షహర్జాదీ కథ చెప్పసాగింది-**

సింద్‌బాద్ నావికుడు చెబుతున్నాడు– "నా భార్య సలహా నాకెంతో నచ్చింది. మరల బాగ్దాద్‌కు వెళ్లే అవకాశం వస్తే ఎలా వదులుకుంటాను. అందులోనూ నా ప్రియమైన భార్య కూడా అదే కోరుకుంటున్నది.

నాకున్న అపారమైన వ్యాపార అనుభవంతో మామగారిచ్చిన ఆస్థిపాస్తులన్నిటిని ఒక్కొక్కటిగా అమ్మి బంగారు నాణెములుగా మార్చాను. విలువైన సరుకులు కొని వ్యాపార నిమిత్తం విదేశాలు పోతున్నానని చెప్పి స్థానికులకు గొప్ప విందు ఇచ్చి మిత్రులందరికీ వెలకట్టలేని కానుకలిచ్చి సంతోషపెట్టి పటిష్ఠమైన నావలో అనేక దినాలు ప్రయాణించి దైవకృపతో ఎటువంటి ఆటంకాలు లేకుండా బస్రా చేరుకుని ఆ తరువాత బాగ్దాద్‌లో అడుగుబెట్టాను.

ఆఖరి ప్రయాణం దాదాపుగా ఇరవై ఏడు సంవత్సరాలకు పూర్తయ్యింది. అప్పటి నుంచి మరల సముద్ర ప్రయాణం మాట ఎత్తకుండా ఇలా హాయిగా కాలం గడుపుతున్నాను. జన్మభూమిలో సుఖసంతోషాలతో బదకడం స్వర్గ జీవనంతో సమానం కదా!" అన్నాడు సింద్‌బాద్ నావికుడు.

ఆ తరువాత హమాలీ సింద్‌బాద్‌కు తన గృహ వ్యవహారాలు నిర్వహించే బాధ్యతనప్పగించాడు నావికుడు సింద్‌బాద్ – ఇద్దరూ మిత్రులై గౌరవాభిమానాలతో కాలం గడిపారు.

అన్ని బంధాలను తెగగొట్టి, రాజ భవనాలను ధ్వంసం చేసి, సమాధులను తెరిచే మృత్యువు వారిని సందర్శించేంత వరకూ వారి మైత్రి నిరాటంకంగా కొనసాగింది.

***అని షహర్జాది సింద్‌బాద్ సాహసయాత్రలను ముగించింది.***

***షారియార్ ప్రభువు అన్నాడు- "నేను ఈసారి కవితాత్మకమైన కథలను వినగోరుతున్నాను. ఈ సింద్‌బాద్ అద్భుత సాహస యాత్రలు నాలో ఎంతో ఆనందాన్ని నింపాయి. ఈసారి ఏ కథ చెప్పబోతున్నావు?"***

***షహర్జాది అన్నది- "ప్రభూ! ఇప్పుడు నేను చెప్పబోయేది అపురూప సౌందర్యరాశి జముర్రుద్, అల్ మజ్ద్ కుమారుడు అల్ షార్ కథ".***

✣✣✣✣✣



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

## I. తెలుగు కవిత్వం - Poetry (Telugu)

1. ఆల్కెమీ - Alchemy
2. వానమబ్బుల కాంతిఖడ్గం - Vaana Mabbula Kanthi Khadgam
3. టీకప్పులో తుఫాన్ - Tea Kappulo Toofan
4. తంగేటి జున్ను - Tangeti Junnu
5. కర్కాటకం - Karakatakam (Cancer)
6. ఒక సరస్సు-అనేక హంసలు - Oka Sarassu – Aneka Hamsalu
7. మరణశాసనం - Marana Saasanam
8. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం - Sri Lalitha Sahasranama Stotram
9. కుయ్యో-మొఱ్రో శతకం - Kuyyo – Morro Satakam
10. భైరవ శతకం - Bhairava Satakam
11. కోవిడ్-19 ప్యారడీలు - Covid-19 Parodies
12. గాయపడిన జింక పిలుపు - Gayapadina Jinka Pilupu
13. మహావాక్యం - Mahavaakyam
14. కుంకుమ భరిణె - Kukum Bharine

## II. Poetry (English)

1. Shades
2. The Twilight Zone
3. My Poem is My Birth Certificate
4. The Pendulum Clock, The Gramophone, the pen and the type writer
5. The Vigilance Whistle!
6. How to Cook a Delicious Poem
7. Windows and Apples
8. The Guerdon of Poesy
9. The Haste Land
10. Bees Need No Invitation When Flowers Bloom...
11. Poetravelogue

12. Wow- Supercalifragilisticexpialidocious
13. The Lost Songs of a Lone Traveler!
14. Che Guevara
15. Coffee - Poems
16. The Tortured Artist
17. Yuddhopanishad (The Upanishad of War)
18. The Making of Mahatma - (Collector's Edition)
19. An Epic of Kashmir
20. The Legend of Lady Yang Guifei- China
21. Tjukurpa- (Australian aboriginal stories- poetry) Dream Time - Every When)
22. Trident (Love, War and Peace) along with Maria Miraglia, Ayubkhawar
23. Journey to Manasa Sarovar
24. Prima ballerina- Roberta di Lara
25. The Casket of Vermilion- The legend of Sammakka- Sarakka
26. Penning with Penguins (Antarctica)
27. Potana's Bhagavatam
28. Soundarya Lahari - Sankaracharya's Soundarya Lahari
29. Modern Bhagavadgita
30. The Songs of Annamayya
31. Apoorvam - Limericks
32. In Search of Truth (Novel)
33. How to be happy (Philosophy)

## III. కథలు-నవలలు-వ్యాసాలు (తెలుగు) - Stories, Novels, Essays... (Telugu)

1. కత్తి అంచుపై - నాయిర్ కథలు - Katti Anchupai (Noir Stories)
2. కరోనా కత్తిఅంచుపై - నాయిర్ కథలు (Noir Stories)
3. ఛుప్ కె ఛుప్ కె - స్త్రీల వ్యాధుల కథలు (Woman Diseases)
4. కథలు-కవితలు - Kathalu – kavitalu
5. ప్రపంచ ప్రసిద్ధ కథలు - World Famous Stories
6. అక్షరార్చన - Aksharapchana (philosophical essays)
7. దీప నిర్వాణ గంధం (మృత్యువు) - Deepa Nirvana Gandham (Death)
8. స్వప్నశాస్త్రం-1 - Swapna Sastram (Dreams-1)
9. స్వప్నశాస్త్రం-2 -కలలు-పీడకలలు - Kalalu-PeedaKalalu (Dreams-2)
10. సంఖ్యాశాస్త్రం - Sankhya Sastram (Numerology)
11. డాక్టర్ జయదేవ్ కార్టూన్లు - Dr. Jayadev Cartoons
12. సత్యాన్వేషణలో - నవల - In Search of Truth (Novel)
13. జీనోమ్ - నవల - Genome (Biotechnology Novel)

14. కోవిడ్-19 - నవల - COVID-19 - Biotechnology Novel
15. వైరసులు-వాక్సీనులు - నవల - VIRUSES – VACCINES
16. అయిదో అశ్వికుడు - నవల - The fifth horseman
17. డాక్టర్ విక్రమార్క-కరోనా బేతాళ కథలు (Corona Stories)
18. ప్రపంచ రాజకీయ సింహాసన ద్వాత్రింశిక - 32 కథలు
19. ప్రపంచతంత్ర కథలు - Prapanchatanthra Kathalu
20. పంచతంత్ర కథలు - Panchatanthra Kathalu
21. 1001 అరేబియన్ రాత్రుల కథలు-1 (1001 Arabian Nights-1)

## IV. అనువాదాలు - ఇంగ్లీషు నుంచి తెలుగులోకి
## Classics (English to Telugu)

### గ్రీకు సాహిత్యం (Greek Literature)

1. ఇలియాడ్ - Iliad (Homer)
2. ఒడిస్సీ - Odyssey (Homer)-
3. ఎపిక్ సైకిల్ - Epic Cycle (Homer
4. ఎడిపస్ రెక్స్ - Oedipus Rex- Sophocles
5. ఏంటిగోని - Antigone-- Sophocles-
6. ది ట్రోజన్ విమెన్ - The Trojan Women- Euripides
7. శాఫో కవిత్వం - The Poems of Sappho-
8. ఇది విలువైనది - The Axion Esti (Odysseus Elytis)
9. సెంచరీ ఆఫ్ లవ్ - Century of Love (Roula Pollard)

### లాటిన్ సాహిత్యం (Latin Literature)

1. ఈనీడ్-వర్జిల్ - Aeneid (Virgil)
2. డివైన్ కామెడీ - డాంటే - Divine Comedy (Dante)

### జర్మన్ సాహిత్యం (German Literature)

1. ఆత్మను అమ్మిన మానవుడు - Faust - Goethe
2. కాలి నడకన ఆర్కాడియాకు - Barefoot to Arcadia - Aprilia Zank

### నార్డిక్ సాహిత్యం (Nordic Literature)

1. పెద్దవ్వ చెప్పిన కథలు - Poetic Eddas

### సుమేరియన్ సాహిత్యం (Sumerian Literature)

1. గిల్గామేష్ చరిత్ర - The Epic of Gilgamesh
2. ఇనాన్నా - Inanna

### ఫ్రెంచి సాహిత్యం (French Literature)

1. ఫ్రెంచి కవిత్వం - French Poetry
2. కంటక పుష్పాలు - Le Flures du Mal-- Charles Baudelaire

**పర్షియన్ సాహిత్యం (Persian Literature)**

1. జరాతుష్ట్రుడి గాథలు – Zoroster- Gathas
2. మస్నవి–1 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
3. మస్నవి–2 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
4. మస్నవి–3 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
5. మస్నవి–4 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
6. మస్నవి–5 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
7. మస్నవి–6 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
8. పక్షుల సభ – ఫరీదుద్దీన్ అత్తర్ – Birds Conference - Attar
9. మధుశాల – రుబాయిలు – Omar Khayyam

**రష్యన్ సాహిత్యం (Russian Literature)**

1. రసధుని – Russian Poetry

**మెక్సికన్ సాహిత్యం (Mexican Literature)**

1. మెక్సికన్ సాహిత్యం – Mexican Poetry

**లాటిన్ అమెరికన్ సాహిత్యం (Latin American Literature)**

1. లాటిన్ అమెరికన్ కవిత్వం – Latin American Poetry - Part-1
2. లాటిన్ అమెరికన్ కవిత్వం – Latin American Poetry - Part-2
3. లాటిన్ అమెరికన్ కవిత్వం – Latin American Poetry - Part-3

**స్పానిష్ సాహిత్యం (Spanish Literature)**

1. పాబ్లో నెరుడా కవిత్వం – Pablo Neruda Poetry
2. లోర్కా “ప్రేమ–మృత్యువు” – Frederick Garcia Lorca's "Love-Death"

**టర్కీ సాహిత్యం (Turkey Literature)**

1. టర్కీ కవిత్వం – దివాన్ కవిత్వం – Turkish Poetry
2. బోనులో సింహం – నజీమ్ హిక్మెత్ – Nazim Hikmet Poetry

**తమిళ సాహిత్యం (Tamil Literature)**

1. శిలప్పదికారం – Silappadikaram - Illango Adigal
2. మణిమేఖల – Manimekhala - Sattanar
3. తమిళ సరస్వతి అందెల రవళి – Sangam Poetry

**కాశ్మీరీ సాహిత్యం (Kashmir Literature)**

1. లల్లాదేవి వాక్కులు – Lal Ded - Vakhs

**హిందీ సాహిత్యం (Hindi Literature)**

1. మధుశాల – Madhusala- Harivams Roy Bachchan

**ఉర్దూ సాహిత్యం (Urdu Literature)**

1. గాలిబ్ గీతమాలిక – Ghalib Ghazals

**పోలండ్ సాహిత్యం (Poland Literature)**

1. పోలండ్ కవిత్వం – Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
2. తొలి వాన కురిసిన తరువాత.... Jak Ziemia Po PierwszymDeszezu
3. క్షణాలు – Moments - AlicjaKubreska
4. అంతరించిన దీపాల ప్రపంచం – The World of Extinct Lamps - Izabela Zubko
5. పవిత్ర త్రిమూర్తిత్వం – Izabela Zubko - The Holy Trinity
6. హైకూలు – Krzysztof Kokot - Around the Haiku
7. జీవిత రహస్యాలు – Juliusz Erazm Bolek - The Secrets of Life - A Calendar in verse
8. అయిదవ ఋతువు – Agnieszka Jarzebowska - The Fifth Season
9. నీలి నిరీక్షణ – Bozena Helena Mazur-Nowak's - Blue Longing
10. (కాదు) నా కవిత – Alicja Kuberska's (Not) My Poem (Telugu)
11. సంచార గాయని – I am a Troubador - Renata Cygan

**జపాన్ సాహిత్యం (Japan Literature)**

1. జపనీయుల కవిత్వం – Japanese Poetry
2. జపనీయుల కవిత్వం–2 – Japanese Poetry-2

**చైనా సాహిత్యం (China Literature)**

1. మూడు రంగుల కుంచె – China Classical Poetry
2. యాంగ్ గ్యుఫీ కథ – The Legend of Lady Yang Guifei

**తైవాన్ సాహిత్యం (Taiwan Literature)**

1. తైవాన్ ఆడపడుచు – Tayouan Pai Pai- Yaw-Chin Fang

**ఈజిప్ట్ సాహిత్యం (Egypt Literature)**

1. ప్రాచీన ఈజిప్ట్ గాథలు – Ancient Egypt Stories
2. పరమాత్మునిలో ఐక్యమవుదాం – Lets be one in The One - George Onsy

**ఫిలిప్పీన్స్ సాహిత్యం (Philippines Literature)**

1. పదివేల పంక్తులు – Ten Thousand Lines - Edwin Cordevilla
2. ఈడెన్ పూల వికాసం – Eden Blooms- Eden S. Trinidad
3. ఫిలిప్పీన్స్ జానపద గాథలు – Philippines Folk Tales

**ఆస్ట్రేలియా సాహిత్యం (Australia Literature)**

1. చిరుగాలి నా ప్రేమికుడు – The Wind My Lover- Ade C. Manila
2. నా లోపలి నిరీక్షణ – The Inner Quiet - Deepa Chandran Ram

**ఘనా సాహిత్యం (Ghana Literature)**

1. జీవితానికి అసలైన అర్థం – The Real Meaning of Life - Dr. Rashid Pelpuo

**మొరాకో సాహిత్యం (Morocco Literature)**

1. దీర్ఘ రెక్కల శ్వాస – The Long-Winged Breath- Oulaya Drissiel Bouzadi

**లెబనాన్ సాహిత్యం (Lebanon Literature)**

1. నాజీనామన్ కవిత్వం – Naji Naaman Poetry

**బ్రూనై సాహిత్యం (Brunei Literature)**

1. సున్నిత హస్తాలు – Smooth Hands- Sosonjan A. Khan

**మలేషియా సాహిత్యం (Malaysia Literature)**

1. ఆణిముత్యాలు – Pearls of Wisdom- Pramila Khadun

**కెనడా సాహిత్యం (Canada Literature)**

1. అలలపై స్వారీ – Riding the Tide- Ashok Bhargava

**ఇటాలియన్ సాహిత్యం (Italian Literature)**

1. గులాబీ మేఘాల గ్రహలోకం – The Planet of Pink Clouds - Sergio Camellini
2. నాట్యం చేసే గాలులు – Dancing Winds- Maria Miraglia

**నేపాల్ సాహిత్యం (Nepal Literature)**

1. సూర్యరశ్మి – Sun Shower- Krishna Prasai

**పాకిస్తాన్ సాహిత్యం (Pakistan Literature)**

1. స్వర సమ్మేళనం – Symphony and Other Poems - Ayub Khawar

**ఆంగ్ల సాహిత్యం (English Literature)**

1. పారడైస్ లాస్ట్ – Paradise Lost - John Milton
2. పారడైస్ రిగెయిన్డ్ – Paradise Regained - John Milton
3. తీర్థయాత్రికుని ప్రగతి – Pilgrim's Progress - John Bunyan
4. జీవితం – Emily Dickinson Poetry - Part I
5. ప్రేమ – Emily Dickinson Poetry - Part II
6. ప్రకృతి – Emily Dickinson Poetry - Part III
7. కాలము – శాశ్వతత్వము – Emily Dickinson Poetry - Part IV
8. ఒంటరి జాగిలం – Emily Dickinson Poetry - Part V
9. విలియం బ్లేక్ కవిత్వం – William Blake Poetry
10. టి.ఎస్. ఎలియట్ కవిత్వం – T.S. Eliot Poetry
11. నాందేవ్ ధసాల్ కవిత్వం – NamdeoDhasal Poetry
12. జలపాతం – Jalapatam (Eighteen English Poets)
13. డబ్బు మనిషి – DabbuManishi (Money Poetry)
14. శాంతియుద్ధం – Santi Yuddham (War-Peace)
15. మధుశాల – Rubaiyat- Edward Fitzgerald
16. సౌగంధిక – Sougandhika (Master Poems in English-1)
17. తూర్పు–పడమర (Master Poems in English-2)
18. ప్రేమ కురిసిన వేళలో... (Master Poems in English-3)

19. వాళ్ళు ముగ్గురూ (Master Poems in English-4)
20. అలనాటి కొత్తగాలి (Master Poems in English-5)
21. మంచు తుఫాన్ (Master Poems in English-6)
22. ఎండా–వానా (Master Poems in English-7)
23. పిల్లనగ్రోవి పిలుపు (Master Poems in English-8)
24. అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె (Master Poems in English-9)
25. నాలుగు దిక్కులు (Master Poems in English-10)
26. దివ్య వస్త్రాల కోసం(Master Poems in English-11)
27. ఒక మధుశాల (Master Poems in English-12)
28. క్రీస్తు అద్భుత గీతాలు (ChristuAdbhutaGeethalu)
29. క్రీస్తు నడిచిన దారిలో (The Path of Christ)
30. అలింద సంగీతం - Chamber Music - James Joyce
31. మార్మిక నావికుడు - The Mystic Mariner- Madan Gandhi
32. శతరూప - Sataroopa- A.K. Khanna
33. వాసుదేవ్ చక్రవర్తి కవిత్వం - Basudeb Chakraborti
34. జ్వాలలతో పోరాటం - Fighting the Flames- Dr. Jernail S. Anand
35. వెన్నెల అలలు - Rippling Moonbeams- Lily Swarn
36. దేహ రహితంగా (Leyla Isik Poetry)

## V. Translations (From Telugu to English)

1. The Great Battle (Suprasanna) - సాంపరాయం – కోవెల సుప్రసన్నాచార్య కవిత్వం
2. The Tree of Fire (AnumandlaBhoomaiah) - అగ్నివృక్షం – భూమయ్య కవిత్వం
3. The Poems of Kuppam (Seeta Ram) - కుప్పం కవితలు – సీతారామ్ కవిత్వం
4. We Need a Language (Sudhakar) - మాకూ ఒక భాష కావాలి – తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
5. The Broken Grammar (Sudhakar) - దళిత వ్యాకరణం – తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
6. The Voice of Telangana (Madiraju Ranga Rao) - తెలంగాణా స్వరం – మాదిరాజు రంగారావు
7. Fire and Ice (Rama Chandramouli) - రామా చంద్రమౌళి కవిత్వం
8. This is no Streaking (Stories - K.K. Menon) - కె.కె. మీనన్ కథలు
9. The Pool of Blood (Naveen) - రక్త కాసారం – అంపశయ్య నవీన్ నవల
10. Varavara Rao Poetry – వరవరరావు కవిత్వం
11. The Enraged Voice- Ravi Maruth - ఉద్రిక్త స్వరం – రవి మారుత్ కవిత్వం
12. To Whomsoever it may concern -Prasen - ఎవరికీ వర్తిస్తే వారికి – ప్రసేన్ కవిత్వం
13. Bouquet of Telugu Songs and Poems - ప్రసిద్ధ తెలుగు పద్యాలు, పాటలు

## VII. Books translated into Multiple Languages

1. The Casket of Vermilion- English - Dr. Lanka Siva Rama Prasad
   i. The Casket of Vermilion -Telugu - Dr. Lanka Siva Rama Prasad
   ii. The Casket of Vermilion -Telugu - పాతూరి రఘురామయ్య, సుప్రసన్నాచార్య

iii. The Casket of Vermilion - Urdu- JawaidNaseem
iv. The Casket of Vermilion - Punjabi- Prof. Joginder Singh Jogi
v. The Casket of Vermilion - Malayalam - Sarala Ram Kamal
vi. The Casket of Vermilion- Marathi- Narayana Mudgalkar, Neelima Mudgalkar
vii. The Casket of Vermilion - German - Sabine Stiglmayr, Aprilia Zank
viii. The Casket of Vermilion - Polish - Alicja Kubreska
ix. The Casket of Vermilion - Philippines- Eden.S. Trinidad
x. The Casket of Vermilion - Chinese- Tian yu
xi. OchrowaSzkatutka - Polish - Alicja Kubreska

2. Trident- English, Telugu, Italian, Urdu
3. The Legend of Lady Yang Guifei- English, Telugu, Malayalam, Mandarin

**VIII. New Books**

1. రంగురంగుల సీతాకోకచిలుకలు (Maria Miraglia's Colourful Butterflies)
2. మంచు కురిసిన తరువాత (Alicja Maria Kuberska's After the Frost)
3. హైకూలు
4. తెలంగాణము

**He won many awards nationally and internationally-**
**He is the recipient of**

1. T.S. Eliot award- 2017,
2. Global poet Award - CANADA-WIN - 2017,
3. Life time achievement Award - Ghana- 2017,
4. Kibatek medal -Turkey - 2017
5. Rauel international Award - 2017
6. Poet Laureate Award - Delhi - 2017
7. SahitiRajahamsa award - Vizag - 2017
8. Poet Laureate-Kazakhstan - 2017
9. Pentasi-B Life Time Achievement Award-2017
10. Naji Naaman Poet Laureate Award - Lebanon -2018
11. Poet Laureate Award - China - 2019
12. Sophy Chen - Award - China - 2019
13. Master of Metaphor and Trans Creative Surgery- 2019 and many more….

He was the host, sponsor of World poetree Festival- 2017 under the banner of Pentasi-B India World Poetry Festival. Attended many International Poetry Festivals in India and abroad- China, Morocco, Ghana, Singapore, Australia, Greece, Poland, Italy, and Philippines as guest of honor.

More than hundred books are available in his free website-

**www.anuvaadham.com**
**www.prosetry.in**




1001 అరేబియన్ రాత్రుల కథలు 3వ భాగంలో
145-315 రాత్రుల కథలు రసరమ్య
భరితమైనవి ఉన్నాయి.
**పక్షులు-జంతువుల కథలు** (145-151 రాత్రులు)
**ఆలి ఇబిన్‌బకర్ - షామ్స్ అల్-నహార్ కథ**
(152-169 రాత్రులు)
**బుదుర్ యువరాణి - కమర్ అల్-జమాన్ కథ**
(169-235 రాత్రులు)
**సలీమ్ - జమీలా కథ** (236-248 రాత్రులు)
**అలా అల-దిన్ అబు షామత్ కథ** (248-269 రాత్రులు
**జ్ఞాని, విద్యావంతురాలు షఫక్ కథ** (270-287 రాత్రులు)
**కవి అబు నువాస్ సాహసగాధ** (287-290 రాత్రులు)
**సింద్‌బాద్ సాహస యాత్రలు** (290-315 రాత్రులు)
ఈ సంపుటంలో చోటుచేసుకున్నాయి.

**డాక్టర్ లంకా శివరామప్రసాద్**

**Dr. LANKA SIVA RAMA PRASAD**